
రాబర్ట్ లూయీ స్టీవెన్సన్
కాంచనద్వీపం
నండూరి రామమోహనరావు

ప్రకాశకీయం

మన ఆంధ్రసాహిత్యం వస్తుతః అనువాదాలతోనే శ్రీకారం చుట్టుకున్నదని మనకందరకూ తెలుసు. ఆంగ్లానువాదాలు కూడా ఏడెనిమిది దశాబ్దాల క్రితమే మన తెలుగులో ప్రారంభమయ్యాయి. అధికశాతం రాజకీయరంగానికి, ఆ తర్వాత నవలా రంగానికి చెందిన అనువాదాలు వెలువడినాయి. బాలసాహిత్యరంగంలో అర్థశతాబ్ది క్రితం వెలువడిన బాలల నవలారచనల అనువాదాలు పాఠకులలో విశేష ఆసక్తిని రేకెత్తించాయి. పఠనాభిలాషను పెంపొందించాయి. ఆనాటి ఇంగ్లిష్ అనువాదాలలో నండూరి రామమోహనరావుగారు 'ఆంధ్రపత్రిక వారపత్రిక'లో ధారావాహికగా వెలువరించిన మార్క్‌ట్వేన్, రాబర్ట్ లూయీ స్టీవెన్‌సన్ నవలలు ఎంతో ప్రసిద్ధి పొందినాయి. ఆంగ్లనవలా సాహిత్యరంగంలో సుప్రసిద్ధులైన వీరిరువురి రచనలలోని ఫాంటసీ ఈనాటికీ కాలదోషం చెందలేదు, వాటిలోని ఆయాపాత్రలు సజీవంగానే మనగలుగుతున్నాయి. మార్క్‌ట్వేన్ సృష్టించిన పాత్రలు, వాటి సాహసాలు, ఆలోచనధోరణులు ఈ తరం బాలబాలికలకు పరిచయం చేసే అవసరం వుందన్న ప్రగాఢ నమ్మకంతో ఈ అనువాదనవలలను నూతన రూపురేఖలతో మీ ముందుకు తీసుకువచ్చాము.

పిల్లలను అత్యద్భుత సాహసలోకాలలోకి తీసుకువెళ్ళి, వారి మనోవీధులలో సాధారణ పరిజ్ఞానం, లోకం పోకడ, ఆనందోత్సాహాలు, ఉల్లాసాన్ని పరివ్యాప్తం చేయవలసిన బాధ్యత అందరి మీద వుంది. బాల సాహిత్యపీఠం తరపున గతంలో కొన్ని ప్రతిష్ఠాత్మక ప్రచురణలను వెలువరించిన మేము బాలసాహిత్యంలో మణిపూసలు అనదగిన ఈ అనువాదాలను పిల్లలకు, తద్వారా పెద్దలకు అందజేయాలన్న తపనతో దశాబ్దం కాలంపైగా మరుగున పడివున్న ఈ అనువాదనవలలను పునర్ముద్రించాము. ఇందుకు సన్మిత్రులు, అనువాదకర్త నండూరి రామమోహనరావు గారు సహృదయతతో అనుమతి ఇచ్చారు. ఇందుకు మా కృతజ్ఞతలు.

అనువాదనవలల్లో ఆయా నామవాచకాలు మాత్రమే ఇంగ్లిష్‌ను జ్ఞప్తికి తీసుకువస్తాయేగాని, కథనం మాత్రం తేటతెనుగులో జాలువారడంతో ఈనాటి తరం పిల్లలకు, పెద్దలకు కూడా పఠనాభిలాషను మరింతగా పెంపొందించగలవని మా ప్రగాఢ నమ్మకం. అనువాదకర్త అభిప్రాయమైన 'ముందుమాట'ను కూడా చదివి, నవలలోకి ప్రవేశించండి. మీకు సంతృప్తి కలుగుతుంది. ఉత్తమపాఠకాభిరుచి మాత్రమే ప్రచురణకర్తలకు వెన్నుబలం. అయిదు అనువాద నవలలను ఏక సమయంలో విడుదల చేస్తున్నాము. ఆశీర్వదించండి.

బి. బాబ్జీ
డైరక్టర్ ఆఫ్ పబ్లిషింగ్
అభినందన పబ్లిషర్స్

25-4-2006
విజయవాడ-2.



ఆర్. ఎల్. స్టీవెన్సన్

(1850-1894)


స్టీవెన్సన్ పూర్తిపేరు రాబర్ట్ లూయీ స్టీవెన్సన్. 1850లో స్కాట్లాండులోని ఎడింబరోలో జన్మించారు. అతడు వృత్తిరీత్యా అడ్వకేట్. శ్వాసకోశ సంబంధమైన రుగ్మతలతో బాధపడుతున్నా ఎన్నో పత్రికలలో ఎన్నో రచనలు చేశారు. యూరప్‌లోనూ, అమెరికాలోను విస్తృతంగా పర్యటించారు. 1883లో 'ట్రెజర్ ఐలండ్' (కాంచనద్వీపం) పుస్తకరూపంలో వెలువడినప్పటి నుంచి ఆయనకు రచయితగా గొప్పపేరు వచ్చింది.

డాక్టర్ జెకిల్ అండ్ మిస్టర్ హైడ్, కిడ్‌నాప్డ్ మొదలైన నవలలతో ఆయన ఖ్యాతి ఇనుమడించింది. 1888లో పసిఫిక్ దీవులకు వెళ్ళారు. సమోవా దీవిలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. 1894లో మెదడులోని రక్తనాళం చిట్లి ఆకస్మికంగా మరణించారు. సమోవాలోనే సమాధి చేశారు. ఆయన గొప్ప వచనరచయితే కాక గొప్పకవి కూడా.

బాలసాహిత్య పీఠం

బాలలకు, నూతన అక్షరాస్యులకు, బడి వదిలిన పిల్లలకు విద్యావికాసం కల్పించడానికి; తేలిక భాషలో విజ్ఞానదాయకమైన ప్రచురణలను, ఇతర ప్రేరణ కార్యక్రమాలను వెలువరించడానికి బాలసాహిత్య పీఠం అవతరించింది.

అభినందన పబ్లిషర్స్
28-9-24, జలీల్ వీధి, అరండల్‌పేట,
విజయవాడ-2. ఫోన్ : 2572211/22



మార్క్‌ట్వేన్ (1835-1910)

" నా పుస్తకం ప్రధానంగా బాలురకు, బాలికలకు వినోదం కోసం వ్రాసినదైనా, ఆ కారణాన పెద్దవాళ్ళు దీన్ని చదవడం మానరని ఆశిస్తున్నాను. పెద్దవాళ్ళు తమ చిన్నతనంలో తాము ఎలా ఉండేవారో, తమ ఆలోచనలు ఎలా ఉండేవో, తాము ఎలా మాట్లాడేవారో, చిత్రమైన సన్నివేశాల్లో ఎలా చిక్కుకునేవారో ఆహ్లాదకరంగా వారికి జ్ఞాపకం చేయడం కూడా ఈ నవలారచన ఉద్దేశాలలో ఒకటి ".

\- మార్క్‌ట్వేన్

జగద్విఖ్యాత హాస్య రచయిత మార్క్‌ట్వేన్ రచనకు
ప్రముఖ రచయిత, పాత్రికేయుడు, అనువాదకుడు

నండూరి రామమోహనరావు

సమ్మోహకానువాదం



నండూరి రామమోహనరావు

జననం 24, ఏప్రిల్ 1927. స్వస్థలం కృష్ణాజిల్లా అరుగొలను. హైస్కూలు చదువు నూజివీడు, బందరు. కాలేజి చదువు రాజమండ్రి. 1948 జనవరి నుంచి 1960 జూన్ వరకు 'ఆంధ్రపత్రిక', ఆ తర్వాత 'ఆంధ్రజ్యోతి'. 1976 నుంచి 1994 వరకు 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక సంపాదకత్వం. 1962, 78, 84, 92 లలో అమెరికా, 1982లో రష్యాపర్యటనలు.

రచనలు : మార్క్ ట్వేన్ (**టామ్‌సాయర్, హకల్‌బెరీఫిన్, రాజూ పేద, విచిత్రవ్యక్తి, టామ్‌సాయర్ ప్రపంచయాత్ర**) నవలలకు, ఆర్.ఎల్. స్టీవెన్‌సన్ (**కాంచనద్వీపం**) నవలలకు, ఆస్కార్‌వైల్డ్ (**బాలరాజు**) కథలకు అనువాదాలు. 'సవ్యసాచి' పేరుతో రాజకీయ వ్యంగ్య గేయాలు; **'హరివిల్లు'** (బాలగేయాలు); **'కథాగేయ సుధానిధి'** (ఈసప్ కథలు); కీర్తి శేషుడు విశ్వాత్ముల నరసింహమూర్తి **'మిత్రలాభం-మిత్రభేదం'** బొమ్మల కథకు, శ్రీ బాపు **'అసంప్రేక్ష్య కారిత్వం'** బొమ్మల కథకు గేయరచన; **'ఉషస్విని'** (కవితా సంపుటి); ఖగోళ భౌతిక శాస్త్ర రచన **'విశ్వరూపం'**; మానవ పరిణామ శాస్త్రగ్రంథం **'నరావతారం'**. సంపాదకీయ సంకలనాలు. **'అనుపల్లవి'**, 'చిరంజీవులు'; 'వ్యాఖ్యావళి'; **'విశ్వదర్శనం'** (రెండు భాగాలు) – పాశ్చాత్య తత్వ చింతన; భారతీయ చింతన.

ముందుమాట

దాదాపుగా అర్ధశతాబ్దంనాటి సంగతి. నేను జర్నలిజంలో అడుగుపెట్టిన తొలి రోజులు. మద్రాసులోని తంబుచెట్టి వీధిలో ఆంధ్రపత్రిక కార్యాలయంలో కొడవటిగంటి కుటుంబరావు, పండితారాధ్యుల నాగేశ్వరరావు, దాసు వామనరావు, తెన్నేటి సూరి, పిలకా గణపతిశాస్త్రి, వి.డి. ప్రసాదరావు, సూరంపూడి సీతారాం, జి. కృష్ణ, ఎమ్.ఎస్. శర్మ వంటి హేమా హేమీలతో కలకల లాడుతూ వుండేది. తీరిక సమయాలలో సాహిత్యచర్చలు, రాజకీయాలపై వాదోపవాదాలు, మార్క్సిజం మంచి చెడ్డలపై తర్జన భర్జనలు. వారి సరసన జర్నలిజంలో అఆలు, కఖాలు దిద్దుకుంటూ నేను.

ఆంధ్రపత్రిక వీక్లీ ఇన్‌చార్జి ఎడిటర్‌గా కుటుంబరావుగారు దాని ప్రాచుర్యాన్ని పెంచే ప్రయత్నంలో భాగంగా ఇంగ్లిష్‌లోని ఉత్తమ సాహిత్యాన్ని తెలిగించే ప్రణాళికను ప్రారంభించారు. ఆ ప్రణాళికా భారం స్వల్పంగా నా మీద కూడా పడింది. ఆ విధంగా 1950-51 సంవత్సరాలనుంచి వరసగా వెలువడినవే మార్క్‌ట్వేన్ నవలలైన టామ్ సాయర్, హకల్‌బెరీ ఫిన్, ప్రిన్స్ అండ్ ది పాపర్, మిస్టీరియస్ స్ట్రేంజర్, టామ్ సాయర్ ఎబ్రాడ్, ఆర్.ఎల్. స్టీవెన్సన్ నవల ట్రెజర్ ఐలెండ్‌మొదలైన నవలలకు నా అనువాదాల సీరియల్స్ .


ఆ రోజులలో ఆ అనువాదాలు పాఠకులను ఎంతగా ఉవ్విళ్ళూరించాయో చెప్పనలవి కాదు. వాటిని అప్పటిలోనే ఆంధ్రగ్రంథమాల (ఆంధ్రపత్రిక అనుబంధ సంస్థ) వారు మళ్ళీ మళ్ళీ పుస్తకరూపంలో ప్రచురించినప్పుడూ అంతే. ఆ తర్వాత చాలా కాలానికి నవోదయ పబ్లిషర్స్, మరియు లిఖిత ప్రచురణలవారు ప్రచురించినప్పుడూ అంతే. కాగా కొంతకాలంగా మార్కెట్‌లో లభ్యం కాని ఈ నవలలను ఇప్పుడు ఈ తరం పాఠకులకోసం అభినందన పబ్లిషర్స్ (విజయవాడ) సంస్థవారు పునః ప్రచురిస్తున్నారు. వారికి నా ధన్యవాదాలు.

అమెరికన్ సాహిత్య నిర్మాతలలో ఒకడైన మార్క్‌ట్వేన్ (1835-1910)ను అబ్రహాం లింకన్ ఆఫ్ అమెరికన్ లిటరేచర్‌గా పేర్కొంటారు. బానిసతనం నుంచి నీగ్రోల విముక్తికి జరిగిన భావపరివర్తనోద్యమంలో ఆయన "హకల్‌బెరీ ఫిన్" నవల ప్రముఖపాత్ర వహించింది. అదీ, దాని వలెనే బాలురను కథానాయకులుగా తీసుకుని ఆయన వ్రాసిన టామ్ సాయర్, ప్రిన్స్ అండ్ ది పాపర్, మిస్టీరియస్ స్ట్రేంజర్ మొదలైన నవలలు అమెరికన్ సాహిత్యంలో క్లాసిక్స్ . ఒకవైపు వ్యంగ్యంతో కూడిన మానవతా వాదం వాటి ట్రేడ్‌మార్కు. ఆనాటి నుంచి ఈనాటివరకు అవి తరం తర్వాత తరాన్ని, అన్ని వయస్సులవారిని ఉర్రూత లూగిస్తూనే ఉన్నాయి. సాహసం కోసమే సాహసాలు చేస్తూ ఎప్పుడూ చిక్కుల్లో చిక్కుకునే టామ్ సాయర్, అతని జతగాడు హక్ ఫిన్, ఒకే పోలికలతో అందరిని తికమక పెట్టిన ఇంగ్లండు బాలరాజు ఆరవ ఎడ్వర్డు, పేదబాలుడు టామ్ కాంటీ (రాజు-పేద) మంచితనానికి మారుపేర్లు. నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం అని తన ముగ్గురు బాలమిత్రులకు గంభీరమైన పాఠాలు చెబుతూ, వారితో పాటు మనల్నీ కూడా ఒక అద్భుత మాంత్రిక ప్రపంచంలోకి తీసుకుపోయే సైతాను ఎప్పుడైనా మనకి కూడా ప్రత్యక్షమైతే ఎంత బావుంటుందో అని విచిత్రవ్యక్తి నవల చదువుతూ లొట్టలు వేయని పాఠకులుండరు.

పిల్లలను, పెద్దలను తీయని సాహసలోకాలలోనికి సాహసయాత్ర చేయించే మార్క్‌ట్వేన్ నవలలను మరొకసారి తెలుగు పాఠకులకు సమర్పిస్తున్నాను. అందుకోండి.

25 ఏప్రిల్, 2006

- నండూరి రామమోహనరావు



కాంచన ద్వీపం

కాంచన ద్వీపానికి సంబంధించిన యావత్తు కథను ఏమీ దాచకుండా పుస్తక రూపంలో రాయవలసిందని జమిందారు ట్రెలానీ, డాక్టరు లివ్‌సే, ఇంకా ఇతర మిత్రులు నన్ను ప్రోత్సహించారు. అందుచేత నాకు కూడా ఉత్సాహం కలిగి నాకు తెలిసినదంతా రాయడానికి పూనుకున్నాను. కాంచన ద్వీపం ఉనికిపట్టును గురించి మాత్రం నేను వెల్లడిచేయ దలుచుకోలేదు- అక్కడ ఇంకా త్రవ్వని ధనరాసులు ఉండడం మూలాన.

నా చిన్న తనంలో జరిగిన వింత సంఘటనలు ఇప్పుడు తలుచుకుంటే అవన్నీ నిన్న మొన్న జరిగినట్టు అనిపిస్తోంది.

మా వూరు సముద్ర తీరానికి బాగా దగ్గర. ఊరికీ సముద్రానికీ మధ్యగా ఉండేది. మా ''ఎడ్మిరల్ బెన్‌బో''. ఈ ''ఎడ్మిరల్ బెన్‌బో'' అనేది మా నాన్న నడుపుతున్న హోటల్ పేరు. మా హోటలుకు చుట్టుపక్కల చాలాదూరం వరకూ ఇళ్ళుండేవి కావు. ఎప్పుడోగాని సాధారణంగా ఆ చాయలకు ఎవరూ వచ్చేవారు కారు.

ఇలా ఉండగా ఒకరోజున మా ఇంటికి ఒక వింత మనిషి వచ్చాడు. వయస్సు అరవై పైగా ఉండవచ్చు. నల్లగా మాసిన బట్టలు, పొడుగాటి పిలక, కణతమీద కత్తిగంటు, మోటువారిన వేళ్ళు, పొడుగ్గా, బలంగా, బరువుగా- ఈ లక్షణాల తో అతడు మా ఇంటికి వచ్చాడు. చూసీ చూడగానే అతడు ఏళ్ళతరబడి సముద్ర

జీవితం గడిపిన నావికుడని స్ఫురిస్తుంది. అతని వెనక కూలివాడు పెద్ద కావడి పెట్టెను మోసుకొచ్చాడు.

వృద్ధనావికుడు మా హోటల్లోకి అడుగు పెడుతూనే పడవవాళ్ళ పాట లంకించుకున్నాడు. తరవాత కూడా చాలాసార్లు అతడు ఈ పాటనే తనలో తను పాడుకోవడం విన్నాను :

'' రాసులకొద్దీ రత్నాలున్నాయ్
యెూ – హో – హో – బలె గుమ్మైన రమ్!
కిమ్మనకుండా గమ్మున తాగెయ్
యెూ – హో – హో – బలె గుమ్మైన రమ్! ''

కర్ణకఠోరంగా ఉండేదతని కంఠం. ఆ గొంతుకలో ఒకటి కాదు – రెండు మూడు గొంతుకలు దేనికది విడివిడిగా పలికేవి.

''ఆ పెట్టె అక్కడ దింపరా అబ్బీ.'' అని కూలివాడికి ఆజ్ఞాపించి ఒక బల్ల ముందు కూర్చున్నాడు. ''ఎవరిక్కడ'' అని బల్లమీద దౌర్జన్యంగా చరిచాడు. మా నాన్న లోపల్నించి రాగానే ''రమ్'' అని అరిచాడు. (రమ్ అంటే ఒక రకమైన సారాయం.) మా నాన్న గ్లాసులో రమ్ తీసుకొచ్చి ఇచ్చాడు. గ్లాసును గభాల్న ఒడిసిపట్టుకొని ''ఓహో'' అని రుచిని మెచ్చుకుంటూ నెమ్మదిగా, చాలాసేపు ఊరించుకుంటూ తాగాడు. మధ్య మధ్య మాకేసి, మా హోటల్ బోర్డు కేసి, దూరాన శిఖరాల కేసి చూశాడు.

తాగడం పూర్తయింది. ''బాగానే వుంది ఈ చోటు. ఇక్కడికి బాగా జనం వస్తుంటారా?'' అని మా నాన్న నడిగాడు. రారని సమాధానమిచ్చాడు మా నాన్న.

'' మరీ మంచిది, ఇలాంటి చోటుకోసమే వెదుకుతున్నాను. ఇదుగో చూడు నేస్తం! నేను ఉన్న దున్నట్టు మొహం మీద కక్కేసే మనిషిని. నాకేం అక్కర్లేదు. వేళ పట్టున ఇంత తిండి, ఇంత రమ్ పడేశావంటే నీజోలి నాకక్కర్లేదు, నా జోలి నీకక్కర్లేదు. నా పేరు..... నాపేరేదైతేనేంలే. నన్ను కెప్టెన్ అని పిలుస్తూ వుండు.

ఏమిటలా చూస్తావ్? ఓహో అదా నీ గొడవ. ఇంద యీ డబ్బు తీసుకో–'' అంటూ కోటు జేబులోంచి మూడు నాలుగు బంగారు నాణాలు తీసి బల్లమీద విసిరేశాడు.

అతడు తను కెప్టెన్ (నౌకాధికారి) నని చెప్పుకున్నప్పటికీ అతని వాలకంచూస్తే కెప్టెన్ లాగా లేనేలేడు. మామూలు కళాసీలాగానే ఉన్నాడు. పెట్టె తీసుకు వచ్చిన కూలివాణ్ణి తరవాత అడగ్గా చెప్పాడు; ఈ మనిషి ఆరోజు పొద్దునే టపాబండిలో దిగాడట. ఊళ్లో మంచి హోటళ్ళు ఏమేమున్నాయో వాకబు చేశాట్ట. ఉన్న అన్నిట్లోకి మా హోటలే మంచిదనీ, ఎప్పుడూ నిశ్శబ్దంగా, నిర్జనంగా, సముద్రానికి దగ్గిరగా ఉంటుందని ఎవరో చెప్పారట. వెంటనే తనకు తగిన స్థలం ఇదేనని నిశ్చయం చేసుకుని ఇటు వచ్చాడట. ఇంతకు మించి అతన్ని గూర్చి మాకేమి తెలియదు.

అతడు బాగా మితభాషి. పగలల్లా చంకలో ఇత్తడి టెలిస్కోపు పెట్టుకొని. కొండ గుట్టల మీదా, సముద్ర తీరానా ఒంటరిగా తిరిగేవాడు. చీకటి పడగానే తిరిగివచ్చి భోజనశాలలో చలిమంటకు దగ్గరగా కూర్చుని గ్లాసు రమ్ తాగే వాడు. ఎవరన్నా పలకరిస్తే పలికేవాడు కాదు. తలెత్తి గుడ్లురిమి చూసేవాడు; ముక్కుతో బుర్రుమని భయంకరంగా శబ్దం చేసేవాడు. ఈ అలవాటు గమనించి మేము కూడా అతని జోలికి పోయేవాళ్ళం కాము. ప్రతి సాయంత్రం షికారు నుంచి రాగానే నన్నో, మా నాన్ననో అడిగేవాడు; ఓడ కళాసు లెవరన్నా ఆ దోవన వచ్చారా అని. తన జాతి వాడెవడూ దొరక్క తోచడం లేదేమో, అందుకని అడుగుతున్నాడేమో అని అనుకునే వాళ్ళం మొదట్లో. కాని క్రమంగా తెలిసింది– నావికులెవరికీ కంట పడకుండా అతడు తప్పించు కుంటున్నట్టు. ఎప్పుడైనా నూటికీ, కోటికీ ఎవడన్నా నావికుడు మా ''ఎడ్మిరల్ బెన్ బో'' కు వస్తే (కోస్తా రోడ్డునే బ్రిస్టల్ నగరానికి పోయేవాళ్ళు మా హోటలు కు వచ్చి విశ్రాంతి తీసు కునే వాళ్ళు లెండి) మన కెప్టెన్ తలుపు సందుల గుండా ముందు తొంగి చూసి ఆ వచ్చిందెవరో తేల్చుకునిగాని ఇవతలకు వచ్చేవాడు కాడు.

అతడు ఎవరికోసం భయపడుతున్నాడో నాకు తెలుసు. ఎందుకంటే ఒకసారి నన్ను చాటుకు పిలిచి చెప్పాడు; ఒంటి కాలి ఓడ కళాసి ఎవడైనా వస్తే తక్షణం తనకు చెప్పవలసిందని. అలా జాగ్రత్తగా పహరా కాస్తూ వుంటే ప్రతి నెలా నాకు నాలుగు పెన్నీలు భత్యంగా ఇస్తానని కూడా వాగ్దానం చేశాడు. నేను ప్రతి ఒకటో తారీకున నా భత్యం కోసం అడిగేవాణ్ణి. అతడు బుర్రుమని శబ్దం చేసి నాకేసి నిశ్చలంగా చూసేవాడు. ఇవ్వడం ఇష్టం లేదేమోనని నేను వెళ్ళి పోయే వాణ్ణి. కాని, రెండు మూడు రోజులయ్యాక, నా జీతం నాకివ్వకపోతే వచ్చే నష్టం ఆలోచించుకునే వాడల్లే వుంది. మాట్లాడకుండా వచ్చి నాలుగు పెన్నీలూ నా చేతిలో పెట్టి మళ్లీ హెచ్చరించేవాడు. '' ఒంటికాలు ముండా కొడుకు వస్తే మాత్రం మర్చిపోకేం'' అని.

''ఒంటికాలు పెద్దమనిషి'' రోజులకు రోజులు నన్నెలా వెంటాడాడో మీకు చెప్పనక్కర్లేదనుకుంటాను. హోరున కుంభవృష్టిగా వర్షం కురిసే అర్ధరాత్రి సమయాల్లో, ఈదురుగాలి మా కిటికీ తలుపులను దడదడ మొత్తేటప్పుడు, సముద్రపు కెరటాలు కల్లోలంగా లేస్తూ విరుగుతూ గర్జించేటప్పుడు, '' ఒంటి కాలు మనిషి'' వెయ్యి రూపాలతో, వెయ్యి విధాలుగా నాకు గోచరించే వాడు. ఒకసారి మోకాలు వరకూ కాలు తెగివున్నట్టు, మరోసారి తొడవరకూ తెగినట్టు కనబడేది. ఒకసారి అతడు పుట్టడమే ఒక్క కాలుతో పుట్టినట్టు అనిపించేది. ముఖ్యంగా నిద్రపోతున్నప్పుడు ఆ రాక్షస వ్యక్తి నా స్వప్నాల చీకట్లో ప్రత్యక్షమై కొండల మీంచి కొండల మీదికి నన్ను తరిమేవాడు. నాలుగు పెన్నీల జీతం మాట దేవుడెరుగును గాని, ఈ ఊహా రాక్షసుడితో నేనెన్ని రోజులు బాధ పడ్డానో చెప్పలేను.

కాని అన్నిటికంటె విపరీతంగా నన్నూ, ఇతరులనూ భయపెట్టింది మా కెప్టెన్ ప్రవర్తన. ఒక్కోసారి అతడు మితిమీరి తాగేవాడు; భోజన శాలలో బల్లముందు కూర్చుని. చుట్టూ ఎవరున్నా లెక్కచెయ్యకుండా, గార్దభస్వరమెత్తి పల్లెపదాలు పాడేవాడు; ఇంకోసారి అందర్నీ తనచుట్టూ కూర్చోమని

ఆజ్ఞాపించి, ఏమిటేమిటో రకరకాల కథలు చెప్పేవాడు; లేకపోతే తను పాడే పాటలకు వంత పాడమనేవాడు. అందరూ గజగజ వణికిపోతూ అతడేం చెయ్యమంటే అదల్లా చేసేవారు. హోటలుకు వచ్చే అతిథులు కెప్టెన్ చుట్టూ ప్రాణాలుగ్గబట్టుకుని కూర్చుని, ''యో - హో - హో -'' లతో ఇంటికప్పు లెగిరిపోయేట్టు పాడటం నాకిప్పటికీ బాగా జ్ఞాపకం. ప్రతివాడూ తన పక్కవాడి కంటే బిగ్గరగా పాడటానికి ప్రయత్నించేవాడు; ఎందుకంటే ఎవరన్నా గొంతు కలపనట్టు కనిపిస్తే ఊరుకునేవాడు కాదు కెప్టెన్.

పూటుగా తాగి నిషా మీదున్నప్పుడు కెప్టెన్ దగ్గిరలో ఉండటం అంత ప్రమాదం మరోటి లేదు; వజ్రాయుధంలాంటి చేత్తో బల్లమీద ధన్ మని గుద్ది '' షటప్'' అనేవాడు; తను కథ చెబుతుంటే ఎవరన్నా ప్రశ్న వేస్తే తారాజువ్వలాగ ఎగిరేవాడు; పోనీ ప్రశ్న వెయ్యకుండా ఊరుకుంటే, ఎవ్వరూ వినడంలేదని తప్పు పట్టేవాడు. మొత్తానికి తను మస్తుగా తాగి, మత్తెక్కి నిద్రపోయిందాకా ఎవ్వర్నీ హోటల్లోంచి కదలనిచ్చేవాడు కాడు. అతని కథలు బలే భయంకరంగా ఉండేవి. హత్యలు, ఉరికొయ్యలు, సముద్రాల్లో తుపానులు, ఎడారుల్లో దెయ్యాలు, దొంగతనాలు.... అతడు ఉపయోగించే భాషనీ, బూతుల్నీ వింటుంటే ఇంతకంటె పరమనీచుణ్ణి దేవుడు సృష్టించలే దనిపిస్తుంది.

'' ఈ లుచ్ఛాగాడెక్కడ దాపురించాడర్రా మన ప్రాణాలకి? వీడి మూలాన మన హోటలుకి వచ్చే కొద్దిమంది కూడా మానుకునేట్టున్నారు.'' అని మా నాన్న అనేవాడు. నిజానికి మొదట్లో జనం కెప్టెన్‌ను చూసి భయపడ్డారు గాని క్రమంగా వారి భయం తగ్గిపోయింది. మా పల్లెటూరి మందకొడి జీవితంలో ఈ కెప్టెన్ మూలానే కాస్త సంచలనం అంటూ కలిగింది. ఏ కొత్తదనమూ ఏ ఉద్రేకమూ ఎరగని మా వూరి యువకులు అతనిచుట్టూ మూగి ఆ విచిత్ర కథలు వినేవారు. కొందరు కొందరికి అతనంటే గౌరవం కూడా పుట్టి '' ఇలాంటి ధైర్యవంతులు, సాహసులు ఉండడం మూలానే సముద్రాలమీద ఇంగ్లండు ప్రభ అలా వెలుగుతోంది'' అని మెచ్చుకునేవారు.

ఒక విషయంలో మాత్రం అతడు మమ్మల్ని నాశనం చేశాడని చెప్పక తప్పదు. వారాలు, నెలలు గడిచిపోతున్నా అతగాడు మా బసలోంచి కదల్లేదు. మొదట్లో ఏమిచ్చాడో ఇచ్చాడు! అంతే; మళ్ళీ ఒక పెన్నీ విదిలించలేదు. మా నాన్న ఎప్పుడన్నా బాకీ సంగతి ఎత్తితే భయంకరంగా బుర్రుమని, నిశ్చలంగా చూసేవాడు. మా నాన్న హడిలిపోయి అవతలికి జారుకునేవాడు. కెప్టెన్ మా ఇంటికి వచ్చింది మొదలు, చనిపోయేవరకు అవే బట్టలు, అదే టోపీ, అవే మేజోళ్ళు ఉపయోగించేవాడు. కోటు క్రమంగా చిరిగిపోయింది. కాని దాన్నే కుట్టుకుని తొడుక్కునేవాడు. చివరికి అతుకుల గుడ్డతప్ప కోటు అంటూ ఏమీ మిగల్లేదు. అతడు ఎవరికీ ఉత్తరాలు రాయడం గాని, అతని కెవరూ రాయడం గాని నేను చూడలేదు. మేడమీది గదిలో మంచంకింద దాచిన కావడిపెట్టెను కూడా అతడు తెరవడం నేనెప్పుడూ ఎరగను.

కెప్టెన్‌కు ఒక్కసారే '' ఎదురుదెబ్బ'' తగిలింది; అదైనా ఆఖరు రోజుల్లో. మా నాయనకు పెద్ద జబ్బు చేసింది. ఒకరోజు సాయంత్రం డాక్టర్ లివ్‌సేగారు రోగిని చూడటానికి మాయింటికి వచ్చారు. మా అమ్మ డాక్టరు గారికి భోజనం వగైరా ఆతిథ్య సత్కారాలు చేసింది. అదయిన తర్వాత డాక్టరుగారు తన ఇంటికి తిరిగి పోవడానికి ఉద్యుక్తులయ్యారు. కాని ఆయన గుర్రం గ్రామం నుంచి తిరిగి రావడానికి కొంత ఆలస్యమైంది. ఈలోగా పైప్ కాల్చుకోవచ్చుగదా అని ఆయన హాల్లో కాసేపు కూర్చున్నారు. నేను కూడా ఆయన సమీపంలో కూర్చున్నాను. డాక్టరుగారి మల్లెపువ్వుల్లాంటి బట్టలు, తెలివితేటలుట్టిపడే ప్రకాశవంతమైన ముఖం, ఆయన మర్యాద మంచితనం ఇవన్నీ చూసి, అటు ఒక మూల రమ్ తాగుతూ కూర్చున్న కెప్టెన్‌ను, అతని కంపుగుడ్డలు, దిష్టి బొమ్మలాంటి వాలకం చూస్తే కెప్టెన్‌మీద ఎంతరోత కలిగిందో చెప్పలేను.

కెప్టెన్ ఉన్నవాడు ఉన్నట్టుండి వేళ్ళతో బల్లమీద తాళంవేస్తూ తన పాత పాట ప్రారంభించాడు :-

కిమ్మనకుండా గమ్మున తాగెయ్-

యో-హో-హో- బలె గుమ్మైన రమ్

ఈ పాట మేము రోజూ వినేదే అవడంవల్ల మాకెవ్వరికీ కొత్త అనిపించలేదు. కాని డాక్టర్‌గారు మాత్రం ఉలికిపడి చూశారు. రెండు మూడు క్షణాలు కెప్టెన్ కేసి తీవ్రంగా, చిరాగ్గా చూసి మళ్లీ నాతో కబుర్లలో పడ్డారు. కొంతసేపటికి తన పాటను ఎవరూ లెక్కచెయ్యకపోవడం గమనించి కెప్టెన్ పాట ఆపాడు. ధన్‌మని బల్లమీద గుద్ది '' షటప్'' అని పిడుగు పడ్డట్టు అరిచాడు. వెంటనే హాల్లో వున్న అతిథులు యావన్మందీ నోళ్ళు నొక్కుకుని నిశ్శబ్దంగా కూర్చున్నారు. డాక్టరుగారు మాత్రం సంభాషణ ఆపలేదు. కొన్ని కొన్ని రకాల జబ్బులను గూర్చి నాకు వివరిస్తూ మాట్లాడుతున్నారు. హాల్లో ఆయన ఒక్కడి గొంతుకే మృదువుగా, స్పష్టంగా వినబడుతోంది. కెప్టెన్ డాక్టరు గారి వంక నిశ్చలంగా చూసి, '' ఎవడ్రా అక్కడ? షటప్'' అని బల్లమీద మళ్ళీ చరిచాడు.

'' మీరు నాతోనేనా మాట్లాడేది?'' అని డాక్టరు గారు అడిగారు.

'' ఆ, నీకే చెప్పేది.''

'' సార్! మీకు ఒకమాట చెప్పదలుచుకున్నాను. మీరు ఇదేవిధంగా రమ్ తాగుతూ ఉన్నట్టయితే, త్వరలో ప్రపంచం నుంచి ఒక తాగుబోతు వెధవ నిష్క్రమిస్తాడు.''

కెప్టెన్ కోపం వర్ణించతరం కాదు. ఉవ్వెత్తున లేచాడు. బొడ్డులో నుంచి ఓడ కళాసీ లుపయోగించే పొడుగాటి చాకు తీశాడు. '' పొడిచి పారేస్తా'' నని డాక్టర్ని బెదిరించాడు.

డాక్టరుగారు కదల్లేదు; ఇదివరకు లాగే నిర్భయంగా ఇంకా గొంతు హెచ్చించి మాట్లాడారు :

'' ఆ చాకు ముడిచెయ్యి. నిన్ను ఉరికంబం ఎక్కించడం నా అభిమతం కాదు.''

అక్కణ్ణించి ప్రారంభమైంది వారిద్దరి మధ్య చూపుల యుద్ధం. కళ్ళలోంచి నిప్పులు కురిపిస్తూ ఒకళ్ళనొకళ్ళు చూసుకున్నారు, కొంత సేపటికి కెప్టెన్

వెనక్కి తగ్గాడు. చాకు ముడిచి బొడ్డులో దోపుకుని దెబ్బతిన్న కుక్క తోక ముడుచుకున్నట్టు మళ్ళీ కుర్చీలో కూర్చున్నాడు. అతడు కూర్చోగానే డాక్టరుగారు ప్రారంభించారు:

'' ఇదుగో మిస్టర్! నా జిల్లాలో నీ బోటి వెధవ, నీచుడు, లుచ్చా ఒకడున్నాడని ఇప్పటికి తెలుసుకున్నాను! కనుక రాత్రింబగళ్లు నీ మీద ఒక కన్ను వేసి వుంటాను. నేను వట్టి డాక్టర్ని మాత్రమే ననుకుంటున్నావేమో. నేను ఈ జిల్లాకు మేజిస్ట్రేటును కూడా. జాగ్రత్తగా మసులుకున్నావా సరే సరి. లేక ఇవ్వాళ్టి మాదిరిగా అసభ్యంగా ప్రవర్తించావా, నిన్ను ఈ ప్రదేశంనుంచి నూరుమైళ్ళ అవతలకు గెంటించి వెయ్యగలను. అర్థమైందా నే చెప్పింది?''

ఇంతలో డాక్టర్ లివ్‌సేగారి గుర్రం గుమ్మం ముందుకు వచ్చి నిలబడింది. ఆయన వెళ్ళివస్తానని చెప్పి గుర్రమెక్కి వెళ్ళిపోయారు. కెప్టెన్ మాత్రం ఆ రాత్రే కాదు, తరవాత చాలా రాత్రులవరకు కూడా గుప్‌చుప్‌గా కాలం గడిపాడు.

2

ఆ తరవాత వరసగా కొన్ని విచిత్ర సంఘటనలు జరిగి, కెప్టెన్ పీడ విరగడైపోయింది మాకు. అది శీతాకాలం; విపరీతంగా మంచు కురిసి రోజు రోజంతా చలిగాలులు వీచేవి. మా నాయన వసంతకాలం వరకూ బతుకుతాడని మా కెవ్వరికీ ఆశలేదు. రోజురోజుకీ ఆయన పరిస్థితి అధ్వాన్న మవుతోంది. నేను, మా అమ్మ హోటలు పనితో సతమతమైపోతున్నాం.

జనవరి నెలలో ఒక ఉదయం – అప్పుడే తెల్లవారింది. మంచు కురుస్తోంది; చలి కరుస్తోంది.

సముద్రం పొగమంచు అలల్లో దాక్కుంది: కెరటాల తుళ్ళింతలు మాత్రం వినిపిస్తున్నాయి. సూర్యుడు కొండశిఖరాల నుంచి తొంగిచూస్తున్నాడు. మా కెప్టెన్ మామూలుకంటె పెందలాడే లేచి సముద్రపు ఒడ్డుకి బయల్దేరాడు.

భుజానికి టెలిస్కోపు, నడుముకు చురకత్తి తగిలించుకున్నాడు. అతడు రోడ్డు మలుపు తిరిగేవరకు నే నలాగే అతనివంకే చూస్తున్నాను. మలుపు తిరుగుతూ ఖాండ్రించి ఉమ్మేసి బిగ్గరగా ఏదో బూతుమాట అన్నాడు. డాక్టర్ లివ్‌సే ఆ రోజున తన్ను ఎదుర్కొన్నందుకు అతనికింకా కోపం తీరలేదని అనుకున్నాను నేను.

అమ్మ మేడమీద మా నాన్నకు పరిచర్యలు చేస్తోంది. నేను భోజన శాలలో ఏదో పనిమీద వున్నాను. ఇంతలో హాలు తలుపులు తెరుచుకుని ఒక మనిషి లోపలికి వచ్చాడు. అతన్ని అంతకు ముందెప్పుడూ నేను చూడలేదు. మధ్య వయస్కుడు; కొట్లాటలో ఆరితేరిన వాడివలె కనిపించలేదు; ఓడ కళాసీవలె కూడాలేడు; కాని అతనివద్ద సముద్రపు వాసన కొడుతున్నట్టే అనిపించింది.

'' ఏం కావాలి?'' అని అడిగాను.

'' రమ్'' అన్నాడా మనిషి. నేను గ్లాసు పట్టుకుని లోపలికి వెళ్ళబోతున్నాను. అతడు నన్ను దగ్గిరికి రమ్మని సంజ్ఞ చేశాడు. నేను ఉన్న చోటే ఆగాను.

'' దగ్గిరికి రా నాయనా, ఒక్క మాట చెప్పాలి.''

నేను దగ్గిరికి వెళ్ళాను. అతడు బల్లమీద అనుకుని రహస్యంగా అడిగాడు.

'' నా స్నేహితుడు బిల్ లోపలున్నాడా?''

నాకు బిల్ ఎవడో తెలియదని, కెప్టెన్ అని మేము పిలిచే మనిషి మాత్రం మా హోటల్లో ఉంటున్నాడని చెప్పాను.

'' నా స్నేహితుడు బిల్ ఉన్నాడే, వాడికి కెప్టెన్ అని పిలిపించుకోవడం ఒక సరదాలే. ఒక చెంపమీద కత్తి గంటు ఉంటుంది, కుడి చెంపమీద . అవునా? ఎప్పుడూ రమ్ము లో మునిగితేల్తూ ఉంటాడు కదూ? ఆ ఇప్పుడు చెప్పు. నా నేస్తం బిల్ లోపలున్నాడా?''

బయటకు షికారుగా వెళ్ళాడని చెప్పాను.

'' ఎటువేపు వెళ్ళాడమ్మా, బీచివేపా, ఇటువేపా?''

నేను కెప్టెన్ వెళ్ళిన దిక్కు చూపించాను. '' సరే'' అని మాత్రం అన్నాడు

ఆ కొత్త మనిషి. హాలు ద్వారాలు, కిటికీలు జాగ్రత్తగా పరీక్షించాడు. ఒక కన్ను మాత్రం సింహద్వారం కేసి వేసే ఉంచాడు. అతని ధోరణిచూస్తే ఎలుకల కోసం పొంచివున్న జంగురుబిల్లి జ్ఞాపకం వచ్చింది, నేను కెప్టెన్ వస్తున్నాడేమో చూద్దామని వాకిట్లోకి వెళ్ళాను. వెంటనే ఆ కొత్తవాడు నన్ను లోపలికి వచ్చెయ్యమని ఆజ్ఞాపించాడు . నేను '' వస్తానులే'' అన్నట్టుగా అక్కడే నుంచున్నాను. దాంతో అతని ముఖం కోపంతో కందగడ్డలాగైంది. ''రావేం'' అని గద్దించాడు. నేను భయపడి తక్షణం లోపలికి వచ్చాను.

అతడు మళ్ళీ మామూలు మనిషై పోయాడు! ప్రేమగా నా జుట్టు నిమురుతూ ''నువ్వు చాలా మంచివాడివమ్మా. నాకు సరిగ్గా నీలాంటి కొడుకే ఉన్నాడు. అచ్చు నీలాగే ఉంటాడు. కాని చూడు మా అబ్బాయి నేనేది చెబితే అది వింటాడు. పిల్లలు పెద్దవాళ్ళేం చెప్పినా చెయ్యాలి. లేకపోతే చెడిపోతారు. బిల్‌గాడితో నువ్వెప్పుడన్నా ఓడలో ప్రయాణం చేసివుంటే తెలిసేది. వాడి మాట వినకపోతే తల బద్దలు గొట్టేయడమే వాడి పద్ధతి. ఆ, అడుగో వస్తున్నాడు నా నేస్తం. ఆ పాత టెలిస్కోపూ, వాడూ తయారు. అబ్బాయ్ నేను లోపల గదిలో దాక్కుంటాను. వాడు రాగానే కాస్త బెదర గొడదాం. వెధవ సన్నాసిని చూసి చాలా ఏళ్ళయింది-'' అంటూ కొత్త మనిషి నన్ను కూడా లోపలికి తోశాడు. నన్ను అడ్డం పెట్టుకుని తలుపు చాటున దాక్కున్నాడు. నేను '' ఇదంతా ఏమిట్రా బాబూ '' అని భయపడ్డమాట వాస్తవం. కొత్త మనిషికూడా భయపడు తున్నట్టు అతని ముఖం చూస్తేనే తెలుస్తోంది. నడుముకు తగిలించుకున్న చురకత్తిని బైటికి తీసి రెడీగా పట్టుకున్నాడు.

కెప్టెన్ హాల్లోకి ప్రవేశించాడు; తలుపులు భద్రంగా మూసి అటూ ఇటూ చూడకుండా మేడమెట్లకేసి వెడుతున్నాడు.

'' బిల్!'' అని పిలిచాడు కొత్త మనిషి వణుకుతూ.

కెప్టెన్ గిరుక్కున వెనక్కి తిరిగి మమ్మల్ని చూశాడు . చూస్తుండగానే అతని ముఖం పాలిపోయింది. కళ్ళలో అర్థంకాని భయం ప్రవేశించింది. చీకట్లో దెయ్యాన్నో, తాచుపామునో చూసిన వాడిలా తయారయ్యాడు.

'' బిల్: మర్చిపోయావా, నీ పాత కాలపు నేస్తాన్ని.''

''నల్లకుక్క:-'' అన్నాడు కెప్టెన్.

'' ఆ, నల్లకుక్కనే. నా పేరుకూడా జ్ఞాపకముందీ? నువ్వు 'బెన్‌బౌ' హోటల్లో మకాం చేశావని తెలిసి చూసిపోదామని వచ్చాను. బిల్లీ, ఎన్నాళ్ళయిందిరా మనిద్దరం కలుసుకుని? ఎలాగైనా ఆ రోజులే మంచివనుకో. అప్పుడుండే ఉషారేదీ ఇప్పుడు?''

'' అరేయ్ నల్లకుక్కా: నేనిక్కడున్నట్టు ఎవరు చెప్పారోగాని, రానేవచ్చావు. సరే. ఇదుగో ఇక్కడే వున్నాను; ఏం చేస్తావో చేసుకో, ఏం చెబుతావో చెప్పుకో.''

'' అదేవిట్రా బిల్, నేను రాకరాక వస్తే, అంత తల బిరుసుగా మాట్లాడుతావ్? ముందు ఈ అబ్బాయి చెరో గ్లాసు రమ్ము తెస్తాడు. కాస్త రుచిచూసి, తాపీగా కూర్చుని పిచ్చాపాటీ చెప్పుకుందాం.''

నేను రమ్ము గ్లాసుల్తో తిరిగి వచ్చేసరికి, ఇద్దరూ బల్లవద్ద చెరో వైపు కూర్చున్నారు. నల్లకుక్క తెరిచిన ద్వారానికి దగ్గిరిగా కుర్చీ వేసుకుని ఒక పక్కగా కూర్చున్నాడు. అవసరమైతే పారిపోవడానికి వీలుగా కూర్చున్నట్టు తోచింది నాకు.

నల్లకుక్క నన్ను అవతలకు పొమ్మని ఆజ్ఞాపించాడు.

'' అబ్బాయ్, చాటునించి విందామని అనుకుంటున్నావేమో , జాగ్రత్త:'' అని హెచ్చరించాడు. నేను లోపలికి వెళ్ళిపోయాను.

చాలా సేపటివరకూ నేను విందామని ఎంత ప్రయత్నించినా వారి మాటలు వినిపించలేదు. గురగురమని రొద మాత్రం వినవచ్చింది. కాని క్రమంగా మాటలు జోరెక్కాయి.

'' ఉహూ, ఉహూ. ఉహూ అంటే ఉహూయే. ఏం లాభంలేదు, నేనివ్వను'' అని కెప్టెన్ కఠినంగా అనడం వినిపించింది.

హఠాత్తుగా బూతులు, తిట్లు ఇతర శబ్దాలు చెలరేగాయి. కుర్చీలు ధన్‌మని

తిరగబడ్డాయి. కత్తులు ఖంగు ఖంగుమని మోగాయి.

'' బాబోయ్'' అని బాధతో కూడిన కేక వినిపించింది. మరుక్షణంలో నల్లకుక్క బైటికి ఉడాయించాడు. కెప్టెన్ కత్తి ఝళిపిస్తూ వెంటబడి తరుము తున్నాడు. నల్లకుక్కకు ఎడమ బుజంనుంచి రక్తం ధారలుగా కారుతున్నది. గేటు తలుపుదాకా పరుగెత్తి కెప్టెన్ కత్తి విసిరాడు. అది తగిలి వుంటే నల్లకుక్క అక్కడే నిలువునా చీలిపోయేవాడు. కాని తలుపుకు పైగా వేళ్ళాడుతున్న మా హోటలు బోర్డుకు తగిలింది కత్తి.

రోడ్డుమీద పడగానే నల్లకుక్క బుజంమీది గాయాన్ని కూడా లెక్కచెయ్య కుండా పరుగులో తనకుగల ప్రావీణ్యాన్ని ప్రదర్శించాడు. కెప్టెన్ కాసేపటి వరకు బోర్డుకేసి చూస్తూ అక్కడే నిలబడ్డాడు. చివరికి ఇంట్లోకి తిరిగివచ్చాడు.

''దెబ్బ తగిలిందా కెప్టెన్?'' అని అడిగాను.

''జిమ్! రమ్ తీసుకురా'' అన్నాడతడు. నిలబడలేక అటూ ఇటూ తూలుతూ పోయి గోడ నానుకున్నాడు. '' నేనిక్కణ్ణించి త్వరగా మూటాముల్లె కట్టెయ్యాలి'' అని రెండు మూడుసార్లు గొణుక్కున్నాడు.

నేను రమ్ముకోసం పరిగెత్తాను. ఆ కంగారులో ఒక గ్లాసు బద్దలు కొట్టాను. ఇంకో గ్లాసులో గబగబా రమ్ము నింపి తీసుకు రాబోతుండగా హాల్లో ధడేలుమని శబ్దమైంది. వచ్చి చూస్తే కెప్టెన్ సాష్టాంగంగా నేలమీద పడిపోయి వున్నాడు ఇంతలో ఈ గలభా అంతా విని మా అమ్మ మేడ మీదనుంచి కిందికి పరుగెత్తుకుంటూ వచ్చింది. మేమిద్దరం సాయంపట్టి కెప్టెన్ ముఖం పైకెత్తగలిగాము. కష్టంగా ఊపిరి పీలుస్తున్నాడు; కళ్ళు మూసుకునే ఉన్నాయి; ముఖం వివర్ణమై భీకరంగా వుంది.

'' ఏమిట్రా నాయనా ఈ గొడవంతా? ఈ దరిద్రపుగొట్టు ముండాకొడుకు మనకెక్కడ దొరికాడురా?'' అని మా అమ్మ గోల చేసింది.

కెప్టెన్‌ను ఏం చెయ్యాలో మాకు తోచలేదు. ఎక్కడ దెబ్బ తగిలిందో కనిపించ నన్నా లేదు. రమ్ముపోస్తే తెలివి వస్తుందేమోనని నోరు తెరవాలని

ప్రయత్నించాముగాని పళ్ళు గట్టిగా కరుచుకుని ఉన్నాడతడు.

ఇంతలో డాక్టర్ లివ్‌సే తలుపుతోసుకుని లోనికి వచ్చారు. ఆయన మానాన్న కెల్లావుందో చూసిపోవడానికి వచ్చారు. డాక్టర్ని చూడగానే మాకు ప్రాణం లేచి వచ్చింది.

'' డాక్టర్‌గారూ , ఏం చేద్దాం? ఇతడు దెబ్బతిని పడిపోయాడు'' అంది మా అమ్మ.

''దెబ్బా? దెబ్బా లేదు ఏం లేదు. నేను ఇదివరకే చెప్పాను. తాగుడు మానకపోతే మూర్ఛరోగం ఎక్కువౌతుందని. శ్రీమతి హాకిన్స్ మీరు మేడమీదికి వెళ్ళి మీ ఆయనను కనిపెట్టి ఉండండి. ఇక్కడ జరిగిందేమీ చెప్పకండి. నేను ఈ తాగుబోతు గాడి వ్యర్థ జీవితాన్ని కాపాడ్డానికి శాయశక్తులా ప్రయత్నిస్తాను. జిమ్! పళ్ళెంలో కాసిని నీళ్ళు తీసుకురామ్మా.''

నేను పళ్ళెంలో నీళ్ళు తీసుకు వచ్చేసరికి డాక్టరుగారు కెప్టెన్ కోటు చేతులు పైకి ఎగదోశారు. బలిష్ఠమైన చేతిమీద వరుసగా పచ్చబొట్లు ఉన్నాయి. ఏమిటేమిటో బొమ్మలు, ''బిల్లీబోన్సు'' అని అక్షరాలు పచ్చబొట్లుగా పొడిచి ఉన్నాయి. బుజానికి సమీపంలో ఉరితీయబడుతున్న మనిషి బొమ్మ వేయబడివుంది. ఆ బొమ్మని చూపిస్తూ డాక్టరుగారు ''తనకు పట్టబోయే గతిని ఇతడు ముందే గ్రహించి ఈ బొమ్మ వేయించినట్లున్నాడు. బలేగా వుంది'' అన్నారు. తరువాత నాకేసి తిరిగి ''జిమ్! నీకు నెత్తురు చూస్తే భయమా?'' అన్నారు.

''లేదండి.''

''అచ్ఛా . చూడు. ఈ పళ్ళెం ఇలా పట్టుకో'' అంటూ తన చాకు తీసి కెప్టెన్ చేతి మీద గంటు పెట్టారు. ఒక నరం తెగింది. నెత్తురు చాలా కారింది పళ్ళెంలోకి. కెప్టెన్ మెల్లిగా కళ్ళు తెరిచి చుట్టూ చూశాడు . డాక్టర్ని చూసి గుర్తుపట్టి కోపంగా మూలిగాడు. తరువాత నన్ను చూసి కాస్త తేరుకున్నాడు. వెంటనే ముక్కుతో బుర్రుమని శబ్దంచేస్తూ లేవడానికి ప్రయత్నించాడు.

'' ఏడీ నల్లకుక్క?'' అని అరిచాడు కెప్టెన్.

'' ఇక్కడ నల్లకుక్కా లేదు, తెల్లకుక్కాలేదు. నువ్వు రమ్ తెగతాగి నట్లున్నావు; నేను చెప్పినట్టుగానే స్పృహ తప్పి పడిపోయావు. నాకిష్టం లేకపోయినా, డాక్టర్ని గనక శ్మశానంలోకి ఒక అడుగు వేసిన నిన్ను ఇవతలకు లాక్కొచ్చాను. సరేకాని, మిస్టర్ బోన్స్-''

''నా పేరు బోన్స్‌కాదు.'' అని కెప్టెన్ అడ్డం వచ్చాడు.

'' కాకపోవచ్చు. బిల్లీ బోన్స్ అని నేనెరిగిన సముద్రపు దొంగ ఒక డుండే వాడులే. నిన్ను చూస్తే వాడు జ్ఞాపకం వచ్చాడు. నీ పేరు నాకు తెలియదు గనుక బోన్స్ అనే నిన్ను పిలుస్తాను. సరే, నీ కొక్కమాట చెబుతాను మళ్లీ. ఒక గ్లాసు రమ్ తాగితే నీకేం ఫర్వాలేదు. కాని ఒకటి తాగితే ఇంకోటి తాగుతావ్. ఇంకోటి తాగితే మరోటి తాగుతావ్. అందుచేత నేను పందెం కాసి చెబుతున్నాను - నువ్వాట్టే రోజులు బతకవని. అర్థమైందా? చచ్చిపోతావ్ కొద్దిరోజుల్లో... చచ్చి... వేరే చెప్పక్కర్లేదు ఏ లోకానికి పోతావో. లే... నుంచో... ఈ సారికి నీపక్కదాకా తీసుకువెడతాను. నడు.''

అతి ప్రయాస మీద కెప్టెన్‌ను నిలబెట్టి మేడమెట్లు ఎక్కించి మంచంమీద పడుకోబెట్టాము. తలుపులు మూసేస్తూ డాక్టరుగారు మళ్ళీ అన్నారు: '' మిస్టర్ బోన్స్! జాగ్రత్త. మళ్ళీ నేను చెప్పలేదనుకునేవ్.''

తరువాత డాక్టరుగారు మా నాన్నను చూడడానికి వెళ్ళారు. నేనుకూడా ఆయన వెంట వెళ్ళాను.

'' ఆ, ఇప్పటికేం ఫరవాలేదు. చాలా నెత్తురు లాగేశాను. కనుక కొంతకాలం దాకా రోగం తిరగ బెట్టదు. వారం రోజుల వరకూ వాణ్ణి కదలకుండా చూడండి. కాని ఈసారి మళ్ళీ మూర్ఛ వచ్చిందో, చచ్చాడన్నమాటే. నేనే కాదు, దేవుడు కూడా వాణ్ణి రక్షించలేడు'' అని చెప్పారు డాక్టరుగారు.

ఆ రోజు మధ్యాహ్నం నేను కెప్టెన్ గదిలోకి చల్లని పానీయాలు, ఏవో మందులు తీసుకుని వెళ్ళాను. అతడు మే మెల్లా పడుకోబెట్టామో అల్లాగే

పడుకుని ఉన్నాడు. బాగా బలహీనంగా, ఏదో ఆందోళనగా ఉన్నట్లు తోచింది.

నన్ను చూడగానే ''జిమ్! ఇక్కడున్న వాళ్ళలో నువ్వొక్కడివే మంచి వాడివిలా కనిపిస్తున్నావు. నేనుకూడా నిన్నెంతో ప్రేమగా చూడటం లేదూ? ప్రతినెలా నీకు నాలుగు పెన్నీలు ఇవ్వటంలేదూ? అందుకని మరి నువ్వు నాకు చిన్న సహాయం చేసిపెట్టాలి. ఒక్క గ్లాసు రమ్ము తెచ్చిపెట్టు, నీకు పుణ్యం వుంటుంది. ఏం తీసుకురావూ?'' అని బతిమాలాడు.

''కాని డాక్టరుగారు-'' అని నేను ప్రారంభించాను. మాట మధ్యలో అడ్డం వచ్చాడు కెప్టెన్. డాక్టరును హృదయ పూర్వకంగా తిట్టసాగాడు.

''డాక్టర్లందరూ వెధవాయలనుకో. ఆ డాక్టర్ గాడున్నాడే, వాడికేం తెలుసు కళాసీల్ని గూర్చి! నేనెన్ని దేశాలు తిరిగాను, ఎన్ని సముద్రాలు చూశాను. కొన్ని దేశాల్లో ఎండ, సూర్యుడు ఫర్లాంగు దూరంలో ఉన్నంత వేడిగా ఉంటుంది. కొన్ని దేశాల్లో చలి వుంటుంది. చూస్కో నాయనా, నెత్తురు గడ్డ గట్టుకు పోతుంది. కొన్ని సముద్రాల్లో కెరటాలు మైలు ఎత్తునలేచి విరిగి పడు తుంటాయి. ఆ డాక్టరుగాడు ఇల్లాంటి వెప్పుడన్నా కనీ వినీ ఎరుగునా? నేను ఇన్నేళ్ళు దేనిమీద బతికాననుకుంటున్నావ్? రమ్! రమ్! రమ్ లేకపోతే నేనెప్పుడో చచ్చేవాణ్ణి. నాకు తిండి, నిద్ర, పెళ్ళాం, బిడ్డలు అన్నీ రమ్మే. ఆ డాక్టరుకేం తెలుసు నాకష్టం? బాబూ, జిమ్! ఒక్క గ్లాసంటే ఒక్క గ్లాసు. మళ్ళీ అడిగితే చెప్పుచ్చుకు కొట్టు. చూడు, నావేళ్ళు ఎలా వణుకుతున్నాయో? ఒక్క చుక్క పడితే ప్రాణం హాయిగా వుంటుంది. డాక్టరుమాట నమ్మకు. వాడల్లాగే చెబుతాడు. వాడికేం? రమ్ లేకపోతే పిచ్చెక్కినట్లుంటుంది. అసలెందుకూ? ఇందాక నీ వెనకాల కెప్టెన్ ఫ్లింట్ దెయ్యం కనిపించింది. ఆ దెయ్యం నన్ను పూనిందా, ఇహ చూస్కో, ఇల్లు ఇల్లంతా గల్లంతుచేసి పారేస్తాను. అడ్డమొచ్చిన వాణ్ణల్లా పీకనొక్కి చంపేస్తాను. అసలు మీ డాక్టరే చెప్పాడుగా. ఒక గ్లాసు తాగచ్చని. జిమ్. జిమ్! ఒక్క గ్లాసు తెచ్చావంటే షిల్లింగు ఇస్తాను.''

ఇంత ప్రాధేయపడేసరికి నా మనస్సు కరిగింది. అవ్వాళ మా నాన్నకు

ఎక్కువ చేసింది. కెప్టెన్‌కు రమ్ ఇవ్వకపోతే ఏం గొడవ చేస్తాడో అని భయపడ్డాను. పైగా ఒక గ్లాసు ఇస్తే ఫర్వాలేదని డాక్టరు చెప్పారుగా. అందుచేత రమ్ ఇవ్వడాని కంగీకరించాను.

'' నీ డబ్బు గిబ్బు నా కక్కర్లేదు. మా నాన్నకు నువ్వు న్యాయంగా ఇవ్వవలసింది ఇచ్చేస్తే చాలు'' అని చెప్పి లోపలికి వెళ్ళాను.

రమ్ తీసుకురాగానే ఎగిరి అందుకుని ఒక్క గుక్కలో కానిచ్చాడు.

'' ఆ, ఆ. ఇప్పటికి కాస్త ప్రాణం తేరుకుంటోంది. ఈ కుక్కి మంచంలో ఎన్నాళ్ళుండాలని చెప్పాడు డాక్టరు? ఏం నేస్తం?''

''కనీసం వారం రోజులు''

''అమ్మో, వారం రోజులే: ఉహూ ఒప్పుకోను. ఈలోగా వాళ్ళు నాకు 'నల్ల చుక్క' ఇవ్వనే ఇస్తారు. ఆ దొంగ ముండాకొడుకులు నా మీద పగబట్టారు. ఎప్పుడు చంపేద్దామా అని చూస్తున్నారు వెధవలు, వాళ్ళది వాళ్ళు ఖర్చుచేసుకుని నాదికూడా దొంగిలించాలని చూస్తున్నారు. కళాసీలు చెయ్యవలసిన పనేనా అది? ఆహ. నాకు తెలియక అడుగుతాను. తప్పు కాదూ ఇంకోడి సొమ్ము దొంగిలించడం? నేనంటావా? నా డబ్బు నేను ఒక్క పెన్నీ కూడా వృధాగా ఖర్చు చెయ్యలేదు. నా మాదిరిగా పొదుపుగా ఎందుకుండకూడదు వాళ్ళు? వాళ్ళు సంపాదించిన వేలన్నీ ఏమైయినాయి? ఏమైయనాయీ అంట? ఉహు. నేను ఛస్తే ఇవ్వను. ఎక్కడికన్నా పారిపోవాలి. వాళ్ళకళ్ళల్లో కారం కొట్టి పోకపోతే నాపేరు-''

కెప్టెన్ మాటల్లో ఒక్కటీ నాకర్థం కాలేదు. దొంగలెవరో, వాళ్ళకీ ఇతనికీ విరోధమేమిటో తెలియలేదు. కెప్టెన్ లేచి కూర్చోడానికి ప్రయత్నించాడు. ''డాక్టరు గాడు నా నెత్తురంతా లాగేశాడు. నాచెవులు సంగీతం పాడుతున్నాయి. అమ్మా! అమ్మ!'' అంటూ లేవబోయి మళ్ళీ వెనక్కి వాలిపోయాడు. అలా కాసేపు పడివుండి చివరి కన్నాడు:

''జిమ్ ! ఆ కళాసీని చూశావుగదూ?''

''నల్లకుక్కేనా?''

'' ఆ, నల్లకుక్కే. వాడు చాలా చెడ్డవాడు కాని వాడికంటే చెడ్డ వాళ్ళున్నారు వెనకాల. మాట వరసకి చెబుతాను. నేనిక్కణ్ణించి పారిపోలేక పోతాననుకో. వాళ్ళు నాకు 'నల్లచుక్క' పట్టుకొచ్చి ఇస్తారనుకో. నువ్వు గుర్రంమీద వెంటనే ఆ డాక్టరుగాడి దగ్గిరికి పోయి పోలీసులతో సహా వెంటబెట్టుకురావాలి. అందరూ దొరుకుతారు. కెప్టెన్ ఫ్లింట్ కింద పనిచేసిన కళాసీలంతా, ఒక్కడు కూడా బీరుపోకుండా దొరుకుతారు. వాళ్ళు నన్నెందుకు వెంటాడుతున్నారనుకున్నావ్? ఈ మంచంకింద వుండే పెట్టె- దానికోసం. కెప్టెన్‌ఫ్లింట్‌కింద తండేలుగా (కళాసీలకు మేస్త్రీ) పనిచేసే వాణ్ణి ఆ రోజుల్లో. ఫ్లింట్ సవానా పట్నంలో (అమెరికాలో ఒక రేవు పట్టణం) చచ్చిపోయేముందు ఆ పెట్టె నాకు అప్పగించి మరీ చచ్చిపోయాడు. నాకొక్కడికే ఆ ద్వీపం తెలుసు. వాళ్ళు ఆ పెట్టెకోసమే నావెంటబడుతున్నారు. వాళ్ళు నల్లచుక్క తీసుకొచ్చి యిస్తేనో, నల్లకుక్కగాని, ఒంటికాలు కుంటివాడుగాని, కనిపిస్తేనో, మాత్రమే నువ్వు డాక్టరు దగ్గిరికి పోయి పోలీసుల్ని సహాయం తీసుకురావాలి. తెలిసిందా?''

''సరే కెప్టెన్! కాని నల్లచుక్క ఏమిటి?''

''అది మా గుర్తులే. వాళ్ళు పట్టుకొచ్చి యిస్తే నీకు దాన్ని గూర్చి చెబుతాలే. కాని నువ్వు మాత్రం జాగ్రత్తగా కనిపెట్టి ఉండాలి. నాకీ సహాయం చేసిపెడితే నీకు సగానికి సగం ఇస్తాను; నా మీద ఒట్టేసుకు చెబుతున్నా.''

అతని కంఠం క్రమంగా బలహీనమైపోతోంది. నేను మందు తాగించాను. చిన్నపిల్లాడు ఆముదం తాగినట్టు అతి కష్టం మీద తాగాడు. వెంటనే మగత కమ్మిన వాడివలె పడి నిద్రపోయాడు. నే నివతల కొచ్చేశాను.

నాకేం చెయ్యాలో తోచలేదు. కెప్టెన్ చెప్పిందంతా డాక్టర్‌గారికి చెప్పి ఉండవలసినది. కాని ఆ సాయంత్రమే మా నాన్న హఠాత్తుగా ప్రాణం విడిచాడు. దాంతో మరో విషయం ఆలోచించడానికే నాకు వ్యవధి లేకపోయింది. మమ్మల్ని ఓదార్చడానికి వచ్చేవాళ్ళు, పోయేవాళ్ళు, మా నాన్నకు అంత్యక్రియలు ఏర్పాటు

చేయడం, హోటలుపని చూసుకోవడం – వీటితో కెప్టెన్ సంగతే నాకు జ్ఞాపకం రాలేదు.

మర్నాడు ఉదయం కెప్టెన్ కిందికి దిగివచ్చాడు. మామూలుగానే భోజనం చేశాడు. కాని మామూలు కంటే ఎక్కువగా రమ్ము తాగినట్టు నా అనుమానం; ఎందుకంటే అంత బలహీనంగా ఉన్నా బలే భయంకర శబ్దాలు చేశాడు. అతన్ని సమీపించడానికే మా కందరికి భయం వేసింది. ఇల్లంతా దుఃఖంలో ముని వుండగా కెప్టెన్ హాల్లో కూర్చుని ''యో–హో–హో–'' అంటూ దౌర్జన్యంగా పాడుతూ వుండడం మాకు కష్టం కలిగించింది. కాని ఏం చేస్తాం? నిషామీద ఎవర్నేం చేస్తాడో? దీనికితోడు డాక్టరుగారు కూడా ఊళ్లోలేరు. ఏదో అర్జంటు కేసు మీద పొరుగూరు వెళ్ళారు. అందుచేత కెప్టెన్ మరీ విచ్చలవిడిగా ప్రవర్తించసాగాడు. కాలుగాలిన పిల్లిలాగ ఊరికే మేడమీదికీ, కిందికీ తిరిగేవాడు. అప్పుడప్పుడు గేటుదాకా వెళ్ళి రోడ్డును రెండు వేపులా పరీక్షగా చూసేవాడు. బాగా తాగి వున్నప్పుడు కత్తి తీసి పదును చూసుకునేవాడు. కాని ఎవరి జోలికీ పోయేవాడుకాదు. తనలోతనే గొణుక్కుంటూ, ఆలోచించుకుంటూ కూర్చునేవాడు.

రెండురోజులిలా గడిచాయి. మా నాన్నకు అంత్యక్రియలు వగైరాలన్నీ యథావిథిగా పూర్తయ్యాయి. ఆ రోజు మధ్యాహ్నం దాదాపు మూడు గంట లప్పుడు నేను గేటుదగ్గిర నుంచుని, చనిపోయిన మానాన్నను గూర్చి తలుచుకుని దుఃఖపడుతున్నాను. ఇంతలో దూరాన రోడ్డుమీద ఎవరో మెల్లిగా రావడం కనిపించింది. చేతికర్రతో దారి తడుముకుంటూ నడవడం, కళ్ళపై వెలుగుపడకుండా గంతలు కట్టుకోవడం చూసి అతడు గుడ్డివాడని గ్రహించాను. నెత్తిమీదనుండి, బుజాలమీదగా వెనక్కిపడేట్టు నల్లటి గుడ్డ కప్పుకున్నాడు. సన్నగా, బాగా బలహీనంగా ఉన్నట్టు కనిపించాడు. మరీ చంటిపిల్లలు చూస్తే జడుసుకునేట్టున్నాడు. హోటలు సమీపించగానే ఆగి, గొంతెత్తి అడిగాడు.

'' గుడ్డివాణ్ణి బాబూ! దేశంకోసం యుద్ధాల్లో పోరాడి కళ్ళు పోగొట్టుకున్న కబోదిన్నాయనా! ఇక్కడెవరన్నా ధర్మాత్ములుంటే, నేను నుంచున్నదెక్కడో చెప్పండి బాబూ!''

''ఎడ్మిరల్ బెన్‌బౌ ముందున్నావు అబ్బీ'' అన్నాను నేను.

'' ఆ – చిట్టి బాబెవరో మాట్లాడుతున్నారు. చిట్టిబాబూ! నీ కంఠం వినగానే నీ మంచితనం గ్రహించాను నాయనా! నీ కెంతైనా పుణ్యముంటుంది. నన్ను లోపలికి తీసుకెళ్ళవూ?''

నేను చెయ్యి అందించాను. వెంటనే అంత మృదువుగా, దీనంగా మాట్లాడిన ఆ అంధుడు నా చేతిని భల్లూకంలా పట్టేశాడు. ఆ పట్టుకు నా వేళ్ళు పటపటమని విరిగాయి. ఒక్కసారిగా భయపడ్డాను. వదిలించుకోవాలని గింజాకున్నాను. కాని అంధుడు ఒక్క ఊపుతో నన్ను తన దగ్గిరకి లాక్కున్నాడు. అంత దుర్బలంగా కనిపించినా అతని చేతుల్లో ఎంత బలముందో నాకప్పుడు తెలిసింది.

''అబ్బాయ్! ఇప్పుడు పద లోపలికి. కెప్టెన్ దగ్గిరికి తీసుకుపో నన్ను'' అన్నాడు అంధుడు.

''ఊహూ. తీసుకుపోను'' అన్నాను నేను.

''ఓ అల్లాగా?'' అని నా చెయ్యి మెలిపెట్టాడు. ''బాబోయ్'' అని అరిచాను. ''తీసుకు వెడతావా? చెయ్యి విరిచెయ్యమన్నావా?'' అని హుంకరించాడు గుడ్డివాడు.

''కెప్టెన్ దగ్గిరికి వెళ్ళడం మంచిది కాదు. ఎప్పుడూ కత్తి పట్టుకుని కూర్చుంటున్నాడు. దగ్గిరి కెవ్వళ్ళనీ రానివ్వడం లేదు. నీ మంచి కోసమే నేను చెప్పేది.''

''నోరుమూసుకు పద లోపలికి'' అని మళ్ళీ ఒక్క ఊపు ఊపాడు. అంత క్రూరమైన, దౌర్జన్య పూరితమైన కంఠం నేనెప్పుడూ వినలేదు. వెంటనే లోనికి దారితీశాను. హాల్లో కూర్చున్నాడు కెప్టెన్! పక్కనే బల్ల మీద రమ్ముసీసా ఉన్నది; నిషాతో కళ్ళు తేలిపోతున్నాయి. అంధుడు ఉక్కులాంటి పిడికిలితో నన్ను పట్టుకొని రహస్యంగా చెప్పాడు. ''నన్ను సరాసరి కెప్టెన్ దగ్గిరికి తీసుకుపో...

దగ్గిరి కెళ్ళగానే ' నీ స్నేహితుడు వచ్చాడు బిల్ అను. అలా అనకపోతే ఏం చేస్తానో తెలుసా'' అంటూ మళ్ళీ చెయ్యి మెలిపెట్టాడు. ఆ బాధకు మూర్ఛ వచ్చినంత పనైంది నాకు. మారు మాట లేకుండా అంధుడు చెప్పినట్టే చేశాను. అతడు చెప్పమన్న మాటలు చెప్పాను.

పాపం కెప్టెన్ ఆ మాటలు వినగానే తలెత్తి చూశాడు. అంధుణ్ణి గుర్తించగానే రమ్ము నిషా అంతా దిగిపోయింది. అతన్ని చూస్తే భయపడడానికి కూడా ఓపిక లేనట్టు తోచింది. లేవబోయాడు.

'' బిల్! ఎలా కూర్చున్నావో అల్లాగే కూర్చో. కదలకు. నేను చూడలేక పోయినా, వినగలను. పదిగజాల దూరంలో సూది కిందపడినా నాకు విని పిస్తుంది. నీకు తెలుసుగా నా సంగతి. వ్యవహారం దగ్గిర నాకు మొహమాటం లేదు. నీ కుడిచెయ్యి చాపు. అబ్బాయ్, అతని కుడిచెయ్యి నా దగ్గిరిగా తీసుకు రా. ఊ. తొందరగా.''

మేమిద్దరం అంధుని ఆజ్ఞను శిరసావహించాము. కెప్టెన్ ప్రాణంలేని మట్టి బొమ్మలా నిశ్చేతనుడై పోయాడు. అంధుడు కెప్టెన్ చేతిలో ఏదో పెట్టాడు. కెప్టెన్ వెంటనే గుప్పిలి మూసుకున్నాడు.

'' పనైపోయింది. వెళ్లిపోతున్నాను'' అంటూ హఠాత్తుగా నన్ను వదిలేశాడు. వెనక్కి తిరిగి ఒక్క అడుగు కూడా తడబడకుండా హాలుదాటి వాకిలి దాటి గేటు తెరుచుకుని చకచక రోడ్డుమీదికి వెళ్ళిపోయాడు. ఒక్కసారి లోపలికి వచ్చి నంత మాత్రాన అతడు ఎవరి సహాయం లేకుండా దారంతా ఎలా గుర్తుంచుకుని తిరిగి వెళ్ళిపోగలిగాడో నాకు అర్థం కాలేదు. అసలు నా కళ్ళను నేనే నమ్మలేక పోయానంటే నమ్మండి.

అంధుడు రోడ్డుమీద దూరాన మలుపు తిరిగే వరకూ మాకు అతని కర్ర చప్పుడు వినిపిస్తూనే వుంది. ఆ చప్పుడు దూరమై పోయాక గాని నాకు, కెప్టెన్ కు తెలివిరాలేదు. వెంటనే కెప్టెన్ చెయ్యి వదిలేశాను. అతను గుప్పిలి తెరిచి చూశాడు.

'' రాత్రి పదిగంటలకి! ఇంకా ఆరుగంటలుంది టైము. ఈలోగా పారిపో గలను. ఓ, పారిపోగలను. నేనా వీళ్ళకి దొరికేది?'' అంటూ కుర్చీలోంచి లేచాడు.

లేస్తూనే అటూ ఇటూ తూలాడు! రెండు చేతుల్తో తన మెడ పట్టుకుని ఒక్క క్షణం ఊగులాడుతూ నుంచున్నాడు. ఒక వెర్రికేకవేసి ధన్‌మని నిలువునా, బోర్లా పడ్డాడు.

'' అమ్మా, అమ్మా,'' అని కేకేస్తూ నేను కెప్టెన్ వద్దకు పరిగెత్తాను. కాని వళ్ళు పట్టుకు చూచేసరికి ప్రాణం పోనేపోయింది. నేలమీద పడుతూనే ప్రాణం వదిలినట్టున్నాడు. అతనంటే నాకు ఇష్టం గాని, జాలిగాని ఎప్పుడూ లేదు: కాని అతడు చనిపోగానే అప్రయత్నంగా నాకు ఏడుపు వచ్చింది. మానాన్న చనిపోయిన దుఃఖం ఇంకా నాలో చల్లారనే లేదు. నాకు బుద్ధి తెలిసిన తర్వాత నా కళ్ళారా చూసిన చావుల్లో ఇది రెండోది.

3

మా అమ్మ నా కేకలు విని పరుగెత్తుకు రాగానే నేను నాకు తెలిసినదంతా టూకీగా చెప్పాను. అసలదంతా ఇదివరకే ఆమెకు చెప్పి తగిన జాగ్రత్తపడి ఉండవలసింది. ఏమైతేనేం- మేము పెద్ద ప్రమాద పరిస్థితిలో చిక్కుకున్నట్టు ఇరువురం గ్రహించాము. కెప్టెన్ మాకు గది అద్దె, భోజనపు ఖర్చులు మొదలైన బాకీ చాలా ఇవ్వదేలాడు. ఇంకా కాసేపట్లో కెప్టెన్ ''స్నేహితులు'' మా హోటలు మీద దాడి చేయనున్నారు. నల్ల కుక్కను, ఆ గుడ్డివాణ్ణి పరిచయం చేసుకున్నాను కనుక మిగతా సముద్రపు దొంగలు ఎలా ఉంటారో చూడకుండానే గ్రహించాను. వాళ్ళు మాకు న్యాయంగా రావలసింది మాకిచ్చి మిగిలిందే పట్టుకుపోతారని ఎలా ఆశించగలను?

పోనీ డాక్టర్ లివ్‌సే ఇంటికి గుర్రం మీద వెళ్ళి పోలీసుల సహాయం తీసుకు వద్దామా అంటే ఇంట్లో మా అమ్మ నొక్కతెనూ నిస్సహాయంగా వదిలి వెళ్ళినట్టవుతుంది. అసలు మా ఇద్దరిలో ఒక్కరం కూడా ఆ ఇంట్లో ఉండటం మంచిది కాదని తోచింది. గడియారపు టిక్ టిక్ శబ్దం కూడా మమ్మల్ని భయ పెడుతోంది. రోడ్డుమీద మనుషుల అలికిడి అవుతున్నట్టు, హాల్లో కెప్టెన్ శవం తాలూకు దెయ్యం ఎగురుతున్నట్టు తోచి మా అమ్మ, నేను ఒకరినొకరం అంటిపెట్టుకునే తిరిగాము. వెంటనే ఏదో చెయ్యాలని నిశ్చయించి బయటకు వచ్చాము. మా హోటలుకు గ్రామానికి రెండు మూడు ఫర్లాంగులకంటె ఎక్కువ దూరంలేదు. అక్కడికి వెళ్ళి కొందరు మనుషులను సహాయం తీసుకు రావాలనుకున్నాము. వెంటనే గ్రామంకేసి బయలుదేరాము.

నాకు ధైర్యం కలిగించిన విషయమేమంటే, గుడ్డివాడు ఆవేళ వచ్చింది గ్రామం ఉన్న దిశనుంచి కాదు; దానికి ఎదుటివైపు నుంచి. అందుచేత గ్రామానికి వెళ్ళేదారి నిరపాయమైందేకదా. ఆ ధైర్యంతో గబగబా నడిచి, పరుగెత్తి ఎలాగైతేనేం కొన్ని నిమిషాల్లో గ్రామానికి చేరుకున్నాం. అప్పటికి నలువైపులా సంజ చీకట్లు అలుముకున్నాయి. కాని గ్రామస్థుల్లో ఒక్కరు కూడా మాకు సహాయం రావడానికి అంగీకరించలేదు. మమ్మల్నెదుర్కొన్న అపాయాలను గూర్చి చెప్పినకొద్దీ, ఆబాల గ్లోపాలం హడలిపోయి జారుకునేవారేగాని, ధైర్యం చెప్పినవారు లేరు. కెప్టెన్ ఫ్లింట్ పేరు నాకు కొత్తదైనప్పటికీ గ్రామస్థుల్లో చాలామందికి పరిచితమైనదే. దేశ దేశాలను హడలెత్తించిన సముద్రపు దొంగట ఆ కెప్టెన్ ఫ్లింట్. అటువంటివాడి శిష్యులు మా '' ఎడ్మిరల్ బెన్ బౌ'' మీదికి ఈ రాత్రి దండెత్తనున్నారని తెలిసి ఇక ముందడుగు వేసే మొగాడేడీ?

మా అమ్మ ఒక చిన్న గంభీరోపన్యాసం ఇచ్చింది. '' మీరెవ్వరూ రాకపోతే నేనూ జిమ్ కలిసి వెడతాం. తండ్రి లేని బిడ్డగదా! వాడికి రావలసిన డబ్బు రాకుండా నేనెలా ఊరుకుంటాను? మేము వెనక్కి వెడతాం. మీ కందరికీ ఇదిగో వెయ్యి నమస్కారాలు. ఛీ, ఇంత పిరికి వాళ్ళని అనుకోలేదు. ఆ పెట్టెను బద్దలుగొట్టి అయినాసరే, మాకు రావలసిన డబ్బు మేం తీసుకుంటాం.''

నేనూ మా అమ్మా వచ్చినదారే పట్టాం. వద్దు వద్దని అందరూ అడ్డం వచ్చేవారేగాని, సాయం వస్తామన్నవారు ఒక్కరూలేరు. కాని ఒక సహాయం మాత్రం చేశారు. తూటాలు నింపిన పిస్టలు ఒకదాన్ని నా చేతికిచ్చారు. అపాయం వస్తే పనికి వస్తుందని! సగం దారిలో గుర్రాలను రెడీగా ఉంచుతామని, డాక్టరుగారింటి నుంచి సహాయం తీసుకొచ్చేందుకొక మనిషిని పంపుతామని వాగ్దానం కూడా చేశారు.

చలితోను, భయంతోను, గజగజ వణుకుతూ నడిచాము. మా దురదృష్టం కొద్దీ ఆ రోజు పూర్ణిమ కూడాను. దూరాన కొండల చాటునుంచి నిండు చంద్రుడు తొంగి చూస్తున్నాడు. మేము గ్రామానికి తిరిగి వెళ్ళేటప్పుడు పుచ్చ పువ్వులాంటి వెన్నెల్లోనే వెళ్ళవలసి వస్తుందని మరీ భయపడ్డాం. రోడ్డుపక్కగా చెట్లనీడల్లో నడిచి చివరికి మా హోటలు చేరుకున్నాం.

సింహద్వారం గట్టిగా బందు చేశాను. కిటికీలు కూడా భద్రంగా మూశాను. లోపలంతా కటిక చీకటి. చీకట్లోనే తడుములాడి మా అమ్మ కొవ్వొత్తి దీపం వెలిగించింది. కెప్టెన్ శవం మేము వదిలిపెట్టి వెళ్ళినప్పుడెలా వుందో అలాగే వుంది. ఒకళ్ళ చేతులు ఒకళ్ళం పట్టుకుని హాల్లో అడుగుపెట్టాం.

'' తాళం చెవులెలా వస్తాయి?'' అంది మా అమ్మ శవం కేసి భయంగా చూస్తూ.

నేను శవం పక్కన మోకాళ్ళ మీద వంగాను. కెప్టెన్ చేతిలో గుడ్డివాడు పెట్టిన గుండ్రని కాగితం ముక్క ఇంకా అలాగే వుంది. 'నల్లచుక్క' అంటే అదే అయి వుంటుందనుకున్నాను. ఒక పక్కన అంతా నల్లగా ఉంది. రెండో పక్కన '' రాత్రి పదిగంటల వరకు గడువు'' అని చక్కటి దస్తూరీలో దొంగల సందేశం రాయబడి వుంది.

'' అమ్మా, పదిగంటల దాకా ఫరవాలేదే'' అన్నాను. అదేక్షణంలో మా గోడ గడియారం టంగ్ టంగ్‌న గంటలు కొట్టనారంభించింది. ఆ హఠాత్ శబ్దానికి

మా పైప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. గడియారం ఆరు గంటలే కొట్టినందుకు మళ్ళీ ధైర్యం తెచ్చుకున్నాం.

''త్వరగా తియ్ తాళం చెవులు'' అంది మా అమ్మ.

ఒకటి తరువాత ఒకటిగా జేబులన్నీ వెదికాను. కొన్ని వెండి నాణాలు, సూది, దారం, పొగాకు, చాకు, చిన్న దిక్సూచి మొదలైన అనవసరపు వస్తువులెన్నో బయట పడ్డాయిగాని తాళంచెవులు దొరకలేదు.

''మెడకి కట్టుకున్నాడేమో చూడు'' అని సలహా ఇచ్చింది మా అమ్మ.

భయం, అనుమానాలు అన్నీ దిగమింగి, ధైర్యం తెచ్చుకుని అతని చొక్కాగుండీలు విప్పాను. మెడనుంచి దారంతో వేళ్ళాడుతూ తాళంచెవి కనపడింది: దారాన్ని అతన్ని చాకుతోనే కోసి వేశాను. అది పుచ్చుకుని ఇద్దరం మేడమీద ఇంతకాలం అతడు నివసించిన గదిలోకి పరిగెత్తాము. కెప్టెన్ పెట్టె మంచం కిందనే వుంది. మూతమీద ''బి'' అనే అక్షరం చెక్కబడి వుంది. పెట్టె బాగా తుప్పు పట్టి, సొట్టలుపోయి వుంది.

తాళంచెవి తీసుకుని మా అమ్మ కొంత కష్టంమీద పెట్టె మూత తెరిచింది. తెరవగానే పొగాకు ఘాటు, తారు వాసన మమ్మల్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. ముందు కొన్ని కొత్త బట్టలు కనిపించాయి. వాటినెవ్వరూ ఇంత వరకూ తొడుక్కోలేదని మా అమ్మ అంది. వాటి కింద రెండు చక్కని పిస్తళ్ళు, ఒక పాత వాచి, రెండు ఇత్తడి దిక్సూచులు, తమాషాగా వున్న అయిదారు నత్తగుల్లలు, కొన్ని విదేశీ నాణాలు కనిపించాయి. సముద్రాలపై ఓడలను దోచుకుంటూ, అమాయకులను హత్యచేస్తూ క్రూరమైన, నీచమైన జీవితం గడుపుతూ దేశ దేశాలు సంచరించే ఇతడు పిల్లలకు సహజమైన కుతూహలంతో నత్తగుల్లలను దాచుకోవడం నాకు ఆశ్చర్యం కలిగించింది.

తెరచాప తాలూకు గుడ్డనుతొలగించి ఇంకా అడుగున పరీక్షించాము. మైనం గుడ్డతో చుట్టిన ఒక పార్సిలు, ఒక చేతి సంచి కనిపించాయి. ఇవే పెట్టెలో మిగిలిన ఆఖరి వస్తువులు. సంచి ముట్టుకునేటప్పటికి బంగారు నాణాలు గలగల

మన్నాయి.

'' ఈ దొంగ వెధవలకి నేనెంత నమ్మకస్థురాలినో చూపిస్తాను. మనకు రావలసినదానికంటే ఒక్క ఫార్తింగు కూడా ఎక్కువ తీసుకోను'' అని మా అమ్మ సంచిలోని బంగారు నాణాలు లెక్కించ సాగింది.

ఆ నాణాలు ఒక దేశానివి కావు, ఒక విలువవి కావు, ఒక ఆకారానివి కావు. స్పెయిన్, ఫ్రాన్సు, ఇంగ్లండ్, ఇటలీ అన్ని దేశాల నాణాలు రకరకాలవి కలగా పులగంగా ఉన్నాయి. ఇంగ్లీషు నాణాలైన గినీలు (21 షిల్లింగులు) చాలా అరుదుగా ఉన్నాయి. వీటితోనే మా అమ్మ బాకీ మొత్తాన్ని వేరుచేయసాగింది. మిగిలినవేవీ మాకు తెలియవాయెను.

గినీలు వెదికితీయడం చాలాసేపు పట్టింది. కొంతసేపటికి నేను హఠాత్తుగా ఆమె చెయ్యి పట్టుకుని ఆపాను . రోడ్డుమీద ఎక్కడో దూరాన పరిచితమైన ధ్వని అస్పష్టంగా వినిపించింది. అది గుడ్డివాడి చేతికర్ర. రోడ్డుమీద టక్‌టక్‌మంటున్న ధ్వని. నాకు గుండె ఆగిపోయినట్టయింది. క్రమంగా ఆ ధ్వని మా హోటలు గేటును సమీపించింది. ఎవరో గేటు తెరిచారు; సింహద్వారాన్ని తట్టారు. తరువాత కొంతసేపు నిశ్శబ్దం. మళ్ళీ ధ్వని ప్రారంభమైంది; క్రమంగా దూరమై, అస్పష్టమై చివరికి వినపడకుండా పోయింది. ఇంతసేపు ఊపిరి బిగబట్టి వింటూ కూర్చున్న మేము '' అమ్మయ్య'' అని ఒక నిట్టూర్పు విడిచాము.

'' అమ్మా, ఆ నాణాలన్నీ తీసుకుపోదాం. ఇలా ఆలస్యం చేస్తే అపాయం'' అన్నాను నేను. ఎందుకంటే గుడ్డివాడు తలుపులన్నీ మూసివేసి ఉండటం గమనించాడు. ఏనిమిషానైనా మిగతా దొంగలందర్నీ వెంట బెట్టుకు రాగలడు. అసలు తలుపులన్నీ మూసి వెయ్యడం ఎంత తెలివైన పనో అప్పుడు గ్రహించాను. కాని మా అమ్మ ఎంత భయభ్రాంతురాలైవున్నా, మాకు రావలసిన దానికంటె ఒక్క పెన్నీ ఎక్కువగాని, తక్కువగాని తీసుకోవడానికి ఇష్టపడలేదు. ఇంతలో దూరాన కొండలవైపు నుంచి సన్నని ఈల వినిపించింది. అప్పటికి మా అమ్మ పట్టుదల సడలింది.

'' సరేలే. దక్కినంతే దక్కింది'' అని మా అమ్మ లేచింది.

నేను మైనం గుడ్డ పార్శిల్ తీసుకున్నాను. మాకింకా రావలసిన డబ్బు కొంత వుంది గనక ఆ పార్శిల్‌లో ఏదుంటే అది చెల్లుకింద కట్టుకోవడానికి నిశ్చయించాను.

మరుక్షణంలో మేమిద్దరం కొవ్వొత్తిని పెట్టెపక్కనే వదిలేసి గబగబ మెట్లు దిగాము. తలుపులు తెరుచుకుని రోడ్డుమీద పడ్డాం . అప్పటికి పొగమంచు చాలావరకు విచ్చిపోయింది. చంద్రుడు బాగా పైకొచ్చాడు. కాని మా హోటలు ముందు మాత్రం కొద్దిగా చీకటిగానే వుంది. అందుచేత మేమివతలకు రావడం ఎవరికంటా పడదని ధైర్యపడ్డాము. కొన్ని గజాలు పరిగెత్తామో లేదో కొండల వైపు నుంచి మనుషులు పరుగెత్తుకు వస్తున్న అలికిడి అయింది. వెనక్కి తిరిగి చూశాం. మినుకు మినుకు మంటున్న లాంతరు వెలుగు కనిపించింది; దాన్ని బట్టి దొంగలు ఆట్టే దూరంలో లేరని గ్రహించాము.

'' నాన్నా, ఈ డబ్బు నువ్వు పట్టుకొని పరిగెత్తు. నాకు స్పృహ తప్పి పోతోంది.'' అని మా అమ్మ తూలుతూ ఉన్నచోటే ఆగిపోయింది. ఆ నిమిషంలో మా గ్రామస్తుల పిరికితనాన్ని ఎంత నిందించానో, మా అమ్మ డబ్బు లెక్క పెడుతూ ఆలస్యం చేసినందుకు ఆమెనెంత నిందించానో చెప్పలేను. ఏమైతేనేం-అపాయం రానేవచ్చింది. ఇప్పుడు బెంగపడి లాభం లేదు. తప్పించుకునే మార్గం చూడాలి. అదృష్టవశాత్తు మేము వంతెనకు సమీపంలో ఉన్నాము. తూలి పోతున్న మా అమ్మను కష్టంమీద పట్టుకొని నడిపించాను. కాలవగట్టు చేరుకునే సరికి ఆమెకు పూర్తిగా స్పృహ తప్పిపోయింది. నాకా సమయంలో అంత బలమెక్కడ నుంచి వచ్చిందో తెలియదు. మా అమ్మను ఎలాగేతేనేం, గట్టు కింద వరకూ లాక్కువెళ్ళి, వంతెన నీడలో ముడుచుకొని కూర్చున్నాను. ఆమె నా బుజాల మీద వాలిపోయింది. నేను నీడలో వున్నప్పటికి మా అమ్మమీద వెన్నెల బాగా పడుతోంది. అదీకాక మేము హోటలుకు కూత వేటు దూరంలోనే ఉన్నాము.

4

దొంగలు మా హోటలును సమీపిస్తున్నారు. నేను ఒకమూల తీవ్రంగా భయపడుతున్నా, వారేం చేస్తారో చూడాలనే ఆసక్తి నాలో విజృంభించింది. నెమ్మదిగా వంతెన కిందనుంచి కాలవగట్టుకు పాకివచ్చి చూశాను. మొత్తం ఏడెనమండుగురుదాకా ఉన్నారు; లాంతరు పట్టుకున్న వాడు ముందు పరిగెత్తుతున్నాడు. వెనక ముగ్గురు మనుషులు కట్టగట్టుకుని వస్తున్నారు. వారిలో మధ్యలో ఉన్న వాడు గుడ్డివాడని ఊహించాను. అతని గొంతుక వినగానే నా ఊహ రైటేనని రుజువైంది.

''తలుపులు బద్దలుకొట్టండి'' అని అరిచాడు గుడ్డివాడు.

నలుగురైదుగురు వెంటనే గేటులోంచి పరుగెత్తారు. సింహద్వారం తెరిచి ఉన్నందుకు ఆశ్చర్య పోతున్నట్టు ఠపీమని ఆగిపోయారు . కాని గుడ్డివాడు ''లోపలికి జొరబడండి'' అని మళ్ళీ కేకలు పెట్టాడు. దొంగలు ఇంట్లో చొరబడ్డారు. కాసేపు నిశ్శబ్దం, వెంటనే రెండుమూడు గొంతుకలు ఒకేసారి అరిచాయి : ''బిల్ చచ్చిపోయాడు!''

గుడ్డివాడు ఆ మాట వింటూనే '' ఆలస్యం చెయ్యకండిరా. మీ దుంపతెగ. వాడి జేబులు వెదకండి'' అని ఆజ్ఞాపించాడు.

మా మేడ మెట్లు కొయ్యవి: మెట్లు విరిగి కూలిపోతాయేమోనన్నంత అట్టహాసంగా దొంగలు మేడ ఎక్కారు. మళ్ళీ కాస్త నిశ్శబ్దం. కెప్టెన్ గదిలో రోడ్డు వైపున్న కిటికీ తెరుచుకుంది. ఒకడు కిటికీ గుండా కిందికి తొంగి చూస్తూ గుడ్డివాడితో చెప్పాడు :

''ప్యూ ! పెట్టె మనకంటే ముందే ఎవరో ఖాళీ చేశారు.''

'' అది ఉందా?'' అని గర్జించాడు ప్యూ.

''డబ్బేనా?''

గుడ్డివాడు డబ్బును నానా బూతులు తిట్టాడు.

''డబ్బు కాదురా, వెధవా! ఫ్లింట్‌కాగితం?''

''అది లేదిక్కడ.''

''హాల్లో ఉన్నవాళ్ళెవర్రా? బిల్‌గాడి జేబుల్లో ఏమన్నా కనిపించిందా?''

హాల్లో నుంచి ఒకడు సమాధానమిచ్చాడు! ''బిల్‌గాడి జేబుల్లో ఏమీ లేదు. ఎవరో ఇదివరకే కొట్టేశారు అంతా.''

''వాళ్ళే. హోటల్ తాలూకు వాళ్ళే, ఆ కుర్రాడిపనే ఇదంతా. వాడి కళ్ళు పీకి పారేసినా బాగుండేది. ఇందాక నేను వచ్చినప్పుడు తలుపులు వేసి వున్నాయి. అప్పటికి వాళ్ళు లోపలే ఉన్నారు. వెదకండి,'' అని ఆజ్ఞాపించాడు అంధుడైన ప్యూ.

''నిజమే. ఇక్కడే ఎక్కడో దొరుకుతారు. వాళ్ళ కొవ్వొత్తి ఇంకా వెలుగుతూనే ఉంది.'' అని మేడమీది కిటికీలోంచి ఒకడన్నాడు..

''ఇల్లంతా వెదకండి. ఆలస్యం చెయ్యకండి.'' అన్నాడు ప్యూ మళ్ళీ.

వెంటనే దొంగలు ఇల్లంతా మా కోసం వెదకసాగారు. కుర్చీలు, బల్లలు, మంచాలు, గిన్నెలు, ప్లేట్లు అన్నీ తిరగదోశారు: తలుపులు బద్దలు గొట్టారు. ఆ ప్రదేశమంతా నిశ్శబ్దంగా ఉన్నందువల్ల వాళ్ళ కోలాహలం, వాళ్ళ కేకలు, మాటలు అన్నీ స్పష్టంగా వినిపిస్తున్నాయి. చివరికి లోపలివాళ్ళందరూ ఒకరి తరువాత ఒకళ్ళు రోడ్డు మీద కొచ్చారు. మేమెక్కడా కనిపించలేదని ప్యూతో చెప్పారు. ఇంతలో దూరంనుంచి రెండుసార్లు విజిల్ వినిపించింది. మా అమ్మ కెప్టెన్ డబ్బు లెక్కిస్తున్న సమయంలో వినబడిన శబ్దమే అది. గ్రామం దిశనుంచి వినవస్తోంది. బహుశా దొంగల ముఠాలోని వాడెవడో రాబోయే అపాయాన్ని గూర్చి వాళ్ళను హెచ్చరిస్తున్నాడల్లే వుంది. ఎందుకంటే ఆ విజిల్ వినగానే దొంగలంతా హడలి పోయారు.

''అదుగో, మనవాడు ఈలవేస్తున్నాడు. రెండుసార్లుకూడా వేశాడు. మనం పారిపోవాలి'' అన్నాడొకడు.

''పారిపోతావా పంది వెధవా: పిరికివాణ్ణి తీసికెళ్ళి అక్కడ కాపలా పెడితే

ఏమౌతుంది? హోటలు వాళ్ళు ఇక్కడే ఉంటారు. వెదకండి, తొందరగా. నాకే కళ్ళుంటేనా-''

ప్యూ ఆజ్ఞ వినగానే మళ్ళీ దొంగలు ధైర్యం తెచ్చుకుని ఇంటి చుట్టూరా వెదకసాగారు. కాని గుడ్డివాడికి జడిసి మాత్రమే వెదుకుతున్నట్టు, అవసరమైతే క్షణంలో ఉడాయించడానికి చూస్తున్నట్టు అనిపించింది.

''తెలివి తక్కువ గాడిదల్లారా! ఆ కాగితం దొరికితే కొన్ని లక్షల పౌనులు మన స్వాధీనమవుతాయి. చచ్చేవరకూ మహారాజ భోగాలనుభవించగలం. అది ఇక్కడే ఎక్కడో వుందని మీకు తెలుసు. అయినా వెదకండిరా అంటే తెగ నీలుగుతున్నారు. మీకోసం కాకపోతే నాకోసమా ఇదంతా? మీలో ఒక్కడైనా ధైర్యం చేశాడూ బిల్ ఎదట పడటానికి? నేను వెళ్ళాను ఒక్కణ్ణే. రెండు కళ్ళూలేని గుడ్డివాణ్ణి నేను ధైర్యం చేశానురా! ఇంత కష్టపడితే ఏమిటిరా నాకు వచ్చేది! జీవితమంతా బిచ్చమడుక్కుంటూ గడపాల్సిందేగద. మీలో మొగతనం ఏమన్నా వుంటే వెదకండి, పట్టుకోండి ఆ కాగితాన్ని'' అని పురికొల్పుతున్నాడు ప్యూ.

''కాదురా ప్యూ! ఆ ఉన్న డబ్బు కాస్తా పట్టుకుపోతే ఏం?'' అని గొణిగాడు ఒకడు.

''వాళ్ళనిప్పుడు ఎక్కడని పట్టుకోగలం? సగం వాటా తీసుకుని నీ దారిన నువ్వు పో'' అని ఇంకోడు గుడ్డివాడికి సలహా ఇచ్చాడు.

''నీ దారిన నువ్వుపో'' అనే మాట వినబడేసరికల్లా గుడ్డివాడి కెక్కడలేని కోపం వచ్చింది. నోటికి వచ్చిన తిట్టల్లా తిడుతూ, కర్రతో చేతికందినవారి నల్లా ఇష్టం వచ్చినట్టు బాదాడు. దొంగలు ప్యూ చేతిలోంచి కర్రలాక్కోవాలని చాలా ప్రయత్నించారు. కాని గుడ్డివాడు పిచ్చి ఆవేశంలో స్వైర విహారం చేశాడు. ఈ పోట్లాట మూలంగా మాకు ప్రమాదం పూర్తిగా తప్పిపోయింది. కొంతసేపటికి మళ్ళీ ఏదో ధ్వని వినవచ్చింది. ఈ సారి విజిల్ ధ్వని కాదు; గ్రామం దిశ నుంచి గుర్రాలు వస్తున్న టకటకశబ్దం వినిపించింది. మరు నిమిషంలో పిస్టల్ పేలిన

మెరుపు, ధ్వని వచ్చాయి. వెంటనే దొంగలు ఎక్కడి వాళ్ళక్కడ చెల్లాచెదరై పోయారు. ఒకడు సముద్రతీరంకేసి, మరొకడు కొండలకేసి ఇలా తలో దిక్కుకూ పారిపోయారు. ఒక్క ప్యూ తప్ప ఇంకెవ్వరూ మా హోటల్ సమీపం లో లేరు. వాడి మీద కసికొద్దీనో, లేక తమ ప్రాణాలు తాము రక్షించు కొనేందుకో మొత్తానికి వాడి అతీ గతీ పట్టించుకోకుండా అంతా పారి పోయారు. వాడు భయావేశంలో తానెక్కడుందీ, ఎటువైపు తిరిగి వుందీ కూడా అంతుపట్టక కర్రతో నేలతట్టుతూ తన స్నేహితులను పిలిచాడు. చివరికి పొరపాటున గ్రామం దిశగా బయల్దేరాడు. వంతెన కూడా దాటాడు.

''జానీ? నల్లకుక్కా! డర్క్: ఏమయ్యార్రా మీరంతా? నన్ను వదిలేసి పోయారా? గుడ్డివాణ్ణి, చిన్నప్పటినుంచీ మీతో తిరిగినవాణ్ణి . నన్ను వదిలి పోయారా? జానీ! –'' అంటూ ఇంకా కొన్ని అడుగులు ముందుకు నడిచాడు.

గుర్రాల ధ్వనులు ఇంకా సమీపించాయి. నలుగు రైదుగురు మనుషులు గుర్రాలను అతి వేగంగా పరిగెత్తిస్తూ వెన్నెల్లో కనిపించారు.

ప్యూ తన పొరపాటు గ్రహించాడు. ఒక్క వెర్రికేకవేసి వెనక్కి తిరిగాడు. తూలుతూ పరుగెత్తడంలో రోడ్డుపక్కనున్న గోతిలో పడ్డాడు. మళ్ళీ లేచి ప్రదక్షణాలు చేసి చివరికి పరుగెత్తుకొస్తున్న నాలుగు గుర్రాలకు అభిముఖంగా పరుగెత్తసాగాడు.

అన్నిటికంటే ముందున్న గుర్రంమీద మనిషి ప్యూను రక్షించడానికి ప్రయత్నించాడు. కాని కళ్ళెం ఎంత లాగినా రోడ్డు వాలుగా ఉండడం చేత గుర్రం వేగాన్ని ఆపుకోలేకపోయింది. మొదటి గుర్రం ప్యూను ఒక్క తాపుతో నాలుగు గజాల అవతలకు గెంటి వేసింది. తరవాత గుర్రాలు అతన్ని హూనం హూనంగా తొక్కివేస్తూ ముందుకుపోయి ఆగాయి. ప్యూ కాస్త కదిలి బోర్లగిల పడ్డాడు. మళ్ళీ కదల్లేదు; మంచి నీళ్ళడక్కుండా చచ్చిపోయాడు.

నేను గట్టుమీదనుంచి రోడ్డుమీద కురికి సంతోషంతో ఎలుగెత్తి కేకవేశాను. అప్పటికి వాళ్ళు గుర్రాలు దిగి వెనక్కి వస్తున్నారు. వాళ్ళలో ఒకణ్ణి నేను

గుర్తుపట్టాను. మా కబురు అందజేయడానికి డాక్టర్ లివ్‌సే ఇంటికి వెళ్ళిన మనిషే అతడు. మిగతా వాళ్ళు రెవిన్యూ అధికారులు, వాళ్ళను అతడు దోవలో కలుసుకున్నాడు. డాక్టర్ ఇంటి వరకూ వెళ్ళడం అనవసరమని వాళ్ళని వెంటపెట్టుకుని తిరిగి వచ్చాడు. సూపర్‌వైజరు డాన్స్ ఏదో పనిమీద మిగతా అధికారులతో మా గ్రామానికి వస్తున్నాడు. వారు సమయానికి రాకపోతే నేను, మా అమ్మ ఏమైపోయేవాళ్ళమో!

ప్యూ చనిపోయాడు. మా అమ్మ వంతెన నీడలో ఇంకా మూర్ఛ పోయే వుంది. ఆమెను గ్రామానికి చేర్చాము. కొంతసేపు ఉపచారాలు చెయ్యగా ఆమెకు తెలివి వచ్చింది. స్పృహ వచ్చీ రాగానే మాకింకా రావలసిన బాకీని గూర్చే మాట్లాడ్డం మొదలెట్టింది. నేను సూపర్‌వైజర్‌తోను, మిగతా అధికారులతోను కలిసి మా '' ఎడ్మిరల్ బెన్ బౌ'' కు వెళ్ళాను. భూకంపంలో నాశనమైన ఇల్లు కూడా ఆ స్థితిలో ఉండదు. దొంగలు మా కోసం వెతుకుతూ నానా బీభత్సం చేశారు. ఆ వెదకడంలో ఆఖరికి గోడగడియారంకూడా కిందకి లాగేశారు. అయితే మా వస్తువులేమీ పోలేదు. కెప్టెన్ డబ్బు సంచీ, జేబులోని వెండి నాణాలు మాత్రమే దొంగిలించబడ్డాయి. ఈ గల్లంతంతా ఏమిటో సూపర్‌వైజర్ డాన్సుకు అంతుపట్టలేదు;

'' డబ్బు ఎత్తుకుపోయారన్నావుగదా? మరి ఇంత హడావిడి చేశారెందుకూ? ఇంకా ఎక్కువ డబ్బుకోసమా?'' అని అడిగాడు డాన్సు.

'' కాదండి సార్, డబ్బుకోసం కాదనుకుంటాను. బహుశా నా జేబులోవున్న ఈ పార్సిల్ కోసం అనుకుంటాను. ఈ హడావిడంతా.'' అని సమాధానమిచ్చాను నేను పార్శిల్ చూపిస్తూ.

'' కావచ్చు, ఏదీ చూడనీ... నాదగ్గిర ఉంచుతానిది.''

''వద్దండి. డాక్టర్ లివ్‌సే గారికి చూపించా లనుకున్నాను.''

''రైట్ ! అవును, ముందాయనకి చూపించడం మంచిది. ఆయన జిల్లా మేజిస్ట్రేటు కూడాను. అసలు నేనుకూడా ఇప్పుడే వెళ్ళి జరిగినదంతా

డాక్టరుగారికిగాని, జమీందారుగారికిగాని రిపోర్టు చెయ్యడం మంచిదను కుంటాను. ప్యూ మహాశయుడు చచ్చిపోయాడు గదా! వాడు చచ్చిపోయి నందుకు నేను విచారిస్తున్నాననికాదు; లోకులు పలువిధాల చెప్పుకోవచ్చు, దాన్ని గూర్చి. అతడు చనిపోవడంలో నా తప్పేమీలేదని రుజువు చేసుకోవలసి వుంది. సరే హాకిన్స్. నీకిష్టమైతే నాతో రా, డాక్టరుగారింటికి తీసుకు వెడ తాను.''

మిస్టర్ డాన్సుకు కృతజ్ఞత తెలిపాను. మళ్ళీ గ్రామానికి వెళ్ళాము. నేను డాక్టరుగారింటికి వెడుతున్నానని, ఈ రాత్రికి వస్తే వస్తాను, లేకపోతే రా''నని మా అమ్మతో చెప్పాను. నేను అధికారుల్లో ఒకరి గుర్రం ఎక్కాను. మిస్టర్ డాన్స్ ఆజ్ఞ ఇవ్వగానే గుర్రాలన్నీ హుటా హుటి గా డాక్టరుగారింటి వైపు దౌడు తీశాయి.

5

డాక్టర్ లివ్‌సే గారి ఇల్లు చేరుకున్నాం. లోపల అంతా చీకటిగా ఉంది. మిస్టర్ డాన్స్ తలుపు తట్టాడు. నౌకరొకడు వచ్చి తలుపు తీశాడు.

''డాక్టరుగా రున్నారా?'' అని అడిగాను. డాక్టరుగారింట్లో లేరని, మధ్యాహ్నమే జమీందారుగారింటికి వెళ్ళారని, ఇంకా అక్కడే ఉండి ఉంటారనీ నౌకరు సమాధానమిచ్చాడు.

''అక్కడికే వెడదాం. పదండి,'' అని మిస్టర్ డాన్స్ అన్నాడు.

జమీందారుగారిల్లు అట్టే దూరంలేదు. అందుచేత నేను మళ్ళీ గుర్రం ఎక్కకుండా వారి ప్రక్కనే నడిచాను. జమీందారుగారి హవేలీ వెన్నెలలో ఒక పెద్ద కొండవలె కనిపించింది. గేటుదాటి విశాలమైన ఆవరణ గుండా మెట్లెక్కి కేకవేశాము. మిస్టర్ డాన్స్ జమీందారుగారిని చూడగోరుతున్నామని ఒక నౌకరు ద్వారా లోపలికి కబురు పంపించాడు. తరువాత ఆ నౌకరే మమ్మల్ని లోపలికి తీసుకుపోయాడు. తివాసీలు పరిచిన నడవగుండా వెళ్ళాము. లైబ్రరీ గదిలో

లైట్లు ధగ ధగ వెలుగుతున్నాయి. ఎత్తయిన బీరువాలలో అందంగా బైండు పుస్తకాలు అమర్చబడివున్నాయి. జమీందారుగారు, డాక్టరుగారు చలిమంటకు దగ్గరగా చెరొక కుర్చీలోను కూర్చున్నారు. ఇద్దరి చేతుల్లోను పొగాకు నింపిన పైప్ లున్నాయి.

జమీందారుగారిని అంత దగ్గర్నుంచి నేనెప్పుడు చూడలేదు. దాదాపు ఆరడుగుల ఎత్తు. దానికి తగ్గ లావు కలిగి మంచి గంభీరంగా కనిపించారు. కళ్ళు తీక్షణంగా ఉన్నాయి. ముఖంలో కొంచెం మొరటుతనం కనిపిస్తోంది.

'' మిస్టర్ డాన్స్! లోపలికి రా'' అని జమీందారుగారు ఠీవిగా ఆహ్వానించారు.

''గుడ్ ఈవెనింగ్ డాన్స్? గుడ్ ఈవెనింగ్ జిమ్! ఏమిటిలా వచ్చారు అకస్మాత్తుగా?'' అని డాక్టరుగారు అడిగారు.

సూపర్‌వైజర్ డాన్స్ శాల్యూట్ చేసి మా హోటల్లో జరిగిన వృత్తాంతం యావత్తూ వివరించాడు. వారిద్దరూ అత్యాసక్తితో మా కథ విన్నారు. గుడ్డివాడు గుర్రాల కిందపడి చనిపోయాడన్న సంగతి చెప్పేసరికి జమీందారుగారు ''సెబాష్ మంచిపని చేశావు. వాణ్ణి వేరే ఉరితీయవలసిన అవసరం లేకుండా చేశావు'' అని మెచ్చుకున్నారు. ఆపదలో చిక్కుకున్న నన్ను, మా అమ్మను కాపాడినందుకు అతన్ని చాలాసేపు అభినందించారు. డాక్టరుగారు నన్నడిగారు;

'' జిమ్! దొంగలు వెతుకుతున్న పార్శిల్ నువ్వు దాచానన్నావు గదూ?''

''అవునండి. ఇదిగో నా జేబులోనే వుంది'' అని పార్శిల్ తీసి ఇచ్చాను.

డాక్టరుగారు దాన్ని అన్నివేపులా పరీక్షించారు. ఆయన దాన్ని తెరుద్దామా, వద్దా అని సందేహిస్తున్నట్టు తోచింది. చివరికి ఇలాగన్నారు.

''మిస్టర్ డాన్స్! నీకు చాలా పని వున్నట్టున్నది. నువ్వు ఇక వెళ్ళు. జిమ్ హాకిన్స్ ఈ రాత్రికిక్కడే వుంటాడు.''

జమీందారుగారు మళ్ళీ డాన్స్‌ను అభినందించారు. అతడు శాల్యూట్ చేసి

తన తోటి అధికారులతో కలిసి వెళ్ళిపోయాడు . జమీందారుగారు నాకు భోజనం తెప్పించారు. ఆ సాయంత్రం జరిగిన వింత అనుభవాలతో నాకు అంతవరకు ఆకలి తెలియనేలేదు. భోజనం చూడగానే ఎక్కడలేని ఆకలి వచ్చింది. కడుపునిండా ఆరగించాను. ముగ్గురం స్తిమితంగా కూర్చున్నాం.

''సరే. జమీందార్ ట్రెలానీ! -''

''సరే, డాక్టర్ లివ్‌సే! -'' ఇద్దరూ ఒకేసారిగా ఒకరినొకరు సంబోధించు కున్నారు.

'' ఆ, ఆ. ఒకళ్ళ తరువాత ఒకళ్ళు'' అని డాక్టరుగారు నవ్వుతూ అన్నారు.

''ట్రెలానీ! ఈ ఫ్లింట్‌ను గూర్చి నువ్వు విన్నావు గదూ?''

''విన్నానా? - వినడమేమిటోయ్ డాక్టర్? అంత పరమకిరాతకుడు, దుర్మార్గుడు, హ్లంతకుడు ఈ భూప్రపంచంలో ఇంకోడు లేడనుకో. స్పెయిన్ దేశం వాళ్ళకి ఫ్లింట్ పేరు చెబితే ఠార్, ఠార్. అంత గొప్ప సముద్రపు దొంగ ఇంగ్లీషు వాళ్ళలో పుట్టినందుకు నేనప్పుడప్పుడు గర్వపడేవాణ్ని కూడా. ఇంతెందుకూ? ఒకసారి వాణ్ణి ట్రినిడాడ్‌లో చూశాను. ఓరి వీణ్ణి నరికెయ్య! ఎట్లా ఉన్నాడనుకున్నావ్?''

'' వాడిపేర్లు నేను కూడా చాలాసార్లు విన్నాను. అది కాదు మనకిప్పుడు కావలసింది. ఫ్లింట్ ఏమన్నా డబ్బు గడించాడా.''

'' డబ్బా? నీకు తెలియదేమిటి: ఇప్పుడీ దొంగలు దేనికోసం ప్రయత్ని స్తున్నారనుకున్నావ్? డబ్బుకోసం కాకపోతే వాళ్ళింత తెగించి దేనికొచ్చా రనుకున్నావ్?''

''త్వరలోనే తెలుస్తుంది ఆ సంగతి. నువ్వు నన్ను మాట్లాడనివ్వవేం? ప్రతి మాటా అలా ఆశ్చర్యార్థకాలతో మాట్లాడితే నేనేం మాట్లాడేది? నే నడిగేది ఇదీ. ఈ పార్సిల్‌లో ఫ్లింట్ గడించిన డబ్బు ఎక్కడుందో తెలిపే కిటుకు ఏదన్నా ఉంటుందనుకో, దానికోసం ప్రయత్నించడం లాభసాటి అవుతుందా, కాదా?''

''లాభమా? ఏమిటి నీ ఉద్దేశం? ఫ్లింట్ ఏమాత్రం సంపాదించాడని నీ అభిప్రాయం? కొన్ని లక్షల పైగా ఉంటుంది. ఆ కిటుకే గనక నిజంగా దొరికితే ఈ క్షణంలో నేను బ్రిస్టల్ వెళ్ళి ఓడ కొనేసి రెడీగా ఉంచుతాను. రెండు రోజుల్లో నువ్వు, నేను, హాకిన్స్ బయలుదేరి ఆ స్థలానికి వెడదాం. ఒక ఏడాదిలో ఫ్లింటు డబ్బును పట్టుకోకపోతే నా పేరు ట్రెలానీ కాదు.''

''సరే'' అన్నారు డాక్టరుగారు. ''జిమ్ అనుమతి మీద ఈ పార్శిల్ విప్పు దాం,'' అంటూ పార్శిల్‌ను బల్లమీద పెట్టారు. దగ్గర దగ్గరగా కుట్లు కుట్టబడి నందున పార్సిల్ విప్పడం సాధ్యం కాలేదు: చాకుతో కుట్లు కోసి వేయవలసి వచ్చింది. అందులో ఒక పుస్తకం, సీలు వేయబడిన ఒక కాగితం ఉన్నాయి.

''ముందు పుస్తకం చూద్దాం.'' అన్నారు డాక్టరుగారు.

నేను, జమీందారుగారు డాక్టరుగారి బుజాల మీదుగా వంగి ఆత్రంగా పుస్తకంకేసి చూస్తున్నాము. డాక్టరుగారు వెనక్కి తిరిగి మమ్మల్ని చూసి, నవ్వి, కుర్చీలు వేసుకు కూర్చోండన్నారు. బల్ల దగ్గిరగా కుర్చీలు లాక్కున్నాము.

మొదటి పేజీమీద పిచ్చిగీతలున్నాయి. చేతిలో పెన్సిలువుంటే ఏమీ తోచని వాడు గీసిన గీతల వలె ఉన్నాయి. రెండో పేజీలో ''మిస్టర్ విలియం బోన్స్- తండేలు'' అని వున్నది. ఇంకో పేజీలో '' ఇక రమ్ తాగను'' అని రాసి వుంది. ఇంకా ఏమిటో అక్షరాలున్నాయి. కాని స్పష్టంగా తెలియటం లేదు.

'' ఉహూ. ఇందులో మనకి పనికివచ్చేదేమీ లేదనుకుంటాను.'' అని డాక్టరుగారు పేజీ తిప్పారు.

తరువాత పది పన్నెండు పేజీల వరకు జమాఖర్చుల పద్దురాసి వుంది. మనుషుల పేర్లుగాని, స్థలాల పేర్లుగాని ఎక్కడాలేవు. మనుషుల పేర్లు ఉండవలసినచోట్ల క్లాస్ గుర్తులు, స్థలాలపేర్లు ఉండవలసినచోట్ల అక్షాంశ రేశలు, మధ్యాహ్న రేఖలు మాత్రమే ఉన్నాయి.

'' ఏమిటో యీ గొడవంతా? తలాతోకా లేకుండా ఉంది.'' అన్నారు

డాక్టరుగారు.

'' ఇది ఆ తాగుబోతు పద్దు పుస్తకం. ప్లస్ గుర్తులు సముద్రపు దొంగలు దోచుకున్న పట్టణాలనో, ఓడలనో తెలియజేస్తాయి. ఈ పైకం అంకెలు వాడి వాటాకు వచ్చిన డబ్బు అయివుంటుంది. చూడరాదూ, ఏళ్ళు గడిచినకొద్దీ వాడెంత ధనవంతుడయ్యాడో ఈ అంకెలు తెలుపుతున్నాయి'' అన్నారు జమీందారుగారు ఒక గొప్ప అపరాధ పరిశోధకుడిలా మొహంపెట్టి.

''రైట్, అంతే. నీ దేశసంచారపు అనుభవం ఇప్పుడు పనికివస్తోంది. బోన్స్ మహాశయుడు చాలా పొదుపరిలా గున్నాడు. అంతా జమే తప్ప ఖర్చు కనిపించడం లేదు!'' అన్నారు డాక్టరుగారు.

ఆ పుస్తకంలో ఇంక చూడవలసిందేమీ లేదు. చివర వివిధ దేశాల నాణాలకూ ఇంగ్లీషు నాణాలకు విలువల మానం తెలియజేస్తూ ఒక పట్టిక మాత్రం వున్నది.

''సరే ఈ కాగితం తీసి చూద్దాం ఇహ'' అని డాక్టరుగారు అతి జాగ్రత్తగా సీళ్ళు తీసివేశారు. ఒక ద్వీపపటం కనిపించింది. అక్షాంశ రేఖలు, మధ్యాహ్న రేఖలతో సహా దాని ఉనికిపట్టు, ద్వీపంలోని కొండలు, సింధు శాఖలు, అఖాతాలు, ఇంకా ఇతర వివరాలన్నీ రాసి వున్నాయి. ద్వీపం తొమ్మిది మైళ్ళ పొడుగు. అయిదు మైళ్ళ వెడల్పు ఉండవచ్చును. ఒక లావుపాటి రాక్షసుడు నుంచున్నట్టుగా వుంది దాని ఆకారం చూస్తే. రెండు చక్కని రేవులున్నాయి. పడమటి వేపున ''టెలిస్కోపు కొండ'' అని ఎత్తయిన కొండ ఒకటుంది.

ద్వీపం ఉత్తర భాగంలో ఎర్రసిరాతో రెండు ప్లస్ గుర్తులున్నాయి. నైఋతి భాగంలో ఒక ప్లస్ గుర్తు ''గుప్తధనం7,00,000 పౌనులు'' అని సిరాతో రాసి వున్నది.

ఈ పటం చూడగానే డాక్టరుగారు, జమీందారుగారు సంతోషాతిరేకంలో మైమరచి పోయారు.

''లివ్‌సే! నీ వెధవ డాక్టరు వృత్తి మానెయ్. రేపు నేను బ్రిస్టల్‌కు పరిగెత్తు

తున్నాను. మూడు వారాలు– మూడు వారాలు: – రెండు వారాల పది రోజుల్లో ప్రపంచంలోకల్లా గొప్ప ఓడను, కళాసీలను సంపాదిస్తాను. హాకిన్స్ '' ఓడ నౌకరు'' గా వస్తాడు. జిమ్! ఓడ నౌకరుగా నువ్వు బలే అద్భుతంగా ఉంటావు. లివ్‌సే! నువ్వు ఓడ డాక్టరుగా ఉందువుగాని, నేను ఓడకు ఎడ్మిరల్ (సర్వాధికారి) గా ఉంటాను. మా ఇంటి జవాన్లు రెడ్రూత్, జాయిస్, హంటర్ లను కూడా తీసుకుపోదాము. మన ఓడకి గాలి అనుకూలంగా ఉంటుంది. కొద్దిరోజుల్లో ద్వీపం చేరుకోగలం. గుప్త ధనాన్ని ఇట్టే కను క్కుంటాం. ఇంక ఒక్కొక్కళ్ళు తిన గలిగినంత డబ్బు తినేద్దాం. ఓ – బలే, అద్భుతం, మహాద్భుతం, పరమాద్భుతం–''

జమీందారుగారి ఉపన్యాసాని కడ్డం వచ్చి డాక్టరుగారు, ''ట్రెలానీ! నేను నీతో ప్రపంచం చివరల వరకూ రమ్మన్నా వస్తాను. జిమ్ కూడా వస్తాడు. కాని నాకొక మనిషి అంటే భయంగా వుంది'' అన్నాడు.

''ఎవడా దుర్మార్గుడు? ఎవడా కుక్క? చెప్పు. ఈ క్షణంలో వాణ్ణి.....''

''నువ్వే, నువ్వంటే నాకు భయంగా వుంది. నీకు నోట్లో నువ్వు గింజ నానదు. ఈ ద్వీపాన్ని గురించి తెలిసిన వాళ్ళం మన ముక్కళ్ళమే కాదు. ఈ రాత్రి హోటల్‌ను ముట్టడించిన సముద్రపు దొంగలకు కూడా కాంచన ద్వీపం అనేది ఒకటున్నదని, దానికో చక్కని పటం తయారు చేయబడి వుందని తెలుసు. వాళ్ళు ప్రాణాలకు తెగించి అయినా డబ్బు కాజెయ్యాలనే నిశ్చయంతో ఉన్నారు. మన దగ్గిర ఆ పటం ఉందని ఈ పాటికే అనుమానం కలిగి వుంటుంది. మనం సముద్రం మీద బయలుదేరే క్షణం దాకా ఒంటరిగా ఎక్కడా తిరగకూడదు. నేను, జిమ్ యీ నాలుగు రోజులు కలిసే ఉంటాం. నువ్వు బ్రిస్టల్‌కు వెళ్ళేటప్పుడు జాయిస్, హంటర్‌లను వెంటపెట్టుకుని వెళ్ళు. మన ముగ్గురికి తప్ప మరో కంటి వాడికి ఈ పటం విషయం, మన గమ్యస్థానం విషయం తెలియగూడదు.''

''రైట్. లివ్‌సే, నువ్వన్నమాట అక్షరాలా నిజం. నేనిదిగో చేతిలో చెయ్యేసి

చెబుతున్నాను. ఛస్తే ఇంకొకడికి చెప్పను ఈ విషయం. నా మాట నమ్ము.''

6

మేము సముద్రయానానికి సిద్ధంకావడం జమీందారుగా రూహించిన దానికంటె ఆలస్యం అయింది. అసలు మేము మొదట్లో వేసుకున్న ప్లానుల్లో ఒక్కటీ అనుకున్నట్టు జరగలేదు. డాక్టరు లివ్‌సేగారూ, నేను ఒకరినొకరం వదిలిపెట్టి ఉండరాదని మొదట్లో అనుకున్నా, అలా సాధ్యం కాలేదు. డాక్టరు గారు తన ప్రాక్టీసు ఎవరికి అప్పజెప్పాలా అని సమస్యలో పడి చివరికి మరొక డాక్టరును మాట్లాడేందుకు లండన్ వెళ్ళారు. జమీందారుగారు బ్రిస్టల్‌లో ఓడకు సంబంధించిన ఏర్పాట్లల్లో మునిగి వున్నారు. ఇక నేను మాత్రం రోజుల తరబడి జమీందారు గారింట్లోనే ఉండిపోవలసి వచ్చింది. నేనెక్కడికీ కదలకుండా చూసేందుకు జమీందారుగారు తన తోటమాలి రెడ్రూత్‌ను కాపలా ఉంచారు.

ఆ కాసిని రోజులు కారాగారంలో ఉన్నంత బాధ పడ్డాననుకోండి, వృద్ధుడైన రెడ్రూత్‌ను తప్పిస్తే మరో ప్రాణి లేడాయెను మాట్లాడేందుకు. ఒంటరిగా ఆ దివాణంలో ఏమీతోచక చచ్చేవాణ్ణి అస్తమానమూ నా ఆలోచనలు కాంచన ద్వీపం పైకే పోయేవి. ఎప్పుడూ ఆ ద్వీప పటంలోని వివరాలను గూర్చే కలలు కనేవాణ్ణి. హాల్లో చలిమంట దగ్గిరగా సోఫాలో కూర్చుని ఊహలో ద్వీప దృశ్యం చిత్రించుకుని గుప్తధనం కోసం ప్రతి అంగుళమూ అన్వేషించేవాణ్ణి. ''టెలిస్కోప్ కొండ'' అని పిలవబడే ఆ ఎత్తయినకొండ ఎన్నివందలసార్లు ఎక్కి ద్వీపరామణీయకం చూసి ఆనందించానో చెప్పలేను. ఒక్కోసారి ద్వీపమంతా ఆటవిక మనుష్యులతో నిండివున్నట్టు, మేము వాళ్ళతో ఘోర యుద్ధంచేసి ఓడించినట్టు ఊహించుకునేవాణ్ణి. ఇంకోసారి ద్వీపమంతా క్రూర వన్య

మృగాలతో నిండివున్నట్టు అనిపించేది. కాని మేము కాంచన ద్వీపంలో నిజంగా ఎదుర్కోవలసి వచ్చిన అపాయాలతో పోల్చి చూస్తే ఈ ఊహా ప్రమాదాలు ఏమూలకి?

కొన్ని వారాలు ఇలా సోమరిగా గడిచాయి. ఒక శుభ ప్రభాతాన బ్రిస్టల్ నగరం నుంచి ఒక లేఖ వచ్చింది. అది డాక్టర్ లివ్‌సే పేరిట వచ్చినా '' డాక్టర్ ఊళ్ళో లేకపోతే టామ్ రెడ్రూత్ గాని, జిమ్ హాకిన్స్ గాని తెరవవచ్చు'' అని పైన రాయబడివుంది. డాక్టర్‌గారింకా లండన్ నుంచి తిరిగి రాలేదు. అందుచేత మేము కవరు చించి చూశాము. రెడ్రూత్ అచ్చు అక్షరాలు తప్ప రాత తిన్నగా చదవలేడు. కనుక నేనే ఉత్తరం చదివి వినిపించాను:-

''పాతలంగర్ హోటల్,
బ్రిస్టల్, మార్చి 1, 17–

ప్రియమైన లివ్‌సే,

నువ్వు మా ఇంటిలో వున్నావో లేదో తెలియదు. కనుక ఈ ఉత్తరం నకలు లండన్ కూడా పంపిస్తున్నాను.

ఓడ కొనేశాను. హార్బరులో రెడీగా ఉంది. అంత మధురమైన, సుందరమైన ఓడ నువ్వు జన్మలో చూసి ఉండవు– నాలుగేళ్ళ పాపాయి కూడా దాన్ని నడప గలడు– రెండు వందల టన్నుల బరువు – పేరు హిస్పానియోలా.

ఆ ఓడని నా పాత మిత్రుడు బ్లాండ్లీ సంపాదించి పెట్టాడు. అతనంతటి అద్భుతుణ్ణి నేనెక్కడా చూళ్ళేదు. నాకోసం ఎంత శ్రమ పడ్డాడనుకున్నావ్. అతనేకాదు– అంతా అలాగే మనకోసం శ్రమపడ్డారు. మనం వెడుతున్నపని (డబ్బంటే ఏమిటి మరి?) చెప్పేసరికి గులాములైపోయి సలాములు కొట్టారనుకో నాకు.''

ఉత్తరం ఆపాను. ''రెడ్రూత్. చూశావా, జమీందారుగారు అందరితోనూ చెప్పేస్తున్నారు, డాక్టరుగారు వద్దన్నా కూడా'' అన్నాను.

''అది ఆయన ఇష్టం. డాక్టరుగా రెవరు వద్దనడానికి?'' అన్నాడు స్వామి

భక్తుడైన రెడ్రూత్.

ఇక వ్యాఖ్యానించడం మానేసి ఉత్తరం చివరివరకు చదివాను:

''ఓడలో వేలెత్తి చూపడానికి కూడా లోపంలేదు. చూసిన వాళ్ళు, చూడనివాళ్ళుకూడా అదే మాటన్నారు. కాని ఒక్కటే వచ్చింది చిక్కు. ఓడ నడిపే సిబ్బంది దొరకడం గగనమైపోయింది. కనీసం ఇరవై మంది అన్నా ఉండాలి- ఏమో ఆ ద్వీపంలో మనుషుల్ని నంచుకు తినే జాతి వాళ్ళున్నారేమో ఎవరికి తెలుసు: పైగా సముద్రపు దొంగలు మన్ని ఎదుర్కొనరని నమ్మకమేమిటి?- కాని అరడజనుమంది దొరికేటప్పటికి తాతలు దిగొచ్చారు. కాని దేవుడి దయవల్ల అదృష్టం తోసుకొచ్చింది. నాక్కావలసిన మనిషి దొరికాడు.

మన ఓడ సరంబీ మీద నుంచుని బుర్ర గోక్కుంటున్నాను. ఇంతలో ఒక మనిషిచక్కా వచ్చాడు. అనుభవంగల నావికుడు. బ్రిస్టల్‌లో అతనెరగని కళాసీ లేడు: చాలా రోజులైందట సముద్రం వదిలి: నీటి బైట చేప మోస్తరుగా ఉందిట అతనికి; మళ్ళీ సముద్రయానం చెయ్యాలనుందట; ఎవరన్నా వంటవాడుగా ఉద్యోగమిస్తే బావుండునని చూస్తున్నాడట.

అతని కథ విని నాకు చాలా జాలి వేసింది. వెంటనే మన ఓడలో వంటవాడుగా కుదిర్చాను. అతని పేరు లాంగ్ జాన్ సిల్వర్; ఒక కాలు లేదు పాపం; యుద్ధాల్లో పోగొట్టుకున్నాడట; మనదేశం తరుపున యుద్ధాల్లో పాల్గొని త్యాగం చేశాట్ట. కాని అతనికి ప్రభుత్వం పింఛనైనా ఇవ్వడం లేదు. హు! ఏం ప్రభుత్వమోయ్, లివ్సే, వెధవ ప్రభుత్వం.

నేను మంచి వంటవాడినే సంపాదించా ననుకున్నాను; కాదు-సిబ్బందినే సంపాదించినట్లయింది. ఎందుకంటే సిల్వర్ సహాయతో రెండు మూడు రోజులలో మనక్కావలసినంత మంది కళాసీల్ని సేకరించాను. చూట్టానికాట్టే బావుండరనుకో. కాని అతి సాహసులు. అతి సమర్థులు, పసిఫిక్ సముద్రాన్ని ఈదమన్నా కళ్ళు మూసుకుని దూకేటంత దమ్ములున్న వాళ్ళు, వాళ్ళతో మనం బయల్దేరితే హిస్పానియోలా ‘ ఈరేడు జగంబుల నజేయంబు’.

నేను అంతకు ముందు మాట్లాడిన అరడజను కళాసీల్లో ఇద్దర్ని సిల్వర్ మాట మీద డిస్మిస్ చేసి పారేశాను. వాళ్ళు వట్టి చవటలని అతను అభిప్రాయ పడ్డాడు.

నా ఆరోగ్యం బాగానే వుంది. మదించిన ఆంబోతులా తింటూ, తుమ్మ మొద్దులా నిద్రపోతున్నాను. కాని మనం బయల్దేరే వరకూ నాకు మనశ్శాంతి ఉండదు. నా ముద్దుల కాంచనద్వీపం ఎప్పుడు చూస్తానో! వెధవ డబ్బు - ఎవడిక్కావాలోయ్? నాకిప్పుడు డబ్బు తక్కువైందనా? సముద్రాల మీద దూరనిర్జన ప్రదేశాలకు వెళ్ళాలనే కుతూహలంగాని? లివ్సే! నుంచున్న పళంగా బయల్దేరి రా- నా మీద ఏమాత్రం గౌరవం ఉన్నా ఆలస్యం చెయ్యకు.

జిమ్ హాకిన్స్ వాళ్ళమ్మను చూడాలనుకుంటే రెడ్రూత్‌ను తోడిచ్చి పంపించు. తరవాత వాళ్ళిద్దరూ బ్రిస్టల్ వస్తారు.

ఒకముక్క;- మనం ఆగస్టు నెలాఖర్లోగా తిరిగి రాకపోతే బ్లాండ్లీ మనల్ని వెదికేందుకు మరొక ఓడను, సిబ్బందిని పంపిస్తానన్నాడు. మర్చేపోయా. మన ఓడకు బలే మంచి కెప్టెన్ దొరికాడు. కొంచెం తల బిరుసు మనిషిగాని, తతిమా విషయాల్లో అమూల్యుడనుకో. లాంగ్ జాన్ సిల్వర్ మన ఓడకు మంచి తండేలును సంపాయించాడు: అతని పేరు యారో.

సిల్వర్ ఏమిటనుకున్నావో, మంచి స్థితిమంతుడే. బ్యాంకిలో చాలా నిలవ చేశాడు. అతనికో నీగ్రో పెళ్ళాముంది. ఆమెకు హోటల్ నడిపే బాధ్యత అప్పగించాడు. కొంచెం గయ్యాళిదని వినికిడి. నువ్వూ నేను బ్రహ్మచారి గాళ్ళమైనా, సిల్వర్ పెళ్ళాన్ని విడిచి సముద్రాలకు ఎందుకు ఎగబడుతున్నాడో గ్రహించడం కష్టంకాదు.

జా. ట్రె.

ఇంకో ముక్క:- హాకిన్స్ వాళ్ళ అమ్మ దగ్గిర ఒక్కరోజు కంటె ఎక్కువ ఉండడానికి వీల్లేదు.''

ఈ ఉత్తరం చదువుతుంటే నా గుండె సంతోషంతో ఎంత వేగంగా

కొట్టుకుందో చెప్పలేను.

మర్నాడు ఉదయం రెడ్రూత్‌తో కలిసి నేను ‘‘ ఎడ్మిరల్ బెన్‌బౌ’’ కు బయల్దేరి వెళ్ళాను. మా అమ్మ కులాసాగానే వుంది. మా హోటల్ వ్యాపారం యథాప్రకారంగా సాగుతూనే వుంది. జమీందారుగారు ఈలోగా హోటల్ అంతా మరమ్మత్తు చేయించారు. కొత్త సామాను కూడా కొని పెట్టారు. హాల్లో మా అమ్మ కూర్చునేందుకు ఒక అందమైన సోఫా కూడా అమర్చారు. నేను లేనంత కాలం మా అమ్మకు చేదోడు వాదోడుగా ఉండేందుకు నా యీడు కుర్రాణ్ణి నియమించారు.

జమీందారుగారి దివాణంలో ఉన్నంత కాలమూ సముద్రయానం మీదనే మనస్సు పెట్టుకుని ఉన్నవాణ్ణి, మా అమ్మను చూడగానే ఆపుకోలేని దుఃఖం వచ్చింది. నాకు శైశవం నుంచి బాగా పరిచయమైన మా ‘బెన్‌బౌ’ పరిసరాలను, కొండలను, అడవులను, సముద్రతీరాన్ని వదిలివెళ్ళడం ఎంత కష్టమో అప్పుడు తెలిసింది.

ఆ రాత్రి మా ఇంట్లోనే గడిపాము. మర్నాడు భోజనమైనాక మళ్ళీ రెడ్రూత్, నేనూ కలిసి బయల్దేరాం.

7

ప్రాతఃకాల భోజనం ఆరగించాను. జమీందారుగారు లాంగ్ జాన్ సిల్వర్‌కు ఒక ఉత్తరం రాసి నా ద్వారా పంపించారు. హార్బరు రోడ్డు వెంబడే పోతే ‘‘టెలిస్కోప్’’ అనే పేరుగల హోటల్ కనిపిస్తుందని, అక్కడ సిల్వర్ కనిపిస్తాడని చెప్పారు. మళ్ళీ కొన్ని ఓడల్ని, నావికుల్ని చూడవచ్చుగదా అని ఎగురుకుంటూ బయల్దేరాను. రోడ్డంతా సరుకులు తీసుకొచ్చే బళ్ళు. జన సమ్మర్దం పొద్దుటి కంటే ఎక్కువైంది.

కొంత దూరంపోగా ‘‘టెలిస్కోప్’’ హోటల్ కనిపించింది. బోర్డు మీద టెలిస్కోప్ బొమ్మకూడా ఉంది. గోడలకు కొత్తగా వెల్లవేశారు. కిటికీలకు ఎర్రటి తెర లున్నాయి. హోటలుకు ఆ పక్క, ఈ పక్క సందులున్నాయి. సందుల్లోకి తెరుచుకుని ద్వారాలున్నాయి. లోపలికి గాలీ, వెల్తురూ బాగా వస్తూ కళకళలాడుతూ ఉంది.

లోపల ఫలహారాలు, పానీయాలు సేవిస్తున్న వారిలో చాలామంది నావికులే. వాళ్ళ మాటలు, బలే దౌర్జన్యంగా ఉన్నాయి. లోపలికడుగు పెట్టడానికి జంకుతూ గుమ్మంలోనే నిలబడ్డాను.

ఇంతలో పక్కగదిలో నుంచి మనిషి వచ్చాడు. చూడగానే లాంగ్ జాన్ సిల్వర్ అని తెలిసిపోయింది. ఎడమకాలు తొడ సమీపంలో కోసి వేయబడి వుంది. ఎడమ చంకలో ఊతకర్ర పెట్టుకున్నాడు. పిచ్చిక గెంతినంత తేలిగ్గా గెంతుతూ వచ్చాడు. మనిషి చాలా పొడుగ్గా, బలిష్ఠంగా ఉన్నాడు. మొహం గండుగా, బండగా ఉన్నా తెలివితేటలు ఉట్టిపడుతూ చిరునవ్వుతో విప్పారి వుంది. ఉత్సాహంగా, కూనిరాగం తీస్తూ, బల్లల మధ్యగా ఎగురు కుంటూ, నన్ను సమీపించాడు.

నిజం చెప్పాలంటే, ఆ రోజున జమీందారుగారు రాసిన ఉత్తరంలో లాంగ్ జాన్ సిల్వర్ పేరు చూసినప్పటినుంచి నాకు భయంగానే ఉంది.

– బిల్లీ బోన్సు చెప్పిన ‘‘ ఒంటికాలు పెద్ద మనిషి’’ ఇతనే నేమోనని. కాని మనిషిని ఒక్కసారి చూడగానే నా భయాలన్నీ తీరిపోయాయి. బిల్లీ బోన్సు, నల్లకుక్క, ప్యూ మొదలైన వారిని చూశాను గనుక సముద్రపు దొంగలంటే ఎలా వుంటారో నాకుతెలుసు. సిల్వర్‌ను చూస్తే ఘరానా మనిషి అనిపించాడు గాని ఎక్కడా అనుమాన పడడానికి ఆస్కారమేలేదు.

‘‘మిస్టర్ సిల్వర్ అంటే మీరేనా?’’ అని అడిగాను.

‘‘ అవునమ్మా, నేనే’’ అన్నాడతడు. ‘‘నీ పేరు?’’ అని అడిగాడు. నేను మాట్లాడకుండా జమీందారుగారి ఉత్తరం అందించాను. అది చూడగానే ఒక్కసారి ఉలికిపడి నావంక చూశాడు.

'' ఓ నువ్వా? సరిసరి. నువ్వు మా ఓడ కుర్రాడివి గదూ? నీ గురించి చెప్పార్లే జమీందారుగారు'' అంటూ కరస్పర్శ చేశాడు.

అంతలో అవతలి చివర ద్వారానికి దగ్గిరగా కూర్చున్న ఒకడు హఠాత్తుగా లేచి బైటికి వెళ్ళిపోయాడు. నేను వాణ్ణి చూడగానే గుర్తు పట్టాను.

''ఓరి! వాణ్ణి పట్టుకోండి. నల్లకుక్క!!'' అని అరిచాను.

'' నల్లకుక్కో, తెల్లకుక్కో, నా కనవసరం. కాని వాడెవడో బిల్ చెల్లించ కుండానే పారిపోతున్నాడు. హేరీ! వాణ్ణి పట్టుకోరా'' అని సిల్వర్ అజ్ఞా పించాడు.

హోటల్ నౌకరుగావును గభాలున వీధిలోకి పరిగెత్తాడు నల్లకుక్కను పట్టుకోడానికి.

''వాడు సాక్షాత్తు మహారాజైనా సరే, బిల్ చెల్లించితీరాలి. నా దగ్గిర ఈ పప్పులుడకవు'' అని నా చెయ్యి వదిలిపెడుతూ '' ఎవరన్నావు వాడు? నల్ల....''

''నల్లకుక్కండి. ట్రెలానీగారు మీతో చెప్పలేదా, సముద్రపు దొంగల్ని గూర్చి? వాళ్ళవాడే వాడు'' అన్నాడు.

'' నిజంగా? ఓరి వీడి తస్సదియ్యా. నా హోటల్‌కి రావడానికి వాడికెన్ని గుండెలున్నాయ్! బెన్! పరుగెత్తు నువ్వుకూడా. వాణ్ని లాక్కురా. వాడు దొంగ అన్నమాట. తస్సదియ్యా. ఆ దొంగతో కూర్చుని కబుర్లు చెబుతోంది ఎవరు? నువ్వేనా టామ్ మోర్గన్? ఇటురా,''

మోర్గన్ అనబడే ఆ మనిషి సిల్వర్ దగ్గిరికి తూలుకుంటూ వచ్చాడు. అతడు వృద్ధుడు! జుట్టు నెరిసింది; కళాసీ దుస్తులలో ఉన్నాడు.

'' ఇదిగో మోర్గన్! నువ్వు ఇదివరకెప్పుడన్నా ఆ నల్ల... నల్ల... కుక్కను చూశావా?'' అని అడిగాడు సిల్వర్.

'' లేదండి'' అని భయపడుతూ చెప్పాడు మోర్గన్.

'' వాడి పేరు తెలుసా నీకు?''

'' ఊహూ.''

''తస్సదియ్యా, టామ్ మోర్గన్ ! బతికిపోయావ్ ఇవ్వాల్టికి . అలాంటి వాళ్ళతో నువ్వు మాట్లాడుతున్నావని గాని, తిరుగుతున్నావని గాని తెలిస్తే నిన్నిక్కడ అడుగు పెట్టనివ్వను తెలుసా. జాగ్రత్త. ఏమిటి వాడు చెబుతున్నాడు నీతో?''

''నాకు తెలియదండి.''

''తస్సదియ్యా. నీ మెడకాయ మీద వున్నది తలకాయేనా? నీ తల కాయలో మెదడుందా? తెలియదట తెలియదు! నువ్విప్పుడెవరితో మాట్లాడుతున్నావో తెలుసా, పోనీ? ఇదుగో మోర్గన్ ! నిజం చెప్పు. ఏమిటా నల్లకుక్క చెబుతు న్నాడు నీతో? ఊఁ-''

''చుక్కాని పాడైపోతే బాగుచెయ్యడమెల్లాగో చెబుతున్నాడండి.''

''తస్సదియ్యా. చుక్కాని గురించి చెబుతున్నాడేం? పోపో. ఎదట లే. వెధవ మొహమేసుకుని''

మోర్గన్ మళ్ళీ తూలుకుంటూ పోయి తన బల్లవద్ద కూర్చున్నాడు. సిల్వర్ ఇలా చెప్పసాగాడు.

'' ఆ టామ్ మోర్గన్ ఉన్నాడే, మంచివాడు, నమ్మదగినవాడు, కాకపోతే కొంచెం అమాయకుడనుకో. ఎవడో జ్ఞాపకం రావడంలేదే. నల్లకుక్కన్నావు గదూ? నల్ల...నల్ల... ఆ- ఇదివరకు చూసినట్టు గుర్తుంది. అప్పుడప్పుడు ఒక గుడ్డివాడితో వచ్చేవా డిక్కడికి.''

''రైట్. వాళ్ళలో గుడ్డివాడు కూడా ఒకడుండేవాడు. వాడి పేరు ప్యూ'' అన్నాను నేను.

'' ఆ. ప్యూ, అంతే, ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. వాణ్ణి చూస్తే చంటి పిల్లలు జడుసుకుంటారు కూడాను. ఇప్పుడా నల్లకుక్క గనక దొరికితే ట్రెలానీగారు చాలా సంతోషిస్తారు. మా బెన్ బాగా పరిగెడతాడు. వాడితో పరిగెట్టేవాడు కళాసీల్లో ఎవడూ లేడు. ఈ పాటికి పట్టుకునే వుండాలి నల్లకుక్కని. తస్స దియ్యా. చుక్కాని ఎలా బాగుచెయ్యాలో చెబుతున్నాడేం?''

ఈ మాట్లాడుతున్నంతసేపూ సిల్వర్ ఊత కర్రతో హోటల్లో అటునుంచి ఇటూ, ఇటునుంచి అటూ గెంతుతూ నడుస్తున్నాడు. నల్లకుక్కను ఇక్కడ చూడగానే మళ్ళీ నాకు అనుమానాలు రేకెత్తాయి. సిల్వర్ అంటే నేననుకున్న కుంటివాడేమోనని. కాని సిల్వర్ ఇప్పుడు చేసిన గొడవంతా చూడగానే అనుమానాలు పటాపంచలయినాయి. నల్లకుక్క కోసం పరిగెత్తిన ఇద్దరూ మనుషులూ రొప్పుతూ రోజుతూ తిరిగివచ్చారు. ఆ దొంగ గుంపులో కలిసి పోయాడని, ఎంత వెదికినా కనిపించలేదని చెప్పారు. సిల్వర్ వాళ్ళ తెలివితక్కువ తనానికి నానా తిట్లూ తిట్టాడు.

అప్పటికి నాకు సిల్వర్ అంటే పూర్తిగా మంచి అభిప్రాయం కలిగింది. అంతకంటే ఘరానా మనిషి లేడనుకున్నాను. సిల్వర్ ఇలా అన్నాడు:

'' చూడు, హాకిన్స్! నా కెంత చిక్కు వచ్చి పడిందో. అవతల ట్రెలానీగారు ఇది తెలిస్తే ఏమనుకుంటారు చెప్పు. ఆ దొంగ ముండాకొడుకెవడో నాకు తెలియదాయెను, వాడు వచ్చి. నా ఇంట్లో, నా ఎదురుగా కూర్చుని, నా కళ్ళల్లోనే కారం కొట్టి పోయాడాయెను. నువ్వు వచ్చి వాడు ఫలానా అని చెప్పిందాకా వాడెటువంటి వాడో నాకు తెలియకపాయెను. ఇందులో నా తప్పేమన్నా వుందేమో చెప్పు. నువ్వు కళ్ళారా చూశావు గదా. వాడు డబ్బులుకూడా ఇవ్వకుండా పారిపోయాడు. హాకిన్స్! నువ్వు ట్రెలానీ గారితో చెప్పాలి, నా తప్పేమీ లేదని. చెబుతావు గదూ? నువ్వు కుర్రాడివైనా తెలివి తేటల్లో మా కెవరికీ తీసిపోవులే. అలాగని నిన్ను చూడగానే గ్రహించాను. ఇదుగో. పూర్వం నేను రెండు కాళ్ళమీద నడిచేటప్పుడు ఇలాంటివి ఓ లెక్కలోకి వచ్చేదికాదు. వాణ్ణి రెండు నిమిషాల్లో నేనే పరిగెత్తి పట్టుకునేవాణ్ణి. తస్సదియ్యా. ఒక గుద్దుతో గిద్దెడు రక్తం కక్కించే వాణ్ణి. ఆ రోజులు పోయాయ్. అప్పటి బలమేదీ ఇప్పుడు నాకు? హాకిన్స్! నువ్వూ నేనూ స్నేహితులుగా ఉందామేం? ఓడలో ఎక్కిం తరవాత నీకు బోలెడు విషయాలు నేర్పుతాను. సరే బయల్దేరుదాం పద. డ్యూటీ అంటే డ్యూటీయే, ట్రెలానీగారితో ఇప్పుడు జరిగినదంతా చెప్పాలి. ఎందుకంటే

ఒక దొంగ వెధవ ఇప్పుడు మనిద్దరినీ చవటదద్దమ్మల్ని చేసి పారిపోయాడు. ఆ. ఇద్దర్నీ దద్దమ్మల్ని-''

సిల్వర్ ఏదో జ్ఞాపకం వచ్చినట్టు ఆగాడు. జేబులు తడుముకుని, ''అరె! వాడు డబ్బివ్వనేలేదు గదూ. చూశావా హాకిన్స్! నాకు డబ్బు సంగతి ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది-హ్హా-హ్హాహ్హా-'' అంటూ నవ్వడం మొదలెట్టాడు. విపరీతంగా నవ్వాడు. నవ్వాపుకోలేక పక్కనున్న బల్లమీదపడి నవ్వసాగాడు. అతనన్న దాంట్లో నవ్వొచ్చే విషయం ఏముందో తెలియక పోయినా ఆ నవ్వు నాక్కూడా అంటుకుంది. కళ్ళ నీళ్ళు వచ్చేవరకూ ఇద్దరం పగలబడి నవ్వాం.

చివరికి మా బసకు బయల్దేరాం. దోవలో సిల్వర్ ప్రతి ఓడను గురించి అది ఏ దేశానిదో, దాని బరువెంతుంటుందో, దాని పేరేమిటో, ఏ ఓడలో ఏం చేస్తున్నారో సవిస్తరంగా నాకు చెప్పాడు. ఒకటి సరుకులు దించుకుంటోందనీ, ఒకటి సరుకులు ఎక్కించుకుంటోందనీ, మరొకటి లంగరెత్తి బయలు దేరుతోందనీ అన్నీ చెప్పాడు. మధ్యలో కళాసీల కథలు ఒకటి రెండు చెప్పాడు.

మేము బస చేరుకునే సరికి ట్రెలానీగారు, లివ్సేగారు సోఫాల్లో కూర్చుని వైన్ సేవిస్తున్నారు. ఓడను తనిఖీ చేయడానికి బయలుదేర బోతున్నట్టున్నారు.

సిల్వర్ వారిద్దరికీ సెల్యూట్ చేశాడు. తన హోటల్లో జరిగిన విషయం యావత్తు పూసగుచ్చినట్టు చెప్పాడు. మధ్య మధ్య '' అంతేగదూ, హాకిన్స్.'' అని నన్ను కనుక్కున్నాడు. నేను అవునని తల ఆడించి అతడు చెప్పిందాన్ని ధ్రువపరిచాను.

జమీందారుగారు, డాక్టరుగారు నల్లకుక్క తప్పించుకుపోయినందుకు విచారించారు, సిల్వర్ ''బోలెడు రమ్ము తాగి నాకు డబ్బు చెల్లించకుండా పోయాడండీ,'' అని మళ్ళీ పెద్ద పెట్టున నవ్వసాగాడు. అతని నవ్వు అంటుజాడ్యం లాంటిది. అందీలో హాస్యం ఉన్నా లేకపోయినా జమీందారు గారు, డాక్టరుగారు కూడా అందుకుని పగలబడి నవ్వారు.

తరవాత సిల్వర్ సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

'' సాయంత్రం నాలుగింటికల్లా అందరూ ఓడలో హాజరు కావాలి,'' అ
జమీందారుగారు అతనికి కేక వేసి చెప్పారు.

''అలాగేనండి,'' అంటూ అతడు వెళ్ళిపోయాడు.

''ట్రెలానీ! నువ్వు ఏ పనీ సక్రమంగా చేస్తావని నాకు నమ్మకం లేదు. కా
సిల్వర్‌ను మాత్రం మంచివాణ్ణే సంపాయించావు''

''ఫస్టు క్లాసయిన మనిషిలే. అంతకంటే నమ్మకస్తుడు మనకి దొరక
డనుకో.'' అన్నారు జమీందారుగారు.

'' ఇక వెడదాం పద. జిమ్ కూడా మనతో వస్తాడు.''

'' ఓ తప్పకుండా. హాకిన్స్! నీ టోపీ తీసుకో. మన హిస్పానియోలాను
చూద్దువుగాని,'' అన్నారు జమీందారుగారు.

టోపీ తీసుకొని వారివెంట నడిచాను. బ్రిస్టల్ బజారు వీధులగుండా పోయ
మా ఓడ నిలిచిన హార్బరు చేరుకున్నాం.

8

హార్బరులో చాలా ఓడలు దాటితేగాని మా హిస్పానియోలా కనిపించలేదు
సరంబీ మీది కెక్కగానే మా తండేలు మిస్టర్ యారో ముందుగా వచ్చి సెల్యూ
చేశాడు. ఏళ్ళు పైబడిన మనిషిలాగా ఉన్నాడు. చెవులకు రింగులున్నాయి; ఒ
కన్ను మెల్ల: అతనికి, మా జమీందారుగారికి మంచి దోస్తీ ఏర్పడినట్ల
గ్రహించాను. కాని మా కొత్త కెప్టెన్‌కీ జమీందారుగారికీ మధ్య పచ్చగడ్డి వే
భగ్గుమంటుందని గ్రహించడానికి అట్టే సేపు పట్టలేదు.

కెప్టెన్ పేరు మిస్టర్ స్మాలెట్, మహా చిరాగ్గా ఉన్నాడు. దేన్ని చూసినా, ఎవ
చూసినా ముఖం చిట్లించుకోవడం, రుసరుసలాడటం. మేము ఓడ గదిలో
వెళ్ళామో లేదో ఒక కళాసీ వచ్చి కెప్టెన్ మీతో మాట్లాడ గోరుతున్నాడని కబు
అందజేశాడు.

'' అయ్యయ్యో. కెప్టెన్ గారు మాట్లాడదలచుకుంటే అభ్యంతర మేముంటుంది? చెప్పవలసినవారు ఆయన, వినవలసిన వాణ్ణి నేను,'' అన్నారు జమీందారు ట్రెలానీ. గది బయట కళాసీ వెనకనే కెప్టెన్ వున్నట్టు గ్రహించి కొంచెం వ్యంగ్యంగా అన్నారు ఈ మాటలు. వెంటనే కెప్టెన్ దూకుడుగా లోపలికి వచ్చాడు. టప్‌మని తలుపులు వేసి మా దగ్గరికి వచ్చాడు.

''కెప్టెన్ స్మాలెట్! ఏమిటి విశేషాలు? అంతా సరిగ్గా వుందా?''

''సార్, మీరు ఏమీ అనుకోకుండా వుంటే నేను ఉన్నదున్నట్టు చెప్పేస్తాను. నేను లోపల ఒకమాట, బయటికి ఒకమాట చెప్పే మనిషిని కాను. నాకీ ప్రయాణం నచ్చలేదు; తండేలు నచ్చలేదు.''

''బహుశా ఓడ కూడా నచ్చలేదేమో?'' అన్నారు కోపం దిగమింగుతూ ట్రెలానీగారు.

'' ఓడని గూర్చి ఇప్పుడేమీ చెప్పలేను- ఎలా నడుస్తుందో ఇంకా చూడలేదు కనుక-''

''బహుశా ఓడ యజమానినైన నేను కూడా నచ్చలేదేమో?'' అన్నారు ట్రెలానీ గారు కోపం ఆపుకునే ప్రయత్నం మానేసి.

డాక్టరుగారు అడ్డం వచ్చారు.

'' ఆగవోయ్ ట్రెలానీ! ఆగు, తొందరపడితే లాభమేమిటి? సౌమ్యంగా తేల్చుకోవాలిగాని, కెప్టెన్ గార్ని సాంతం చెప్పనీ. కెప్టెన్! మీకు ఈ ప్రయాణం ఇష్టం లేదన్నారు. ఎందుకని?''

'' నన్ను జమీందార్ ట్రెలానీగారు ఉద్యోగిగా తీసుకునేటప్పుడు, ఓడ ఎక్కడికి వెడుతుందో ముందు చెప్పనని, ఎందుకు వెడుతున్నామో అసలు చెప్పనని అన్నారు. నేను ఒప్పుకున్నాను. బాగానే వుంది. కాని తీరాచూస్తే ఓడలో వున్న ప్రతి చిన్న కళాసీకీ నాకు తెలియని విషయాలన్నీ తెలిసిపోయాయి. నేను వాళ్ళ ముందు వెర్రి మొహం వెయ్యాల్సి వస్తోంది. ఇది న్యాయమేనా అని అడుగుతున్నాను-''

'' ఊహు. న్యాయం కాదు. మీకు చెప్పకుండా ఇతర్లకు తెలియనివ్వడం సబబు కాదు. నిజమే'' అన్నారు డాక్టర్ లివ్‌సే.

'' తరవాత- మనం గుప్తధనంకోసం వెడుతున్నామని తెలిసింది- నాకు మన కళాసీలు చెబితే తెలిసింది సుమండీ. డబ్బు చాలా చెడ్డది. ఎంత సత్పురుషుణ్ణయినా దుర్మార్గానికి దించుతుంది. గుప్త ధనాలకోసం ప్రయాణాలు చెయ్యడం నాకిష్టం లేదు; అందులో రహస్య ప్రయాణమని చెప్పి ఆ రహస్యం ప్రతి చిలకకీ చెప్పేసినప్పుడు అసలిష్టంలేదు.''

''లాంగ్‌జాన్ సిల్వర్ చిలకేనా?'' అన్నారు ట్రెలానీ.

'' అహ. దానిక్కాదు. ఊరికే మాట వరసకన్నాను. ప్రతివాడికీ తెలిసిపోయిందే అని నా బాధ. మీ కెవ్వరికీ తెలియటంలేదుగాని ఈ ప్రయాణంలో మన అందరి చావుబతుకులు తేలిపోతాయి.''

''సరే అది మీ అభిప్రాయం కావచ్చు. కాని మేము మీరనుకున్నంత అజ్ఞానులం, అమాయకులం కాము. తరవాత- కళాసీ లెవరూ నచ్చలేదన్నారు. అంటే వాళ్ళకి ఓడ పని ఏమీ తెలియదనా?'' అని అడిగారు డాక్టరుగారు.

'' వాళ్ళు నా కిష్టం లేదుసార్. అసలు నా కళాసీలను నేనే చూసుకుని వుండవలసింది.''

''నిజమే. వాళ్ళచేత పనిచేయించేది మీరే గనక, మీరే వాళ్ళని మాట్లాడి వుండాల్సింది. అయితే మీతో సంప్రతించేందుకు టైము లేక అలా అయిందే గాని మరేంకాదు. తరవాత-తండేలు ఎందుకిష్టంలేదు?''

''మిస్టర్ యారో మంచి నావికుడే; అనుభవం వున్నవాడే; కాని అతనికి అధికారి కుండాల్సిన గాంభీర్యంగాని, నిగ్రహంగాని లేదు. కళాసీలకు బాగా లోకువై పోయాడు. అతని మాట ఎవరూ వినేట్టు లేరు. పైగా కళాసీల ముందు తాగుతున్నాడు.''

''తాగకూడదనా, మీ ఉద్దేశం?''

'' అదికాదు. తండేలు అనే పదవిలో ఉన్నవాడు మిగతా వాళ్ళతో అంత

చనువుగా ఉండకూడదని.''

''సరే కెప్టెన్! క్లుప్తంగా చెప్పండి. మీ అభిప్రాయ మేమిటో.'' అని డాక్టరుగారడిగారు.

''మంచిది. నేనుమీతో ముందు చెప్పలేదనుకునేరు. అన్నీ చెప్పేశాను. ఏదన్నా జరిగితే దానికి నా బాధ్యత ఏమీ వుండదు. వినండి. కళాసీలు మందుగుండు సామగ్రి, ఆయుధాలు సరంబీ కింద ఖాళీ జాగాలోకి చేరుస్తున్నారు. ఈ ఓడ గదికింద బోలెడు జాగా వుందిగదా. ఇక్కడెందుకు పెట్టగూడదు?- ఒకటి. మీరు మీ సొంత నౌకర్లను తీసుకువస్తున్నారని విన్నాను. వారిని మిగతా కళాసీలు ఉండేచోటనే ఉండమని అన్నారట. వారికి ఓడ గది పక్కన స్థలం ఎందుకు ఏర్పాటు చెయ్యగూడదు?- రెండు.''

''ఊ. అయిందా? ఇంకా ఏమన్నా వుందా?'' అన్నారు ట్రెలానీ గారు ఇంకా కోపంగానే.

''ఇంకొక్క మాట. ప్రతివాడు మన గమ్యస్థానం విషయమే మాట్లాడుతున్నాడు.''

''అవును. వాళ్ళకి తెలియనివ్వడం పొరపాటే'' అన్నారు డాక్టరు గారు.

''మీ దగ్గిర అదేదో ద్వీపం పటం వుందని, అందులో డబ్బెక్కడుందో తెలిపే గుర్తులున్నాయని అందరికీ తెలిసిపోయింది. ద్వీపం ఏ సముద్రంలో ఏ అక్షాంశ, మధ్యాహ్న రేఖలమీదున్నదో కూడా తెలిసింది.'' అంటూ కెప్టెన్ స్మాలెట్ వాటి సంఖ్యను పేర్కొన్నాడు.

''అది నేను పిట్టకు్కూడా చెప్పలేదు,'' అన్నారు ట్రెలానీగారు విస్మయంతో.

''కావచ్చు. కాని అందరికీ తెలిసింది ఆ విషయం.''

''డాక్టర్! నువ్వో, హాకిన్సో చెప్పి వుండాలి'' అన్నారు ట్రెలానీ గారు.

''ఎవరైతేనేం, ఎలాగూ వాళ్ళకి తెలిసిన తరవాత.'' అన్నారు డాక్టరుగారు. ఆయనగాని, కెప్టెన్ గాని, నేనుగాని జమీందారుగారి మాటలు లెక్కచెయ్యలేదు. ఎందుకంటే ఆయన నోట్లో నువ్వుగింజ నానదని మాకు తెలుసు. కాని

ఈ విషయంలో ఆయనన్నది నిజమే; ఆయన గాని మేము గాని ద్వీపం ఉనికి ఎక్కడో ఎవ్వరికీ చెప్పలేదు. అందరికీ ఎలా తెలిసిందో మాకు విచిత్రంగానే ఉంది.

''మరొకమాట'' అని కెప్టెన్ మళ్ళీ ప్రారంభించాడు. '' ఆ పటం మీలో ఎవరి దగ్గరుందో నాకు తెలియదు. ఎవరి దగ్గరున్నా, ఆ విషయం నాక్కూడా తెలియకుండా దాచండి. అది మీకిష్టం లేకపోతే నేను ఈ క్షణంలో రాజీనామా చెయ్యడానికి సిద్ధంగా వున్నాను.''

''అర్థమైంది ఇప్పటికి'' అన్నారు డాక్టరుగారు. ''ద్వీప పటాన్ని రహస్యంగా ఉంచమని, ఓడ వెనకభాగాన్ని శత్రువులకు అభేద్యంగా చెయ్యమని, నమ్మకమైన వాళ్ళని ఆయుధాలతోసహా వెనక భాగంలో ఉంచమని మీరు చెబుతున్నారు. అంటే తిరుగుబాటు జరగొచ్చని మీ అనుమానం. అంతేనా?''

''సార్! నేనన్న మాటలు నాకు అంటగట్టకండి. తిరుగుబాటు జరుగుతుందని తోస్తే ఏ కెప్టెనూ ఓడ నడిపేందుకు ఒప్పుకోడు. తండేలు మిస్టర్ యారో మీద నాకెటువంటి అనుమానమూ లేదు; అతణ్ణి మనం నమ్మవచ్చు. మిగతా కళాసీల్లో కొందరు మంచి వాళ్ళున్నారు. ఏమో, అందరూ మంచివాళ్ళేనేమో, చెప్పలేను. నేనింతగా మీతో చెబుతున్నది ఎందుకంటే ఈ ఓడ బయలుదేరింది లగాయతు, తిరిగి ఈ హార్బరు చేరుకునే వరకు మీ అందరి బాధ్యత నాదే. ఏ ప్రమాదం జరిగినా బాధ్యత నామీదే పడుతుంది. కొన్ని జాగ్రత్తలు తీసుకోవలసిందని కోరుతున్నాను . లేకపోతే నేను రాజీనామా చెయ్యటానికి సిద్ధంగా ఉన్నాను.''

''కెప్టెన్ స్మాలెట్! ఇంతేనా? మీరు లోపలికి వచ్చినప్పటి వాలకం చూస్తే ఏదో గొప్ప విషయం బయటపెట్టాలని వచ్చినట్టనిపించింది'' అన్నారు డాక్టరుగారు.

''అవును, డాక్టర్! నేను రాజీనామా ఇచ్చేసే ఉద్దేశంతో వచ్చాను. జమీందారుగారు నా మాట పట్టించుకుంటారని అనుకోలేదు.''

''ఇక్కడ డాక్టర్ లివ్‌సే లేకపోతే అదే జరిగేది. సరే మీరు చెప్పింది ఎలాగూ విన్నాను. ఆ ప్రకారమే చేస్తాను. కాని ఇంతవరకూ మీమీద మంచి అభిప్రాయం ఏమన్నా వుంటే ఆ కాస్తా ఇప్పుడు తుడుచుకు పోయిందని గ్రహించండి,'' అన్నారు జమీందారుగారు కర్కశంగా.

కెప్టెన్ వెళ్ళిపోయాడు.

''ట్రెలానీ:'' అన్నారు డాక్టరుగారు. ''నీ మెదడు మీద నాకెలాంటి నమ్మకం లేదు కాని మెరికల్లాంటి వాళ్ళనిద్దర్ని సంపాదించావు. ఒకడు ఈ కెప్టెన్ రెండోవాడు లాంగ్ జాన్ సిల్వర్.''

''సిల్వర్‌కే మోయ్, ఫస్టుక్లాసయిన నావికుడు. ఈ కెప్టెన్ అంటే మొదట్నించి నాకు మంటగానే వుంది. పని తెలిసిన వాడని తీసుకున్నాగాని. నా కర్థంకాక అడుగుతాను, ఏమిటా పొగరుమోత్తనం? ఏమిటా తల బిరుసు? ఓడ యజమానితో అలాగేనా మాట్లాడ్డం?''

''సరే, చూద్దాంగా.''

మేము మళ్ళీ సరంబీ మీదికి వచ్చాం. అప్పటికప్పుడే కళాసీలు మందు గుండు సామగ్రిని ఓడ గదివద్దకు చేరేస్తున్నారు. కెప్టెన్, తండేలు దగ్గరుండి అజ్మాయిషీ చేస్తున్నారు.

ఈ కొత్త ఏర్పాటు నాకు నచ్చింది. ఓడ వెనక భాగంలో ఆరు అరలు ఏర్పాటు చేశారు. అవి కెప్టెన్, మిస్టర్ యారో, హంటర్, జాయిస్, డాక్టరు గారు, జమీందారుగారు ఉపయోగించుకునేందుకు ఉద్దేశించినవి. కాని తరవాత అది మార్చారు. కెప్టెన్, మిస్టర్ యారో ఓడ ముందు భాగంలో ఉండేందుకు ఒక చిన్న గదిలాగా ఏర్పాటు చేశారు; అందులో రెండు అరలు కట్టారు. వెనక భాగంలో ఖాళీ అయిన రెండు అరల్లో ఒకటి నాకు, ఒకటి రెడ్రూత్‌కు ఇచ్చారు.

కళాసీలు పనిలో నిమగ్నమై వున్నారు. నేను కూడా వాళ్ళకి సాయపడుతున్నాను. ఇంతలో మరిద్దరు ముగ్గురు కళాసీలతో కలిసి లాంగ్‌జాన్ వచ్చాడు.

అతడు రావడం మేమెవ్వరం చూడలేదు. కుంటుకుంటూ వచ్చి మా పక్కన నుంచున్నాడు. జరుగుతున్నదేమిటో గ్రహించగానే ఇలా అన్నారు.

''ఏయ్, ఏమిటీ ఇదంతా? ఎక్కడికి తీసుకెడుతున్నారు ఆ తుపాకులు, కత్తులూ?''

''కిందికి తీసుకెడుతున్నాం, ఓడ గది కింద జాగా వుందిగా?'' అన్నాడొకడు.

''అరె, ఎవడు చెప్పాడురా మీకు? ఇప్పుడు ఈ పనిపెట్టుకుని కూర్చుంటే ఎలా?''

''సిల్వర్! నేనే ఆజ్ఞాపించాను. నువ్వు కిందకు వెళ్ళు. వంట సిద్ధం చెయ్యి భోజనాలవేళ అవుతోంది.'' అన్నాడు కెప్టెన్.

''వెడుతున్నానండి సార్;'' అన్నాడు సిల్వర్. కాని వెళ్ళడానికిష్టం లేనట్టు అక్కడే ఒక నిమిషం నిలబడ్డాడు.

''సిల్వర్ చాలా మంచివాడండి. ఏమంటారు కెప్టెన్?'' అన్నారు డాక్టరు గారు మెల్లిగా.

''కావచ్చు?'' అన్నాడు కెప్టెన్ స్మాలెట్. ''ఏయ్ నెమ్మదిగా, భద్రం భద్రం,'' అని కళాసీలను హెచ్చరించాడు. ఇంతలో ఆయన నన్ను చూశాడు. నేను పరధ్యానంగా తెరచాప తాళ్ళు పట్టుకుని లాగుతున్నాను.

''ఏయ్ కుర్రాడా? అది వదిలెయ్, చేతులూరుకోవా? పో కిందకి పో. సిల్వర్‌కు ఏమన్నా కావాలంటే అందిస్తూండు.'' అని అధికార స్వరంతో ఆజ్ఞాపించాడు.

నేను శాల్యూట్ చేసి వెళ్ళిపోతుండగా, కెప్టెన్ డాక్టర్‌గారితో చెప్పాడు:

''నా ఓడ మీద ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అని ఉండటానికి ఒప్పుకోను. నాకందరూ సమానమే.''

కెప్టెన్ మీద ఎంత ద్వేషం పుట్టిందో చెప్పలేను. జమీందారుగారి అభిప్రాయంతో నేను పూర్తిగా ఏకీభవించాను: ఈ కెప్టెన్ నిజంగా పొగరు మోతువాడే.

9

ఆ రాత్రి మేము ప్రయాణానికి ఆఖరు ప్రయత్నాలన్నీ చేసుకున్నాము. జమీందారుగారి స్నేహితులు, బ్లాండ్లీ మొదలైనవారు వీడ్కోలు ఇవ్వడానికి చిన్న చిన్న బోట్లలో మా ఓడ దాకా వచ్చారు.

తెల్లవారుజామున నాలుగ్గంటలవేళ తండేలు బాకా ఊదాడు. వెంటనే కళాసీలు ఎవరి స్థానాల్లోకి వాళ్ళు వెళ్ళి పనిచేయ సాగారు. రాత్రి అంతా సామాన్లు సర్దడంలో విపరీతంగా అలిసి ఉన్నాను. అయినా సరంబీ మీద నుంచి కదల బుద్ధి కాలేదు. అంతా కొత్తగా, వింతగా ఉంది: తండేలు బాకా ఊదడం, లంగరు పైకి లాగడం, కెప్టెన్ ముక్తసరిగా ఆజ్ఞ లివ్వడం, కళాసీలు లాంతర్లు పట్టుకుని ఎవరి స్థానాలకు వాళ్ళు పరిగెత్తడం అంతా తమాషాగానే వుంది.

''సిల్వర్! పదం పాడాలి నువ్వు'' అన్నాడొకడు.

''మన పాతపాట'' అన్నాడింకొకడు.

సరంబీ పిట్టగోడలను ఆనుకుని నుంచున్న సిల్వర్-

''రాసుల కొద్దీ రత్నాలోయ్-''

అని గొంతెత్తాడు. కళాసీలు

''యో-హో-హో-బలె గుమ్మైన రమ్-''

అని పల్లవి అందుకున్నారు. వెంటనే లంగరు గొలుసులు పైకి లాగటం ప్రారంభమైంది. లంగరు పైకి రాగానే, తెరచాపలు ఒకదాని తరువాత ఒకటి పైకి లేవసాగాయి. నెమ్మదిగా ఓడ కదిలింది. ఒడ్డు క్రమంగా దూరం కాసాగింది. నేను ఒక గంటగావును కునుకుతీసి లేచేసరికి ఓడ సముద్రం మధ్యలో వుంది. కాంచన ద్వీపానికి ప్రయాణం ప్రారంభమైంది.

సముద్రయానాన్ని పూర్తిగా వర్ణించదలుచుకోలేదు నేను. అంతా సక్రమంగానే జరిగిపోయింది; పవనాలు అనుకూలంగానే వున్నాయి. ఓడ ఒడుదుడుకులు లేకుండా నడిచింది. కళాసీలు సమర్థులనిపించుకున్నారు:

కెప్టెన్ సమయానుకూలమైన తెలివితేటలు చూపించాడు. కాని కాంచనద్వీపం చేరేలోగా రెండు మూడు వింత సంఘటనలు జరిగాయి: అవి వివరించవలసిన అవసరం వుంది.

కెప్టెన్ ఊహించిన దానికంటే దరిద్రంగా తయారయ్యాడు మా తండేలు మిస్టర్ యారో. అతన్ని ఎవరూ లెక్కచేసేవారుకాదు. అంత చులకనైపోయాడు అతడు. అదలా ఉంచి రెండు మూడు రోజుల తర్వాత నిత్యమూ చింత నిప్పుల్లాంటి కళ్ళు, లోతుకుపోయిన దవడలు, తూలుడు, బూతులు, హఠాత్తుగా తెలివి తప్పిపోవడం మొదలైన లక్షణాలతో కనిపించసాగాడు మిస్టర్ యారో. ఒకసారి ఓడమీద పడి అటూ ఇటూ దొర్లేవాడు; ఒకసారి రోజంతా మాట్లాడకుండా మత్తుగా పడుకునేవాడు. మళ్ళీ రెండు మూడు రోజులపాటు తెలివిగా వుండి పని చక్కగా చేసేవాడు

మాకు విచిత్రం అనిపించిన విషయ మేమంటే అతనికి రమ్ ఎక్కడనుంచి వస్తోందా అని. ఎంత వెదికినా ఎక్కడా రమ్ సీసాలు కనిపించలేదు '' నీకెక్కడిది రమ్'' అని అతన్ని అడిగితే పిగలబడి నవ్వి అవతలకి పోయేవాడు; లేకపోతే ''నేను చచ్చినంత ఒట్టు. కటిక నీళ్ళు తప్ప ఇంకేం తాగలేదు'' అని అడ్డమైన ప్రమాణాలు చేసేవాడు.

చివరికి మే మనుకున్నంత పనీ జరిగింది. ఒకరోజు రాత్రి అంతర్ధానమై పోయి, మళ్ళీ కంటపడలేదు. తెగతాగి ఒళ్ళు తెలియక నీళ్ళలో దూకి వుంటాడని కెప్టెన్ అన్నాడు . కాని మా ఓడకు తండేలు లేకుండా ఎలా? కనుక జాబ్ ఆండర్సన్ అనే అనుభవజ్ఞుడైన కళాసీని తండేలుగా నియమించారు. అతనికి సహాయం చేసేందుకు మా సరంగు (చుక్కాని నడిపేవాడు) ఇజ్రాయెల్ హాండ్స్‌ను నియమించారు.

అందరికంటే విచిత్రమైన వ్యక్తి మా వంటవాడు లాంగ్‌జాన్ సిల్వర్. ఊతకర్రతో ఎప్పుడోగాని అతనికి పని వచ్చేదికాదు. సాధారణంగా దాన్ని మెడలో వేళ్ళాడేసుకుని తాళ్ళు పట్టుకుని, గోడలు పట్టుకుని నడిచేవాడు. ఎంత

పెనుగాలిలోనైనా సరే సరంబీ మీద అటూ ఇటూ పచార్లు చేసేవాడు.

అతన్ని గూర్చి మా సరంగు చెప్పాడు: ''సిల్వర్ సామాన్యమైన మనిషి కాదు. ఇప్పుడంటే ఇలా కుంటుతూ అదో మాదిరిగా ఉన్నాడు కాని ఇదివరకు రోజుల్లో అయితేనా? సింహాలతో అయినా పోట్లాడేంత పొగరుగా ఉండే వాడన్న మాట. మాలోకల్లా కాస్త డొక్కశుద్ధి ఉన్న వాడు వాడే. ఇప్పటికైనా తల్చుకుంటే పుస్తకంలో మాదిరిగా మాట్లాడగలడు. ఇంతెందుకూ? ఒకసారి నేను చూశాను- నలుగురు దున్నపోతుల్లాంటి మనుషుల్ని టపటప పడగొట్టేశాడు, చేతిలో కర్రకూడా లేకుండా.

కళాసీ లందరూ సిల్వర్ అంటే గడగడ లాడేవారు. కెప్టెన్ స్మాలెట్ క్కూడా అంత గౌరవమిచ్చేవారు కాదు. అతడు కూడా ఎవరి దగ్గర ఎలా ఉండాలో అలా ఉండేవాడు. అందరితోనూ మంచిగా ఉండేవాడు. ముఖ్యంగా నేనంటే ఎంతో ప్రేమ చూపేవాడు . వంట గదిలోకి పిలిచి ఏమన్నా తింటానికి పెట్టేవాడు.

''రావోయ్, హాకిన్స్! రా. కాసేపు కబుర్లు చెప్పుకుందాం. ఇదిగో మా కెప్టెన్ ఫ్లింట్‌ను చూశావా? సముద్రపు దొంగల నాయకుడు లేడూ? ఫ్లింట్ – అతని పేరే పెట్టాను, దీనికి'' అంటూ తన చిలకని బుజాల మీదికి ఎక్కించుకునేవాడు. ''కెప్టెన్ ఫ్లింట్! ఏమిటి విశేషాలు? తస్సదియ్యా. చూశావా హాకిన్స్, మన ప్రయాణం విజయవంతం అగుగాక, అని దీవిస్తోంది చిలక?''

చిలక ''పెసో, పెసో'' అని అతి వేగంగా అనేది. (పెసో అనేది స్పెయిన్ దేశపు నాణెం) చివరికి '' ఆగు'', అని సిల్వర్ గదమాయించేదాకా ఆగేది కాదు.

'' ఈ చిలక వయస్సు ఏ రెండు వందల ఏళ్ళో ఉంటుంది. చిలకలు చాలా ఏళ్ళు బతుకుతాయిలే. ఈ చిలక కెప్టెన్ ఇంగ్లండ్‌తో కొంతకాలం వుండేదట. మడగాస్కర్, మలబార్, సూరినాం, ప్రావిడెన్స్, పోర్టో బెలో – అబ్బ, ఎన్ని చోట్లు చూసిందో, ఎన్ని హత్యలు చూసిందో, ఎన్ని ఓడలు ధ్వంసమవుతుండగా చూసిందో చెప్పలేను. తస్సదియ్య, గోవా వైస్రాయిగారు దీన్ని కొందామని కూడా అనుకున్నారట. చూడు . దాని ముఖం చూస్తే ఎంత చిన్నదానిలా

ఉంటుందో కెప్టెన్! నీ కెన్నేళ్ళు?''

''తెరచాప లెత్తండి!'' అని అరిచేది చిలక.

''బలే చిలకలే, తస్సదియ్యా'' అని జేబులోంచి గుప్పిళ్ళతో పంచదారతీ
చిలకకి పెట్టేవాడు. చిలక ఆత్యాశ్చర్యకరంగా ఇష్టమొచ్చిన బూతులు తిడుతూ
పంచదార తినేది.

కెప్టెన్ స్మాలెట్‌కు, జమీందారుగారికి మధ్య సంబంధాలేమీ అభివృ
కాలేదు. కెప్టెన్ మీద ట్రెలానీగారికి పీకల దాకా వుంది.

తన కోపం దాచాలని కూడా ప్రయత్నించేవారు కాదాయన. మింగేస్తా
మన్నట్టు చూసేవారతని వంక. కెప్టెన్ తన పని తను చేసుకుపోయేవాడు
పలకరిస్తేనేగాని పలికేవాడుకాదు. అదైనా ముక్తసరిగా మాట్లాడేవాడు. గుచ్చి
గుచ్చి అడగ్గా అతడు ఒప్పుకున్నాడు. కళాసీలను గూర్చి మొదట్లో తాను
అపోహపడ్డానని, హిస్పానియోలా వంటి మంచి ఓడను తానెప్పుడూ చూ
లేదని, అయినా ఈ ప్రయాణం సక్రమంగా ముగిసే వరకు తనక నుమానమే
ననేవాడు.

ఈ మాట వినగానే జమీందారుగారు కళ్ళు నిప్పులు గక్కుతూ అవతలి
వెళ్ళిపోయేవారు. ''ఎప్పుడో మే మిద్దరం దెబ్బలాడుకునేదాకా వస్తుంది. ఆ,''
అనేవారు.

ఓడ మధ్య భాగంలో అందరికీ అందుబాటులో ఉండేటట్టు యాపిల్‌ప
పీపా ఒకటుంది. ఎవడిక్కావలసినన్ని వాడు తెచ్చుకుని తినేవాడు.

'' ఎందుకండీ ఆ పీపా అక్కడ, వట్టి దండగ కాకపోతే?'' అని ముఖ
చిట్లించుకుని అనేవాడు కెప్టెన్.

కాని ఆ యాపిల్ పీపాయే చివరికి మా ప్రాణాలు రక్షించింది. అదే కను
అక్కడ లేకపోతే మేము ఏమైపోయి వుండేవాళ్ళమో. అసలు జరిగింది ఇది

మేము కాంచన ద్వీపాన్ని సమీపిస్తున్నాం. రాత్రింబగళ్ళు తదేక దీక్షగా
టెలిస్కోపులు పెట్టుకుని చూసేవాళ్ళం. ఒడ్డు కనిపిస్తుందేమోనని. ఆ రోజు

రాత్రికో, ఆ మర్నాడు మధ్యాహ్నానికో ద్వీపం చేరుకోగలమని కెప్టెన్ అంచనా
వేశాడు. ఓడలోని దిక్సూచిని బట్టి మేము నైఋతి మూలకి దక్షిణంగా
పోతున్నాము. హిస్పానియోలా ఒడుదుడుకులు లేకుండా ఊగుతూ
తూగుతూ పోతున్నది. అందరం మహోత్సాహంగా ఉన్నాము . ఎందుకంటే
మా ప్రయాణం అంతం కావస్తున్నది.

సూర్యుడస్తమించాడు. కెరటాల మీద ఎర్రటి కాంతులు పొడుగ్గా పడ్డాయి.
నేను చేయవలసిన పనులన్నీ ముగించుకున్నాను. విశ్రమించే స్థలానికి వెడుతూ
మధ్యలో యాపిల్ పీపాను చూసి ఆగాను. ఒక యాపిల్ తిందామని
బుద్ధిపుట్టింది. చుట్టుపక్కల ఎవ్వరూ లేరు. ఒకళ్ళిద్దరు కళాసీలు పాడుతున్న
పల్లెపదాలు గాలి అలల మీద తేలివస్తూ నిశ్శబ్దాన్ని భంగం చేస్తున్నాయి.
పీపాలోనికి దూకాను . ఎంత తడిమినా ఒక్క యాపిల్ పండు కూడా
దొరకలేదు. అన్నీ అయిపోయాయి. ఒక్క నిమిషం అలా కూర్చున్నానో లేదో
ఓడ ఊపుకు, దూరంనించి అస్పష్టంగా వినిపించే పాట లయకూ ఏదో మత్తు
ఆవహించినట్టు అయి అలాగే ఒరిగి నిద్రపోయాను.

ఎంతసేపలా నిద్రపోయానో తెలియదు. ఎవరో బరువైన మనిషి వచ్చి పీపా
పక్కనున్న కుర్చీ పీటమీద కూర్చుని పీపాను ఆనుకోవడంతో నాకు మెలకువ
వచ్చింది. ఆ మనిషి బరువుకు పీపా కదిలిపోయింది. నేను వెంటనే లేచి బయటికి
రాబోయాను. ఇంతలో ఆ మనిషి మాట్లాడసాగాడు. అతడు లాంగ్‌జాన్
సిల్వర్. అరడజను మాటలు వినేసరికల్లా ఎలా వున్నవాణ్ణి అలాగే
పాతుకుపోయాను. గజగజ వణుకుతూ, ముచ్చెమటలు పోస్తుండగా, సిల్వర్
చెప్పే మాటలు వింటూ, కిక్కురుమనకుండా కూర్చున్నాను. ఆ అరడజను
మాటలు వినగానే నాకు తెలిసిపోయింది- ఓడ మీద గల నా స్నేహితులందరి
క్షేమం నా ఒక్కడిమీదే ఆధారపడి వున్నదని.

''ఉహూ. నేను కాదు'' అంటూ సిల్వర్ ప్రారంభించాడు. ''నేను సరంగు
గా ఉండేవాణ్ణి, ఫ్లింట్ మా అందరికీ కెప్టెన్ గా ఉండేవాడు. మా ఓడ పేరు

వా(ల్రస్. ఎలా ఉండేదనుకున్నావ్. తస్సదియ్య. ఈ హిస్పానియోలా దాని ముందు ఎందుకు పనికొస్తుంది?''

''కాని ఫ్లింట్ చాలా గొప్పవాడనుకుంటాను. ఆయన పేరు చెబితే రాజులే గడగడలాడేవారుట'' అన్నాడు రెండోవాడు. వాడి పేరు డిక్. కళాసీలందరిలోకీ చిన్నవాడు. ''నా చిన్నతనంలో డేవిస్ అని ఒక గొప్ప సముద్రపు దొంగ ఉండేవాడు. తస్సదియ్య. పచ్చి నెత్తురు తాగేవాడట. ఆయనతో పనిచేసే అదృష్టం నాకు కలగలేదు. మొదట కెప్టెన్ ఇంగ్లండు కింద, తరవాత కెప్టెన్ ఫ్లింట్ కింద. అదీ నా చరిత్ర. మొత్తం మూడువేల దాకా సంపాయించాను. అదంతా ఎక్కడుందా? ఎక్కడేమిటి? బ్యాంకుల్లో భద్రంగా దాచాను. కెప్టెన్ ఇంగ్లండు మనుషులిప్పుడేమయ్యారా? ఏమో నాకు తెలియదు. కెప్టెన్ ఫ్లింట్ మనుషులేమయ్యారు? దాదాపు అంతా ఇక్కడే వున్నారు. ప్యూ చచ్చిపోయాడు. వాడు నాకంటే ఎక్కువ సంపాయించాడు. కాని తస్సదియ్య. పార్లమెంటులో లార్డులాగా, ఏడాదికి పన్నెండు వందల చొప్పున తగలేసేవాడు. చివరి రోజుల్లో వాడి గతి ఏమయింది? అడుక్కుతిన్నాడు. దొంగతనం చేసేవాడు, పీకలు కోసేవాడు. అయినా మల మల మాడేవాడు.''

''పాపం,'' అని జాలిపడ్డాడు డిక్.

''పాపమేమిటి. వెధవకి. అదే నాకు వళ్ళు మంట. ఎవడు తగలెయ్యమన్నాడు డబ్బు? నా లాగా జాగర్తగా ఎందుకు దాచుకోగూడదు? నేనేం కడుపు మాడ్చుకోలేదే. శుభ్రంగా తిన్నాను. తాగాను, అనుభవించాను. కాని మితిమీరి ఎప్పుడూ ఖర్చుచెయ్యలేదు నేను. ఇక్కడ కొంత, అక్కడ కొంత అలా దాచాను. అంతా ఒకచోటదాస్తే ఎవరన్నా అనుమాన పడవచ్చు. నాకిప్పుడు యాభయ్యేళ్ళు. ఈ ప్రయాణం నుంచి తిరిగి వచ్చాక, ఇక నేను ఘరానాగా పెద్దమనిషిలా బతకదలుచుకున్నాను. కాలుమీద కాలేసుకుని, జరిగిపోయిన దాన్ని తలుచుకోకుండా నిశ్చింతగా బతక దలుచుకున్నాను. నేనెలా ప్రారంభించాను? నీలాగే నేనూ ఒకప్పుడు చిన్నకళాసినే.''

''నీ డబ్బంతా ఇంకా బ్యాంకుల్లోనే వుందా?''

''నేను పిచ్చివాణ్ణనా నీ ఉద్దేశం? చావు బతుకుల ప్రయాణం మీద బయలు దేరుతూ, బ్యాంకిలో ఉంచుతానా డబ్బు? అంతా తీసి, నా భార్యకిచ్చాను. నా హోటలు కూడా అమ్మేశాను. ఆమెను ఫలానా చోట ఎదురుచూస్తూ ఉండమని చెప్పి పంపాను.''

''సరే అసలు విషయం మాట్లాడదాం. ఓడమీద మనం నమ్మదగిన వాళ్ళెంతమందున్నారు?'' అని అడిగాడు డిక్.

''సామాన్యంగా దొంగల్లో దొంగలకి నమ్మకం ఉండదు. కాని సిల్వర్‌తో వ్యవహారం పాముతో చెలగాటం లాంటిది. నన్ను మోసం చేస్తున్నాడని తెలిస్తే అవతలివాణ్ణి ఇంకో లోకానికి సాగనంపేదాకా నేను నిద్రపోను. కొందరు ఇది వరకు ప్యూ అంటే గడగడలాడేవారు. కొందరు ఫ్లింట్ అంటే భయపడే వారు. కాని ఫ్లింట్, ప్యూ ఇద్దరికీ సిల్వర్‌ని చూస్తే సింహస్వప్నంగా ఉండేది, తస్సదియ్య. కాని డిక్! నీకు తెలుసుగా, నాతో మంచిగావుంటే నేనెంత మంచిగా ఉంటానో, నేను ఊరికే డాబులు కొట్టేవాణ్ణి కాన్ను. వ్యవహారం దగ్గిర మొహమాటం లేదు నాకు. నువ్వు నన్ను పూర్తిగా నమ్మితే, నేను నిన్ను పూర్తిగా నమ్ముతాను. అదీ నా పద్ధతి''

''సిల్వర్! నువ్వు నిప్పుల్లో దూకమన్నా దూకుతాను. నువ్వు ఏం చెయ్యమంటే అది చేస్తాను'' అన్నాడు డిక్.

''నాకు తెలుసు. నీ ముఖం చూడగానే నీ మంచితనం కనిపెట్టాను. నేను చెప్పినట్టు విను. నిన్ను పైకి తీసుకువస్తాను'' అన్నాడు సిల్వర్.

నాకు ఆ క్షణంలో సిల్వర్‌ను పొడిచెయ్యాలన్నంత కోపం వచ్చింది. నా దగ్గిర నన్ను పొగిడినట్టే, ఆ వెధవని కూడా పొగుడుతున్నాడు. అతడు ఎంత నీచుడో అప్పుడు తెలిసింది నాకు.

ఇంతలో మరి ఏడెనమండుగురు కళాసీలు వచ్చారక్కడికి. నేను కూర్చున్న ఆపిల్ పీపా చీకట్లో ఉండడం మూలాన బతికిపోయాను. వాళ్ళ కంటబడితే

బహుశా నన్ను అక్కడే గొంతు పిసికి ఉందురు. మృత్యువుకు బెత్తెడు ఎడంలో వున్నా, నా మనస్సంతా వాళ్ళ మాటల మీదనే ఉన్నది.

''డిక్ కూడా ఒప్పుకున్నాడు'' అన్నాడు సిల్వర్.

''డిక్ ఒప్పుకుంటాడని నా కిదివరకే తెలుసు. ఇప్పుడది కాదు, సిల్వర్! ఎంతకాలం నన్నిట్లా చేతులుకట్టి ఉంచుతావ్? కెప్టెన్ స్మాలెట్ ఇచ్చే ఆజ్ఞలు చూస్తుంటే నాకు వొంటి మీద తేళ్ళు, జెర్రులు పాకుతున్నట్టుంది. అసలిప్పటికే నన్ను చాలాసార్లు అవమానించాడు. వాణ్ని ఎప్పుడు కసితీరా తందామా అని తొందరగా వుంది. ఈ పళంగా వెళ్ళి వాళ్ళు తినే ఊరగాయలు, మంచి మంచి కూరలు, ద్రాక్ష సారా అన్నీ జుర్రుకోవాలనుంది. నువ్వు ''ఊ'' అను. నేను దూకుతాను'' అన్నాడు సరంగు ఇజ్రాయెల్ హాండ్స్.

''ఇజ్రాయెల్! నీకు ఇంత తలకాయ ఉందన్న మాటేగాని, అందులో ఉన్నదంతా మట్టే, నే చెప్పేది విను. నువ్వు మాట్లాడకుండా నీ పని చెయ్యి, నీకే దోస్తే అది తిను. అందరితోను మర్యాదగా, నమ్మకంగా మాట్లాడు. నేను చెప్పినప్పుడు నీ పిస్టల్ ఉపయోగించుకుందువు గాని,'' అన్నాడు సిల్వర్.

''అది సరే లేరా. నేనిప్పుడు నువ్వు చెప్పినట్టుచెయ్యనంటున్నానా? నేనే దల్లా, ఎప్పుడూ అని ?''

''ఎప్పుడేమిటి ఎప్పుడు? నాకు '' ఇదే సమయం'' అనిపించినప్పుడు. మతిపోయినట్టు మాట్లాడతావేమిటి; కెప్టెన్ స్మాలెట్ మంచి అనుభవమున్న నావికుడు. ఓడని మనకోసం శుభ్రంగా నడిపి పెడుతున్నాడు. ఇక ఆ జమీందారు, డాక్టరు ఉన్నారు; ఆ పటం వాళ్ళ దగ్గరే వుందో, మరెక్కడైనా వుందో. నే చెప్పేదేమిటంటే, ఆ పటం వాళ్ళ దగ్గరే ఉండనీ, వాళ్ళనే ఆ డబ్బు ఎక్కడుందో వెదకనీ. వాళ్ళనే తవ్వి తియ్యనీ, అది ఓడలో శుభ్రంగా చేర్చ డానికి కావలిస్తే మనం కూడా ఓ చెయ్యి అందిద్దాం. తస్సదియ్య. అప్పుడు చూస్కో మన తడాఖా. మీ క్కొంచెం ఓర్పు అనేది ఉంటే, తిరుగు ప్రయాణం సగం అయిందాకా ఊరుకుంటాను. ఆ తరువాత దేవుడు కాదు. దేవుడి బాబు

వచ్చినా సరే ఊరుకోను.''

''మనకి ఓడ నడపడం చేతకాదనా నీ భయం?'' అని అడిగాడు సరంగు ఇజ్రాయెల్.

''ఇదుగో, ఇజ్రాయెల్! నువ్వు సరంగువి. దారి చూపిస్తే చుక్కాని పట్టడం లో నిన్ను మించినవాడు లేడు. కాని దారి చూపించేదెవరూ అని నేనడిగేది. అంచేత నేను చెప్పినట్టు విను. సమయం వచ్చినపుడు నేను– పిస్టల్ పేలుస్తాను. ధన్ ధన్ మని ఒకళ్ళ తరవాత ఒకళ్ళని పేల్చేయడం, సముద్రంలోకి తోసె య్యడం.''

''పాపం చంపడం ఎందుకురా, సిల్వర్?'' అన్నాడొకడు.

''ఏంచెయ్యమంటావ్? తస్సదియ్యా. బయల్దేరాడోయ్ ఏసుక్రీస్తు. అక్కడ ఆ లంకలోనే వదిలేద్దామంటావా? ఫ్లింట్ గాని, బిల్లీ బోన్స్ గాని అయితే అలాగే చేసేవారు. కాని నేను పెద్దమనిషిని. నాకు దయా ధర్మం, నీతీ జాతీ ఉన్నాయి. అంచేత నన్నడిగితే వాళ్ళని చంపెయ్యమంటాను. వాళ్ళు లంకలో నుంచి ఎలాగో బయటపడితే మన పనేమవుతుంది? నేను గుర్రాల కోచ్‌లో దర్జాగా కూర్చుని పార్లమెంట్‌కు పోతూ వుండగా ఈ జమీందారు, ఈ డాక్టరు, మళ్ళీ నా కంట పడడం, నన్ను కోర్టుకు లాక్కెళ్ళడం, నా మెడకి ఉరితాడు చుట్టుకోవడం– ఈ గోలంతా నేను పడలేను. అంచేత ధన్‌ధన్ పేల్చడమే పద్ధతి.''

''సిల్వర్! నువ్వురా మొగాడివంటే'' అని ఒకడు ఎంతో మెచ్చుకుంటున్నట్టు అన్నాడు.

''చూద్దువుగానిగా, సమయం వచ్చినప్పుడు, తస్సదియ్య. నేనొక్కటే కోరుతున్నాను. ట్రెలానీగాణ్ణి నా కిచ్చెయ్యండి. వాణ్ణి చంపాలని ఎన్నాళ్ళనించో ముచ్చట పడుతున్నాను. ఇజ్రాయెల్! కెప్టెన్ స్మాలెట్‌ని కావలిస్తే నువ్వు తీసుకో ఏం? అరే అబ్బీ, డిక్! అదిగో ఆ పీపాలో యాపిల్ పండేమన్నా వుంటే ఒకటి పట్రా - నాలిక దురదగా వుంది.''

ఈ మాట వినేసరికి నాకు ఊహాతీతమైన భయం పుట్టింది. మనుషుల్లో

ఇంత క్రూరులుంటారని నేను ఎప్పుడూ ఊహించలేదు. సిల్వర్ '' యాపిల్ పండు తీసుకురా'' మ్మనగానే నాపని అయిపోయిందనుకున్నాను. డిక్ కూర్చున్న చోట నుంచి లేవడం వినిపించింది. కాని నా అదృష్టం బాగుండడం వల్ల ఇజ్రాయెల్ వాణ్ణి ఆపాడు.

''సిల్వర్! ఇప్పుడా చెత్తంతా ఎందుకు లెద్దూ? కాస్త రమ్ తెప్పించు. తాగుదాం.'' అన్నాడు ఇజ్రాయెల్.

''డిక్! ఇవిగో తాళం చెవులు, పోయి రమ్ తీసుకురా'' అన్నాడు సిల్వర్.

అప్పుడు నా కర్థమైంది, చచ్చిపోయిన తండేలుకు రమ్ ఎక్కణ్ణించి వచ్చేదో, బహుశా సిల్వరే మిస్టర్ యారోను వదిలించుకోవాలనే ఉద్దేశంతో అతనికి రమ్ అందించి వుంటాడు.

డిక్ అవతలికి వెళ్ళగానే ఇజ్రాయెల్ సిల్వర్‌నేదో మెల్లగా అడిగాడు. సిల్వర్ ఏదో సమాధానమిచ్చాడు. ఒకటి రెండుముక్కలు మాత్రం స్పష్టంగా విని పించాయి. '' ఉహు, ఇంకెవ్వరూ మనతో చేరరు'' అని సిల్వర్ అన్నాడు. దాన్ని బట్టి ఓడమీద కొందరైనా మేము నమ్మదగిన మనుషులున్నారని గ్రహించాను. డిక్ రమ్ పాత్రలు తీసుకుని తిరిగి రాగానే అంతా తాగారు.

ఇంతలో సరంబీ మీద నుంచి కేకలు వినిపించాయి. ''అహోయ్, ఒడ్డు అదిగో, ఒడ్డు'' అని ఎవడో అరుస్తున్నాడు. వెంటనే యాపిల్ పీపా వద్ద సమాజ మంతా చెల్లాచెదరైంది. దడదడ కాళ్ళు తొక్కుకుంటూ అంతా సరంబీ మీదకు పరుగెత్తారు. నేను ''అమ్మయ్య'' అని నిట్టూర్పు విడిచి పీపాలోనుంచి బయటికి దూకాను.

10

నేను ఓడ సరంబీ మీదికి వెళ్ళేసరికి కళాసీలు, నా మిత్రులు అందరూ సమావేశమై వున్నారు. సముద్రాన్ని ఆవరించిన పొగమంచు మెల్లిగా

విచ్చిపోతున్నది. చంద్రుడు నిర్మలంగా ప్రకాశిస్తున్నాడు. మాకు నైఋతి మూలగా రెండు చిన్న కొండలు, వాటి వెనక ఎత్తయిన మరొక కొండ కనిపించాయి.

ఇదంతా కలలోనుంచి చూస్తున్న వాడివలె చూశాను. సిల్వర్ కుట్రను చెవులారా విన్నప్పటి భయం ఇంకా నన్ను వీడలేదు. ఇంతలో కెప్టెన్ స్మాలెట్ కొత్త ఆజ్ఞలు జారీ చేశాడు. కళాసీలు హిస్పానియోలాను ద్వీపం తూర్పు దిక్కుకి మళ్ళించారు.

కెప్టెన్ అడిగాడు : ''మీలో ఎవరన్నా ఈ ద్వీపం ఇదివరకు చూశారా?''

''నేను చూశానండి'' అంటూ సిల్వర్ ముందుకు వచ్చాడు. ''ఒకసారి నేను పనిచేసిన ఓడ ఈ వైపుగా వచ్చింది.''

''రేవు ద్వీపానికి దక్షిణంగా, ఒక చిన్న లంక చాటున ఉందనుకుంటాను'' అన్నాడు కెప్టెన్.

''అవునండి సార్. దెయ్యాల దీవి అంటారండి దాన్ని . ఒకప్పుడిక్కడ సముద్రపు దొంగలు మాంచి జోరుగా ఉండేవారుటండి. మా ఓడలో ఒక కళాసీకి ఈ ద్వీపం సంగతి బాగా తెలుసు. అతనే నాకు చెప్పాడు. చూడండి, ఆ తట్టున కనబడుతోందే, కొండ? దాన్ని డమాన్ దిబ్బ అంటారండి. మనకి దగ్గర్లో కనిపిస్తున్న దాన్ని చిన్న డమాన్ దిబ్బ అంటారు. ఆ మధ్య ఉన్నది చూడండి – పెద్ద కొండ, దాన్ని టెలిస్కోపు కొండ అంటారండి. దానిమీద కెక్కితే టెలిస్కోపు లోంచి చూసినట్టు అంతా కనిపిస్తుందిటండి.''

''ఇదుగో చూడు, సిల్వర్! నా దగ్గరొక పటముంది. మనం ఆగవలసిన రేవు అదేనేమో చూడు,'' అన్నాడు కెప్టెన్.

సిల్వర్ గబగబ వచ్చి పటం అందుకున్నాడు. కాని ఒక్కసారి చూడగానే తెల్లమొహం వేశాడు. పటంలో అతనికి కావలసింది లేదు. ఆ పటం మాకు బిల్లీ బోన్స్ పెట్టెలో దొరికిన పటం కాదు. దాని నకలు. ఎర్రగుర్తులు, బిల్లీ బోన్స్, ఫ్లింట్‌ల పేర్లు తీసేసి జమీందారుగారు కెప్టెన్ ఉపయోగం కోసమని నకలుపటం

తయారు చేశారు. సిల్వర్ తెల్లమొహం వేసి, మరుక్షణంలో తన భావాల నన్నిటిని కమ్మకుని మామూలు మనిషి అయ్యాడు.

'' ఇదేనండి సార్. రేవు అని రాసి వుందే, ఇక్కడే మనం లంగరు దించాలి. చాలా బావుందండి సార్ ఈ పటం. ఎవరు తయారు చేశారో? సముద్రపు దొంగలు తయారుచేశారేమో అంటే, వాళ్ళ మొహం, వాళ్ళకా తెలివి తేటలు కూడానా?''

''సరే. నీ పని నువ్వు చూసుకో. మళ్ళీ కావలిస్తే పిలుస్తాను.'' అన్నాడు కెప్టెన్.

సిల్వర్ ధైర్యానికి నాకాశ్చర్యం వేసింది. నిర్భయంగా తనకు ఆ ద్వీపం తెలుసునని చెప్పాడు. అనుమానిస్తారేమోనని కూడా జంకలేదు. అతడు నన్ను సమీపించడం చూసి భయపడ్డాను. యాపిల్ పీపాలో కూర్చుని అతని కుట్రను నేను విన్నాననే సంగతి అతనికి తెలిసి ఉండదు. అయినప్పటికి అతని ధైర్యం, కుత్సితం, కళాసీలపై అతనికి గల పలుకుబడి, చూస్తుండగానే తలలు మార్చేయగల శక్తి చూసి అతనంటే నాకు అప్పుడు చెప్పలేనంత భయం పుట్టింది.

''ఆహా! ఎంత మంచి ద్వీపమనుకున్నావ్ హాకిన్స్? నీలాగా రెండు కాళ్ళూ వున్న కుర్రవాడు ఎగరడానికి, గెంతడానికి, ఆడుకోవడానికి బలేగా వుంటుంది. చెట్లెక్కవచ్చు. రేవులో ఈతకొట్టచ్చు, గొర్రెలను వేటాడచ్చు. కొండల మీదకి పాకచ్చు- మజాగా ఉంటుందిలే తస్సదియ్య, అదంతా తలచుకుంటే నేను కూడా చిన్న పిల్లడినై పోతున్నాను. ఈ కొయ్యకాలే లేకపోతేనా, నీతో పాటు నేనూ గంతులేసేవాణ్ణి. నువ్వు వెళ్ళేటప్పుడు నన్ను కూడా తీసుకుపో. ఏం?''

నన్ను బుజం మీద తట్టి కిందికి వెళ్ళిపోయాడు.

కెప్టెన్ స్మాలెట్, జమీందారుగారు, డాక్టరుగారు సరంబీ మీద ఒక మూల పిట్టగోడ ఆనుకుని మాట్లాడుతున్నారు. సిల్వరు కుట్రను వారికి ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా తెలియజెయ్యాలని నా ఆదుర్దా. కాని బహిరంగంగా చెప్పడం మంచిది కాదు. వాళ్ళ దగ్గరికి ఏం నెపం మీద వెడదామా

అని ఆలోచిస్తుండగా డాక్టరు లివ్‌సేగారే నన్ను దగ్గిరికి పిలిచారు. ఆయన తన పైప్‌ను కింద ఓడ గదిలో మరిచి పోయారట; పట్టుకురమ్మని చెబుదామనుకున్నారట. నేను ఆయన్ని సమీపించగానే, మెల్లిగా చెప్పాను: ''డాక్టరు గారూ! మీతో అర్జంటుగా మాట్లాడాలి. వాళ్ళిద్దర్నీ కూడా కింది గదిలోకి తీసుకు వెళ్ళండి. తరవాత ఏదో వంకమీద నన్ను పిలిపించండి. చాలా ఘోరవార్త చెప్పాల్సివుంది'' అన్నాను .

డాక్టరుగారు ఒక్క క్షణం కంగారు పడ్డారు. కాని మరుక్షణంలో మామూలై పోయారు .

''ఆ, అంతేనా. సరేలే నువ్వుపో ఇంక'' అన్నారాయన బిగ్గరగా. మిగతా వారిద్దరినీ కలుసుకుని ఆయన ఏదో మాట్లాడారు. వారిలో ఒక్కరూ ఉలిక్కి పడడం గాని, ''ఆ'' అని కంగారుపడడం గాని చేయలేదు. కాని డాక్టరుగారు నేను చెప్పింది వారితో చెప్పారని గ్రహించాను. వెంటనే కెప్టెన్ స్మాలెట్ తండేలు ఆండర్సన్‌ను పిలిచాడు. కళాసీల నందర్నీ సమావేశం చెయ్యమని ఆజ్ఞాపించాడు.

తండేలు విజిల్ వెయ్యగానే కళాసీలు సరంబీ మధ్య భాగానికి వచ్చి నిలబడ్డారు. కెప్టెన్ స్మాలెట్ వారితో ఇలా చెప్పాడు:

''జమీందారు ట్రెలానీగారు మీతో ఒక ముక్క చెప్పమన్నారు మన ప్రయాణం ముగిసింది. మనం చేరవలసిన ద్వీపం చేరుకున్నాం. ''కళాసీలందరూ బాగా పని చేశారా'' అని ట్రెలానీగారు నన్నడిగారు. ఒక్కడుకూడా నా ఆజ్ఞను నిర్లక్ష్యం చెయ్యలేదని, తమ విధులు సక్రమంగా నెరవేర్చారని ఆయనకు మనవి చేసుకున్నాను. అందుచేత మీ అందరి ఆయురారోగ్యాల కోసం ద్రాక్షసారా సేవించ వలసివుందని ఆయనన్నారు. అందుకని మేమిప్పుడు కింద గదిలోకి వెళ్ళబోతున్నాము. మీకు ద్రాక్షసారా మంచి ఖరీదైనది సప్లయి చేయిస్తాను. ట్రెలానీ గారి ఆయురారోగ్యాలు కోరుతూ మీరు కూడా తాగండి.''

సిల్వర్ ఈ ఉపన్యాసం వింటూ, విషపు నవ్వు నవ్వుతున్నాడు. ''జమీందారు ట్రెలానీగారికీ–'' అని అరిచాడు.

''జై'' అని ఓడ దద్దరిల్లేట్టు అరిచారంతా. ఆ అరుపు వింటే ఈ మనుషులేనా మమ్మల్ని చంపడానికి చూస్తున్నది అనిపించింది.

''కెప్టెన్ స్మాలెట్ గారికీ–'' అన్నాడు సిల్వర్.

''జై'' అని మళ్ళీ అరిచారు కళాసీలు.

కెప్టెన్, జమీందారుగారు, డాక్టరుగారు ఓడ గదిలోకి వెళ్ళిపోయారు. రెండు మూడు నిమిషాల తర్వాత ''జిమ్ హాకిన్స్ ని ఒకసారి పంపించవలసిం'' దని కబురు వచ్చింది.

ముగ్గురూ బల్లచుట్టూ కూర్చున్నారు. మధ్య శ్పానిష్ ద్రాక్షసారా సీసా ఉంది. పక్కన మూడు చిన్న గ్లాసుల్లో ద్రాక్షసారా ఉంది. డాక్టరు గారు పైప్ కాలుస్తూ గుప్పు గుప్పుమని వేగంగా పొగ వదులుతున్నారు. ఆందోళనగా ఉన్నప్పుడాయన అలాగే పొగ తాగుతారు. నన్ను చూడగానే జమీందారుగారు ''హాకిన్స్! ఏదో చెబుతా నన్నావుట, ఏమిటది?'' అన్నారు.

నేను యాపిల్ పీపాలో కూర్చుని విన్నదంతా పూసగుచ్చినట్టు వివరించాను. నా కథ పూర్తయ్యే దాకా శ్రోతలు కుర్చీలకు అంటిపెట్టుకుని కూర్చున్నారు.

నా కథ పూర్తయ్యాక గాని వాళ్ళు నన్ను కూర్చోమనలేదు. తరవాత ఒక గ్లాసులో ద్రాక్షసారా పోసి ఇచ్చారు. నా ఆరోగ్యాన్ని కోరుతూవాళ్ళు సారా తాగారు. జమీందారుగారి ముఖంలో మార్పు గమనించాను.

''కెప్టెన్ స్మాలెట్! మీరు నిజం చెప్పారు. నేను గాడిదనయ్యానని ఒప్పుకుంటున్నాను. ఇక మీరెలా చెబితే అలా నడుస్తాను'' అన్నారు జమీందారు గారు ముఖం తప్పిస్తూ.

''నాకంటే పెద్దగాడిద కాలేదులెండి మీరు. మొదట్లోనే తగిన జాగ్రత్తపడి ఉండవలసింది నేను. నా అనుమానం రైటో కాదో మొదటనే తెల్సుకోకపోవడం నా పొరబాటే.''

''కాని కెప్టెన్! ఈ సిల్వర్ మహా దేవాంతకుడు లాగా వున్నాడు. మనిషిని చూస్తే అంతకంటే మర్యాదస్థుడు లేనట్టుంటాడు. ఎంత కుట్రపన్నాడు?'' అన్నారు డాక్టరుగారు.

''సరే, ఈ మాటలకేంగాని అసలు సంగతి మాట్లాడదాం.'' అన్నాడు కెప్టెన్, ''ట్రెలానీగా రనుమతిస్తే రెండు మూడు విషయాలు చెబుతాను.''

''అనుమతి ఇవ్వవలసింది మీరు'' అన్నారు ట్రెలానీగారు ముఖం ఎత్తకుండా.

''మొదటిది. మనం వెనక్కి తిరగడానికి వీల్లేదు. ముందుకే పోవాలి. రెండు– మనకింకా వ్యవధి వుంది. అంటే గుప్తధనం తవ్వి ఎత్తేవరకూ వాళ్ళు మనకి ఏ హానీ తలపెట్టరు. మూడు– ఓడలో మనం నమ్మదగిన మనుషులింకా కొందరున్నారు. ఎప్పుడో ఒకప్పుడు కుట్రదారులకు, మనకూ బహిరంగ యుద్ధం తప్పదు కనుక నే చెప్పేదేమంటే, ఒక మంచిరోజు చూసి, వాళ్ళు అనుకోని సమయంలో హఠాత్తుగా మనమే ముందు దాడిచేద్దాం. ముందు దాడి చేసే అవకాశం వాళ్ళ కివ్వకూడదు. ట్రెలానీగారూ! మీసొంత నౌకర్లు ముగ్గురున్నారు. వాళ్ళని మనం విశ్వసించవచ్చునా?''

''ఆ. నన్ను నమ్మినంత గట్టిగా నమ్మవచ్చు.''

''సరే. వాళ్ళు ముగ్గురు. హాకిన్స్‌తో కలిపి మనం నలుగురం, మొత్తం ఏడుగురం, ఇంకెవరున్నారు మనవాళ్ళు?''

డాక్టరుగారందుకున్నారు: ''ట్రెలానీ సిల్వర్‌ను కలుసుకోక ముందు నలుగురైదుగుర్ని మాట్లాడాడుగా. వాళ్ళు బహుశా మంచివాళ్ళే కావచ్చును.''

''ఉహూ. కాదులే. ఇజ్రాయెల్ హాండ్స్‌ని నేనేగా మాట్లాడింది. వాడు కూడా ఆ ముఠాలో చేరిన వాడేగా, అంచేత వాళ్ళలో ఎవర్నీ నమ్మడానికి వీల్లేదు.''

''నేను చెప్పేది వినండి సార్. మనం తొందర పడకుండా ఎవరు నమ్మకస్థులో ఎవరు కాదో ముందు కనిపెట్టాలి'' అన్నాడు కెప్టెన్.

''మనకు జిమ్ ఉన్నాడుగా. అతని దగ్గర కళాసీలంతా చనువుగా ఉంటారు. జిమ్ కూడా తెలివైనవాడు. ఒక్క చూపుతో మనిషి తత్వం కనిపెట్ట గలడు.'' అని సిఫార్సుచేశారు డాక్టరుగారు.

''హాకిన్స్! నీ మీదే ఆశలు పెట్టుకున్నాం,'' అన్నారు జమీందారుగారు.

మా చర్చలు ముగిశాయి. కాని ఎంత చర్చించినా సమస్య తెగలేదు. మొత్తం ఓడమీదున్న వాళ్ళు ఇరవై యారుగురు. అందులో మా శత్రువులు పంధొమ్మిది. మేము ఏడుగురం. అందులో ఒకడు బాలుడు. కనుక యుద్ధం అంటూ వస్తే ఇటు ఆరుగురు, అటు పంధొమ్మిది మంది అన్నమాట.

11

మర్నాటి ఉదయం సరంబీ మీదికి వచ్చి చూశాను. కాంచన ద్వీపం రాత్రి చూసినట్టు లేదు; చాలా మారిపోయింది. బూడిదరంగు చెట్లు దట్టంగా పెరిగి వున్నాయి. మధ్య మధ్య ఎత్తయిన దేవదారు వృక్షాలు ఉన్నాయి. కొండ గుట్టలు చెట్ల కంటే ఎత్తుగా ఉండి బోడిగా కనిపించాయి. టెలిస్కోప్ కొండ మిగతా వాటికంటె నాలుగైదు వందల అడుగులు ఎత్తుగా వున్నది. కొండల ఆకారాలు తమాషాగా వున్నాయి. మొత్తానికి ద్వీప స్వరూపం చూస్తే ఏమిటో వికారం పుట్టింది.

హిస్పానియోలా దెయ్యాల దీవికి అసలు ద్వీపానికీ మధ్య వున్న రేవుకు అభిముఖంగా పోతోంది. ద్వీపానికి చెందిన రకరకాల పక్షులు మా ఓడపైగా ఎగురుతూ రొదచేస్తున్నాయి. కెరటాలు ఉవ్వెత్తుగా లేచి ఓడను ఉయ్యాల లూపుతున్నాయి. అక్కడి సముద్రమంతా మురికిగా నానా అసహ్యంగా వుంది. ముక్కులు బద్దలు కొట్టేటంత దుర్గంధం వస్తోంది. ఇదంతా చూస్తే నాకు కాంచనద్వీపం మీద ఇంతవరకూ వున్న మోజు పోయి రోత పుట్టుకొచ్చింది.

ఇక ఓడమీద పరిస్థితులేమన్నా బాగున్నాయేమో అంటే, అవీ అంత అధ్వాన్నంగానూ ఉన్నాయి. రేవు దగ్గిరి కొస్తున్న కొద్దీ కళాసీల్లో తిరుగుబాటు చిహ్నాలు ఎక్కువ కాసాగాయి. జాబ్ అండర్సన్ అందరికంటే ఎక్కువగా పొగరు మోతుతనం ప్రదర్శిస్తున్నాడు. నాకు వినిపించేట్టు రెండు మూడు సార్లు ''ఇంకెంత సేపులే మీ పని,'' అని బూతులతో సహా గొణిగాడు. మిగతావాళ్ళు కూడా కెప్టెన్ వంక, నా ఇతర మిత్రులవంక కొరకొర విషపు చూపులు చూస్తున్నారు. ఒక్క సిల్వర్ మాత్రం మామూలు మర్యాద ధోరణిలోనే ప్రవర్తిస్తున్నాడు. కెప్టెన్ ఏదన్నా ఆజ్ఞాపిస్తే ఇది వరకుకంటే ఎక్కువ వినయంతో నెరవేరుస్తున్నాడు. మిగతా కళాసుల దగ్గిరికి వెళ్ళి ఏదో గుసగుసలాడుతున్నాడు. ''తొందర పడకండి,'' అని హెచ్చరిస్తున్నట్టు నాకు తోచింది.

ఓడ ద్వీపపటంలో సూచించబడిన రేవును చేరింది. ఓడకు ఒకవైపు దెయ్యాలదీవి, మరొకవైపు కాంచనద్వీపం అరమైలు దూరాల్లో వున్నాయి. లంగర్లు పెద్ద శబ్దాలు చేస్తూ నీటిలో మునగగానే ఒడ్డుపైనున్న చెట్లమీద పక్షులు గోలగా ఒక్కసారి పైకెగిరి మా ఓడను ముసిరాయి. మళ్ళీ కాస్సేపటికి ఎక్కడివక్కడ సర్దుకున్నాయి.

ఓడ ఆగగానే కళాసీల తిరుగుబాటు లక్షణాలు ఇంకా ఎక్కువ అయ్యాయి. అందరూ ఒకచోట చేరి గుసగుస లాడడం, మాలో ఎవరమన్నా సమీపిస్తే మాట లాపివెయ్యడం సాగించారు. కెప్టెన్ ఎంత చిన్న పని చెప్పినా, నిర్లక్ష్యంగా గొణుగుతూ చెయ్యడం, లేకపోతే అసలు చెయ్యకపోవడం మొదలెట్టారు.

చివరికి మేము మళ్ళీ ఓడగదిలో సమావేశ మయ్యాము. కెప్టెన్ చెప్పాడు;

''సార్! నేనింకొక్క ఆజ్ఞ ఇచ్చానూ అంటే తిరుగుబాటు తప్పదు. వాళ్ళ కేదన్నా పని చెబుదామా అంటే ప్రమాదం సంభవించేట్టుంది. చెప్పకుండా ఊరుకుంటే, మనం రహస్యం కనిపెట్టినట్టు అనుమానిస్తారు. మనం ఈ పరిస్థితుల్లో ఒకణ్ణే నమ్మడానికి వీలుంది.''

''ఎవరతడు?'' అన్నారు ట్రెలానీగారు.

''సిల్వరే. తన అనుచరుల ఆవేశాన్ని అణచడానికి శాయశక్తులా తంటాలు పడుతున్నాడు. అతడు సాధ్యమైనంత వరకు తొందరపడడు. అందర్నీ ఒకచోట చేర్చి నచ్చచెప్పడానికి చూస్తున్నట్టున్నాడు. కనుక వాళ్ళకు మనం అవకాశం ఇవ్వాలి. ఒకపని చేస్తాను. ఈ పగలంతా మీరు ద్వీపం లోకి పోయి విశ్రాంతి తీసుకోవచ్చునని చెప్తాను. ఈ అవకాశం వాళ్ల జారవిడవరు. అందరూ కట్ట గట్టుకొని పోతారు. అప్పుడు మనం వాళ్ళని మళ్ళీ ఓడ మీదకి రానివ్వకుండా పోరాడాల్సి వస్తుంది. ఎవరూ పోరనుకోండి, అప్పుడు మనం ఈ ఓడగది భాగంలోనే నిలిచి యుద్ధం చెయ్యాలి. కొందరు వెళ్ళి కొందరిక్కడ దిగబడ తారనుకోండి. అప్పుడు మనకేం ప్రమాదం రాదని, ఇంకా టైము ఉందని అనుకోవాలి.''

ఆ విధంగా ఒక నిశ్చయానికి వచ్చి, ఒక ప్లాను తయారు చేసుకున్నాం. తూటాలు నింపిన పిస్తళ్ళు నమ్మకస్థులందరికీ పంచాము. ట్రెలానీ గారి ఇంటి నౌకర్లు హంటర్, రెడ్రూత్, జాయిస్‌లకు కుట్ర సంగతి చెప్పాము. వాళ్ళు మేమనుకున్నంత ఆశ్చర్యపడలేదు. వాళ్ళకి కళాసీల ప్రవర్తన మొదటినుంచి అనుమానాస్పదంగానే వుందిట.'' ఒక్కొక్క ముండాకొడుకును నల్లిని నలిపినట్టు నలిపిపారేస్తా'' అని హంటర్ అన్నాడు.

తరవాత కెప్టెన్ స్మాలెట్ సరంబీ మీదికి వెళ్ళాడు. కళాసీ లందరిని పిలి చాడు. ''మిత్రులారా! అందరం అలసిపోయాము. చాలా రోజులు సముద్ర ప్రయాణం చేశాక కాసేపు నేలమీద విహరించాలని సహజంగానే మీకు కోరిక ఉంటుంది. బోట్లను నీళ్ళలో వెయ్యండి. వెళ్ళదలుచుకున్న వాళ్ళందరూ వెళ్ళవచ్చు. సూర్యాస్తమయానికి అరగంటముందు తుపాకీ పేలుస్తాను. అప్పుడు మీరు వచ్చెయ్యవచ్చు.''

ఈ మాట వినగానే కళాసీలు సంతోషం ఆపుకోలేక గంతులు వేశారు. నేలమీదకి పోగానే గుప్తధనం ఇట్టే వెదికి పట్టుకోవచ్చునని అనుకున్నారల్లే వుంది.

''కెప్టెన్ స్మాలెట్‌కు జై'' అని మళ్ళీ కేక వేశారు. ఆ కేక దూరపు కొండల్లో ప్రతిధ్వనించింది; మళ్ళీ పక్షులు గోలగా లేచి ముసిరాయి.

కెప్టెన్ తెలివిగా అవతలకు వెళ్ళిపోయాడు. సిల్వర్ తన పార్టీలో ఎవరెవరు రావాలో, ఎవరు ఓడమీద ఉండాలో ఏర్పాటు చేశాడు. ఆరుగురు ఓడలోనే ఆగిపోయారు. సిల్వర్‌తో కలిపి మిగతా పదముగ్గురూ బోట్లలో బయల్దేరారు.

అప్పుడు నా బుర్రలోకి ఒక ఆలోచన ప్రవేశించింది. అది వట్టి తెలివి తక్కువ ఆలోచనే కావచ్చును. కాని, నేనలా చెయ్యకపోతే మా ప్రాణాలు నిష్కారణంగా కాంచన ద్వీపానికి బలి అయి వుండేవి.

ఓడమీద ఉండి ప్రస్తుతం నేను చెయ్యగలిగిందేమీ లేదు. అందుచేత తీరానికి పోయి ఏవో సాహస కృత్యాలు చెయ్యాలని, గుప్తధనం ఉన్నచోటు నా మిత్రులకంటే ముందు కనిపెట్టి వాళ్ళను ఆశ్చర్య పరచాలని ఒక ఊహ తట్టింది. ఇక వెనకా ముందు ఆలోచించకుండా అయిదారుగురు కళాసీలున్న ఒక బోటులోకి దూకేశాను. వెంటనే బోటు ప్రయాణం మొదలెట్టింది. ఇంకా రెండు మూడు బోట్లలో కళాసీలున్నారు. వారి బోట్లకంటే తేలికైనది కావడంవల్ల నేనున్న బోటు , చురుకుగా, త్వరగా పోతూంది. నేను బోటులో వున్నట్టు ఎవరూ కనిపెట్టలేదు. చుక్కాని పట్టుకున్న కళాసీ ఒకడు మాత్రం ''జిమ్! నువ్వేనా అక్కడుంది? కదలకుండా కూర్చో'' అన్నాడు . దూరాన బోటులో ఉన్న సిల్వర్ కళ్ళు చిట్లించుకుని నాకేసి చూస్తూ నేను అవునో కాదో అని పరిశీ లిస్తున్నాడు. మా బోటు ఒడ్డు తగిలీ తగలగానే దగ్గిరగా ఉన్న ఒక చెట్టుకొమ్మ అందుకుని ఒక్క ఊపుతో ఒడ్డుమీద పడ్డాను. సిల్వర్ బోటు ఇంకా వందగజాల దూరంలో ఉంది.

''జిమ్! జిమ్! ఆగు'' అని సిల్వర్ గద్దిస్తూ కేకలు వేస్తున్నాడు. నేను వినిపించు కోకుండా ముక్కుకు సూటిగా పరుగు పుచ్చుకున్నాను. కాలిలో సత్తువ ఉన్నంతవరకూ పరిగెత్తాను. ఇక పరిగెత్తలేక ఆగి నలుదిక్కులా పరికించాను.

12

సిల్వర్‌ను తప్పించుకుని రాగలిగినందుకు గర్వపడుతూ ఒక చెట్టు కింద ఆగి నలుప్రక్కలా పరీక్షగా చూశాను. సముద్ర తీరంనుంచి కొంత దూరందాకా అంతా బురదనేల. బురదలో పెరిగే చెట్లు, పొదలు అన్నీ దాటి వచ్చాను. నేను నుంచున్న చోట పొడి ఇసుక వున్నది. ఆ ప్రదేశంలో ఉన్నతమైన దేవదారు వృక్షాలు, సిందూర వృక్షాలు గుబురుగా పెరిగి ఉన్నాయి.

ద్వీపమంతా పరిశోధించాలనే కుతూహలం కలిగింది . అంతా నిర్జనంగా ఉన్నట్టు తోచింది. నోరులేని జంతువులు, పక్షులు మాత్రమే కనిపిస్తున్నాయి. మళ్ళీ కొంత దూరం నడిచాను. ఏవో పువ్వుల మొక్కలు కనిపించాయి. అవేమి పువ్వులో తెలియలేదు. వాటి సందులనుంచి పాకుతూ కొన్ని చిన్న చిన్న పాములుకూడా కనిపించాయి. ఒక పాము తల ఎత్తి నా వంక చూసి బుస్సు మంది- ఈ కొత్త వా డిక్కడికెందు కొచ్చాడన్నట్టు. అది అపాయకరమైన పామని నాకప్పుడు తెలియలేదు. తరవాత తెలిసింది అది కట్లపామని.

చెట్ల వెనుకగా కనిపిస్తున్న టెలిస్కోప్ కొండ వంక చూస్తూ నుంచున్నాను. ఇంతలో నా వెనక చెట్లమీది పక్షులన్నీ గోలచేస్తూ ఒక్కసారిగా ఎగిరాయి. కళాసీలు ఒడ్డు చేరుకుని ద్వీపంలోకి వస్తున్నారని గ్రహించాను. కొంత సేపటికి మాటలు కూడా వినిపించసాగాయి. మాటలు క్రమంగా దగ్గరగా, దగ్గరగా వినిపిస్తున్నాయి.

నాకు భయం వేసింది. శత్రువులకు కనిపించకుండా దగ్గర్లో వున్న ఒక లావాటి చెట్టు చాటున నక్కి కూర్చున్నాను. మాటలు బాగా సమీపంలో విని పిస్తున్నాయి. ఒక కంఠం సిల్వర్ దని గుర్తుపట్టాను. తీవ్రంగా, క్రోధంతో మాట్లాడు తున్నాడు. రెండో కంఠం నెమ్మదిగా, కొద్దిగా భయపడుతున్న ట్టుంది. చివరికి వాళ్ళొకచోట కూర్చున్నట్టున్నారు. ఎందుకంటే వాళ్ళ మాటలు కాస్సేపు ఆగిపోయాయి. పక్షులు కూడా చెట్లమీద తిరిగి సర్దుకున్నాయి.

అందుచేత నేను ధైర్యం చేసి మెల్లిగా పాకుతూ వారిని సమీపించి ఇంకొక చెట్టు చాటున నక్కాను. అక్కడినించి సిల్వర్, అతని అనుచరుడు శుభ్రంగా కనిపిస్తున్నారు. నేను మాత్రం వారికి కనిపించకుండా జాగ్రత్త పడ్డాను.

సిల్వర్ టోపీ తీసి కిందపడేశాడు. అనుచరుణ్ణి చూస్తూ ఇలా గన్నాడు.

''టామ్! నువ్వంటే నాకు మొదట్నుంచీ ఇష్టం. నీ మంచికోసమే నేను చెప్పేది. నీ తల కాపాడాలనే నేను తంటాలు పడుతున్నాను. నువ్వు ఒప్పుకోకపోతే వాళ్ళని ఊరుకోబెట్టడం కష్టం. అసలు నిన్ను ఒప్పిస్తానని చెబుతూ ఇంతవరకూ వాళ్ళని ఆపుతూ వచ్చాను. చెప్పు, ఆఖరిసారిగా అడుగుతున్నాను. మాలో కలుస్తావా, లేదా?''

రెండోవాడన్నాడు: ''సిల్వర్! నీవు అందరిలోకి పెద్దవాడివి. గౌరవంగా బతికినవాడివి. నీవద్ద కావలసినంత డబ్బు- మా అందరి దగ్గర ఉన్న దానికంటె ఇరవై రెట్లు ఉంది. నీ ధైర్యంలో పదోవంతు కూడా మాలో ఎవరికీ లేదు. నువ్వు కూడా ఆ వెధవల్లో చేరి ఇంత నీచానికి ఒడి గడతావా? తప్పు కాదట్రా?''

ఇంతలో దూరాన పక్షులన్నీ మళ్ళీ ఒక్కసారిగా ఎగిరాయి. ఒక పెద్దకేక. తరువాత చచ్చిపోతున్న మనిషి ఎవరో దారుణమైన బాధతో మూలుగుతున్నట్టు వినిపించింది.

ఈ శబ్దాలకు టామ్ భయంతో కంపిస్తూ ఒక్క ఉదుటున లేచాడు. సిల్వర్ కూడా ఒక్క ఊపుతో లేచాడు. చంకలో ఊతకర్ర పెట్టుకుని కప్ప పైకి దూకడానికి సిద్ధంగా ఉన్న తాచుపాములాగ కనిపించాడు.

''సిల్వర్!'' అని అరిచాడు టామ్.

''చేతులెత్తుపైకి'' అని భయంకరంగా గర్జించాడు సిల్వర్. ఆ గర్జనకు టామ్ కంటె నేనే ఎక్కువగా వణికిపోయాను.

''చేతులెత్తుతాను . కాని, నన్ను చంపడం వల్ల నీకేమి లాభం సిల్వర్? నేను అమాయకుణ్ణని నీకు తెలియదా? నేనేమి మాట్లాడను. మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి మీరు. నేను మాత్రం మీలో కలవను. ఇప్పుడు ఎవరు అరిచింది? చెప్పు సిల్వర్!''

టామ్‌ను ఒక్క క్షణం కూడా విడవకుండా గమనిస్తున్న సిల్వర్ సమాధానం చెప్పాడు: ''వాడా? ఎలాన్ అనుకుంటాను.''

''ఎలాన్ గాడా? వాణ్ణి చంపేశారా? అంత మంచివాణ్ణి చంపేశారా?'' అని ఏడుపు గొంతుకతో అన్నాడు టామ్. ''సిల్వర్! నువ్వూ, నేను ఇరవై ఏళ్ళనుంచీ స్నేహితులుగా ఉన్నాం. ఇక నీకూ నాకూ సరి . నన్ను చంపాలను కుంటే చంపెయ్. కాని నేను మాత్రం అంత పాపానికి ఒడిగట్టను. ''

ఇలా అంటూ టామ్ వెనక్కి తిరిగి, ధైర్యంగా సముద్రపుటొడ్డుకు అడుగులు వేయసాగాడు. అయిదారు అడుగులు వేశాడోలేదో సిల్వర్ బెల్టు లోంచి అతి వేగంగా పిస్టల్ తీసి టామ్‌కేసి గురి పెట్టి పేల్చాడు. ''ఆ-'' అంటూ టామ్ కుప్ప కూలినట్టు కూలిపోయాడు. సిల్వర్ మరుక్షణంలో మెరుపు మెరిసినట్టు మెరిసి ఊత కర్రను వదిలేసి టామ్ మీదికి దూకాడు. బొడ్డు లోనుంచి బాకుతీసి టామ్‌ను కసితీరా పోట్లు పొడిచాడు.

తరవాత ఏమి జరిగిందో నాకు తెలియదు. ఈ ఘోర దృశ్యం చూసి స్పృహతప్పి ఒరిగి పోయాను. మళ్ళీ లేచేసరికి సిల్వర్ ఇంకా అక్కడే వున్నాడు. ఎదురుగా టామ్ శవం నెత్తురు వరదల్లో తేలుతోంది. సిల్వర్ తన బాకుపై నెత్తురు తుడుచుకుంటున్నాడు. తక్కిన ప్రకృతి అంతా ఎప్పటి లాగే వున్నది. చల్లటిగాలి వీస్తోంది. చెట్ల ఆకులు రొదచేస్తున్నాయి. ఆ ప్రశాంత ప్రకృతిలో అక్కడ ఒక మనిషి హత్య జరిగిందనేందుకు ఎదురుగా శవం తప్ప మరే నిదర్శనం లేదు.

తరవాత సిల్వర్ జేబులోంచి విజిల్ తీసి చాలాసార్లు, రకరకాలుగా ఊదాడు. ఎందుకు ఊదాడో తెలియలేదు. కాని మళ్ళీ నన్ను భయం ఆవే శించింది. బహుశా దూరానున్న సిల్వర్ మిత్రులు అందరూ బిల బిలమంటూ అక్కడికి రావచ్చు. నన్ను చూశారంటే ఏం జరుగుతుంది? ఏం జరుగుతుందో నా కళ్ళారా చూడనే చూశాను. వాళ్ల కుట్రలో కలవనందుకు ఇద్దరు కళాసీలు- ఎలాన్, టామ్, ఇద్దరు - దారుణంగా వధించ బడ్డారు. నన్ను మాత్రం చంపరని

నమ్మకమేమిటి?

మళ్ళీ వచ్చిన దారినే పాకిపోయాను. ఎక్కడా శబ్దం కాకుండా, సాధ్యమై నంత వేగంగా నేను మొదట్లో ఆగిన చెట్టు వరకు పాకాను. తరవాత లేచి కాలికొద్దీ పరిగెత్తాను. ఎటుపోతున్నదీ కూడా గమనించకుండా పరిగెత్తాను.

మళ్ళీ వెనక్కి వెళ్ళడం అసంభవం. కెప్టెన్ స్మాలెట్ సూర్యాస్తమయానికి ముందు తుపాకీ పేలుస్తా నన్నాడు. కాని నేను హిస్పానియోలాను చేరు కోవడమెలా? బోట్లు శత్రువుల స్వాధీనంలో ఉన్నాయి. అసలు నేను ఓడను విడిచి వీళ్ళతో ఎందుకు రావాలి? వచ్చినందుకు తగినశాస్తి జరిగింది. ఇక ఓడలోకి వెళ్ళగలగడం కలలోమాట . గుడ్‌బై హిస్పానియోలా! గుడ్‌బై డాక్టర్ లివ్‌సే: మిత్రులందరికి గుడ్‌బై: ఇక నేను ఈ నిర్జన ద్వీపంలోనే శాశ్వతంగా సంచరించాలేమో.

ఇలా ఆలోచిస్తూ ఇంతసేపూ పరిగెత్తుతూనే వున్నాను. ముందు విశాలమైన మైదానం వున్నది. దేవదారుచెట్లు, సిందూరపుచెట్లు వెనకాలంత దట్టంగా లేవు. కాని బాగా ఎత్తుగా వున్నాయి. గాలి కూడా సముద్రపు తీరాన వున్నట్టుకాక నిర్మలంగా, హాయిగా వున్నది.

కాని మళ్ళీ కొత్త అపాయం ఎదురుపడింది. మళ్ళీ కాళ్ళకు సంకెళ్ళు పడినట్టు ఆగవలసి వచ్చింది.

13

వందగజాల దూరంలో ఒక చిన్న కొండ వున్నది. హఠాత్తుగా దాని శిఖరంనుంచి రాళ్ళు, రప్పలు దొర్లడం ప్రారంభించాయి. ఆ శబ్దానికి అప్రయత్నంగా అటువైపు దృష్టిసారించాను. కొంతసేపటికి ఒక ఆకారం శిఖరం మీద కనబడింది. అతివేగంగా ఎగురుతూ గెంతుతూ కిందకివస్తోంది. అది

ఎలుగుబంటో, కొండముచ్చో, మరే ఇతర జంతువో తెలియలేదు. ఆకారం మటుకు అతి వికృతంగా ఉన్నది. దాన్ని చూసీ చూడగానే భయంతో ఒళ్ళు బిగుసుకుపోయినట్టయి ఆగిపోయాను.

వెనక్కి పోవడానికి గాని, ముందుకు పోవడానికిగాని కాళ్లాడలేదు. వెనకవేపు తెలిసిన శత్రువు-ముందువేపు తెలియని శత్రువు-వెనకగొయ్యి ముందు నుయ్యిగా తయారైంది నా పని. కాని చివరికి తెగించాను. తెలియని ఈ వింత జంతువు నెదుర్కోవడం కంటే సిల్వర్ దగ్గరికి పోవడమే మంచిదని పించింది . వెంటనే వెనక్కి తిరిగి పరిగెత్తసాగాను. ఇరవై గజాలు పరిగెత్తానో లేదో, ఆ వింత జంతువు ఏ దారిన వచ్చిందో ఏమోగాని నా ఎదురుగా మళ్ళీ కనబడింది. కాని ఈ సారి స్పష్టంగా తెలిసింది. అది జంతువు కాదని, మనిషేనని. మనిషని తెలిసినంత మాత్రాన నా భయం తగ్గలేదు. ఇలాంటి దూరద్వీపాల్లో మనుషుల్ని తలబద్దలు గొట్టి పీక్కుతినేవాళ్ళుంటారని విని వుండడంచేత ఇక ఎల్లాగూ చావు తప్పదని గుండె రాయిచేసుకుని నుంచు న్నాను.

అడవి మనిషి నేనాగడంతోనే తనూ ఆగాడు. సందేహిస్తూ రెండడుగులు వేశాడు. మళ్ళీ ఆగాడు. మళ్ళీ కదిలి మళ్ళీ ఆగాడు. నాకు ఆశ్చర్యం వేసింది. నాలాంటి చిన్న కుర్రవాడిని చూసి ఈ అడవి మనిషి ఎందుకిలా జంకు తున్నాడని. చివరికి అతడు రెండు చేతులూ పైకెత్తి మోకరించాడు.

నేను అతన్ని సమీపించాను. '' ఎవరు నువ్వు?'' అని అడిగాను.

''బెన్ గన్'' అన్నాడు. అతని కంఠం తుప్పుపట్టిన గొలుసులు గరగర మన్నట్టు, కఠోరంగా, అసహ్యంగా వినిపించింది. ''బెన్‌గన్ అంటారు సార్ నన్ను. నేను బెన్‌గన్ నండి. నేను...''మాటల కోసం తడుముకుంటున్నట్టు నాలుక స్వాధీనంలో లేనట్టు అనిపించింది. ''నా పేరు బెన్‌గన్ అండి. మూడేళ్ళనుంచి మనుషుల్తో మాట్లాళ్లేదండి.''

ఎండకు కమిలిపోయి వున్నా అతని శరీరవర్ణం తెల్లగానే వుంది. ఇంగ్లీషు

వాడేనని గ్రహించాను. పెదవులు మాత్రం నల్లగా మాడిపోయి ఉన్నాయి. జుట్టు, గడ్డం, మీసాలు తెల్లగా పండిపోయాయి. తెరచాప గుడ్డలే కట్టుకున్నాడు. అవైనా తెగమాసి, చిరిగి వున్నాయి.

''మూడేళ్ళా?'' అని ఆశ్చర్యపోయాను. '' ఇక్కడి కెలావచ్చావ్? ఏదన్నా ఓడమునిగి ఇక్కడికి చేరుకున్నావా?''

''లేదండి. ఇక్కడ వదిలేశారండి నన్ను.''

నేనిటువంటివి ఇదివరకు విన్నాను. ముఖ్యంగా సముద్రపు దొంగల్లో ఎవడన్నా ఎదురుతిరిగితే వాణ్ణి నిర్జనద్వీపంలో వదిలేస్తారు. వాడు కొంత కాలం పాటైనా చావకుండా కాస్త ఆహారం, తుపాకి, మందుగుండు సామగ్రి కూడా ఇస్తారు. ఇది వాళ్ళ ఆచారం.

''మూడేళ్ళ కిందనండి, నన్నిక్కడ వదిలేశారు. అప్పట్నుంచీ సార్, గొర్రెలు, పత్తులు, రొయ్యలు, ఆకులలములు తింటున్నానంటే నమ్మండి, మనుషులు తినే తిండికోసం మొహం వాచిపోయానండి. మీ దగ్గరేమన్నా జున్నుగడ్డగాని, కేక్‌గాని వుందాండి, మీ కాళ్ళు పట్టుకుంటానండి సార్. కాస్త పెట్టండి.''

''నాదగ్గిరేమీ లేదుగాని మా ఓడమీదికి మళ్ళీ ఎప్పటికైనా వెళ్ళడమంటూ జరిగితే నీకు తప్పకుండా బోలెడు పెడతాను'' అన్నాను నేను.

''ఏమండి సార్! ఎందుకు వెళ్ళలేరండి?'' అని అడిగాడు.

''దానికి అంతా కథ వుందిలే.''

''మీ పేరేంటండి?''

''జిమ్ హాకిన్స్.''

''హాకిన్స్‌గారూ! మీరు నమ్ముతారో నమ్మరోగాని, ఈ మూడేళ్ళు నేనెన్ని కష్టాలు పడ్డానో చెప్పలేనండి. మృగంలా బతికానండి. నాకొక మంచి అమ్మ వుందంటే నమ్ముతారా అండి మీరు?''

''ఎందుకు నమ్మను?'' అన్నాను మా అమ్మను తలచుకుంటూ.

''మా అమ్మ చాలా మంచిదండి. ఎప్పుడూ దేవుణ్ణి ప్రార్థిస్తూ వుంటుం

దండి. ఆవిడమాటలు వినకుండా నేను సముద్రపు దొంగల్లో చేరానండి. ఇప్పుడు బుద్ధి వచ్చిందండి. ఇంకెప్పుడూ పాడు పనులు చెయ్యనండి. మంచిగా ఉంటానండి,'' అని ఆగి అన్నివేపులా సందేహిస్తూ చూశాడు తరవాత మెల్లిగా చెవిలో చెప్పాడు. ''నాదగ్గిర చాలా డబ్బు ఉందండి.''

మూడేళ్ళు ఏకాంత ప్రవాసం అనుభవించినందువల్ల ఈ మనిషికి మతిపోయిం దనుకున్నాను. అలా అనుకుంటున్నట్టు అతడు గ్రహించాడల్లే వుంది. కొంచెం గట్టిగా, కోపంగా ఆ మాటలే మళ్ళీ అన్నాడు.

''నా దగ్గిర బోలెడు డబ్బుంది, ఏమనుకుంటున్నారో? నేను మొదట్లో మిమ్మల్ని చూశాను. కావలిస్తే ఆ డబ్బంతా మీకే ఇచ్చేస్తాను.''

అంతలో అతని ముఖంమీద సందేహరేఖలు తోచాయి. నావంక తీవ్రంగా చూశాడు. నా చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు. సముద్రతీరంకేసి చూపిస్తూ.

''ఆ ఓడ ఎవరిది? ఫ్లింట్‌దేనా?'' అని అడిగాడు.

ఆ, ఫరవా లేదనుకున్నాను. ఇతడుఫ్లింట్ శత్రువై ఉంటాడనీ, అందువల్ల నాకు మిత్రుడనీ అనుకున్నాను.

'' కాదు. కెప్టెన్ ఫ్లింట్ చచ్చిపోయాడు. కాని అతని మనుషులు చాలామంది ఓడలో మాతో వచ్చారు. వాళ్ళు మా మీద కుట్రపన్నారు.'' అని చెప్పాను.

''వాళ్ళలో కుంటివాడున్నాడా?''

''సిల్వరేనా?'' అన్నాను.

''అవును, లాంగ్ జాన్ సిల్వర్!''

'' ఉన్నాడు. వాణ్ణి వంటవాడుగా పెట్టుకున్నాము. వాడెదురు తిరిగి మిగతా వాళ్ళతో కలిసి మ మ్మల్ని చంపడానికి చూస్తున్నాడు.''

''ఈ ద్వీపం ఏమిటనుకుంటున్నారు మీరు?'' అని అడిగాడు.

మేము ఎలావచ్చిందీ, ఎందుకు వచ్చిందీ అంతా చెప్పాను. శ్రద్ధగా, కుతూహలంతో విన్నాడు. విన్నాక నా తల నిమురుతూ ఇలాగన్నాడు.

''హాకిన్స్‌గారూ: మీరు బెన్‌గన్‌ని నమ్మండి. బెన్‌గన్ మీకు ఏ సహాయం

కావాలన్నా చేసిపెడతాడు. ఈ ద్వీపంలో నాకు తెలియనిచోటు లేదు. అయితే మీ జమీందారుగారు నన్ను నమ్ముతారా మరి?''

''ఆయన చాలా మంచివాడు'' అని చెప్పాను.

బెన్‌గన్ కొంచెంసేపు ఆలోచించాడు.

''మీతో ఒక రహస్యం చెబుతాను. మీరు ఏ పని మీద వచ్చారో ఆ పని నేనిదివరకే పూర్తిచేశాను. ఆ, అంతా, కాస్తకూడా మిగల్చకుండా చేసేశాను.''

''నిజంగా'' అని ఆశ్చర్యపోతూ అడిగాను.

''నిజంగా. నేను చచ్చినంత ఒట్టు.''

''ఎక్కడుంది అదంతా?''

''ఎ క్కడుంటేనేం? ఎక్కడో ఒక మూలగా దాచాను హాకిన్సు గారూ! మీరు నాకు మాటివ్వాలి. జమీందారుగారికి నా సంగతంతా చెప్పి ఒప్పించాలి. నాకేమీ అక్కర్లేదు. వెయ్యి పౌన్లు యిస్తే చాలు. ఒప్పుకుంటారా?''

''తప్పకుండా ఒప్పుకుంటారు. అసలు అందరం కలసి పంచుకోవాలనే మా ప్లాను.''

''మరి ఇంకోటుంది. నన్ను మీ ఓడలో మళ్ళీ ఇంగ్లండు తీసుకు వెడతారా?''

''తప్పకుండా. అసలు మాకు వెళ్ళేటప్పుడు కళాసీలు ఎలాగూ తక్కువౌతారు గనక నువ్వువుంటే మాకు చాలా తోడుగా వుంటుంది.''

బెన్‌గన్ ముఖం సంతోషంతో చేటంత అయింది. మనిషి స్తిమిత పడ్డాడు.

'' ఇహ చెబుతాను వినండి. నేను కెప్టెన్ ఫ్లింట్ ఓడలో కళాసీని. అతను తను దోచిన డబ్బంతా ఈ ద్వీపంలో పాతిపెట్టాడు. అప్పుడు నేను, సిల్వర్, బిల్లీ బోన్సూ ఓడలో వున్నాం. ఆ ఓడపేరు మీరు విన్నారుగా, వాల్రస్ అంటారు. ఫ్లింట్ ఇంకో ఆరుగుర్ని వెంటపెట్టుకుని వెళ్ళి డబ్బుపెట్టెలు ఎక్కడో పాతిపెట్టాడు. పాతిపెట్టి, వచ్చేటప్పుడు, ఒక్కడే వచ్చాడు. మిగతా ఆరుగురూ ఏమయ్యారని మేమడగలేదు. వాళ్ళందర్నీ చంపేసి ఉంటాడని మాకు తెలుసు.

ఆ. అతడొక్కడే ఆరుగుర్నీ చంపేసి వుంటాడు. అతని స్వభావం మాకు తెలుసు. కాని ''డబ్బెక్కడ పాతి పెట్టా'' వని అడిగాం. ''కావలిస్తే మీరు పోయి వెతుక్కోండి. నేను మాత్రం మీకోసం ఆగను'' అన్నాడు ఫ్లింట్. మేం నోరు మూసుకున్నాం.

మూడేళ్ళ కిందట నేను ఇంకో ఓడలో పనిచేస్తున్నాను. ఆ ఓడలో స్నేహితుల్ని ఒప్పించి ఈ ద్వీపానికి తీసుకొచ్చాను. వాళ్ళు, నేనూ కలిసి పన్నెండు రోజులపాటు లంకంతా వెతికాం. డబ్బెక్కడుందో కనిపించలేదు. వాళ్ళు తమని నేను మోసగించా ననుకున్నారు. నాకు ఒక తుపాకి, ఒక పార, గునపం యిచ్చి ''బెన్‌జమిన్ గన్! నువ్వు నీ ఇష్టం వచ్చినంతకాలం ఇక్కడే హాయిగా ఉండు. డబ్బు దొరికితే నువ్వే తీసుకో'' అని చెప్పి వదిలేశారు. హాకిన్స్‌గారూ! అప్పట్నించీ ఇక్కడే మృగాల్లో మృగం లాగా వుంటున్నాను. మిమ్మల్ని చూడగానే నాకు ప్రాణంలేచి వచ్చింది.'' అని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

''బాబూ! మీ జమీందారుగారితో చెప్పండి. 'బెన్‌గన్' చాలా మంచివాడు. మూడేళ్ళు ఎండలో, వానలో, చలిలో, వెలుగులో, చీకటిలో బతికాడు. ఎప్పుడూ దేవుణ్ణి ప్రార్థన చేసుకుంటూ ఉన్నాడు. కాని చాలా కష్టపడి చివరికి ఫ్లింట్ రహస్యాన్ని కనిపెట్టాడట, అని చెప్పండి. ఏమిటా రహస్యమని ఆయనడిగితే ఇదిగో ఇలా కన్ను గీటండి. ఏం, తెలిసిందాండి.''

''సరే. చెబుతాను. కాని నేను ఓడలోకి వెళ్ళడమెలా? రావడమంటే సిల్వర్ వాళ్ళబోట్లలో వచ్చాను. కాని ఈసారి నన్ను చూడగానే వాళ్ళు చంపేస్తారు,'' అన్నాను దిగులుగా.

''నేనున్నాను గదండి నేనిన్నాళ్ళూ ఏం చేస్తున్నా ననుకున్నారు? ఓ మంచిబోటు తయారు చేశాను ఆ ముక్కా ఈ ముక్కా చేర్చి. ఓడరేవుకు తూర్పుగా తెల్లగుట్ట అని ఉందే, అక్కడ చెట్ల చాటున దాచాను దాన్ని. కావలిస్తే చీకటి పడ్డాక వీలవుతుందేమో చూద్దాం...... ఏమిటది?'' అని అదిరిపడ్డాడు బెన్‌గన్ నేను కూడా అదిరిపడ్డాను.

ఎందుకంటే మా ఓడ దిశ నుంచి ధామ్మని ఫిరంగి మోత వినిపించింది. సూర్యాస్తమయానికి ఇంకా రెండుగంటలు టైముంది. కనుక ఆ ఫిరంగి కెప్టెన్ స్మాలెట్ పేల్చినదై ఉండదు. కనుక ఏదో గొడవ ప్రారంభమై ఉండాలి.

''యుద్ధం మొదలు పెట్టారల్లే ఉంది,'' అన్నాను కంగారుగా. వెంటనే రేవుకేసి పరుగెత్తసాగాను. నా పక్కన బెన్‌గన్ అతి తేలిగ్గా లేడివలె చెంగుచెంగున ఎగురుతూ వస్తున్నాడు.

''ఈ పక్కగా రండి. ఇటు, ఇటు. ఎడమవేపు చెట్లకిందగా పరిగెత్తండి. చూడండి. ఇక్కడే నేను మొట్టమొదటి గొర్రెను చంపాను. ఇక్కడికి అప్పుడప్పుడు వచ్చి దేవుణ్ణి ప్రార్థిస్తూ ఉంటాను......'' ఇలా మాట్లాడుతూ అతడు నాతోపాటు పరిగెత్తుతూ వస్తున్నాడు.

ఫిరంగి మోత వినబడిన చాలాసేపటికి ధాంధామ్మని తుపాకులు పేలిన చప్పుళ్ళు క్రమంగా ఎక్కువయ్యాయి. యుద్ధం జోరుగా జరుగుతోందన్న మాట. ఇంకా కొంతదూరం పరిగెత్తాము. హఠాత్తుగా ఒక పావుమైలు దూరంలో ఎదురుగా ''యూనియన్ జాక్'' జెండా కనిపించింది. చెట్లపైగా అస్తమయ సూర్యుడి ఎర్రటికాంతిలో ఇంకా ఎర్రగా మెరిసిపోతూ కనబడింది.

14

డాక్టర్ లివ్‌సే చెప్పిన కథ

సిల్వర్ మొదలైనవారి బోట్లు రెండూ తీరానికి వెళ్ళాక, నేను, కెప్టెన్, జమీందారు ఓడగదిలో కూర్చుని మా కార్యక్రమాల్ని గూర్చి చర్చించుకొంటున్నాము. గాలిపాటు ఏ మాత్రం అనుకూలంగా వున్నా, ఓడలో మిగిలిన ఆరుగురు తిరుగుబాటుదార్ల పైనబడి వారిని ఖైదు చెయ్యడమో ఏదోచేసి, లంగరులెత్తి వెనక్కి బయలుదేరి పోయేవాళ్ళం. కాని గాలి పాటు ప్రయాణానికి

అనుకూలంగా లేదు. అదీగాక జిమ్‌హాకిన్స్ ని ఇంక చూడడం అసంభవమని భావించాము. సరంబీ మీదికి వచ్చి చూశాము. గాలి దుర్గంధ భూయిష్ఠంగా ఉన్నది. కుట్రదారులు ఆరుగురూ ఒకమూల సణుగు తూ, మాకేసి విషపు చూపులు చూస్తూ కూర్చున్నారు.

ఊరికే చూస్తూ కూర్చోవడం మాక్కూడా దుర్భరంగా ఉంది. చివరికి హంటర్, నేనూ కలిసి ఒడ్డుకు వెళ్ళి సంగతి సందర్భాలు తెలుసుకు రావాలని నిశ్చయించాము. వెంటనే మరొక బోటులో -పటంలో ''మట్టికోట'' అని గుర్తు పెట్టబడిన ప్రదేశానికి సూటిగా బయల్దేరాము.

ఒడ్డు చేరగానే హంటర్‌ను బోటు కాపాడడానికి వదిలి నేను లోపలికి నడిచాను. చెట్లు, తీగలు అల్లిబిల్లిగా పెరిగివున్నాయి. రెండు చేతుల్లో రెండు పిస్టళ్ళు రెడీగా పట్టుకున్నాను. వందగజాలు నడిచానో లేదో ''మట్టికోట'' కనబడింది. అది మట్టిగోడలతో కట్టబడివున్నా, గోడలలోపల బలమైన దుంగ లున్నందున ఇల్లు దృఢంగానే వుంది. ఇంటివెనక ఒక మాదిరి ఎత్తయిన దిబ్బవున్నది. దిబ్బపై నుంచి నీటిబుగ్గ ఒకటి దిగువకు ప్రవహించివస్తోంది. ఆ నీరు నిర్మలంగా, త్రాగడానికి బాగానే ఉండేటట్టుంది. ఇంటికి, నీటిబుగ్గకు చుట్టూ కొంత ఖాళీ స్థలం, దాని చుట్టూ ఆరడుగుల ఎత్తుగల ఒక కంచె ఉన్నాయి. కంచె కవతల మళ్ళీ ఖాళీ స్థలం ఉంది. మట్టికోట నెవరైనా ముట్టడిస్తే లోపలివాళ్ళు కాలుమీద కాలు వేసుకుని యుద్ధం చెయ్యవచ్చు. ఎందుకంటే గోడలకు అన్ని వేపులా పెద్ద రంధ్రాలున్నాయి. గోడచాటున నిలబడి, రంధ్రంలో తుపాకులుంచి, ముట్టడిదారులను కాకుల్ని కొట్టినట్టు కొట్టవచ్చు. బయటవాళ్ళు ఖాళీ స్థలంలో నుంచునే యుద్ధం చెయ్యవలసి వస్తుంది కనుక వాళ్ళకి రక్షణ ఉండనే ఉండదు. ఇంటిలోపల నలభై, యాభయిమంది చులాగ్గా పడతారని అంచనా కట్టాను.

కాని అన్నిటికంటే నాకు నచ్చింది నీటిబుగ్గ. తగినంత ఆహారపు నిల్వలు ఉంటే ఇక్కడ ఎంతకాలమైనా గడపవచ్చు ననిపించింది. ఓడలో మాకు అన్ని సదుపాయాలూ ఉన్నాయిగాని మంచినీళ్ళు లేవు. ఇక్కడ పుష్కలమైన

జలసౌకర్యం ఉన్నది.

ఇలా ఊహాగానం చేస్తుండగా, నా ఆలోచనలను చెదరగొడుతూ పిస్టల్ పేలినధ్వని, ''అమ్మో'' అని చనిపోతున్న వాడెవడో వేసిన కేక వినిపించాయి. అదిరిపడ్డాను. జిమ్ హాకిన్స్ ఎగిరిపోయి ఉం వాడని భయపడ్డాను.

ఇంక ఇక్కడ తారట్లాడడం మంచిదికాదని గబగబ బోటు దగ్గరకు వచ్చేశాను. హంటర్ అతి వేగంగా తెడ్లు వేశాడు. హిస్పానియోలా లోనికి ఎక్కి ఎక్కగానే జమీందారు నన్ను కావిలించుకున్నాడు. ఇందాకటి ఫిస్టల్ ధ్వని విని నన్నో, హంటర్‌నో పేల్చేసి ఉంటారని అతడు భయపడ్డాడట.

కెప్టెన్ స్మాలెట్ చెప్పాడు: ''అక్కడ కూర్చున్న ఆరుగురిలో ఆఖరివాణ్ణి చూశారా? వాడు పిస్టల్ మోత వినగానే మూర్ఛపోయాడు. వాడికి హత్యలు కొత్తగావును. బహుశా వాడు మంచివాడు కావచ్చును. మనవేపు తిరిగితే తిరగవచ్చునుకూడా. ప్రయత్నించి చూద్దాం.''

నేను ద్వీపంలో చూసినదంతా చెప్పాను. మేము ఏం చెయ్యాలో నిశ్చయించుకున్నాము.

ఓడ గది ముందు కాపలాగా రెడ్రూత్‌ను నిలబెట్టాము. అతనికి తూటాలు నింపిన నాలుగు చిరుతుపాకు లిచ్చాము. హంటర్ బోటును ఓడ వెనుక భాగాన నిలిపి ఉంచాడు. నేనూ, జోయిస్‌కలిసి బోటులో సామాన్లు నింప నారంభించాము. తుపాకి మందు డబ్బాలు, తుపాకులు, బిస్కట్ల సంచులు, మాంసపు టిన్నులు, ద్రాక్షసారా సీసాలు, అన్నిటికంటే ప్రధానమైనది నా మందులపెట్టె బోటులో చేర్చాము.

మేము ఈ పని చేస్తుండగా ఈలోగా జమీందారు, కెప్టెన్ సరంబీ మీదికి వెళ్ళి కుట్రదారులను బెదిరించారు. కెప్టెన్ సరంగు ఇజ్రాయెల్ హాండ్స్ ను పిలిచి ఇలాగన్నాడు: ''మిస్టర్ హాండ్స్: మేమిద్దరం ఇక్కడ ఉన్నాం. మా ఇద్దరివద్దా చెరి రెండేసి పిస్టళ్ళున్నాయి. మీలో ఎవరన్నా ఒడ్డున ఉన్న మీ స్నేహితులకు ఏవిధమైన సంజ్ఞగాని చేసినట్టయితే వాడిపని ఆ క్షణంలోనే ఆఖరు.

తెలిసిందా?''

బెదిరింపుకు వాళ్ళు భయపడడమే కాకుండా, తెల్లబోయారు. ఎందుకంటే వాళ్ళ కుట్ర సంగతి మాకింకా తెలియదనే ఉద్దేశపడుతున్నారు. కెప్టెన్ మాటలువిని వారి ఆశ్చర్యానికి మేరలేదు. వెంటనే వాళ్ళు సరంబీ మెట్లు దిగి కింది భాగానికి వెళ్ళారు. బహుశా వెనకనుంచి వచ్చి మా మీద పడదామని వాళ్ళ అభిప్రాయం కావచ్చు. కాని ఓడ గదిముందు నడవలో తుపాకీలతో రెడీగా ఉన్న రెడ్రూత్‌ను చూసి హడిలిపోయి మళ్ళీ సరంబీ మీదికి వచ్చారు. వచ్చి మళ్ళీ మొదటిచోటే కూర్చున్నారు.

ఈ లోగా మా బోటును సామాన్లతో పూర్తిగా నింపాము. హంటర్, జోయిస్, నేనూ బోటు నడుపుకుని ఒడ్డుచేరాము. ఆ సామానంతా మట్టి కోటలో చేర్చాము. జోయిస్‌ను అక్కడ కాపలాపెట్టి హంటర్ నేనూ తిరిగి ఓడలోకి వచ్చి మళ్ళీ ఇదివరకులాగే బోటులో సామాను నింపాము. అదంతా మట్టికోటలోకి చేర్చి, హంటర్‌ను కూడా జోయిస్‌కు తోడుగా వుంచి నేనొక్కణ్ణే బోటులో తిరిగి హిస్పానియోలా వద్దకు వచ్చాను.

మూడోసారి కూడా బోటును నింపనారంభించాము. ఈసారి తుపాకి మందు, బిస్కట్ల సంచులు మాత్రమే నింపాము. ఇదే ఒడ్డుకి ఆఖరి ప్రయాణం. కనుక బోటులో ఈమాటు నేనూ, కెప్టెన్, జమీందారు, రెడ్రూత్ నలుగురం ఎక్కాలి. నలుగురం ఎక్కగా బోటు ఎంత బరువును భరించగలదో అంతమాత్రమే సామాను చేర్చాము. కాని చూస్తూ చూస్తూ ఓడలో అంత మందు గుండు సామగ్రిని వదిలివేయ బుద్ధి కాలేదు. అందుచేత కొంచెం ఎక్కువ సామగ్రిని బోటులో నింపామనుకుంటాను. మేము నలుగురం తలొక చిరుతుపాకిని, కత్తిని ధరించాము. మిగతా ఆయుధాలను, మందుసామగ్రిని సముద్రంలో పారబోశాము. రెడ్రూత్ ఓడ గదిని విడిచిపెట్టి బోటులోకి వచ్చాడు. నేను, జమీందారు కూడా బోటులో కూర్చున్నాము. కెప్టెన్ మాత్రం ఇంకా సరంబీ మీదనే నిలబడ్డాడు.

''ఏయ్ కళాసీలూ! వినిపిస్తోందా నా మాట?'' అన్నాడు కెప్టెన్. సమాధానం లేదు.

''నీకే చెప్పేది. అబ్రహాం గ్రే! నీతోనే మాట్లాడుతోంది.''

''ఇంకా సమాధానంలేదు. కెప్టెన్ గొంతు హెచ్చించాడు: ''గ్రే! నేను ఓడ వదిలి వెడుతున్నాను. నీ అధికారితో పాటు రావలసిందని ఆజ్ఞాపిస్తున్నాను. నీ మనస్సు మంచిదని, పొరపాటున వాళ్ళ కుట్రలో అడుగుపెట్టావని నాకు తెలుసు. నా చేతిలో గడియారం వుంది. ముప్పయ్ సెకండ్లు టైమిస్తున్నాను నువ్వు మాతో రావడానికి.''

కాస్సేపు నిశ్శబ్దం.

''వచ్చెయ్, వచ్చెయ్. త్వరగా రావాలి. ఇంకా పది సెకండ్లు మాత్రమే ఉంది టైము. ఒక్కొక్క సెకండు గడుస్తున్నకొద్దీ నా ప్రాణానికి, ఈ పెద్దమనుషుల ప్రాణాలకి అపాయం ఎక్కువౌతోం దన్న మాట. వస్తున్నావా?''

హఠాత్తుగా తెరచాటున పెద్ద చప్పుడైంది. దెబ్బలు వినిపించాయి. అబ్రహాం గ్రే ఒక్క దూకులో కెప్టెన్ స్మాలెట్ వద్దకు వచ్చాడు.

అతని ఎడమ దవడ మీద కత్తి గంటునుంచి రక్తం కారుతోంది.

''వచ్చానండి సార్. నేను మీతోనే ఉంటానండి.''

మరుక్షణంలో అతడూ, కెప్టెన్ బోటులోకి దూకారు. వెంటనే బోటు కదిలింది. పిస్టల్ ధ్వని వినిపించినప్పుడు మూర్ఛపోయినవాడే అబ్రహాం గ్రే.

15

ఈ ఆఖరి ప్రయాణం మాకు అపాయకరంగానే పరిణమించింది. బోటులో అయిదుగురం వున్నాం. అందులో ముగ్గురు- జమీందారు, కెప్టెన్ స్మాలెట్, రెడ్రూత్‌లు- ఆరడుగులపైగా పొడుగున్న మనుషులు. అదికాక తుపాకిమందు,

బిస్కట్ల సంచులు. దీంతో బోటు ఏ క్షణానైనా మునిగిపోవచ్చుననిపిస్తోంది. అంచులు నీటి మట్టానికి దాదాపు సమానంగా ఉన్నాయి. పెద్దతరంగం వచ్చి నప్పుడల్లా లోపలికి నీళ్ళు వస్తున్నాయి. ఆ నీళ్ళను వెంటనే తోడివేస్తున్నాము కాబట్టి సరిపోయింది. లేకపోతే మునిగి పోయేవాళ్ళమే. గట్టిగా ఊపిరి పీల్చ టానికి కూడా మాకు భయంగా ఉంది.

అదల్లా ఉంచి, సముద్రపు పోటు మమ్మల్ని ఒడ్డుకు చేరనివ్వడం లేదు. ఎంత బలంగా తెడ్లువేసినా బోటు కదలడంలేదు. కదిలితే పడమటికో, నైఋతికో కదులుతోందిగాని మేము చేరవలసిన దిశగా మాత్రం కదలటంలేదు. ఈ లెక్కన మేము పడమటివైపున సిల్వర్ వాళ్ళ బోట్లు నిలిచిన రేవుకు చేరేటట్టున్నాము.

నా బలం యావత్తు ఉపయోగించి చుక్కాని పట్టుకున్నాను. ''కెప్టెన్! చుక్కాని నిలవడంలేదు. ఇంకొంచెం బలంగా తెడ్లు వెయ్యగలరా?'' అని అడిగాను. కెప్టెన్, రెడ్రూత్ తెడ్లు వేస్తున్నారు. కెప్టెన్ అన్నాడు: ''తెడ్డు ఇంక ఏ మాత్రం గట్టిగా ఊపినా పడవ తల్లకిందులౌతుంది. ఇంకొంచెంసేపు చుక్కానితో తంటాలు పడండి.''

అంతవరకూ నేను మట్టికోట దిశగా చుక్కాని పట్టుకున్నాను. అందుచేత మా పడవని కెరటాలు పడమటగా ఉన్న సిల్వర్ బోట్లకేసి తోసివేస్తున్నాయి. అది చూసి కెప్టెన్ తూర్పుగా తిప్పమన్నాడు చుక్కాని. వెంటనే బోటు తూర్పుగా ప్రయాణం సాగించింది.

''ఇట్లా అయితే మనం ఒడ్డు ఎంతసేపటికీ చేరు కోలేమనుకుంటానండి,'' అన్నాను నేను.

''ఫరవాలేదు, ఎక్కడో ఒకచోట ఒడ్డును సమీపించగలం. సిల్వర్ గాడి బోట్ల దగ్గరికి పోకుండా ఉంటే చాలు. ఒకవేళ మనం మట్టి కోటకి దూరంగా చేరినా, ఒడ్డు వెంబడే పడవ నడిపి తేలికగా అసలు చోటుకు వెళ్ళగలం,'' అని ఉపాయం చెప్పాడు కెప్టెన్.

''కెరటాలు తగ్గుతున్నాయి సార్! అప్పుడే,'' అన్నాడు అబ్రహాం గ్రే.

''మంచిది,'' అన్నాడు కెప్టెన్ తల ఊపుతూ. గ్రేను మాలోవాడి గానే పరిగణించడానికి నిశ్చయించుకున్నాము.

హఠాత్తుగా కెప్టెన్ స్మాలెట్ అరిచాడు: ''ఫిరంగి!''

నేనన్నాను: ''ఫిరంగి ఏం ఫరవాలేదు. దాన్ని ఓడలోనుంచి ఊడదీయడం అసాధ్యం ఒకవేళ ఊడదీసినా ఒడ్డుకు తీసుకురావడం, చెట్ల గుబురుల్లోంచి మన మట్టికోటదాకా తీసుకురావడం వాళ్ళతరం కాదు. (ఓడలో బ్రహ్మాండమైన ఫిరంగి ఒకటుంది. దాంతో పేలిస్తే మా మట్టికోట దెబ్బ కెగిరి పోతుంది.)

''అది కాదు డాక్టర్! తిరిగి చూడండి వెనక్కి.''

అందరం ఓడకేసి చూశాము. ఓడలో మిగిలిన అయిదుగురు విద్రోహులు ఫిరంగిని మా బోటుకేసి తిప్పడానికి ప్రయత్నిస్తున్నారు. ఒకడు మందు కూరుతున్నాడు. మేము వచ్చేటప్పుడు ఫిరంగి గుండ్లు, మందు ఓడలోనే వదిలి వేసి వచ్చాము. ఆ తొందరలో వాటినికూడా సముద్రంలో పారవెయ్యాలని మాకు జ్ఞాపకం రాలేదు.

''కెప్టెన్ ఫ్లింట్ ఎప్పుడూ ఇజ్రాయెల్ హాండ్స్‌ని మెచ్చుకుంటూ ఉండేవాడు, ఫిరంగి చాలా బాగా పేలుస్తాడని'' అన్నాడు అబ్రహాం గ్రే.

ఈలోగా మేము ఓడనుంచి చాలాదూరం వచ్చేశాము. కాని ఫిరంగి పేల్చితే మాత్రం మేము నామరూపాలు లేకుండా ధ్వంస మవుతాము. ఈ ప్రమాదం గమనించి కెప్టెన్ స్మాలెట్ అడిగాడు:

''మనలో ఎవరు బాగా గురిపెట్టగలరు?''

''ట్రెలానీ!'' అన్నాను.

''ట్రెలానీగారూ! దయచేసి మీరు నాకో ఉపకారం చేయాలి. వాళ్ళలో ఒకణ్ణి, వీలైతే ఇజ్రాయెల్ హాండ్స్‌ని పడగొట్టాలి.'' అన్నాడు కెప్టెన్.

ట్రెలానీ మారుమాట లేకుండా తుపాకీ తీశాడు.

''జాగ్రత్తగా ఉండండి. ట్రెలానీగారు పేల్చే సమయానికి ఈ పక్కకి ఒరగండి. ట్రెలానీగారూ! తుపాకీ కాస్త డబాయించి పట్టుకోండి. పడవ ఏ

మాత్రం ఊగినా తలకిందులవుతుంది.'' అని హెచ్చరించాడు కెప్టెన్.

కెప్టెన్ చెప్పినట్టే మేము ఒక పక్కకి ఒరిగి ఊపిరి బిగపట్టి నిరీక్షిస్తున్నాము. ఓడమీద ఫిరంగి మూతికి దగ్గరగా ఇజ్రాయెల్ నుంచుని వున్నాడు. అతని వెనక మిగతావాళ్ళు నుంచున్నారు. ట్రెలానీ, ఇజ్రాయెల్ కేసి గురిచూసి తుపాకి పేల్చాడు. కాని వాడు ఆ సమయానికి నేర్పుగా వంగాడు. గుండు వెనకాల మనుషుల్లో ఒకడికి తగిలింది. వాడు నేల కొరిగాడు. ఓడమీదవున్న వాళ్ళందరూ ''బాబోయ్'' అని ఒక్కసారిగా కేకలు వేశారు. ఆ కేకలను ప్రతిధ్వనిస్తున్నట్టుగా సిల్వర్ పడవలు వున్న ప్రదేశంనుంచి మిగతా కుట్రదారులందరూ కేకలు వేశారు. ఒడ్డున వున్న ఒక బోటులోకి కొందరు ఎక్కి మా పడవను వెంబడించడానికి ప్రయత్నిస్తున్నారు కూడాను. మిగతా వాళ్ళలో కొందరు ఒడ్డునే మా కేసి పరిగెత్తి వస్తున్నారు. కాని వాళ్ళుగాని, కుట్రదారుల పడవగాని మమ్మల్ని సమీపించే లోగానే ఒడ్డు చేరుకోగలమనే ధైర్యం మాకున్నది. మాకింకా ప్రమాదకరంగా ఉన్నది హిస్పానియోలాలోని ఫిరంగి ఒక్కటే.

''ట్రెలానీగారూ! మరొకణ్ణి పడగొట్టాలి'' అన్నాడు కెప్టెన్.

ట్రెలానీ మళ్ళీ తుపాకి ఎత్తి గురిపెట్టాడు. ఈసారి దెబ్బకు విద్రోహుల్లో ఎవరు కూలిపోయారో చూసే వ్యవధిలేదు మాకు. ఎందుకంటే తుపాకీ ప్రేలగానే మా పడవ ఒక్క గంతువేసి మునిగిపోయింది. నేను, కెప్టెను కొంచెం జాగ్రత్తగా ఉండబట్టి నిలద్రొక్కుకో గలిగాము. మిగిలిన ముగ్గురూ బోటుతో పాటు మునిగారు. కాని ప్రాణనష్టం ఏమీ జరగలేదున. బోటులో ఉన్న సామగ్రి మాత్రం నష్టమైంది.

రెండు బారలు ఈదేసరికి కాళ్ళకు నేల అందింది. పూర్తిగా తడిసిపోయి సాధ్యమైనంత వేగంగా ఒడ్డుకి వచ్చాము. ఒడ్డునే పరిగెత్తి వచ్చే తిరుగుబాటు దార్లు మమ్మల్ని ఎదుర్కొనేలోగానే మట్టికోటను చేరుకోవాలని మా ఉద్దేశం. వాళ్ళు అంతకంతకు మమ్మల్ని సమీపిస్తున్నారు. మట్టికోట ఇంకా డెబ్బయ్ ఎనభై

గజాల దూరంలో ఉంది. ఒకవేళ ఈలోగానే వాళ్ళెదురు పడితే ఏం చెయ్యాలో మాకు తోచలేదు. నా దగ్గిర, కెప్టెన్ దగ్గిర మాత్రమే తుపాకులున్నాయి. ట్రెలానీ దగ్గిర తుపాకీ ఉన్నదిగాని అది తడిసిపోయి పనికి రాకుండా పోయింది. అందుచేత ట్రెలానీ, కెప్టెన్ తుపాకీని తీసుకున్నాడు. అబ్రహాం గ్రే దగ్గర ఏ ఆయుధమూ లేకపోవడం చూసి నా కత్తిని అతని కిచ్చాను. ఈ విధఃగా సన్నద్ధులమై చెట్లను మరుగుగా చేసుకుంటూ మట్టి కోటదిశగా నడవసాగాము.

16

మరొక నలభై అడుగులు వెయ్యగానే చెట్ల గుబురుగుండా మా మట్టికోట కనిపించింది. అదే సమయంలో ఎడమ ప్రక్కనుంచి తిరుగు బాటుదార్లు మాకేసి పరుగెత్తుకు రావడం చూశాం. మమ్మల్ని చూడగానే అదిరిపడి ఎక్కడి వాళ్ళక్కడ ఆగిపోయారు. వాళ్ళు తేరుకునే లోపుగానే నేను, జమీందారుగారు తుపాకులు పేల్చాము. మాతోపాటు సమానంగా మట్టికోటలోనుంచి హంటర్, జోయిస్‌లుకూడా పేల్చారు. ఇన్ని కాల్పులకీ శత్రువుల్లో ఒకడు మాత్రం నేలకూలాడు. మిగతావాళ్ళు వచ్చిన దోవనే కాలికి బుద్ధి చెప్పారు.

తుపాకీలు మళ్ళీ మందుతో నింపుకుని పడిపోయిన మనిషిని సమీపించాము. అప్పటికే వాడి శరీరం చల్లబడింది. మొదటి దెబ్బలోనే ఒకణ్ణి హతమార్చి నందుకు సంతోషిస్తూ మళ్ళీ మట్టికోటకేసి నడిచాము. ఇంతలో పొదలచాటున ఒక పిస్టల్ పేలింది. ఒకతూటా నా చెవిపక్కగా గుయ్యిన దూసుకుపోయింది. వెంటనే నేను, జమీందారు పొదలవేపు తుపాకులు పేల్చాము. తరవాత పక్కకు తిరిగాము. శత్రువులు పేల్చిన తూటా వృద్ధ సేవకుడు టామ్ రెడ్రూత్‌కు తగిలింది. అతణ్ణి మోసుకుని మట్టి కోటలో ప్రవేశించాము.

మేము దెబ్బకు దెబ్బ తియ్యడానికి సిద్ధంగా ఉన్నామని గ్రహించారు కాబోలు శత్రువులు. మళ్ళీ ఆ పరిసరాలలో ముఖం చూపకుండా ఉడాయించారు. రెడ్రూత్‌కు పరిచర్యలు చేయడానికి మాకు కావలసినంత వ్యవధి లభించింది. పాపం అతని రోదనం వింటుంటే మాకు గుండెలు తరుక్కుపోయాయి. గాయం నుంచి రక్తం కాలువలుకట్టి కారుతున్నది. అతని నాడి పరీక్షించాను. ఇక నేను చేయదగిన దేమీ లేదని అనుకున్నాను.

మా కష్టాలు ప్రారంభమైంది మొదలు ఇప్పటి వరకూ ఆ వృద్ధుడు ఒక్కసారైనా గొణగలేదు, సణగలేదు. ఏ పని చెబితే ఆ పని మారుమాట లేకుండా చేశాడు. ఇప్పుడు అందరికంటే ముందు అతని వంతు వచ్చింది.

అతనికి ఒక పక్కవేసి పడుకోబెట్టాము. ట్రెలానీ అతని ప్రక్కన ముఖం కప్పుకొని కూర్చుని నిశ్శబ్దంగా ఏడుస్తున్నాడు. రెడ్రూత్ హీనస్వరంతో అడిగాడు:

''డాక్టర్‌గారూ! జమీందారుగారూ! నాకు సెలవిప్పిస్తారా?''

మేమెవ్వరం మాట్లాడలేదు, పొంగివచ్చే దుఃఖం ఆపుకుంటూ మౌనంగా చుట్టూ నుంచున్నాము.

''ఆ వెధవల్లో ఒకణ్ణయినా పడగొట్టకుండా వెళ్ళిపోతున్నానే అని నా బెంగ.'' అన్నాడు రెడ్రూత్. మళ్ళీ కాసేపు నిశ్శబ్దం.

ట్రెలానీ ముఖంమీద చేతులు తీసేసి రెడ్రూత్ చేతులు పట్టుకుని ''టామ్ నన్ను క్షమిస్తావా?'' అని అడిగాడు.

''అదేమిటి బాబుగారూ! అంతమాట అనకండి. మీ ఉప్పుతిని బతికా నిన్నాళ్ళూ. మీ ఒడిలో నిశ్చింతగా చనిపోతున్నాను. ఇంతకంటే ఏం కావాలి నాకు!'' అన్నాడు రెడ్రూత్.

ఈ లోగా కెప్టెన్ స్మాలెట్ ఏమిటేమిటో సవరిస్తున్నాడు. పంట్లాం జేబుల్లోంచి రెండు యూనియన్ జాక్ జెండాలు తీశాడు. ఒక బైబిలు, ఒక మోకు, కలం, సిరాబుడ్డి, బోలెడు పొగాకు తీశాడు. ఒక జెండాను కర్రకు

తగిలించి ఇంటి నడికప్పుమీదికెక్కి అక్కడ కట్టివేశాడు. దాంతో అతని మనస్సు కుదుటబడినట్టయింది. సంతృప్తితో కిందికి దిగివచ్చి రెడ్రూత్ పక్కన నుంచున్నాడు.

ఎవరన్నా బైబిల్ చదివితే బావుంటుందని రెడ్రూత్ కోరాడు. బైబిల్ లోని ప్రార్థనలు చదువుతుండగా రెడ్రూత్ సునాయాసంగా, నిశ్శబ్దంగా ఈ లోకాన్ని విడిచిపోయాడు. కెప్టెన్ వెళ్ళి రెండో జెండా తీసుకువచ్చి గౌరవ పూర్వకంగా దాన్ని శవం మీద కప్పాడు. ట్రెలానీ శవం పక్కన ఇంకా దుఃఖిస్తూ కూర్చున్నాడు. కెప్టెన్ అతన్ని ఊరడించడానికి ఇలా అన్నాడు:

''జమీందారు గారూ! మీరు దుఃఖించకండి. రెడ్రూత్ అదృష్టవంతుడు. ఇంత వృద్ధాప్యంలో కూడా మిమ్మల్ని అనుసరించి ఈ ఎడారి ద్వీపానికి వచ్చాడు. మీ సేవలోనే చనిపోయాడు. అతనికేం ఫరవాలేదు.''

తరవాత కెప్టెన్ నన్ను అవతలకు పిలిచి చెప్పాడు:

''మనమిక్కడ ఎన్ని రోజులిలా పోరాడవలసి వస్తుందో తెలియదు. మన పడవలో అంత సామాను నీటిపాలు కావడం నిజంగా దురదృష్టమనే చెప్పాలి. మందు సామగ్రి పోయినా అంత ఇబ్బంది లేదుగాని, ఆహార పదార్థాలు కూడా నీళ్ళలో కలిసిపోవడం మనకు దెబ్బే. ఎంత కఠినంగా రేషనింగు పెట్టుకున్నా వారం పదిరోజులకంటే ఈ నిల్వలు ఎక్కువ కాలం సరిపోవు. ఒక విధంగా మనలో ఒక్కడైనా తగ్గిపోవడం మంచిదే అయింది.''

ఇంతలో ఫిరంగి మోత మళ్ళీ వినిపించింది. ఓడలోని వాళ్ళకు మా కోట శిఖరం మీది ఇంగ్లీషు జండా శుభ్రంగా కనిపిస్తూ ఉండివుండాలి. దాని కేసి గురిపెట్టి శత్రువులు ఫిరంగి పేలుస్తున్నారు. కాని మొదటిగుండు మా కోటనుదాటి దూరాన చెట్లలోపడి వ్యర్థమైంది.

''ఒహో! ఫిరంగి పేలుస్తున్నారే. పేల్చండి పందుల్లారా! ఉన్న కాస్త మందుగుండు అయిపోయేదాకా అలాగే పేల్చండి,'' అన్నాడు కెప్టెన్ పళ్ళు కొరుకుతూ.

ఫిరంగి రెండోసారి పేలింది. ఈసారి గురి అట్టే తప్పలేదు. గుండు మా ఆవరణలోకే ప్రవేశించి నేలమీద పడింది. అంతకంటే ప్రమాదమేమీ జరగలేదు.

''ఓడలోని వాళ్ళకు మన మట్టికోట కనిపించదు. కాని మన జెండాను చూసి దానికేసి గురిపెట్టి కొడుతున్నారు. కనుక అపాయమేమీ జరక్కముందే జెండాను లాగివెయ్యడం మంచిది కాదా?'' అన్నాను కెప్టెన్‌తో.

''జెండాను తీసివెయ్యమంటారా? అసంభవం, ఛస్తే తీసెయ్యను,'' అని ఖచ్చితంగా జవాబు చెప్పాడు కెప్టెన్. అతని అభిప్రాయంతో మేమంతా ఏకీభవించాము. ఎందుకంటే, కోటపై ఎగరవేసిన యూనియన్ జాక్ మా ఆత్మ గౌరవానికి చిహ్నం. అంతేకాకుండా, తిరుగుబాటుదార్ల ఫిరంగి బెదిరింపులను మేము లెక్కచెయ్యడం లేదనడానికి కూడా మంచి నిదర్శనం. అందుచేత అది అక్కడ వుండడమే మంచిదని అంగీకరించాము.

ఆ విధంగా చీకటిపడే వరకు ఓడలో వాళ్ళు ఫిరంగి పేలుస్తూనే వున్నారు. ఫిరంగి గుండ్లలో ఒక్కటీ మా కోటలోకి చొచ్చుకు రాలేకపోయింది. ఒక్కటీ మా జెండాను పడగొట్టలేక పోయింది. ఆవరణలో మాత్రం చాలా పడ్డాయి. ఒక్కొక్క గుండు పడినప్పుడల్లా ఒక ఇసుక తుఫాను రేగినట్లయ్యేది. మేము లోపల కూర్చుని క్రికెట్ ఆట చూస్తున్నట్లు వినోదిస్తూ కూర్చున్నాం.

కెప్టెన్ స్మాలెట్ ఒకచోట కూర్చుని తన డైరీ తీసి ఇలా వ్రాయ సాగాడు:

''అలెగ్జాండర్ స్మాలెట్– ఓడ కెప్టెన్; డేవిడ్ లివ్‌సే– ఓడ డాక్టరు; అబ్రహాం గ్రే– కళాసీ; జాన్ ట్రెలానీ– ఓడ యజమాని; జాన్ హంటర్, రిచర్డ్ జోయిస్– యజమాని సొంత నౌకర్లు; వీరు మాత్రమే తిరుగుబాటు నెదుర్కోడానికి మిగిలారు. పది రోజులకు సరిపడే రేషన్లతో ఈ రోజునే కాంచన ద్వీపం ప్రవేశించారు. మట్టికోటపై ఇంగ్లీషు జెండా ఎగరవేశారు. థామస్ రెడ్రూత్– యజమానిగారి సేవకుడు, తిరుగుబాటుదార్ల చేతిలో మరణించాడు; జేమ్సు హాకిన్స్– ఓడనౌకరు............''

ఇంతలో మట్టికోట కువైపు నుంచి కేకలు వినిపించాయి. ఎవరో గొంతెత్తి

పిలుస్తున్నారు. సంజ చీకట్లలో ఎవరైనదీ కనిపించటం లేదు.

''డాక్టరుగారూ! జమీందారుగారూ! హల్లో, అక్కడుంది నువ్వేనా హంటర్?'' అని కేకలు వినిపించాయి. జిమ్ హాకిన్స్ కంఠం గుర్తు పట్టాము. నేల మీద పాకుకుంటూ జిమ్ కోటలోకి ప్రవేశించాడు.

జిమ్ హాకిన్స్ కథ

బెన్‌గన్ బ్రిటీష్ జెండాను చూడగానే నన్ను చెయ్యి పట్టుకుని ఆపి ''అరుగో: మీ స్నేహితులక్కడ ఉన్నట్టున్నారు,'' అన్నాడు.

''తిరుగుబాటుదార్లు కాగూడదా?'' అన్నాను.

''సిల్వర్ సంగతి మీకు తెలీదు. సముద్రపు దొంగలుతప్ప ఇక్కడి కింకెవ్వరూ రారు. ఇలాంటి చోట దొంగల జెండా ఎగరెయ్యక యూనియన్ జాక్ ఎగరేస్తాడా సిల్వర్? వాళ్ళు మీ స్నేహితులే సందేహం లేదు. పోట్లాట కూడా ముమ్మరంగా జరుగుతోంది. మీ స్నేహితులే గెలుస్తున్నారనుకుంటాను. మట్టికోట బలేగా ఉంటుందిలెండి. కెప్టెన్ ఫ్లింట్ చాలా గట్టిగా కట్టించాడు దాన్ని. ఫ్లింట్ బలే గొప్ప వాడు లెండి ఎంతెంత వాళ్ళనయినా గజగజలాడించే వాడు, ఒక్క సిల్వర్‌ని తప్ప. సిల్వర్, ఫ్లింట్ సమ ఉజ్జీలు.''

''సర్లే, నీ సోదివింటూ కూర్చోడానికి నాకు తీరిక లేదు. చప్పున పోయి మా వాళ్ళను కలుసుకోవాలి.''

''కాదండి హాకిన్స్ గారూ! మీతో వద్దామనుంది గాని భయం వేస్తోందండి. మీరు జమీందారు గారితో నా సంగతి తప్పకుండా చెప్పాలి. ఆయన సరే అంటే గాని నేను రాను. ''బెన్‌గన్ మీకో తమాషా చూపిస్తాడట'' అని కూడా ఆయనతో చెప్పాలి. చెప్పి ఇలా కన్ను గీటాలి,'' అని బెన్‌గన్ కన్ను గీటి చూపించాడు.

''మీరు మళ్ళీ నన్ను కలుసుకోవాలంటే ఇవాళ నన్నెక్కడ చూశారో అక్కడికే

రండి. మీరు కాక ఇంకెవరైనా వచ్చేట్టయితే ఆయన ఒంటరిగానే రావాలి. చేతిలో తెల్లటి గుడ్డ పట్టుకురావాలి. తెలిసిందాండి.''

''జమీందారుగార్ని గాని, డాక్టరుగార్ని గాని చూడాలనుకుంటున్నా వన్నమాట. అంతేనా?''

''అవునండి.''

''అయితే నేనిక వెళ్ళనా?''

''మర్చిపోరుగదూ? ఒక తమాషా అని మాత్రం చెప్పండి. ఇదుగో మన్లో మనమాట-''

ఢామ్మని శబ్దంచేస్తూ ఒక ఫిరంగి గుండు మాకు వందగజాల్లో ఇసుకలో పడి దుమారం రేగింది. వెంటనే చేతులు విడిపించుకుని చెరోదిక్కుకు పారిపోయాము.

అక్కణ్ణించి ఒక గంటదాకా ఫిరంగి విరామం లేకుండా పేలుతూనే వుంది.

ఈ చెట్టునుంచి ఆ చెట్టుకు, ఆ చెట్టునుంచి ఈ చెట్టుకు అంగలు వేస్తూ, ఫిరంగి గుండ్లు ఎక్కడ మీద పడతాయోనని హడలిపోతూ తూర్పుగా సముద్రంవైపు నడిచాను.

సూర్యుడు అస్తమించాడు. చెట్లమీదుగా సముద్రపు చలిగాలి వీచసాగింది. నెమ్మదిగా చీకట్లు అలుముకుంటున్నాయి. నేనీ పాటికి దాదాపు సముద్రతీరం దాకా వచ్చాను. దూరంగా తెల్లరాళ్ళ గుట్ట కనిపించింది. బెన్ గన్ చెప్పిన తెల్లగుట్ట అదే అయివుంటుంది. అక్కడే తన పడవ దాచానన్నాడు బెన్గన్. ఎప్పుడన్నా అవసరమైతే ఆ పడవ వాడుకోవచ్చునని ఆ ప్రదేశం గుర్తు పెట్టుకున్నాను.

అప్పటికి ఫిరంగి కాల్పులు ఆగిపోయాయి. కనక ఇక అపాయం లేదని వెనకనుంచి నా మిత్రులున్న స్థలంవైపు నడిచాను. మట్టికోట చేరగానే నా కేకలు విని డాక్టరుగారు, ఇతరులు ఎదురువచ్చి లోపలికి తీసుకుపోయారు.

నా కథంతా క్లుప్తంగా చెప్పాను. తరవాత చుట్టూ పరకాయించి చూసి పరిస్థితి అర్థం చేసుకున్నాను. రెడ్రూత్ శవాన్ని ఇంకా సమాధి చేయలేదు.

అబ్రహాం గ్రే కు కణత మీద తగిలిన గాయం పచ్చి పుండై అతడు ఒక మూల పడుకుని మూలుగుతున్నాడు.

కెప్టెన్ స్మాలెట్ మమ్మల్ని సోమరిగా కూర్చోనివ్వలేదు. రాత్రంతా మట్టికోటకు కాపలా కాయవలసి ఉంటుందన్నాడు. మమ్మల్ని రెండు దళాలుగా విభజించాడు. నేను, డాక్టరుగారు, గ్రే ఒకదళం. జమీందారు గారు, హంటర్, జోయిస్ మరొక దళం. అందరం అలిసిపోయి వున్నాం. ఎవరికీ వంట్లో పీసమెత్తు ఓపికలేదు. కాని పడుకుని నిద్రపోతే పనులెలా జరుగుతాయి? కెప్టెన్ ఇద్దర్ని కట్టెలు కొట్టుకు రావడానికి పంపించాడు. ఇద్దర్ని రెడ్రూత్ శవం పాతి పెట్టేందుకు గొయ్యి తవ్వమన్నాడు. డాక్టరు గారికి వంటపని అప్పగించాడు. నన్ను ద్వారం వద్ద గస్తీ కాయమన్నాడు. తాను ఎవరికేది కావలిస్తే అది అందిస్తూ, అందరినీ ఉత్సాహపరుస్తూ తిరుగుతున్నాడు.

డాక్టరుగారు పొయ్యిదగ్గిర ఎప్పుడూ అలవాటులేదు గావును పొగలో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉండుండి లేచి ఒకసారి అటూ యిటూ పచార్లు చేసి మళ్ళీ పని చేసుకుంటున్నారు. ఒక్కోసారి నా దగ్గిరికి వచ్చి కబుర్లు చెప్పి వెడుతున్నారు.

''జిమ్! స్మాలెట్ ఉన్నాడే నాకంటే, ట్రెలానీ కంటే దిట్టమైన మనిషి. కెప్టెన్ అంటే అలా వుండాలి. ఎంత వ్యవహార జ్ఞానం, తెలివి తేటలు ఉన్నాయో చూశావా అతనికి?'' అన్నారు డాక్టరు గారు

ఇంకోసారి వచ్చి అడిగారు: '' జిమ్? ఈ బెన్గన్ నిజంగా మనిషేనా? లేక ఏదన్నా భూతమా?''

''ఏమోనండి నాకూ తెలియడంలేదు. ఏమైనా పిచ్చివాడని మాత్రం అనుమానించవచ్చును'' అన్నాను.

''మూడేళ్ళపాటు ఈ ఒంటరి ద్వీపంలో గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్న మనిషి నీలాగా, నాలాగా ఉండమంటే ఎల్లా ఉంటాడు? అన్నట్టు అతనికి జున్ను బాగా ఇష్టమని చెప్పావుగదూ?''

''అవునండి''

''చూశావా, మనం అనుకోకుండానే ఒక్కోసారి మంచి పనులు చేస్తూం టాము. నా దగ్గిర వెండి పొడుండబ్బా ఉందే, దాంట్లోంచి నేను పొడుం తీసి పీలుస్తుంటే ఎప్పుడన్నా చూశావా నువ్వు? చూడలేదు. ఎందు కంటే: దాంట్లో ఉన్నది ముక్కుపొడుం కాదు: ఇటలీలో తయారైన జున్నుముక్క. ఎందుకో బుద్ధి పుట్టి దాని అలా దాచాను. ఆ జున్ను బెన్‌గన్ కిస్తాను.''

రెడ్రూత్‌ను పాతిపెట్టాక భోజనాలు చేశాము. తలోక గ్లాసు బ్రాందీ తాగాము. తరవాత మా ముగ్గురు నాయకులు ఒక మూల చేరి చర్చలు సాగించారు.

మా దగ్గిరున్న ఆహారపదార్థాలు అట్టే రోజులు రావు. బయలుదేరే ముందు జమీందారుగారు ఏర్పాటు చేసిన ప్రకారం ఇంగ్లండు నుంచి మాకు రక్షణ వచ్చేవరకు ఉన్న ఆహారాన్నే సరిపెట్టుకోవాలి. అది ఎలాగూ అసంభవం కనుక మాకు రెండే మార్గాలున్నాయి: తిండికి మాడి చనిపోనైనా చనిపోవాలి: లేక తిరుగుబాటుదార్లకు లొంగిపోవాలి. చివరకు ముగ్గురు నాయకులూ చర్చించి తేల్చిన దేమిటంటే తిరుగుబాటుదార్లలో వీలైనంత ఎక్కువమందిని హతం చెయ్యాలి. ఇప్పటికే వాళ్ళ సంఖ్య పందొమ్మిది నుంచి పదిహేను వరకు దిగింది. మరిద్దరు గాయాలు తిని వున్నారు. ఓడమీద ఇజ్రాయెల్ హాండ్స్‌కు తగల వలసిన దెబ్బ తగిలి పడిపోయిన మనిషి చనిపోయాడో లేదో తెలియదు. కాని వాడుకూడా లేనట్టే లెక్క.

ఆ రాత్రి చాలా పొద్దు పోయేవరకూ ఓడమీద శత్రువులు రమ్ తెగ తాగి పాటలు పాడుకుంటూ, దెబ్బ లాడుకుంటూ గడిపారు. మేము వంతుల ప్రకారం కాపలా కాశాము. నా వంతు అయిపోయిన తర్వాత శుభ్రంగా పడుకుని నిద్రపోయాను. తెల్లవారు కట్ల నా మిత్రుల సందడితో లేచాను.

''సంధిజెండా'' అని ఎవరో అరవడం వినిపించింది. ''సిల్వర్ వచ్చాడండోయ్'' అని మరొకరు కేక వేశారు. నేను కళ్ళు నలుపుకుంటూ లేచి గోడలోని రంధ్రం

ద్వారా బయటికి చూశాను. ఆవరణ అవతల ఇద్దరు నుంచున్నారు. ఒకడు తెల్లజెండా ఊపుతున్నాడు. రెండోవాడు సిల్వర్. ఊత కర్ర చంకలో పెట్టుకుని మాకేసి చెయ్యి వూపుతూ ఠీవిగా నుంచుని వున్నాడు.

18

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. చలికి ఒళ్ళు కొయ్యబారిపోతున్నది: వేళ్ళు కొంకర్లు పోతున్నాయి. పొగమంచు కూడా ఇంకా దట్టంగా అలముకునే వున్నది.

గోడలోని కన్నాలలోంచి బయటికి తొంగి చూస్తున్న మమ్మల్ని చూసి కెప్టెన్ స్మాలెట్ లోపలికి పొమ్మని ఆజ్ఞాపించాడు. ఇందులో ఏదో మోసం వుందని అన్నాడు.

''ఎవరక్కడ?'' అని సిల్వర్‌ను చూస్తూ గద్దించాడు కెప్టెన్.

''సంధిజెండా'' అని కేక వేశాడు సిల్వర్.

కెప్టెన్ మళ్ళీ వెనక్కి తిరిగి మాకేసి చూసి ''డాక్టరుగారూ! మీరు ఉత్తరపు వేపు గోడవద్ద నుంచోండి. జిమ్ తూర్పువేపు, గ్రే పడమటివేపు. మిగతావాళ్ళు తుపాకులు దట్టించండి . జాగ్రత్త!'' అని ఆజ్ఞాపించాడు.

''సంధి జెండాతో నీకేం పని?'' ప్రశ్నించాడు సిల్వర్‌ను కెప్టెన్.

సిల్వర్ పక్కన నుంచున్న అనుచరుడు సమాధాన మిచ్చాడు:

''కెప్టెన్ సిల్వర్ మీతో సంధి చేసుకోవా లనుకుంటున్నాడు.''

''కెప్టెన్ సిల్వరా? అతడెవడో ఎరగనే. ఎవడు వాడు? '' అన్నాడు కెప్టెన్ కోపంగా. ''కెప్టెన్‌ట కెప్టెన్! చేసింది చాలక వీడికి కెప్టెన్ పదవి కూడానా?'' అని నెమ్మదిగా గొణుక్కున్నాడు.

సిల్వర్ సమాధానమిచ్చాడు:

''నేనేనండి, లాంగ్‌జాన్ సిల్వర్‌ను. ఈ కుర్రాళ్ళంతా కలిసి వద్దంటున్నా

నన్ను కెప్టెన్‌ని చేశారండి. మీరు పారిపోయిం తరువాత హిస్పానియోలాకు ఒక అధికారి అంటూ ఉండాలి గదండి. అందుకని... మనం సంప్రదింపులు ప్రారంభించే ముందు మీరొక వాగ్దానం చెయ్యాలండి సార్. మమ్మల్ని ఇక్కణ్ణించి క్షేమంగా పోనివ్వాలండి. ఏమంటారు:''

''సిల్వర్! నీలాంటి విశ్వాస ఘాతకుడితో రాజీ సంప్రతింపులు చేసేటంత ఓర్పులేదు నాకు. చెప్పేదేదో రెండు ముక్కల్లో చెప్పేయ్. మేము మిమ్మల్నేమీ చెయ్యము. మీరుమాత్రం ఏదన్నా మోసం తలపెట్టారంటే ఊరుకోము'' అన్నాడు కెప్టెన్ స్మాలెట్.

''ఛచ్చా! మీలాంటి పెద్దమనుషుల దగ్గిర అలాంటి పాడుపనులు చేస్తామటండి. మీరు మాటిచ్చారు; అది చాలు నాకు'' అంటూ సిల్వర్ ఆవరణ చుట్టూవున్న కంచెను లంఘించి లోనికి వచ్చాడు. అతని అనుచరుడు ''వెళ్ళవ'' ద్దని అనబోయాడు కాని ''భయం లేదులే'' అన్నట్టు సిల్వర్ వాణ్ణి వీపు మీద తట్టాడు. సిల్వర్ అంత ధైర్యంగా శత్రువులమైన మమ్మల్ని సమీపించడం నాకు అచ్చెరువు గొలిపింది.

సిల్వర్ మట్టికోట ద్వారం సమీపించి చాలా మర్యాదగా కెప్టెన్‌కు సెల్యూట్ చేశాడు.

''అక్కడే కూర్చో'' అని ఆజ్ఞాపించాడు కెప్టెన్.

''బయట చాలా చలిగా వున్నదండి. లోపలికి వచ్చి కూర్చుంటాను'' అన్నాడు సిల్వర్ నవ్వుతూ.

కెప్టెన్ ముఖం చిట్లించాడు. ''సిల్వర్! నువ్వు సజావుగా ప్రవర్తించి వుంటే మాకున్న సదుపాయా లన్నిటిని నీతో పంచుకునేవాళ్ళం. ఊహు- నువ్వు కెప్టెన్ సిల్వర్‌వి గదూ, నీలాంటి గొప్పవాడికి సత్కారం చెయ్యగలమా మేము?''

''సరే పోనీండి, ఇక్కడే కూర్చుంటాను'' అని సిల్వర్ అక్కడే ఇసకలో చతికిల పడ్డాడు. ''చాలా బావుందండి ఇక్కడ. అదృష్టవంతులు మీరు- మాకంటే ముందే సంపాదించారు మట్టికోటని. ఓ- జిమ్ కూడా ఉన్నాడే. హలో జిమ్? కులాసాగా ఉన్నావా? డాక్టరుగారూ! నమస్కారాలండి, మీ అందర్నీ

చూస్తుంటే సంతోషంగా ఉందండి. కులాసాగా ఒక కుటుంబంలో వాళ్ళలాగా వున్నారు'' అని సోదిగా మాట్లాడసాగాడు సిల్వర్.

''నువ్వు చెప్పదలచుకున్నదేదో త్వరగా చెప్పు'' అని గద్దించాడు కెప్టెన్ స్మాలెట్.

''అరెరె. తొందరపడతా రేమిటండి స్మాలెట్ గారూ: కిందటి రోజు యుద్ధంలో మీరే గెల్చారని ఒప్పుకుంటాను. ఒప్పుకోకతప్పదు కనుక ఒప్పుకుంటాను. ఎందుకంటే మావాళ్ళకి కాస్త వణుకు పుట్టినట్టుంది. నాక్కూడా వణుకు పుట్టిందేమో తెలియదు. ఏమైనా మీతో రాజీ బేరాలు ఆడదామనే వచ్చాను. అసలు మా రహస్యం మీరు కనిపెట్టారని నాకు తెలియలేదుగాని, ఏ మాత్రం ముందు తెలిసినా, తస్సదియ్య, మిమ్మల్ని ఒక ఊపు ఊపేవాణ్ణి''

''ఇంతకీ ఏమిటీ?-'' అన్నాడు కెప్టెన్.

''ఏమీలేదు. ఫింట్ డబ్బు మాక్కావాలి. ఆకాశం విరిగిపడ్డా ఆ డబ్బును మేము కొట్టెయ్య దలుచుకున్నాం. మీకు ప్రాణాలపై తీపివుంటే మాతో రాజీకి రండి. మీ దగ్గరొక పటం వుంది కదూ?''

''ఉంటే ఉండవచ్చు. లేకపోతే లేకపోనూ వచ్చు-''

''మీ దగ్గిర ఆ పటం వుందన్న సంగతి మాకు తెలుసు. మాకు ఆ పటం ఇచ్చెయ్యండి. అదీ నేను కోరేది.''

''సిల్వర్: నిన్ను గడ్డి పోచకింద జమకడుతున్నాను. తరవాత నీ ఇష్టం.'' అంటూ కెప్టెన్ స్మాలెట్ తీరిగ్గా పొగాకుతో తన పైపు నింపుకోసాగాడు.

కెప్టెన్ స్వరంలోని కఠినధోరణి గమనించి సిల్వర్ వెంటనే ఏమీ మాట్లాడలేక పోయాడు. తనుకూడా జేబులోంచి పైప్ తీసి పొగాకు నింపుకుని అంటించాడు. ఇద్దరూ తాపీగా పైప్‌లు కాలుస్తూ, ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు చూసుకుంటూ, మధ్య మధ్య ముందుకు వంగి ఉమ్ములు వేస్తూ గడిపారు. కొన్ని నిమిషాల తర్వాత సిల్వర్ ప్రారంభించాడు:

''స్మాలెట్ గారూ! మళ్ళీ చెబుతాను వినండి. పటం మాకు స్వాధీనం చెయ్యండి. మా కుర్రాళ్ళను తుపాకులతో కొట్టడం మానెయ్యండి. డబ్బు మేమే తవ్వి ఎత్తుకుంటాము. అదంతా ఓడలోకి ఎక్కించుకుంటాము. మిమ్మల్ని క్షేమంగా ఏదో దేశంలో దింపుతాము. అక్కణ్ణించి మీరు ఇంగ్లండుకు ఎలా చేరుకున్నా సరే. అసలు నేను మంచివాణ్ణి కనుక మిమ్మల్ని ఓడలో తీసుకుపోతానంటున్నాను. మా వాళ్ళు అందుకు ఒప్పుకోకపోవచ్చు. అలాగైతే మీరు ఈ ద్వీపంలోనే ఉండిపోవలసి వస్తుంది. కాని ఒక సహాయం మాత్రం చేస్తాను. మాకు కనిపించిన మొదటి ఓడను ఆపి వాళ్ళతో మాట్లాడి మీకోసం దాన్ని ఇక్కడికి పంపించగలను. ఏమంటారు? నేను చెప్పేదాంట్లో బేసబబు ఏమన్నా ఉందా? నా మాటలు లోపల వాళ్ళంతా వింటున్నా రనుకుంటున్నాను. ఒకరితో చెబితే అందరితో చెప్పినట్టే. నేను చెప్పింది నచ్చిన వాళ్ళెవర్నైనా మాలోకి తీసుకోడానికి సిద్ధంగా ఉన్నాను.'' అని గొంతు హెచ్చించి చెప్పాడు సిల్వర్.

'' అంతేనా?'' అని కెప్టెన్ అడిగాడు.

'' అంతే. ఇదే ఆఖరుమాట. ఒప్పుకోకపోయారా, తస్సదియ్య. ఈ మట్టికోటతో సహా మిమ్మల్నందర్నీ ధ్వంసం చేసిందాకా నిద్రపోను.''

కెప్టెన్ సౌమ్యంగానే ఇలా హెచ్చరించాడు:

''సరే, నేను చెప్పేది విను. మీరంతా ఒకళ్ళతర్వాత ఒకళ్లు చేతిలో ఆయుధం ఏమీ లేకుండా ఇక్కడికి వచ్చినట్టయితే సంకెళ్ళు వేసి బంధించగలనని వాగ్దానం చేస్తున్నాను. ఓడలో అందర్నీ ఇంగ్లండు తీసుకుపోతాను. అక్కడ కోర్టులో విచారణ జరిపించి అందర్నీ ఉరితీయించినదాకా నిద్రపోనని కూడా వాగ్దానం చేస్తున్నాను. ఈ పద్ధతి మీకిష్టం లేకపోతే మీ గతి నక్కలకీ కుక్కలకీ ఎరుక. మీరు ఎన్ని రోజులు వెదికినా డబ్బు పట్టుకోలేరు. మీలో ఒక్కడికీ ఓడ నడిపించడం తెలియదు. అసలు మీరు మాతో యుద్ధమే చెయ్యలేరు. గెలుపు మాదే. ఇక పో. ఈ ప్రాంతంలో మళ్ళీ నీ ముఖం కనిపించిందంటే నీ రెండు గుళ్లలోకి రెండు

ండ్ల గురి చూసి వదులుతాను. ఏం బావుందా నే చెప్పింది? ఇవే నా ఆఖరి మంచి మాటలు. ఊ, లే. వెనక్కి తిరుగు. కుంటి కాలు ఆడించుకుంటూ పరుగెత్తు.''

కెప్టెన్ స్మాలెట్ ఇచ్చిన ఈ ఉపన్యాసంతో సిల్వర్ అవతారం పూర్తిగా మారిపోయింది. మొహంలో కత్తి వాటుకి నెత్తురుచుక్క లేదు. పైపు బూడిద దులుపుకున్నాడు. లేవబోతూ, ''కాస్త చెయ్యి అందివ్వండి'' అన్నాడు.

''నేనా? నీకా? ఫో అవతలకి,'' అని కసిరాడు కెప్టెన్.

'' ఏయ్ లోపలున్న వాళ్ళూ! ఎవరన్నా వచ్చి నాకు చెయ్యి అందిస్తారా?'' అని గర్జించాడు సిల్వర్. మేమెవ్వరం కదల్లేదు.

తనలో తను పరమ బూతులు తిట్టుకుంటూ దొంగల నాయకుడు ఇసుకలో పాకుతూ కంచెవరకూ వెళ్ళాడు. కంచె పుచ్చుకుని లేచి అక్కడ వదిలిపెట్టిన ఊతకర్రను తిరిగి పుచ్చుకున్నాడు. ఒక్క ఉదుటున అవతలికి లంఘించి మాకేసి తిరిగి,

''తస్సదియ్య! మిమ్మల్నందర్నీ ఊచకోత కోయిస్తా. నవ్వండి అలాగే నవ్వండి. రేపు ఈ పాటికి మీలో ఒక్కణ్ణికూడా మిగలనివ్వను'' అంటూ అతి వేగంగా చెట్ల గుబురులోకి నడిచి తన అనుచరుడితో సహా మాయమయ్యాడు.

19

సిల్వర్ పోకడను జాగ్రత్తగా గమనిస్తున్న కెప్టెన్ అతడు కనుచూపు దాటి పోగానే వెనక్కి తిరిగాడు. మొదట ఆజ్ఞాపించిన ప్రకారం మాలో ఎవ్వరం ఉండవలసిన చోట్ల లేము– ఒక్క అబ్రహాం గ్రే తప్ప. కెప్టెన్‌కు మా మీద కోపం రావడం మొదటిసారిగా చూశాను.

''పొండి, ఎవరి చోట్లలో వాళ్ళు ఉండండి. ట్రెలానీగారూ! మీ ప్రవర్తన ఆశ్చర్యకరంగా ఉంది. లివ్‌సేగారూ! మీరు వైద్యులు. మీరు కూడా ఇలా

క్రమశిక్షణ మర్చిపోతా రనుకోలేదు. అబ్రహాం గ్రే! నువ్వొక్కడివే నిజమైన కళాసీవి. నీ పేరు నా డైరీలో రాసుకుంటాను.''

కెప్టెన్ వెనక్కి తిరగ్గానే మేము ఎవరిచోట్లకు వాళ్ళం పోయి నుంచున్నాము. సిల్వర్ రాయబారపు సంప్రతింపులను వినే కుతూహలంలో మేము మాకు తెలియకుండానే వచ్చి కెప్టెన్ వెనక నిలబడ్డాం. మేము మా స్థానాల్లోకి మళ్ళీ పోయి నుంచోడం చూసి కెప్టెన్ సంతృప్తితో అన్నాడు:

''సిల్వర్ రాయబారం మీరు విన్నారు. ఇంక కాసేపట్లో మళ్ళీ యుద్ధం ప్రారంభం కావచ్చును. వాళ్ళకి సంఖ్యాబలం ఉన్నమాట నిజమే. కాని మనకి మట్టికోట రక్షణ వున్నది. మనం గనక క్రమశిక్షణ చెడకుండా నిలబడినట్టయితే శత్రువులను దుమ్ము చెయ్యగలమని నాకు నమ్మకం ఉన్నది.''

తరవాత కెప్టెన్ నలుపక్కలా తిరుగుతూ మట్టికోటను పరీక్షించాడు. తూర్పు, పడమరవైపుల గోడలకు రెండేసి కన్నాలు మాత్రమే ఉన్నాయి. దక్షిణపు గోడకు ద్వారం కాక మరి రెండు కన్నాలున్నాయి. ఉత్తరపు గోడకు అయిదు కన్నాలున్నాయి. మా ఏడుగురికీ మొత్తం ఇరవై తుపాకులున్నాయి. ఇంటి మధ్యలో కర్రల బల్లమీద తుపాకులను పేర్చాము. ప్రతి గోడవద్ద కూడా అలాంటి బల్లలున్నాయి. వాటిమీద కూడా తుపాకులను, కత్తులను, రెడీగా అమర్చాము.

''చలిమంట ఆర్పివెయ్యండి. సూర్యుడు బాగా పైకొచ్చాడు. మన కళ్ళకి ఈ పొగ అడ్డంకూడా ఎందుకూ?'' అన్నాడు కెప్టెన్. నన్ను చూసి ''జిమ్, నువ్వు ఏమీ తినలేదల్లే వుంది. నీ ప్లేటు తీసుకుపోయి నీ చోటులోనే కూర్చుని తిను. జాగ్రత్త! తిండిలో పడి బయటికి చూడడం మరిచిపోయేవు. ఏ క్షణాన్నైనా చెట్లలోంచి తుపాకి గుండ్లు రావచ్చు. హంటర్! అందరికీ తలొక గ్లాసు బ్రాందీ అందించు'' అని కెప్టెన్ ఆజ్ఞాపించాడు.

''డాక్టర్! మీరు ద్వారంవద్ద నిలబడండి. గోడ చాటున మాత్రమే వుండండి గాని బయటికి కనిపించకండి. హంటర్! నువ్వు తూర్పున కాపలా కాయ్. జాయిస్! నువ్వు పడమర గోడవద్ద. ట్రెలానీ గారూ! మాలోకల్లా మీరే తుపాకీ

విద్యలో సమర్థులు. మీరూ, గ్రే ఉత్తరపు గోడను రక్షించండి. జాగ్రత్త! ఆ వైపున అయిదు కన్నాలున్నాయి. శత్రువులు ఆ గోడను సమీపించారంటే మన పని అఖరు. మన గోడలోనుంచి మననే రాలగొడతారు. జిమ్! నువ్వూ నేను తుపాకీలు నింపి వీళ్ళకి అందిస్తూ ఉండడమే మనపని.''

కెప్టెన్ అపరిమితోత్సాహంతో ఇలా ఆజ్ఞలిస్తొంటే మాకు కూడా ఆ ఉత్సాహం విస్తరించింది. ఓ మహా యుద్ధంలో పాల్గొంటున్నంత ఉత్సాహంతో నిలబడ్డాం.

ఒక గంట గడిచింది. ఎంతసేపటికీ శత్రువు దర్శనం కాకపోయేసరికి మాకు విసుగుపుట్టింది. ఆవలిస్తూ బయట చెట్లమీద పక్షులకేసి చూస్తూ ఎంతసేపు గడపగలం? ఇంతలో జాయిస్ అతి అమాయకంగా అడిగాడు:

''కెప్టెన్! ఎవడన్నా కనిపిస్తే పేల్చమంటారా?''

మాకు ఆ ప్రశ్నకు నవ్వు వచ్చింది. కెప్టెన్ నవ్వును పెదవులనుంచి తొలగించుకుంటూ సమాధానమిచ్చాడు:

''పేల్చడానికే నీ చేతిలో ఆ తుపాకీ. దాంతో పిడేలు వాయిద్దామనుకుంటున్నావా?''

''సరేనండి సార్'' అన్నాడు జాయిస్ అంతే అమాయకంగా. జాయిస్ మాటతో మళ్ళీ అందరికీ ఉత్సాహం వచ్చింది. కొన్ని సెకన్లు ఊపిరి బిగబట్టి నిరీక్షించాము. హఠాత్తుగా జాయిస్ తుపాకి పేల్చాడు. వెంటనే చెట్ల చాటునుంచి టపటప తుపాకులు పేలి గోడలకు చాలా గుండ్లు కొట్టుకున్నాయి. ఒక్కటీ లోపలికి రాలేదు. పొగ చెదిరిపోగానే చూశాము కాని చెట్లలో ఒక్కడుకూడా కనిపించలేదు . మళ్ళీ నిశ్శబ్దం ఆవరించుకుంది.

'' ఒకణ్నెన్నా కొట్టావా?'' అడిగాడు, కెప్టెన్.

''లేదనుకుంటానండి'' అన్నాడు జాయిస్.

''జిమ్! జాయిస్‌కి ఇంకో తుపాకీ యిచ్చి ఖాళీ తుపాకి నింపు. డాక్టర్! మీ వైపున ఎందరున్నా రనుకుంటున్నారు?''

''ముగ్గురు. మూడుసార్లు మెరుపు కనిపించింది; మూడు తూటాలు ఈ వైపు పడ్డాయి'' అన్నారు డాక్టరుగారు.

''ముగ్గురా? మీ వైపున ఎందరండి ట్రెలానీగారూ?''

కాని ఉత్తరపువైపున ఎందరు కేంద్రీకరింపబడిందీ అంత తేలిగ్గా లెక్క కట్టడానికి వీల్లేకపోయింది. జమీందారుగారి లెక్కప్రకారం ఏడుగురు. గ్రే లెక్క ప్రకారం ఎనిమిదిమందో, తొమ్మిదిమందో. తూర్పు పడమరల ఒక్కొక్క శత్రువే ఉన్నట్టు తేలింది. కనుక ఎక్కువమంది ఉత్తరపు దిక్కున కేంద్రీకరింపబడ్డారని, ఆ వైపున యుద్ధం ముమ్మరంగా జరగవచ్చునని భావించాము. ఆ దిక్కును జాగ్రత్తగా రక్షించాలని, తిరుగుబాటుదార్లు ఏ ఒక్క కన్నం స్వాధీనపరుచుకున్నా, లోపలి వాళ్ళపని ఆఖరేనని కెప్టెన్ హెచ్చరించాడు.

ఇంతలో ఉత్తర దిశనున్న వృక్ష సమూహం నుంచి కొందరు తిరుగుబాటుదార్లు వెర్రి కేకలు వేసుకుంటూ, చెంగు చెంగున ఎగురుతూ మట్టికోటకు అభిముఖంగా రాసాగారు. అదే సమయంలో డాక్టరుగారున్న దిశనుంచి తుపాకి తూటాలు వచ్చి ఆయన చేతిలోని తుపాకిని తుత్తునియలు చేశాయి.

జమీందారుగారు, గ్రే మళ్ళీ మళ్ళీ తుపాకీలు కాల్చారు. ముగ్గురు దెబ్బతిని నేలకొరిగారు. పడినవారిలో ఒకడు లేచి తూల్తూ వెనక్కి పారిపోయాడు. మిగతా నలుగురు కంచెదాటి ఆవరణలో ప్రవేశించారు.

చెట్ల చాటునుంచి తుపాకులు పేలుస్తున్న వాళ్ళు ఈ నలుగుర్నీ ఉత్సాహపరుస్తూ అరుస్తున్నారు.

తండేలు జాబ్ అండర్సన్ తలకాయ కనిపించింది. ''పేల్చండిరా, వీళ్ళ పని పట్టాలి'' అని అరిచాడు. మరుక్షణంలో ఒకడు హంటర్ చేతిలో నుంచి తుపాకి లాక్కుని దాని మడమతో అతన్ని కొట్టాడు. ఇంకొకడు ఇంటి చుట్టూ పరిగెత్తి ద్వారం వద్దకు వచ్చి కత్తితో డాక్టర్ మీద కలబడ్డాడు.

మా పరిస్థితి క్షణంలో తారుమారైంది. ఒక నిమిషం కింద వరకూ మా సర్వాధీనంలో వున్న మట్టికోటలోకి శత్రువులు ప్రవేశించి మమ్మల్నే తరుముతున్నారు.

''బయటికి పదండి. అవతలికి పోయి వాళ్ళతో పోరాడండి. కత్తులు తీసుకోండి'' అని కెప్టెన్ అరిచాడు.

కత్తుల కట్టనుంచి ఒకటి లాగి పట్టుకున్నాను. అప్పుడే ఇంకొకరెవరో ఇంకో కత్తి లాగారు. లోపల తుపాకుల పొగ దట్టంగా అలుముకున్నందున మనిషికి మనిషి కనిపించడంలేదు. నేను బయటికి పరిగెత్తాను. నన్నెవరో వెంటాడుతున్నారు. ఎదురుగా డాక్టరుగారు కత్తి ఝుళిపిస్తూ, తన పైకి ఉరికిన శత్రువును తరుముతున్నారు. చివరి కాయన కొట్టిన దెబ్బకి వాడు మట్టికోట వెనక గల దిబ్బపైనుంచి దొర్లుకుంటూ దొర్లుకుంటూ కిందకి పడిపోయాడు.

ఇంతలో నన్ను తండేలు జాబ్ అండర్సన్ ఎదుర్కొన్నాడు. నన్ను చూడగానే సింహనాదంచేసి, కత్తి పైకెత్తాడు. నేను తప్పించుకొనే ప్రయత్నంలో పక్కకి దూకి, కాలు జారి దిబ్బనుంచి సరాసరి కిందకి దొర్లుకుంటూ పోయాను.

అదృష్టవశాత్తు అండర్సన్ నన్ను వెంబడించకుండా అబ్రహాం గ్రే అడ్డుపడి వాణ్ణి ఒక్క వేటులో వధించాడు. మరొక తిరుగుబాటుదారును తుపాకి పేల్చి చంపాడు. డాక్టరుగారు తన నెదుర్కొన్న శత్రువును పరలోకానికి సాగనంపారు.

ఇదంతా కొద్ది నిమిషాల్లో జరిగిపోయింది. చివరికి పొగ తేలిపోయిన తర్వాత చూడగా విజయం మా పక్షాన్నే వరించినట్టు స్పష్టపడింది. కాని ఆ విజయం ఏ ఖరీదుకు లభించిందో గ్రహించగానే మా మనస్సులెంతగా బాధపడ్డాయో చెప్పలేను. నమ్మినబంటు జోయిస్ చనిపోయాడు. హంటర్ తలమీద బలమైన గాయం తగిలి స్పృహ తప్పిపోయాడు. కెప్టెన్ కూడా అదే స్థితిలో జమీందారుగారి చేతుల్లో వాలిపోయి ఉన్నాడు.

''కెప్టెన్‌కు బాగా దెబ్బ తగిలింది'' అన్నారు ట్రెలానీగారు. ఇంతలో కెప్టెన్ స్పృహ కోలుకొని లేచి ''వాళ్ళంతా పారిపోయారా?'' అని ఆదుర్దాగా అడిగాడు.

'ఆ. పారిపోగలిగిన వాళ్ళంతా పారిపోయారు. అయిదుగురు మాత్రం ఇక ఎప్పటికీ పారిపోలేరు'' అన్నారు డాక్టరుగారు.

''అయిదుగుర్ని వధించామా? ఓ, చాలు ఇవ్వాల్టికి అది. ఫరవాలేదు. మొదట్లో వాళ్ళు పంధొమ్మిదిమంది, మనం ఏడుగురం. ఇప్పుడు వాళ్ళు తొమ్మిదిమంది. మనం ఆరుగురం.''

20

మళ్ళీ ఆ రోజున శత్రువుల బాధ మాకు తగల్లేదు. ఆ రోజల్లా ఒక తూటా కూడా పేలలేదు. మట్టికోట మా స్వాధీనంలోనే వున్నది. మా సామగ్రి యావత్తూ చెక్కు చెదరకుండా ఉన్నది. గాయపడినవారికి చికిత్స చేయడానికి, వంట వండుకోవడానికి తగినంత వ్యవధి లభించింది, వంట సరంజామా అంతా జయటికి చేరేసి నేను, జమీందారుగారు వంట ప్రారంభించాము.

ఆ రోజు యుద్ధంలో గాయాలు తిన్న ఎనిమిది మందిలో అయిదుగురు అప్పుడే చనిపోయారు. మిగతా వారిలో ఒకడు తిరుగుబాటుదారు. వాడికి డాక్టరుగారు శస్త్ర చికిత్స చేస్తుండగానే గుటుక్కుమన్నాడు. మరొకడు మా హంటర్. అతడు ఆ రోజల్లా బాధపడి బాధపడి సాయంత్రానికి ప్రాణాలు వదిలాడు. ఇక మిగిలినవాడు మా కెప్టెన్ స్మాలెట్, ఆయనకి దెబ్బలు తగిలాయిగాని ప్రాణ ప్రమాదకరంగా తగల్లేదు. ఒక తూటా బుజంలో నుంచి దూసుకుపోయింది. మరొకటి ఎడమ కాలికి తగిలింది. తప్పక నయమవుతుందని డాక్టరుగారు ధైర్యం చెప్పారు; కాని కొన్ని వారాలపాటు ఆయన కదలడానికీ , నడవడానికీ వీల్లేదని అన్నారు.

భోజనాలైన తరవాత డాక్టరుగారు, జమీందారుగారు కెప్టెన్ పక్కవద్ద కూర్చుని చాలాసేపు ఏవేవో చర్చలు జరిపారు. చివరికి డాక్టరుగారు లేచి టోపీ పెట్టుకుని జేబుల్లో పిస్తళ్ళు, నడుముకు కత్తి పెట్టుకున్నారు. చొక్కా జేబులో కాంచన ద్వీప పటం దాచుకున్నారు; పెద్ద తుపాకిని బుజం మీద ఆనించుకుని ఆవరణదాటి నడిచి చెట్లలో మాయమయ్యారు.

ఇదంతా నేనూ, గ్రే ఒకచోట కూర్చుని చూస్తున్నాము. డాక్టరు ఒంటరిగా అవతలికిపోవడం చూసి గ్రే ఆశ్చర్య చకితుడై నోట్లోంచి తీసిన పైప్ మళ్ళీ నోట్లో పెట్టుకోవడం మరిచిపోయి అలాగే చూడసాగాడు.

''డాక్టర్ లివ్‌సే గారికి పిచ్చెక్కిందా?''

''కాదు, కాదు. ఆయన బెన్‌గన్‌ని చూడడానికి వెడుతున్నారనుకుంటాను'' అని సమాధానమిచ్చాను. నా ఊహ రైటేనని తరవాత తెలిసింది.

ఈలోగా మట్టికోట యావత్తూ అట్టుడికి నట్టు ఉడికి పోతోంది. మచ్చెమటలు పోసి అక్కడ ఉండడం దుర్భరంగా వుంది. డాక్టరుగారు చల్లని చెట్ల నీడలో, సముద్రపు గాలిలో అలా షికారుకు వెడుతుంటే నాకు ఆయన మీద ఈర్ష్య పుట్టింది. అదీకాక నాకు భోజన పాత్రలు తోమి శుభ్రం చేసే పని, నేల శుభ్రం చేసే పని అప్పగించారు. ఆ పని చేస్తున్నంతసేపు నాకు డాక్టరుగారి మీద ఈర్ష్య, ఇక్కణ్ణించి దాటుకు పోవాలనే ఆసక్తి ప్రబలం కాసాగాయి. నేల ఊడుస్తూ ఊడుస్తూ బిస్కట్ల సంచిని సమీపించాను. ఎవరూ చూడకుండా రెండు జేబుల్లోను బిస్కట్లు నింపుకున్నాను.

నేను చేసేపని దుస్సాహసం, తెలివి తక్కువతనం అని స్పష్టంగా తెలుసు. అయినా అలా చెయ్యకుండా ఉండలేకపోయాను. ఏదన్నా అవాంతరం వస్తే రక్షణ కోసం రెండు పిస్తళ్ళు తూటాలతో నింపుకుని జాగ్రత్త పరిచాను. మరి కొన్ని తూటాలు, మందుకూడా జేబుల్లో పెట్టుకున్నాను. నా ఉద్దేశమేమిటంటే ద్వీపం తూర్పు తట్టునవున్న తెల్లగుట్టకు వెళ్ళి అక్కడ బెన్‌గన్ చెప్పిన పడవ వున్నదో లేదో చూడాలని. ఇదేమంత అత్యవసరమైన పనికాదు. ఆ పడవ అక్కడ ఉన్నా లేకపోయినా కొంపమునిగేదేమీ లేదు. కాని నేను షికారు పోవడానికి ఏదో ఒక నెపం వుండాలిగా. అందుచేత ఈ పని పేరుపెట్టి నన్ను నేను సమాధాన పరుచుకున్నాను. కెప్టెన్‌తోగాని, ట్రెలానీతోగాని చెబితే కదలనివ్వరని ''ఫ్రెంచి లీవ్'' పుచ్చుకుని పోవాలని నిశ్చయించాను.

చివరికి మంచి అవకాశం దొరికింది. ట్రెలానీగారు, గ్రే కెప్టెన్ వద్ద కూర్చుని

కట్లు వదులైతే మళ్ళీ కడుతున్నారు. ఆ పనిలో మునిగి వాళ్ళు నన్ను మరిచి పోయారు . ఇదే సమయమని నేను అవతలికి దాటాను. నేను చేస్తున్న పని తప్పు అని అడుగడుగునా మనసు పీకుతూనే ఉంది. మట్టి కోటలో ఉన్నదే ముగ్గురు. అందులో ఒకరు లేవలేని స్థితిలో వున్నారు. అలాంటప్పుడు నేను చెప్పకుండా పోవడం తప్పుకాదా? కాని చిన్నవాణ్ణి నేను ఉండి మాత్రం చెయ్య గలిగిన దేమిటిలే అని సమాధానపరుచుకుని బయలుదేరాను.

తూర్పుదిశగా నడిచాను. కుడిచేతివైపుగా సముద్రంలో కొంత దూరాన హిస్పానియోలా తరంగాలకు ఉయ్యాల లూగుతూ కనిపించింది. ఒడ్డున ఉన్న పడవలలో సిల్వర్, అతని అనుచరులు కూర్చుని పాటలు పాడుతున్నారు. తరంగాల హోరు క్రమేపీ ఎక్కువౌతోంది. సూర్యుడు టెలిస్కోప్ కొండ చాటుకు దిగుతున్నాడు. నెమ్మదిగా చీకట్లు వ్యాపిస్తున్నాయి., నేను వేగం హెచ్చించాను. ఆ సాయంత్రమే బెన్‌గన్ పడవను కనుక్కోవాలని, చీకటి బాగా పడకముందే మట్టికోటకు తిరిగి రావాలని నా ఊహ.

తెల్ల గుట్టను చేరుకున్నాను. అది ఎక్కి అవతలి వైపు దిగి చూశాను. కొంత సేపు వెదకగా పొదలు బాగా గుబురుగావున్న ప్రదేశంలో ఆకులలములతో కప్పబడివున్న పడవ కనిపించింది. నేనుకూడా పట్టనేమో అన్నంత చిన్నదిగా, ఇరుకుగా వుంది. చాలా కష్టం మీదగాని అది పడవ అని, అది నీళ్ళలో ప్రయాణానికి పనికి వస్తుందని ఎవరూ ఊహించలేరు. అంత దరిద్రంగా వుంది అది. ఏ పనిముట్లు లేకుండా, బెన్‌గన్ దాన్ని తయారు చేశాడు. మరింకెలా వుంటుంది ?

పడవను కనిపెట్టడమే నా ఆశయం కనక నేను వెనక్కి తిరిగివెళ్ళి పోవలసింది. కాని ఇంతలో ఇంకొక ఆలోచన తట్టింది. ఏదో మహా ఘనకార్యం చేస్తే గాని మళ్ళీ తిరిగి పోగూడదనిపించింది. బాగా చీకటి పడగానే పడవలో హిస్పాని యోలా వరకు వెళ్ళి లంగరుతాళ్ళు తెగగొట్టి వెయ్యాలనుకున్నాను. ఆ రోజు యుద్ధంలో మా శత్రువులు చాలా నష్టపడ్డారు. అందుచేత వాళ్ళు కాంచన

ద్వీపానికి, అక్కడి బంగారపు పాతర్లకి దణ్ణంపెట్టి హిస్పానియోలాలో వెనక్కి పోవాలని ఆలోచిస్తున్నట్టు నాకొక దృఢమైన అనుమానం కలిగింది. కనుక సిల్వర్ వాళ్ళు ఇంకా ఒడ్డున ఉండగానే ఓడ లంగరు ఛేదించి దాని దారిన దాన్ని పోనివ్వాలనుకున్నాను.

బాగా చీకటి పడేదాకా పడవలోనే కూర్చున్నాను. పొగమంచు దట్టంగా వ్యాపించి ఆకాశమంతా ఆవరించింది. ఆ చీకట్లో రెండే వెలుగులు కని పిస్తున్నాయి. ఒకటి ఓడలోని దీపం. ఇంకొకటి తీరాన సిల్వర్ వాళ్ళు వేసుకున్న చలిమంట.

అప్పుడు లేచి పడవను రెండు చేతులతోను ఎత్తి నీటిలో విడిచాను. కొంత దూరం వరకూ బురద నీళ్ళలో నడిచి తరవాత పడవలో ఎక్కి ప్రయాణం సాగించాను.

21

బెన్‌గన్ పడవమీద మొదట నాకు కలిగిన దురభిప్రాయం త్వరలో తొలగి పోయింది. నా ఎత్తు, బరువుగల మనిషికి ఆ పడవ చాలా సౌకర్యంగా ఉన్నది; కాని తీరా దాన్ని నడపబోయేటప్పటికి అంత సుకరంగా లేదేమో ననిపించింది. ఎంతసేపు తెడ్డువేసినా వలయంగా తిరుగుతుందే గాని ముందుకు పోదే? నేను వెళ్ళాలనుకున్న దిక్కుతప్ప మిగతా అన్ని దిక్కులకూ తిరుగుతోంది. చిన్నపిల్లణ్ణి బతిమాలుకున్నట్టు ఎన్నోసార్లు నెమ్మదిగా ప్రయత్నించాను దాన్ని సముద్రం లోకి నెట్టుదామని. కాని మళ్ళీ మళ్ళీ కెరటాలతోపాటు ఒడ్డుకే రావడం మొద లెట్టింది.

ఆఖరికి ఎలాగైతేనేం ప్రవాహ వేగంలో పడి హిస్పానియోలా వైపు ప్రయాణం సాగించింది నా పడవ. ఓడను సమీపించగానే లంగరు తాడు చేతికి అందింది; దాన్ని గట్టిగా పట్టుకున్నాను. నా జేబులో ఉన్న కత్తి తీశాను కాని ఇంతలో ఒక విషయం జ్ఞాపకం వచ్చింది. లంగరుతాడు చాలా బిర్రుగా వున్నది.

దానిని గనక అప్పుడు కోస్తే ఓడ ఒక్క గంతు వెనక్కి వేసి తర్వాత ముందుకు పోతుంది. ఆ వెనక్కి గెంతటంలో వెనకనేవున్న నేనూ, నా పడవ చిత్తయి పోతాము. ఏం చేద్దామని ఆలోచిస్తుండగా ఓడ నా పడవకు దగ్గరగా జరిగి లంగరుతాడు కొంచెం సడలింది. ఇదే సమయమని కత్తితో తాడును పరపర కోసేశాను. కాని పూర్తిగా కోయలేదు. ఇంకా కొంచెం పట్టు ఉన్నది. పూర్తిగా ఎందుకు కోయలేదంటే ఓడ మళ్ళీ దూరానికి జరిగి తాడు బిగిసింది. మళ్ళీ గాలి వాటుకి ఓడ దగ్గరికి జరిగేదాకా ఆగడం మంచిదనుకున్నాను.

ఇంతలో ఓడ గదిలోనుంచి పెద్ద పెద్ద కేకలు వినిపించాయి. అందులో ఒక గొంతుక సరంగు ఇజ్రాయెల్ హాండ్స్‌ది. రెండోది హాండ్స్‌తో పాటు ఓడకు కాపలాగా నియమించిన కళాసీది. వాళ్ళ కంఠాలను బట్టే వాళ్ళు తెగతాగి వున్నారని, మంచి మల్లయుద్ధంలో నిమగ్నులై వున్నారని గ్రహించాను.

ఒడ్డున చలిమంట వద్ద కళాసీలు కూడా తాగి తందనా లాడు తున్నారు. ఎవరో ''యో-హో-హో-బలె గుమ్మైన రమ్'' అని పాడు తున్నారు.

ఇంతలో గాలి వీచి హిస్పానియోలా ఇందాకటి వలెనే దగ్గరికి జరిగింది. అదను కనిపెట్టి నేను మిగిలిన తాడుకూడా కోసివేశాను. వెంటనే హిస్పాని యోలా గిర్రున ఒక చుట్టు తిరిగి నా పడవకు అభిముఖంగా రాసాగింది. ప్రాణ భయంతో నేను నా పడవను దూర దూరంగా నెట్టుకుంటూ ఓడవెనక భాగాన్ని సమీపించాను. అక్కడ ఓడగది దగ్గరనుంచి వేళ్ళాడుతూ నీళ్ళలో తేలుతున్న ఒక సన్నటితాడు చేతికందింది. దాన్ని ఆధారంగా చేసుకుని నా పడవను మెల్లిగా ఓడ దగ్గరికి జరుపుకుంటూ, ఓడలో కెక్కాను. లంగరుతాడు తెగిపోయి ఓడ ప్రమాద స్థితిలో ఉన్న సంగతిని కాపలా కళాసీలు ఇంతవరకూ గుర్తించలేదేమా అని ఆశ్చర్యపడుతూ గది కిటికీలోనుంచి తొంగిచూశాను. వారి ప్రమత్తతకు కారణం వెంటనే అర్థమైంది. ఇజ్రాయెల్ హాండ్స్, అతని తోటి కళాసీ భయంకరంగా యుద్ధం చేస్తున్నారు. ఒకరి మెడమీద ఒకరు చేతులువేసి ఒకరి నొకరు పడవేసే స్థితిలో ఉన్నారు. వెంటనే తాడు సహాయంతో మళ్ళీ నా

పడవలోకి వచ్చేశాను.

అప్పటికి ఓడ మొదటి సందిగ్ధస్థితి నుంచి తెప్పరిల్లి దెయ్యాలదీవికి కాంచనద్వీపానికీ మధ్య పడమటివైపున ఉన్న ఇరుకు సందుగుండా ప్రయాణం చేస్తున్నది. ఓడతోపాటు నా పడవకూడా ఆవైపే పోతున్నది. దెయ్యాల దీవిని దాటి పెద్ద సముద్రంలోకి ప్రవేశించామా అంటే ఓడమాట ఎలావున్నా నా చిన్న పడవ మాత్రం అలల తాకిడికి మునిగిపోక తప్పదు. ఇక నా జీవితం అంతమైనట్టేనని భావించుకుని భగవంతుణ్ణి స్మరించుకుంటూ, నా భవిష్యత్తు ఆయనకే వదిలి పడవలో కూర్చున్నాను. ఓడలోని ఇద్దరు కళాసీలుకూడా తమ ప్రమాదస్థితి గమనించారల్లే వుంది. ఆదుర్దాగా ఓడలో అటూ ఇటూ పరుగులిడుతున్న చప్పుడు వినిపించింది. అటువంటి సమయంలో వాళ్ళకీ ఏం చెయ్యాలో తోచివుండదు; అందుకని పోట్లాట విరమించి ఇద్దరూ కలిసి గాబరాపడుతున్నారు; పడవ కుదుపుకీ, అలల హోరుకీ అలసి ఎప్పుడు నిద్రపోయానో తెలియదు. చాలాసేపు గాఢంగా, నిశ్చింతగా మా అమ్మను గూర్చి, '' ఎడ్మిరల్ బెన్ బౌ'' గూర్చి కలలు కంటూ నిద్రపోయాను.

22

లేచేటప్పటికి బాగా తెల్లవారింది. నా పడవ కాంచన ద్వీపానికి నైఋతి మూలగా అలల్లో ఉయ్యాల లూగుతూ ప్రయాణిస్తున్నది. సూర్యుడు దయించాడు కాని ఇంకా టెలిస్కోప్ కొండ చాటునే ఉన్నాడు. డమాన్ దిబ్బ నాకు అనతి దూరంలో కనిపిస్తున్నది. తీరానికి రెండు ఫర్లాంగుల కంటె ఎక్కువ దూరంలో లేదు; వెంటనే ఒడ్డుకుపోయి దిగాలనిపించింది. కాని మరుక్షణంలో అది అసాధ్యమని గ్రహించాను. ఎందుకంటే డమాన్ దిబ్బపైనుంచి దొర్లిన బండరాళ్ళు అనేకం ఒడ్డు పొడుగునా నీళ్ళలో నుంచి పైకి కనిపిస్తున్నాయి.

ఏ రాతికి కొట్టుకున్నా నా పడవ తునాతునకలైపోక తప్పదు. అంతేకాదు. ఆ రాళ్ళ మీద ఒక దానిమీద నుంచి ఇంకోదానిమీదికి చెంగున ఎగురుతూ, వింత శబ్దాలు చేస్తూ, విచిత్ర జంతువులు కనిపించాయి. చూడ్డానికి మెత్త మెత్తగా నత్తలవలె ఉన్నాయి గాని పరిమాణంలో చాలా పెద్దవిగా ఉన్నాయి. దాదాపు అర్వై, డబ్భయ్‌దాకా ఉండి కుక్కలు మొరిగినట్టు మొరుగుతున్నాయి. అప్పుడు నాకు తెలియలేదుగాని తరవాత తెలిసింది, వాటిని సముద్ర సింహాలంటారని, అవి ఏమీ హానిచెయ్యవని. అప్పుడు మాత్రం వాటిని చూస్తే నాకు భయం పుట్టుకొచ్చింది.

డమాన్ దిబ్బ దాటాక తీరరేఖ వంకర తిరగకుండా పొడుగునా సూటిగా సాగిపోతుంది. కొంతదూరం పోయాక సింధుశాఖ, దానిపక్కన ఫ్లింట్ అగ్రం ఉన్నాయి. ఫ్లింట్ అగ్రంవరకు పోయి పక్కన సురక్షితంగా ఉండే సింధు శాఖలోకి పడవని పోనిచ్చి ఒడ్డుకు దిగడం మంచిదని నిశ్చయించుకున్నాను.

ఎలాగైతేనేం నా పడవ ఫ్లింట్ అగ్రాన్ని చేరింది. కాని అక్కడ మరో సమస్య ఎదురైంది.

అగ్రం దాటి తూర్పుగా తీరంకేసి తిరిగేసరికి సింధుశాఖలో నా పడవ కంటే ముందే హిస్పానియోలా వచ్చి నుంచుని ఉంది. ముందుకు పోయి ఓడలోని కళాసీల చేతుల్లో చావడమా, లేక వెనక్కిపోయి ఎక్కడా ఒడ్డుకు రావడానికి వీల్లేక ఆకలితో, దాహంతో మరణించడమా, ఏది తేలిక అనే సమస్య ఉత్పన్న మైంది.

తీరాచూస్తే ఓడలో మనుషులున్న అలికిడిగాని, జాడగాని లేదు. క్రితం రాత్రి లంగరు తాడు కోసివేయగానే నా పడవలాగే ఓడకూడా తరంగాలు ఎటు తిప్పితే అటు తిరుగుతూఫ్లింట్ అగ్రం దగ్గర సింధుశాఖలోకి చేరివుంటుంది. లోపలి మనుషులు తాగి మూర్ఛపోయి ఉన్నారో, లేక సముద్రంలో పడి చచ్చారో, ఒడ్డుకు ఈదుకుంటూ పోయారో ఊహించలేకపోయాను. ఏమైనా ఓడలోకే పోయి పరిస్థితులు చూడా లనుకున్నాను. నా పడవ ఓడను సమీపించ

గానే చుక్కాని కొయ్యలు, తాళ్ళు ఆధారంగా లోని కెగబాకాను.

ఓడ సరంబీ మీద నుంచున్నాను. అవతల చివర కళాసీలిద్దరూ ఉన్నారు. వాళ్ళు నన్ను చూడలేదు. ఒకడు రెండు చేతులూ, కాళ్ళూ బారజాచుకుని వెల్లకిలా పడుకున్నాడు. వాడికి దగ్గిరలో ఇజ్రాయెల్ హాండ్స్ సరంబీ పిట్టగోడకు ఆనుకుని తల రొమ్ము మీదికి వాల్చి కూర్చున్నాడు.

ఓడ గాలికిగాని, కెరటాలకుగాని అటూ ఇటూ ఊగినప్పుడల్లా నేల మీద పడుకునివున్న కలాసీ ఓడతోపాటు అటూఇటూ దొర్లుతున్నాడు. అలా దొర్లుతున్నవాడు లేవడం లేదేమా అని ఆశ్చర్యం వేసింది. స్పృహ లో లేడను కున్నాను. ఇజ్రాయెల్ కూడా ఓడ ఊగినప్పుడల్లా కొద్ది కొద్దిగా ఒరిగి చివరికి నేలమీద నిలువునా పడుకున్నాడు. దగ్గిరికి వెళ్ళి చూశాను. వాళ్ళచుట్టూ పగిలిన సీసాల పెంకులు, రక్తపు చారికలు ఉన్నాయి. ఒకళ్ళ నొకళ్ళు హత్య చేసుకుని ఉంటారనుకున్నాను.

ఇంతలో ఇజ్రాయెల్ మెల్లిగా మోచేతులమీద లేచి కూర్చోడానికి ప్రయ త్నించాడు. బాధతో నీరసంగా మూలుగుతున్నాడు. వంటినిండా గాయా లున్నాయి. పాపం వాణ్ణి చూడగానే జాలివేసిందిగాని ఆ రోజున యాపిల్ పీపా లోనుంచి విన్న మాటలు జ్ఞాపకం వచ్చి గుండెని కఠినం చేసుకున్నాను.

'' లేవోయ్ మిస్టర్ హాండ్స్'' అని పిలిచాను.

ఇజ్రాయెల్ అదిరిపడి వెనక్కి చూశాడు. నేను కదలకుండా అక్కడే నుంచున్నాను. అతడు అట్టే సేపు తల నిలపలేక మళ్ళీ పడిపోయి నీరసంగా ''రమ్! రమ్!'' అని బలహీనంగా అన్నాడు.

రమ్ తెచ్చే ఉద్దేశంతో నేను మెట్లుదిగి ఓడ గదిలోకి వెళ్ళాను. ఆ గది ఎంత బీభత్సంగా ఉన్నదో చెప్పలేను. ప్రతి అలమారు, డ్రాయరు, పెట్టె, పగలగొట్టి చూసినట్టున్నారు ద్వీప పటంకోసం. నేలమీద కాగితాలు, రమ్‌సీసాలు, ప్లేట్లు చిందర వందరగా పడి ఉన్నాయి. ఆ చెత్తలో వెదకగా, నిండా రమ్ ఉన్న సీసా ఒకటి దొరికింది. ఒక అలమారులో కొన్ని బిస్కట్లు, ద్రాక్షపళ్ళు, జున్ను ముక్క

దొరికాయి. అవి జేబులో వేసుకున్నాను. మంచి నీళ్ళ తొట్టి దగ్గిరికి వెళ్ళి ముందు కడుపునిండా మంచినీళ్ళు తాగాను. తర్వాత ఇజ్రాయెల్ వద్దకు వచ్చి రమ్‌సీసా అందించాను. ఆత్రంగా సీసా అందుకుని రెండు గుక్కల్లో అంతా ఖాళీ చేశాడు.

''బాగా దెబ్బలు తగిలాయా?'' అని అడిగాను, బిస్కట్లుతింటూ.

ఇజ్రాయెల్ నీరసంగా సమాధానమిచ్చాడు: '' ఆ డాక్టరు గనక ఉంటే రెండు నిమిషాల్లో లేచి తిరగ గలను. కాని నాకు అదృష్టం లేదు. అదే వచ్చిన బాధ. ఆ వెధవ చచ్చిపోయాడు. అసలు వాణ్ని ఎవరు రమ్మన్నారు ఇక్కడికి? అయితే హాకిన్స్‌గారూ! మీరిక్కడికి ఎల్లా వచ్చారు?''

'' ఓడను స్వాధీనం చేసుకునేందుకు వచ్చాను. నన్ను ఇప్పుడు కెప్టెన్‌గా గౌరవించాలి నువ్వు.'' అని డబాయించాను.

ఇజ్రాయెల్ తీవ్రంగా చూశాడు నా వంక . కాని కిమ్మనలేదు. ఇంత వరకూ మంచులా పాలిపోయిన అతని ముఖంలోకి రమ్ తాగడంతో కాస్త కళవచ్చినా ఇంకా బలహీనంగానే ఉన్నాడు. ఓడ ఊపుకు సరిగ్గా కూర్చోలేక పడిపోతు న్నాడు.

''మిస్టర్ హాండ్స్! చూడు, ఆ తెరచాప కొయ్యమీద మీ దొంగల జెండా ఎగరేశారు. అది అక్కడ ఉండడానికి వీల్లేదు. తీసివేస్తున్నాను.'' అని కొయ్యకు కట్టివున్న తాడువిప్పి నల్లజెండా దించివేశాను.

''కెప్టెన్ హాకిన్స్! మీరు ఒడ్డుకు పోవాలనుకున్నారు గదూ? నాక్కూడా పోవాలని ఉంది. కాని ఓడ నడిపేదెవరూ? మీకు ఆ పని ఏమీ చేతకాదు గదా! అందుకని మనం ఒక పనిచేద్దాం,'' అని ఆగి నా కళ్ళలోకి చూశాడు ఏమను కుంటున్నానో చూద్దామని.

''ఊ. చెప్పు,'' అన్నాను నా తిండి కానిస్తూ.

''ఏం లేదండి. మీరు నాక్కాస్త తింటానికేదన్నా తెచ్చి పెట్టండి. కాస్త గుడ్డ పేలిక ఒకటివ్వండి. ఈ దెబ్బకి కట్టు కట్టుకుంటాను. నేను లేచి అప్పుడు ఓడ నడుపుతాను.''

''సరే. ఒప్పుకున్నాను. కాని మళ్ళీ దెయ్యాలదీవి దగ్గరికి కాదు సుమా. ఈ ద్వీపానికి ఉత్తరాన ఉత్తర సింధుశాఖ అని ఉంది చూడు, అక్కడికిపోయి నా ఓడను అక్కడ ఆపుతాను, తెలిసిందా?''

''మీ ఇష్టం, ఎక్కడికి తీసుకెళ్ళమంటే అక్కడికి తీసుకెడతానండి. మీరు కెప్టెన్ గదాండి. మీరేం చెబితే అది వినడం నా ధర్మం. మరి త్వరగా ఏదన్నా తెచ్చియ్యండి.''

నేను మళ్ళీ కిందికిపోయి తినుబండారాలు, కాస్త రమ్, మంచి నీళ్ళు, ఒక గుడ్డపేలిక తెచ్చి ఇచ్చాను.. ఇజ్రాయెల్ అవన్నీ తిని తాగి కాస్త తేరుకున్నాడు. తొడలో తగిలిన పెద్దగాయానికి గుడ్డముక్క కట్టుకున్నాడు. కొద్ది నిమిషాల్లో లేచి నిలబడ్డాడు. ఓడను ముందుకు కదిలించడానికి ఏమేం చెయ్యాలో చెప్పాడు. తను చుక్కాని పట్టుకున్నాడు.

మరికొన్ని నిమిషాల్లో హిస్పానియోలా ఫ్లింట్ అగ్రందాటి ఉత్తరంగా ప్రయాణం సాగించింది. కొద్దికాలం పాటైనా, ఓడలో ఒకడుతప్ప ఎవరూ లేకపోయినా, నేను కెప్టెన్ గిరి చెలాయిస్తున్నందుకు గర్వపడ్డాను. ఇజ్రాయెల్ చాలా నమ్రతగా, భయభక్తులతో మెలగుతున్నాడు. కాని అతని కళ్ళలో నామీద ద్వేషం, పగ మెదులుతూ ఉండడం నేను చూడకపోలేదు. అందుచేత సాధ్యమైనంత దూరంగానే తిరుగుతూ, వెయ్యి కళ్ళతో వాణ్ని కనిపెడుతూనే ఉన్నాను.

23

గాలిపాటు అనుకూలంగా ఉన్నందువల్ల మా ఓడ ద్వీపం పడమటి తీరం వెంబడే ఉత్తరంగా ప్రయాణం చేసింది. ఉత్తర సింధుశాఖను సమీపిస్తున్నాము. సరంగు ఇజ్రాయెల్ ఎప్పటికప్పుడు నాకు ఇచ్చే సలహాలను బట్టి ఓడను నేనే ఎక్కువభాగం నడుపుతున్నాను.

''కెప్టెన్!'' అన్నాడు హాండ్స్, సరంబీ మీదనే ఉన్న రెండో కళాసీ శవాన్ని

చూపుతూ ''ఓబ్రియన్ ఎలాగూ చావనే చచ్చాడు. వాడి శవం కూడా ఇక్కడెందుకండి దిష్టిబొమ్మలాగ. కాస్త ఎత్తి సముద్రంలో పారేస్తారా?''

''నేనా? అంతబరువు మొయ్యలేను; అదీగాక నాకు శవాల్ని మొయ్యడం అలవాటు లేదు. అక్కడే ఉండనీ దాన్ని,'' అన్నాను.

'' ఇంత దరిద్రపు ఓడని ఎప్పుడూ చూడలేదండి కెప్టెన్! మనం బయల్దేరిన వేళా విశేషమేమిటో గాని ఈ హిస్పానియోలా మీద చాలా మంది కళాసీలు పాపం చచ్చిపోయారండి. ఒకమాట అడుగుతాను కెప్టెన్! ఈ ఓబ్రియన్ చనిపోయాడు కదా! నిజంగా అంటే, పూర్తిగా చచ్చిపోయాడంటారా? లేకపోతే దెయ్యమై మళ్ళీ వస్తాడంటారా! మీరు చదువుకున్నారు గదండి, అందుకని అడుగుతున్నా.''

''ఇజ్రాయెల్! శరీరాన్ని చంపగలవు గాని ఆత్మని చంపలేవు, ఆత్మ దెయ్యమై ఇంకో లోకంలో ఉంటుంది. ఓబ్రియన్ అక్కణ్నించి మనల్ని చూస్తూ ఉండి ఉంటాడు,'' అన్నాను.

''నిజంగానా కెప్టెన్? అయితే మనుషుల్ని చంపడం వట్టి దండగేనన్నమాట. అదేదో, మీరు చెప్పిన ఆత్మ- బతికివుంటే ఇహ ఎందర్ని చంపి మాత్రం లాభమేమిటి?-'' ఇజ్రాయెల్ హాండ్స్ ఇంతసేపు నా వంక చూడకుండా, నా చూపుల్ని తప్పించుకుంటూనే మాట్లాడుతున్నాడు. ఇప్పుడు ఆగి నావంక ఒక్కసారిచూసి మళ్ళీ కళ్ళు తిప్పుకున్నాడు. ఆ చూడడంలో వాడిలో వున్న ద్రోహబుద్ధి వ్యక్తమైంది. మళ్ళీ అన్నాడు ఇజ్రాయెల్: ''కెప్టెన్! ఈ రమ్ మరీ ఘాటుగా ఉందండి. బుర్ర తిరిగి పోతోంది. కాస్తంత ఆ కిందగదిలోకి వెళ్ళి బ్రాందీ సీసా ఉంటే తెచ్చి పెట్టండి మీకు పుణ్యం ఉంటుంది.''

ఇజ్రాయెల్ మాటల్లో ఒక్కదాన్నీ నేను నమ్మలేదు. ఎప్పుడూ రమ్ తప్ప మరేమీ తాగనివాడికి అది ఘాటు కావడమేమిటి? ఇదంతా ఏదో మోసపు ఆలోచనే. నన్ను సరంబీ నుంచి కిందికి పంపించి ఏదో చెయ్యాలను కుంటు న్నాడు. వాడి బెదురుచూపులు, విషంతో కూడిన చిరునవ్వు ఇవన్నీ చూస్తే నా అనుమానం మరింత దృఢపడింది.

''బ్రాందీ కావాలా? అలాగే. తెస్తానాగు,'' అన్నాను.

సరంబీ మెట్లు దిగి ఓడ గదికి వెళ్ళే నడవలో ఆగాను. ఇజ్రాయెల్ ఏంచేస్తాడో చూడాలనుకున్నాను. నేను ఓడ గదిలోకి వెళ్ళి ఉంటాను గదా అని ఇజ్రాయెల్ గబగబ కూర్చున్న చోటినుంచి లేచాడు. లేవడంలో తొడలోని గాయం నెప్పెట్టిందేమో, భీకరంగా మూలిగాడు. లేచి ఓబ్రియన్ శవం దగ్గిరికి వెళ్ళి దాని కిందవున్న బాకు తీశాడు. దానిమీద రక్తం గడ్డకట్టుకుని ఉన్నది. ఒక్కక్షణం దానికేసి చూసి చొక్కాలోపల దాచుకున్నాడు. మళ్ళీ ఎరగనట్టు తను మొదట కూర్చున్న మాదిరిగానే కూర్చున్నాడు.

నేను తెలుసుకోదలచింది ఇంతే. ఇజ్రాయెల్ లేచి నడవగలుగుతున్నాడు: వాడి దగ్గర ఒక ఆయుధం వుంది. కనుక వాడిచేతిలో నాకు అపాయం తప్పదు. జాగ్రత్తగా ఉండవలసిందే. కాని ఒక విషయంలో మాత్రం వాణ్ణి నమ్మాను. ఓడ ఉత్తర సింధు శాఖలోకి సురక్షితంగా చేరడం నాకెంత అవసరమో వాడికీ అంత అవసరమే. వాడి సహాయం లేందే నేను గాని, నా సహాయం లేందే వాడు గాని ఓడను నడిపే స్థితిలో లేము. అందుచేత ఓడ రేవును చేరేదాకా వాడు నాకేమీ హాని తలపెట్టడనుకున్నాను.

ఇలా ఆలోచిస్తూ ఓడగదిలోకి వెళ్ళి బ్రాందీ సీసాను వెదికి తీసుకున్నాను. సరంబీ మీదకి వచ్చి కొంతదూరంలో నుంచుని సీసాను హాండ్స్‌కు అందించాను. సీసామూతి పగులగొట్టి అతడు కొంత తాగాడు. తరవాత జేబులోనుంచి పొగాకు తీసి చుట్ట చుట్టుకున్నాడు.

ఇంకా మేము రెండు మైళ్ళు పోవలసివుంది; ఇజ్రాయెల్ చెప్పిన ప్రకారం తెరచాపలు ఎత్తుతూ దించుతూ, ఓడను పోనిస్తున్నాను. ఉత్తర సింధుశాఖను చేరాము. మలుపుతిరిగి ఆ చీలికలోనికి ప్రవేశించాము. సింధుశాఖ ఇరుకుగా ఉన్నది. ఆ ఒడ్డున దట్టంగా అరణ్యాలున్నాయి. తీరాలను దాదాపు తగులుతూనే ఓడ ముందుకు పోతోంది, తీరరేఖలు రెండూ కలుసుకునేచోటు సమీపించాము. అక్కడ శిథిలమై తునాతునకలై వున్న ఒక పాత ఓడ కని

పించింది.

''ఆ, ఇక్కడ చాలా బావుంది. ఇంత మంచి రేవు నేనెక్కడా చూడలేదు. ఆ తెరచాప దించండి. నెమ్మదిగా, నెమ్మదిగా.........'' అంటున్నాడు ఇజ్రాయెల్ నా వెనక కొద్ది దూరంలో నిలబడి.

నేను ఓడను తీరాన ఆపుచేసే సంరంభంలో ఇజ్రాయెల్‌ను, అతని చొక్కాలోని బాకును, అతని మోసాన్ని విస్మరించాను. హఠాత్తుగా గుండె ఝుల్లుమంది. ఎందుకు ఝుల్లుమన్నదో నా కప్పటికీ ఇప్పటికీ అర్థం కాలేదు. భయంకరమైన ప్రమాదం రాబోతున్నప్పుడు అలాగే జరుగుతుం దను కుంటాను. వెంటనే వెనక్కి తిరిగి చూశాను. ఇజ్రాయెల్ సగం దారిలో ఊగుతూ నుంచున్నాడు. చేతిలో బాకును ఎత్తి పట్టుకున్నాడు.

మా చూపులు కలుసుకోగానే ఇద్దరం ఒకసారే అరిచామనుకుంటాను. నా అరుపులో భయం వ్యక్తమవుతున్నది. అతని అరుపులో దౌర్జన్యం ఉన్నది. ఇజ్రాయెల్ అలా అరిచి నాకేసి దూకాడు. దూకడంలో నా అదృష్టవశాత్తు కాలు బెణికి ముందుకు పడ్డాడు. ఈ అదను చూసుకుని నేను దూరంగా పరిగెత్తాను. వాడు లేచేలోగా పంట్లాం జేబులోంచి పిస్తలు తీసి వాడికేసి గురిపెట్టాను. నా పిస్టల్‌ను లెక్కచెయ్యకుండా వాడు మీదికి వస్తున్నాడు. పిస్టల్ పేల్చాను. కాని పిస్టల్ మోగలేదు, పేలలేదు. నా ఆశ్చర్యానికి మితిలేదు. బెన్ గన్ పడవలో ప్రయాణం చేస్తున్నప్పుడు అలలకి నా పంట్లాం తడిసిపోవడం జ్ఞాపకం వచ్చింది. అప్పుడే, నా పిస్టల్ కూడా తడిసి పనికి రాకుండా పోయి ఉంటుందనుకున్నాను. పిస్టలును సరిగా పరీక్షించి బాగు చేసుకోనందుకు నన్ను నేను ఎంతో నిందించు కున్నాను.

ఇంతలో నా అదృష్టం కొద్దీ ఓడ తీరానగల ఇసుక దిబ్బలను కొట్టుకుని ఒక్కసారిగా కంపించింది. ఓడ వెనకభాగం పైకి లేచింది. ఆ అదురుకు నేను, ఇజ్రాయెల్ కూడా బోర్లాపడి వాలుగావున్న సరంబీ మీద దొర్లసాగాము. మాతో పాటు ఓబ్రియన్ శవం కూడా దొర్లసాగింది. ముందు లేచి నిలబడింది నేనే.

ఇజ్రాయెల్ మీదికి శవం దొర్లడం చేత వాడు దానితో కొంతసేపు కుస్తీ పట్టిగాని లేవలేకపోయాడు. ఈలోగా నేను దగ్గర్లోవున్న ఒక తెరచాప కొయ్యమీదికి ఎగబాకాను.

కొయ్యకు సగం ఎత్తున కట్టబడివున్న చట్రం వరకూ పాకి అక్కడ కూర్చున్నాను

ఇజ్రాయెల్ ఈలోగా నిలబడి మళ్ళీ ఒక అరుపు అరచి బాకు విసిరాడు. అది నా కాళ్ళకు కింద కొంత దూరంలో కొయ్యకు తగిలి నేలపై పడిపోయింది. ఇజ్రాయెల్ విస్తుపోయి, కళ్ళు చిట్లించుకుని నాకేసి చూస్తున్నాడు. నేను సురక్షిత స్థలం సంపాదించాను గదా అనే ధీమాతో చట్రంమీద కూర్చుని చొక్కా పై జేబులోంచి పొడిమందు, తూటాలు తీసి పిస్టల్ లోని తడిమందు తీసి పారవేసి తిరిగి నింపాను. జేబులో నుంచి ఇంకో పిస్టల్ తీసి దాన్ని కూడా పొడిమందుతో నింపాను. రెండు పిస్టళ్ళూ రెండు చేతులతో పట్టుకున్నాను. ఇంతసేపు ఇజ్రాయెల్ నేను చేస్తున్నపని శ్రద్ధగా చూస్తున్నాడు.

''ఇజ్రాయెల్: నువ్వు అడుగు ముందుకు వేశావంటే రెండుతూటా లొక్కసారిగా నీ తలలోంచి దూసుకుపోతాయి. జాగ్రత్త:''

ఈ బెదిరింపు వాడిమీద బాగా పనిచేసింది. ముందుకు రాబోతున్న వాడు అక్కడే ఆగిపోయాడు. అది చూసి నేను ధీమాగా నవ్వాను. ఇజ్రాయెల్ రెండు గుటకలు కష్టం మీద మింగి,

''కెప్టెన్: కాస్తలో తప్పి పోయింది గాని లేకపోతే ఈ బాకు నీ వీపును రెండు చెక్కలు చేసేది. ఉహు. నాకు అదృష్టం లేదు . ఇప్పటికైనా నిన్ను వదలి పెడతాననుకోకు,'' అంటూ నేను కూర్చున్న కొయ్యను సమీపించాడు. నేను వాడి మాటలు చిరునవ్వు నవ్వుకుంటూ వింటున్నాను. హఠాత్తుగా వాడు చెయ్యెత్తి కత్తి విసిరాడు. కత్తి నా బుజం పైన చర్మాన్ని చీల్చుకుంటూ కొయ్యకు గుచ్చుకుంది. అదే సమయంలో నేను పిస్టల్ పేల్చాను అప్రయత్నంగా. ఇజ్రాయెల్ హాహాకారం చేస్తూ కింద దభీమని కూలిపోయాడు.

24

ఓడ ఏటవాలుగా ఉండటంచేత ఇజ్రాయెల్ దెబ్బ తినడంతోనే నీళ్ళలో పడ్డాడు. ఒకటి రెండుసార్లు పైకి తేలాడు గాని, నీళ్ళు సద్దుకోవటంతో శాశ్వతంగా అడుగుకుపోయి అదృశ్యుడయ్యాడు.

శత్రువు తొలగిపోగానే నా దుస్థితి స్ఫురణకు వచ్చింది. ఇజ్రాయెల్ విసిరిన బాకు నా బుజం చీల్చుకొని కొయ్యకు గుచ్చుకుందని చెప్పాను. వీపుమీద, రొమ్ముమీద నెత్తురు కారుతున్నది. బాకు తెరచాప కొయ్యలో గట్టిగా ఇరుక్కుపోవడం మూలాన ఒక్క చేత్తో లాగి వెయ్యడానికి సాధ్యంకాలేదు. రెండు చేతుల్తో ఊడబెరికితే ఆ ఊపుకు నేను ముందుకు ఒరిగి నీళ్ళలో పడక తప్పదు. ఏం చేయడమా అనే భయంతో ఒక్కసారిగా ఆపాదమస్తకం కంపించాను. అప్రయత్నంగా కలిగిన ఆ కంపనకు బాకు ఊడిపోయి కిందపడింది. నెత్తురు ఇంకా ధారలుగా కారింది. ఎలాగైతేనేం కొయ్యనుంచి కిందికి పాకివచ్చి సరంబీ మీదకు చేరాను.

ఓడ గదిలోకి వెళ్ళి కొంత దూది, గుడ్డపీలికలు సంపాదించి గాయానికి కట్టుకున్నాను. గాయం లోతుగా తగల్లేదు. బుజం పై అంచు మాత్రమే తెగింది. ఆ చెయ్యి ఉపయోగించడానికి వీల్లేనంతగా నెప్పి పెట్టడం లేదు కూడా. అందుచేత గాయాన్ని గూర్చి కలత పడవలసిన అవసరం లేక పోయింది.

చుట్టూ చూశాను. ఈ ఓడ యావత్తూ నాదే కదా అని సంబర పడ్డాను. ఒక మూల సరంబీ పిట్టగోడ కానుకుని ఓబ్రియన్ శవం ఇంకా అలాగే వుంది. ఈ పాటి కది చాల వికృతంగా తయారై చూడ్డానికి భయం కలిగిస్తోంది. నడుం దగ్గర పట్టుకుని దాన్ని పిట్టగోడ నుంచి అవతలకు దొర్లించాను.

అప్పటికి సూర్యుడు బాగా పడమటికి వాలిపోయాడు. నేను ఒంటరిగా ఆ నిర్జన ప్రదేశంలో బిక్కు బిక్కుమంటూ నిలబడ్డాను. బాగా చీకటి పడకముందే మట్టికోటను చేరుకోవాలని అనిపించింది. నా సాహస కార్యాలను

ఎప్పుడు నా స్నేహితులకు వినిపిద్దామా అని ఆత్రుత ఎక్కువైంది. ఎవరితోనూ చెప్పకుండా సాహసించి పోయినందుకు మొదట చివాట్లు పెట్టినా, హిస్పానియోలాను శత్రువుల నుంచి తిరిగి స్వాధీనం చేసుకున్నందుకు, ఒక శత్రువునైనా కడతేర్చినందుకు కెప్టెన్ నన్ను అభినందించకపోడని భావించాను.

లంగరు తాళ్ళ ఆధారంతో నీళ్ళలోకి దిగాను. మోకాళ్ళవరకు మాత్రమే వచ్చాయి నీళ్ళు. ఒడ్డుకు చేరి దక్షిణంగా నడక ప్రారంభించాను. సూర్యాస్తమయమైంది. చంద్రుడు తూర్పున ఉదయించాడు. చంద్రకాంతిలో, చిరు చలిగాలిలో, ఉషారుగా కూనిరాగాలు తీస్తూ నడుస్తున్నాను. కొంత దూరం పరిగెత్తాను. కొంతదూరం నడిచాను. కాని మట్టి కోటను సమీపిస్తున్న కొద్దీ వేగం తగ్గించాను. నన్ను గుర్తించలేక నా మిత్రులే తుపాకి పేల్చి చంపెయ్య వచ్చునని భయపడ్డాను. అందుకని సాధ్యమైనంతవరకు చెట్ల నీడల్లోనే మెల్లిగా నడిచాను.

మట్టికోట ఆవరణను చేరగానే ఆశ్చర్యం పట్టలేకపోయాను. ఎందుకంటే మట్టికోట వెనక భాగాన పెద్ద దుంగలతో చలిమంట వెయ్యబడి ఉంది. మంటలు రేగక పోయినా దుంగలు కణకణ తగల బడుతూనే ఉన్నాయి. అంత పెద్ద మంట తయారు చేయడానికి నా మిత్రులకు అంత కలప ఎక్కణ్ణించి లభ్యమైందో అర్థం కాలేదు. ఒకవేళ కలప ఉన్నా దాని వద్ద మనుషులెవ్వరూ లేకపోవడం మరింత ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆశ్చర్యంతో పాటు కాస్త భయంకూడా కలిగింది.

కాని ముందుకే పోయాను. ఆవరణ చుట్టూ వున్న కంచెను దాటి చేతులతో, కాళ్ళతో పాకుకుంటూ మట్టికోట ద్వారం సమీపించాను. నా మిత్రులంతా గాఢ నిద్రలో వుండి గురకలు పెడుతున్నారు. అంత నిర్భయంగా, కాపలా కూడా లేకుండా వాళ్ళు నిద్రపోతున్నందుకు ఆశ్చర్యపడుతూ, ఇప్పుడు నా బదులు సిల్వర్ అనుచరులే వచ్చి అందరి తలలు నిద్రలోనే నరికివేస్తే ఏమవుతుంది? అని ఊహించుకుని వణికిపోయాను.

లోపల అంతా చీకటిగా వుంది. చడీ చప్పుడూ లేకుండా నా స్థానం లోకి పోయి పడుకోవాలని, తెల్లవారాక నన్ను చూసి వాళ్ళు దిగ్భ్రాంతు లవుతుంటే చూసి వెక్కిరించాలని అనిపించింది. ఊపిరికూడా బిగపట్టి పాకుతున్నాను. ఇంతలో నా చేతుల కేదో తగిలింది. ముట్టుకుని చూస్తే అది ఎవరిదో కాలు. ఆ కాలు తాలూకు మనిషి ఇటునుంచి అటు దొర్లి పడుకున్నాడు; ఇంతలో భయంకరమైన కఠోర శబ్దం వినిపించింది:

''పెసో, పెసో, పెసో...........'' ఈ ధ్వని ఎంతసేపటికీ ఆగడం లేదు.

'కెప్టెన్ఫ్లింట్;' సిల్వర్ చిలుక! ఏమిటిది? నేనెక్కడున్నాను? నా మిత్రుల మధ్య కాదా ?

చిలక అరుపులకు అంతా సందడిగా లేచారు. '' ఎవరక్కడ?'' అని సిల్వర్ గర్జించాడు. నేను లేచి ద్వారంకేసి పరిగెత్తాను పక్కకు తిరిగి పరిగెత్తబోయి ఇంకో మనిషికి ఢీకొట్టాను. అంతా కంగారు అయిపోయింది.

''కాగడా ముట్టించండిరా'' అని సిల్వర్ ఆజ్ఞాపించాడు. ఒకడు కాగడా పుచ్చుకుని చలిమంట వద్దకుపోయి అంటించుకుని వచ్చాడు.

25

కాగడా వెలుతురులో పరిస్థితి క్షణంలో అవగతమైంది. మట్టికోట, అందులోని మా సామగ్రితో సహా శత్రువుల ఆక్రమణలో ఉన్నది. అన్నిటికంటే నా భయాన్ని ఇనుమడింప జేసినదేమంటే ఒక్క ఖైదీకూడా కనబడలేదు. నా మిత్రులందర్నీ వధించి ఉంటారని భావించాను. వారితో పాటు మరణించేందుకు అవకాశం లేకుండా చేసుకున్నందుకు నన్ను నేను ఎంతో నిందించుకున్నాను.

సిల్వర్ బుజంమీద చిలక కూర్చుని రెక్కలను ముక్కుతో పొడుచుకుంటోంది. సిల్వర్ ఒక కొయ్య పెట్టెమీద కూర్చున్నాడు. మిగతా కళాసీలు చుట్టూ నుంచుని నాకేసి ఏమీ అర్థంకానట్టు వింతగా చూస్తున్నారు. సిల్వర్ ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అన్నాడు;

''ఒహో! జిమ్ హాకిన్స్ వచ్చాడా? తస్సదియ్య, ఏం చేస్తున్నామో చూద్దామని వచ్చావా? డిక్: కాస్త, ఆ కాగడా ఇటు అందివ్వు, పైప్ ముట్టించుకుంటాను. ఆ, చాల్లే, ఒరే, అబ్బాయిలూ! మీరు జిమ్ హాకిన్స్‌కి ఏమీ భయపడనక్కర్లేదు. అతడు చాలా మంచివాడు. మీరు ఏం తప్పులు చేసినప్పటికీ అన్నిటినీ క్షమిస్తాడు. తస్సదియ్య జిమ్! వచ్చావన్నమాట. పాపం సిల్వర్ ముసలాడు, ఏం చేస్తున్నాడో చూసి పరామర్శించాలని వచ్చావా? నువ్వు చురుకైన వాడివని తెలుసుననుకో. కాని ఇంత నిర్భయంగా ఇక్కడికి రాగలవని అనుకోలేదు సుమా. తస్సదియ్య''

సిల్వర్ మాటకు నేనేమీ సమాధానమివ్వలేదు. పైకి మాత్రం ధైర్యంగానే ఉన్నాను. కాని లోపల గుండెలు పీచు పీచు మంటూనే ఉన్నాయి. సిల్వర్ మళ్ళీ ప్రారంభించాడు:

''జిమ్! నేనిదివర కెన్నో సార్లు చెప్పాను. నువ్వంటే నాకెంతో ఇష్టమని. నీ ధైర్యం, చురుకుతనం ఎంతో మెచ్చుకుంటున్నాను. నిన్ను చూస్తే చిన్నప్పటి నా చేష్టలు జ్ఞాపకం వస్తున్నాయి. నువ్వు కూడా మాతో కలిస్తే ఎంత బావుండేది? నీక్కూడా కాస్త ధనం ముట్టజెప్పే వాళ్ళంకదా! నిజం చెప్పమంటావా జిమ్? నీమీద మీ వాళ్ళందరికీ కోపం వచ్చింది. ముఖ్యంగా డాక్టరుగారు నువ్వు మాలో కలిశావని అనుమానించి నిన్ను చంపేద్దామన్నంత కోపంగా ఉన్నారు. కనక నువ్వు వాళ్ళదగ్గిర కెలాగూ పోలేవు. ఇక నువ్వు మూడో పార్టీ స్థాపించా లనుకున్నా నీకు అనుచరులెవ్వరూ లేకపోవటం మూలాన అదీ లాభం లేదు. కనక మా పార్టీలో చేరడం తప్ప నీకు గత్యంతరం లేదు.''

సిల్వర్ ఉపన్యాసం వల్ల ఒక విషయం స్పష్టపడింది. నా మిత్రులెవ్వరూ చనిపోలేదు. అందుచేత వాళ్ళకు నాపై కోపం వచ్చిం దన్నమాట ఎలా ఉన్నా

నా మనస్సు కొంత శాంతించింది.

''అబ్బాయ్ జిమ్! నువ్వు మా చేతుల్లో చిక్కావని నిన్ను బాధిస్తామేమోనని భయపడకు. నీకిష్టం అయితే మాలో చేరు. ఇష్టం లేకపోతే మరి నీ ఉద్దేశమేమిటో చెప్పు'' అన్నాడు సిల్వర్.

వణుకుతున్న కంఠంతో నేనన్నాను: ''జవాబు చెప్పమంటావా?''

''చెప్పమనే అడిగేది, తొందరలేదు. బాగా ఆలోచించుకుని సావకాశంగా చెప్పు.''

''అయితే ఇదుగో, నేను తెలుసుకోవలసిన సంగతులు కొన్ని వున్నాయి. అసలేం జరిగింది? మీరిక్కడికి ఎల్లా వచ్చారు? నా స్నేహితులెక్కడున్నారు?''

'' ఏయ్, జాగర్తగా మాట్లాడు. అవన్నీ నీకు చెప్పడానికి వీల్లేదు'' అన్నాడొక కళాసీ.

'ఒరేయ్, నువ్వు నోర్మూయ్యరా. నేనిక్కడ మాట్టాడుతుండగా నీకెందుకు మధ్యలో'' అని గదమాయించాడు సిల్వర్ ఆ కళాసీని. మళ్ళీ నాకేసి తిరిగి చెప్పాడు: ''నిన్న మధ్యాహ్నంగావును. డాక్టరు లివ్‌సే సంధి జెండా పుచ్చుకుని మా దగ్గిరికి వచ్చారు. వచ్చి ''కెప్టెన్ సిల్వర్! మనపని అఖరు. హిస్పానియోలా మాయమైంది'' అన్నారు. మేము అబద్ధ మనుకున్నాం. తీరాచూస్తే రేవులో ఓడలేదు గీడలేదు. డాక్టరు గారన్నారు: ''కెప్టెన్ సిల్వర్? ఇక మనం ఎవరిదారి వాళ్ళు చూసుకోవలిసిందే. యుద్ధం మానేద్దాం. ఈ మట్టికోటను, అందులోని సావానూ మీరు తీసుకోండి. మా దారిన మమ్మల్ని పోనివ్వండి'' అని బతిమాలారు. సరే అని మేము ఒప్పుకున్నాం. వాళ్ళు ఎక్కడున్నారో మాకు తెలియదు.''

''ఇంతేనా'' అని అడిగాను.

''ఆ, నువ్వు వినదగింది ఇంతే'' అన్నాడు సిల్వర్.

''నేనేం చెయ్యదలుచుకున్నానో చెప్పమంటావా?'' అన్నాను.

''చెప్పు.''

''విను. జాగ్రత్తగా వినండి అంతా. నేను కుర్రాణ్ణి గదా అని డబాయిద్దా మనుకుంటున్నారేమో, అదేం లాభంలేదు. మీరు నన్ను మోసగించలేరు. మీకు ఓడ దక్కలేదు, మనుషులు దక్కలేదు. ఫ్లింట్ డబ్బు దక్కలేదు. మీరు ఓడిపోయారు. దీనికి కారణం ఎవరో తెలుసా? నేను. ఆ రోజు రాత్రి యాపిల్ పీపాలో దాక్కుని, మీ కుట్ర యావత్తూ విని మా వాళ్ళకు చెప్పింది నేను. హిస్పానియోలా లంగరు తాళ్ళు తెంపి, దానిమీద వున్న కాపలా వాళ్ళందర్నీ సముద్రానికి బలి ఇచ్చింది నేను. ఓడను మీ కెవ్వరికి తెలియని చోట దాచింది నేను. కనక మీరు నన్నేదో డబాయించాలని చూస్తే పప్పులుడకవు. నేనూ మిమ్మల్ని డబాయించాల్సింది. మీరంటే నాకేం భయంలేదు. చంపాలనుకుంటే చంపండి. నన్ను చంపినందువల్ల మీకేమీ లాభంలేదు. నన్ను వదిలేస్తే మీ ప్రాణాలు రక్షించడానికి ప్రయత్నిస్తాను.''

నేను గుక్క తిప్పుకోవడానికి ఆగాను. ఇంతసేపు కళాసీలు నిశ్చేష్టులై నాకేసి నోళ్ళు తెరుచుకుని చూస్తున్నారు. చివరికిలా అన్నాను:

''సిల్వర్! ఇక్కడున్న వాళ్ళలో నువ్వే మంచివాడివి. నన్ను చంపేస్తే చంపెయ్. కాని ఒక్క కోరిక చెల్లించు. డాక్టరుగారితో నేను వాళ్ళకు ద్రోహం చెయ్యలేదని, అంతా మంచి బుద్ధితోనే చేశానని చెప్పు, ఇంతే నే కోరేది.''

''జిమ్! అలాగే. జ్ఞాపకం ఉంచుకుంటాను నువ్వు చెప్పింది'' అన్నాడు సిల్వర్ అతని ధోరణి చూస్తే హేళనగా అన్నాడో, లేక నా ధైర్యానికి మెచ్చుకోలుగా అన్నాడో అర్థం కాలేదు.

''ఈ కుర్రాడింకోటికూడా చేశాడు. అప్పుడు నల్లకుక్కను కనిపెట్టింది కూడా ఇతనే'' అన్నాడు మోర్గన్. మోర్గన్ అంటే ఆ రోజున టెలిస్కోప్ హోటల్లో సిల్వర్‌తో మాట్లాడిన మనిషే.

''తస్సదియ్య. జిమ్ హాకిన్స్ బలేవాడులే. బిల్లీబోన్స్ దగ్గిర్నుంచి కాంచనద్వీప పటం కొట్టేసింది కూడా ఇతనే. మొదట్నుంచీ మనకి అడ్డంగానే ఉన్నాడు'' అన్నాడు సిల్వర్.

''అయితే సఫా ఈ దెబ్బతో'' అంటూ మోర్గన్ బాకుతీసి నావేపు నడిచాడు.

''ఆగు'' అని అరిచాడు సిల్వర్. ''ఎవర్రా నువ్వు? టామ్ మోర్గన్‌వి కాదూ? నాయకుడు నువ్వా నేనా? తస్సదియ్య. ఒక్కడుగు ముందుకు వేశావంటే గుద్దుకు చంపేస్తాను. జాగర్త ముప్పయ్యేళ్ళనుంచీ నా మాటకి ఎదురు చెప్పి బతికినవాడు లేడు. ఈ రోజుకు నువ్వు బయల్దేరావేం? తస్సదియ్య. అందర్నీ ఊచకోతగా నరికేస్తాను ఏమనుకుంటున్నారో?'' అని అడ్డం వచ్చాడు సిల్వర్.

మోర్గన్ ఆగాడు. కాని మిగతావాళ్ళలో గుసగుసలు అధిక మయ్యాయి.

''మోర్గన్ ఏం తప్పు చేశాడు?'' అడిగాడొకడు.

''చాలా రోజుల్నించి చూస్తున్నాను నీ ధోరణి. అంతా నీ ఇష్టమే తప్ప మా ఇష్టం లేదా?'' అన్నాడింకొకడు.

నోట్లోంచి పైప్ తీసి సిల్వర్ తన అనుచరులందర్నీ ఒకసారి కలయచూశాడు.

''అయితే మీరంతా నాతో దెబ్బలాటకి సిద్ధంగా ఉన్నారా? మాట్లాడ రేమర్రా ఒక్కళ్ళూ? మీకు నోళ్ళు లేవూ? ఇన్నేళ్ళు బతికి మీలాంటి వెధవ సన్నాసులకి జడుస్తానట్రా? రండి. కత్తి తీసుకుని ముందుకు రండి ఎవరు వస్తారో? ఈ పైప్ ఆరిపోయేలోగా వాణ్ణి నరకానికి పంపిస్తాను. తస్సదియ్య.''

ఎవ్వడూ కదల్లేదు. ఎవ్వడూ నోరెత్తలేదు. సిల్వర్ మళ్ళీ పైప్ నోట్లో పెట్టుకుని '' ఏం? ఒక్కడికీ దమ్ములు లేవూ? ఛీ! మీ మొహాలు చూస్తే డోకొస్తోంది. ఒక్కడికీ మొగతనం లేదు, నేను మీకు కెప్టెన్‌ని. నన్ను మీరే ఎన్నుకున్నారు. మీ అందరిలోకి నేనే మొగాణ్ణి కనక నన్నే ఎన్నుకున్నారు. మీకు నే నిష్టం లేకపోతే ఎవడైనాసరే ముందుకు వచ్చి యుద్ధం చెయ్యండి. అది మీకు చేతకాకపోతే నేను చెప్పినట్టు వినండి. ఆ కుర్రాడు మీకంటే నయం. అతనికున్న ధైర్యంలో పదోవంతు లేదు మీకు. అతనిమీద చెయ్యి వెయ్యదలుచుకున్న వాడెవడో ముందుకు రండి''

తరవాత కొంతసేపు అందరూ నిశ్శబ్దంగా ఉన్నారు. సిల్వర్ నా పక్షాన వాదించడంతో నాకు కొంచెం ఆశారేఖ తోచసాగింది. కళాసీలు ఒకమూల చేరి కొంతసేపు గుసగుస లాడారు. సిల్వర్ పెట్టెమీద కూర్చుని పైప్‌తీసి ధ్యానంలో పడ్డాడు. అయినా ఒక కంటితో అనుచరులను కనిపెట్టడం మానలేదు. చివరికి తుపుక్కున ఉమ్మేసి ఇలా అన్నాడు:

''మీరేదో చాలా చెప్పాలనుకుంటున్నారల్లే ఉందే? చెప్పండి త్వరగా.''

''సిల్వర్! నువ్వు నీ ఇష్టం వచ్చినట్టు చేస్తున్నావు. మాకు చాలా అసంతృప్తిగా ఉంది. ప్రతి ఓడ సిబ్బందికి కొన్ని హక్కు లుంటాయి. కొన్ని నియమా లుంటాయి. మా హక్కుల్నీ, నియమాల్నీ నువ్వు పాటించడం లేదు. అందుచేత మేము కొంతసేపు ఆలోచించుకోవా లనుకుంటున్నాం'' అని దురుసుగా అన్నాడొకడు.

''మీ ఇష్టం వచ్చినంతసేపు ఆలోచించుకోండి'' అన్నాడు సిల్వర్.

ఇందాకటి కళాసీ సిల్వర్‌కు సెల్యూట్ చేసి అవతలికి పోయాడు. ఇంకొకడు సిల్వర్‌కు చాలా వినయంగా సెల్యూట్ చేసి తడబడుతున్న అడుగులతో బయటికి వెళ్ళాడు. ఇలా ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు సెల్యూట్ చేసుకుంటూ పోయారు. నేను, సిల్వర్ మాత్రమే మట్టికోటలో మిగిలాము. సిల్వర్ నోట్లోంచి పైప్ తీసివేసి మొదలెట్టాడు:

''జిమ్ ! వెంట్రుకవాసిలో నీకు చావు తప్పింది, నన్ను వాళ్ళు తొలగిద్దామనుకున్నారు, కాని నీకేమీ అపాయం రానివ్వను. అసలు నువ్వు ఇందాక మాట్లాడిందాకా నిన్ను రక్షించా లనుకోలేదు. కాని, నీ ధైర్యం చూసి ఆశ్చర్యపోయాను. నిన్ను రక్షిస్తే నన్ను కూడా నువ్వు రక్షించగలవనుకున్నాను.''

''నేను చెయ్యగలిగింది చేస్తాను'' అన్నాను.

'' ఏం లేదు. అవసర మొచ్చినప్పుడు నాకు సహాయం చేస్తానని మాటివ్వు. తక్కినది నేను చూసుకుంటాను. ఈ వెధవల్లో ఒక్కడికి కూడా బుర్రలో మెదడు లేదు. నాకు మెదడున్నది. అందుచేత నేనిప్పుడు జమీందారుగారి పక్షం చేరిపోయాను. ఆ ఓడ నెక్కడ దాచావోగాని, భద్రంగా ఉందని నాకు తెలుసు.

హాండ్స్‌ని, ఓబ్రియన్‌ని ఖతం చేశావని కూడా తెలుసు. కనక చూడు. నువ్వూ నేనూ కలిసి వీళ్ళ కళ్ళలో దుమ్ముకొట్టి తప్పించుకోవాలి.''

సిల్వర్ పెట్టెమీదనుంచి లేచాడు. పెట్టె తెరిచి బ్రాందీ సీసా తీశాడు.

''కాస్త దాహం పుచ్చుకుంటావా జిమ్?''

''అక్కర్లేదు.''

''సరే, నేను పుచ్చుకుంటాను. ఇప్పుడు ఈ వెధవలతో కాస్త చెయ్యీ చెయ్యీ కలపాల్సి వస్తుందేమో? అన్నట్టు జిమ్! మీ డాక్టరుగారు ఆ పటం నాకు ఎందుకిచ్చాడంటావ్?''

నేను తెల్లబోతూ చూశాను. నాకు ఆ విషయం ఏమీ తెలియదని గ్రహించాడు గావును, సిల్వర్ మరి దాని సంగతి ఎత్తలేదు.

''ఇచ్చాడులే, నీకు తెలియదేమో? కాని అందులో ఏదో మోసం ఉన్నట్టు నా కనుమానం'' అంటూ సిల్వర్ గడగడ బ్రాందీ తాగాడు.

26

మట్టికోట ఆవరణలో సముద్రపు దొంగలు సమావేశమై రహస్య చర్చలు చేస్తున్నారు. కొంతసేపటికి వాళ్ళలో ఒకడు లోపలికి వచ్చి కాగడా కావా లన్నాడు. తీసుకుపొమ్మన్నాడు సిల్వర్. మేమిద్దరం చీకట్లో మిగిలాము.

దొంగలు ఏం చేస్తున్నారో చూడా లనిపించింది. గోడవద్దకు వెళ్ళి కన్నంగుండా తొంగిచూశాను. కంచె దగ్గరగా అందరూ గుమికూడి ఉన్నారు. మధ్యలో ఒకడు కూర్చుని చేతిలో పుస్తకం పట్టుకున్నాడు. వాడి పక్కన మరొకడు కాగడా పట్టుకుని వెలుగు చూపిస్తున్నాడు. మిగతా వాళ్ళు వంగుని చూస్తున్నారు. రెండు నిమిషాల తరవాత లేచి అంతా మట్టి కోటకేసి రాసాగారు.

నేను ఏమీ ఎరగనట్టు గది మధ్యలో ఉన్న కర్రల బల్ల పక్కన కూర్చున్నాను.

బిలబిల మంటూ కళాసీలు లోనికి వచ్చారు. సిల్వర్‌ను చూస్తూ నుంచున్నారు.

''ఏం సందేహిస్తారేం? ఏమాలోచించుకున్నారు? చెప్పేదేదో వెంటనే కక్కండి'' అన్నాడు సిల్వర్ నిర్లక్ష్యంగా.

కళాసీలు తమలో ఒకణ్ణి ముందుకు నెట్టారు. వాడు సిల్వర్‌కు గజం దూరంలోనే జంకుతూ ఆగాడు.

''మింగెయ్యనులే; ఏమిటీ సంగతి?''

కళాసీ సిల్వర్‌ను ఇంకా సమీపించి, తన కుడిచేతి గుప్పిలిని సిల్వర్ ఎడమచేతి గుప్పిలిలో ఉంచి, వెనక్కి వచ్చేశాడు. సిల్వర్ తన గుప్పిలి తెరిచి చూసి లేచాడు.

''తస్సదియ్య, నల్లచుక్క: అవును, నేనూ అదే అనుకున్నాను. మీకీ కాగితం ఎక్కడ దొరికింది? అరె. బైబిల్‌లో నుంచి ఈ కాగితం చింపారా? ఓరి యదవాయల్లారా, పవిత్ర గ్రంథాన్ని చింపవచ్చునట్రా?''

''నేను వద్దంటున్నా డిక్ చింపాడు,'' అని మోర్గన్ గొణిగాడు.

''డిక్! క్షమించమని ప్రార్థన చేసుకో...''

''సిల్వర్! మేమంతా కలిసి చర్చించి నీకు నల్లచుక్క ఇచ్చాము. అది తిప్పిచూడు. ఏమి రాసివుందో! తరవాత మాట్లాడుదువు గాని,'' అన్నాడు పిల్లికళ్ళ కళాసీ ఒకడు.

''బాగా చెప్పావు జార్జ్! నువ్వు వ్యవహారాలు నడపడంలో దిట్టమైనవాడివి. తస్సదియ్య. నల్లచుక్కను చూడమని నాకు ఆజ్ఞాపిస్తున్నావు కదూ? చూస్తాను. ''నిన్ను తొలగించాము''– అంతేనా? సరే. ఎవరిదో గాని ముత్యాలలాగా వుంది దస్తూరి. నీదేనా జార్జ్? సరే, ఇంకేం. తస్సదియ్య. గొప్పవాడివైపోతున్నావే? ఫరవాలేదు . నువ్వే కెప్టెన్‌వౌతావు నా తరవాత. కాస్త ఆ కాగడా అందించరా, పైప్ ఆరిపోయింది.''

''సిల్వర్!'' అన్నాడు జార్జి. ''నువ్వు మమ్మల్ని బుట్టలో వేసుకుందా

మనుకుంటున్నావేమో ఇంకా? నువ్వు తమాషా మనిషివిలే గాని, ఇప్పుడు నీ పప్పులేం ఉడకవు. రా, వోటింగు ప్రారంభిద్దాం.''

''వోటింగా? తొందరలేదులే దానికి. ఇంకా నేను మీ కెప్టెన్‌నే. మీకు కళాసీల నియమాలు, హక్కులు తెలుసునని ఇందాక అన్నారు. తెలియవని ఇప్పుడు రుజువౌతోంది. ఎందుకంటే ముందు నన్ను ఎందుకు తొలగిస్తున్నారో చెప్పనిదే నేను తొలగిపోను. అందాకా ఈ నల్లచుక్క గడ్డిముక్కతో సమానం'' అని సిల్వర్ చెప్పాడు.

''ఓ. నీకు కారణాలు కావాలా సిల్వర్? అయితే విను'' అన్నాడు జార్జి. ''మన సిబ్బందిలో ఇంతమంది చచ్చిపోయారంటే, మన కుట్ర అంతా నాశనమైందీ అంటే దానికి నువ్వే కారణం. రెండు: శత్రువులు ఈ మట్టికోట నుంచి దాటిపోతుంటే వాళ్ళనెదిరించ నివ్వలేదు. మూడు: పోనీ తరవాతనైనా వాళ్ళని ముట్టడించుదా మనుకుంటే అదీ వద్దన్నావు నువ్వు. నాలుగు: ఈ కుర్రాడు జిమ్ మన చేతిలో చిక్కాడు. వాణ్ణికూడా చంపనివ్వలేదు నువ్వు. ఈకారణాలకి ఏం జవాబు చెబుతావో చెప్పుకో.''

''ఇంతేనా, ఇంకేమైనా వున్నాయా?''

''ఇప్పటికి వీటికి సంజాయిషీ ఇద్దూ. తరవాత కావలిస్తే చెప్తానింకా.''

''జార్జ్! వరసన అన్నిటికీ సమాధానమిస్తాను విను. ఒకటి: ఇంత మందీ చచ్చారంటే నావల్లనే నన్నావు. మొదట్లో నే చెప్పింది మీకు జ్ఞాపకముందిగా? నే చెప్పినట్టు చేస్తే ఇవ్వాళ రాత్రికల్లా బంగారమంతా తవ్వి తీసివుండేవాళ్ళం. ఒక్కమనిషి కూడా బీరు పోకుండా అందరం హిస్పానియోలాలో తెరచాపలెత్తి బయలుదేరి వుండేవాళ్ళం. అయితే నేను చెప్పినమాటను వ్యతిరేకించిందెవరు? జాబ్ అండర్సన్, ఇజ్రాయెల్ హాండ్స్, జార్జ్. వీళ్ళా నన్ను కాదని తోసివేసింది. నేనేం చెయ్యగలను, ఇప్పుడు తప్పంతా నా మీదికి తోసివేస్తే.''

సిల్వర్ ఆగి స్నేహితుల వంక పరకాయించి చూశాడు. అతడు చెప్పిన దాంట్లో అబద్ధమేమీ లేదని వాళ్ళు ఒప్పుకుంటున్నట్టే కనిపించారు.

''మొదటి ఫిర్యాదు అయింది. నాలుగో ఫిర్యాదు ఏమిటి? ఈ కుర్రాణ్ణి ఎందుకు చంపలేదని. ఈ కుర్రాణ్ణి చంపుకుంటే మనకు వచ్చే లాభమేమిటి? ఇతడు మనదగ్గిర ఉన్నాడని తెలిస్తే, మనం ఏమాట చెబితే ఆ మాట చచ్చినట్టు వింటారు వాళ్ళు. ఈ కుర్రాడివల్ల మన కెంత లాభం కలగబోతుందో మీరే చూస్తారు. ఇక మూడో ఫిర్యాదు. వాళ్ళమీద ఎందుకు ముట్టడి చెయ్యలేదని. ఆరు గంటల కింద మీరే స్థితిలో ఉన్నారో మర్చిపోయినట్టున్నారు. జార్జ్? నీ మొహం పచ్చబడింది: తస్సదియ్య, కాళ్ళు చేతులు గిజగిజ బల్లిలాగ కొట్టుకున్నావు. నీ గుడ్లు తేలిపోతున్నాయి. మీలో ప్రతి ఒక్కడూ అదే మాదిరిగా ఉన్నాడు. డాక్టరు లివ్‌సే వచ్చి మీకు రోజూ వైద్యం చెయ్యకపోతే అంతా ఈపాటికే గుటుక్కుమని ఉండేవాళ్ళు. ఆయన ఇంకాస్సేపటిలో వచ్చి మళ్ళీ వైద్యం చేస్తాడు. అంత మంచి డాక్టరును చంపుకునేటంత తెలివితక్కువ వాళ్ళన్నమాట మీరు. మూడు ఫిర్యాదులకు జవాబు లిచ్చాను. రెండో ఫిర్యాదు: మట్టి కోటలోనుంచి వాళ్ళనెందుకు దాటి పోనిచ్చావని. దానికి కూడా సమాధానం కావాలా జార్జ్?''

''చెప్పు,'' అన్నాడు జార్జి వంచిన తల ఎత్తకుండా.

'' ఇదిగో ఇందుకు..'' అని అరిచాడు సిల్వర్ అతికోపంగా. జేబులో నుంచి ఒక పచ్చకాగితం తీసి నేలకు విసిరి కొట్టాడు. అది కాంచనద్వీప పటమని గుర్తుపట్టాను.

జార్జి ఆ కాగితం తీసుకొని మడత విప్పి ముందు తెల్లబోయాడు. పక్కవాడి కందించాడు. వాడి ఆనందం వర్ణించ తరం కాదు. వాడి చేతిలోంచి ఇంకోడు, వాడి చేతిలోంచి ఇంకోడు లాక్కొని, ఆత్రంగా ఆ కాగితాన్ని చూపుల్తో మింగేస్తున్నట్టు చూశారు. ''పటంరోయ్ పటం'' అని ఒకడు గంతులు వేశాడు. సిల్వర్ చేతిలోకి పటం ఎలావచ్చిందో నాకర్థం కాలేదు. కాని ఆ కళాసీల ముఖాలు చూడాలిప్పుడు. వాళ్ళు తమ కళ్ళను తామే నమ్మలేక పోయారు. ఎర్ర గుర్తులతో సహా అసలైన కాంచనద్వీప పటమే అది.

జార్జికి సిల్వర్‌మీద ఇంకా విధేయత, విశ్వాసం కుదరలేదు. ఇలా అన్నాడు. ''పటం దొరికిందని చంకలు కొట్టుకోనక్కర్లేదు. ఓడ ఏమైందో తెలియదు. ఇక్కడనుంచి బయట పడడమెలా?''

సిల్వర్ మొహం కోపంతో జేవురించింది. పిడికిలి బిగించి ఊపుతూ అరిచాడు: ''జార్జ్! నా కనవసరంగా కోపం తెప్పించకు. నీతో ద్వంద్వ యుద్ధం చెయ్యగలను. ఎలా బయటపడడమని నన్నడుగుతావేం? నాకేం తెలుసు? నా పథకానికి అడ్డు వచ్చిన నీకూ నీ స్నేహితులకే తెలియాలి. ఉహూ. మీవి మట్టిబుర్రలు. మీకు తెలియదు. దానికీ నేనే ఉపాయం కనిపెట్టాలి.''

ఎవ్వడూ నోరెత్తలేదు. సిల్వర్ ముఖంలోకి చూడలేక అందరూ తికమక పడుతూ మొహాలు వేలాడేసి నుంచున్నారు. సిల్వర్ ప్రారంభించాడు:

''తస్సదియ్య, ఒక్కడికీ నోరెత్తే దమ్ముల్లేవు. ఎలా ఉంటాయ్? మీరు ఓడను పోగొట్టుకున్నారు. నేను బంగారం సంపాదించి పెట్టాను. ఇక మీరేమన్నా ఏడ్చుకోండి. నేను రాజీనామా ఇచ్చేస్తున్నాను, నా దోవన నేపోతాను. మీరింకోణ్ణి ఎన్నుకోండి.''

''సిల్వర్! సిల్వర్! నువ్వే కెప్టెన్‌వి. నువ్వే ఉండాలి. శాశ్వతంగా నువ్వే మాకు కెప్టెన్‌వి'' అని అందరూ అరిచారు.

''సరే. మీరు కోరితే నేను కాదనను. జార్జ్: నువ్వు ఇంకా కొంత కాలం ఆగాలి కెప్టెన్ కావడానికి. అంతేకాదు, నేను పగ తీర్చుకునేరకం మనిషిని కాదు, కనుక అదృష్టవంతుడివి; బతికిపోయావు . అయితే ఈ నల్లచుక్క పారెయ్యవచ్చునా? డిక్! అనవసరంగా నీ బైబిల్ పాడు చేసుకున్నావు.''

సిల్వర్ నల్లచుక్కను నాకిచ్చాడు.

''జిమ్! ఇదిగో నల్లచుక్క, తీసుకో.'' అన్నాడు. నల్లచుక్కను తీసుకుని చూశాను. గుండ్రంగా వున్నది. ఒకవైపున బొగ్గుమసి పులమబడింది . అయినా బైబిల్‌లోని అచ్చు అక్షరాలు కనిపిస్తూనే వున్నాయి. రెండో పక్కన సిల్వర్‌ను కెప్టెన్ పదవి నుంచి తొలగిస్తున్నట్టు రాసివుంది (ఈ కాగితం ముక్క నా దగ్గిర ఇప్పటికీ వుంది. కాని చేత్తో రాసిన అక్షరాలు చెరిగి పోయినాయి.)

ఆ రాత్రికి ఆ వ్యవహారం అయిపోయింది. తరవాత తలొక గ్లాసూ రమ్ దాహం పుచ్చుకున్నారు. తరవాత ఎవళ్ళ చోటులో వాళ్ళు చేరి నిద్రపోయారు. సిల్వర్‌కు జార్జిమీద ఇంకా కోపంగానే ఉన్నట్టుంది. వాడికి శిక్షగా ఆ రాత్రంతా కాపలా కాయవలసిందని ఆజ్ఞాపించాడు. ఈమాటు తన నెదిరిస్తే పొడిచి పారేస్తానని బెదిరించాడు.

నన్ను ప్రాణాపాయం నుంచి రక్షించినందుకు సిల్వర్‌కు లోలోపలే ధన్యవాదాలర్పిస్తూ పడుకున్నాను. కాని ఎంతసేపటికి నిద్రపట్టలేదు. సిల్వర్ ఎంత చాకచక్యంగా తన అనుచరుల తిరుగుబాటును అణిచి వేశాడో తలుచుకుంటే ఇప్పటికీ నా కాశ్చర్యం కలుగుతుంది. ఆ రాత్రి మాత్రం నాకు ఎంతసేపటికీ నమ్మకం కలగలేదు–నేను పూర్తిగా సురక్షితుణ్ణి అయ్యానని, ఏ నిమిషంలో ఎటుపోయి ఎటు వస్తుందోనని ఆందోళన చెందుతూ ఎప్పుడో నిద్రలోకి జారాను.

27

తెల్లవార వస్తుండగా నన్నెవరో లేపారు. నన్నే కాదు ద్వారం వద్ద కాపలా ఉన్న జార్జితో సహా అందర్నీ లేపారు . కంచెకు అవతల నుంచున్న డాక్టర్ లివ్‌సే గారి కేకలే మమ్మల్ని లేపాయనుకుంటాను. డాక్టర్‌గారి కంఠం వినగానే నాకు ప్రాణం లేచి వచ్చింది. కాని కొంత భయంకూడా కలగకపోలేదు. నేను మిత్రులతో చెప్పకుండా పారిపోయినందుకు మనస్సు ఇంకా కలత పడుతూనే ఉంది. అందులో శత్రువుల ముఠాలో చేరినట్టు ప్రత్యక్షంగా కనిపిస్తూ ఆయనను ఏ ముఖం పెట్టుకుని చూడగలను?

''డాక్టర్! మీరా? రండి, రండిసార్! '' అంటూ సిల్వర్ శత్రుత్వమనేది కలలోకూడా ఎరగనంత ఆప్యాయంగా ఆహ్వానించాడు. ''చాలా చీకటితో లేచివచ్చారే? జార్జ్! లేచినుంచుని డాక్టర్‌గారికి సెల్యూట్ చెయ్యి. మీ

రోగులందరు కులాసాగానే వున్నారండి సార్! అంతేకాదు. మీకో తమాషా చూపిస్తాను. రండి త్వరగా.''

డాక్టరుగారు కంచెదాటి ఆవరణలోకి వచ్చారు. సిల్వర్ చూపిస్తానన్న తమాషా ఏమిటో నాకు తెలుసు. డాక్టరుగారు లోనికి రాగానే సిల్వర్ నన్ను రెక్క పట్టుకుని ముందుకు తీసుకొచ్చాడు.

''జిమ్ హాకిన్స్! ఇక్కడా?'' అని ఆశ్చర్యపోయారు డాక్టరుగారు.

''అవును జిమ్ హాకిన్సే. మీ జిమ్ హాకిన్సే'' అన్నాడు సిల్వర్.

''సరే ఆ సంగతి తరవాత చూద్దాం. ముందు రోగులను పరీక్షచెయ్యనియ్'' అన్నారు డాక్టరుగారు. ఆయన శత్రువుల మధ్య ఉన్న సంగతి మరిచిపోయినట్టే, తన ప్రాణం వీరి చేతుల్లో ఉన్న సంగతి ఎరగనట్టే ప్రవర్తిస్తున్నారు.

తల కట్టు కట్టుకున్న ఒక కళాసీని పరీక్షించి ''నువ్వు బాగానే ఉన్నావు. నీకు నయమయిపోయింది. జార్జ్! నీకెలా వుంది? అరె, నీ లివర్ తల్లకిందులైనట్టుందే? ఆ మందు పుచ్చుకున్నావా? జార్జి నేనిచ్చిన మందు తాగాడా?'' అన్నాడు లివ్‌సే.

''తాగాడండి సార్!'' అన్నాడు మోర్గన్.

''సరి, మంచిది. నేను సముద్రపు దొంగల డాక్టర్ని. ఉహు, కాదు ఖైదీల డాక్టర్ని. ఎందుకంటే వీలైనంత ఎక్కువ మందిని కోర్టులో హాజరుపరిచి ఉరికొయ్య ఎక్కించాలని నా ఆశయం. అందుచేత మీలో ఒకడుకూడా చావకుండా నేను జాగ్రత్తపడాలి'' అన్నారు డాక్టరు కొంటెగా నవ్వుతూ.

కళాసీలు తెల్ల మొహాలేసి డాక్టరుగారి ఛలోక్తిని చేదుమాత్ర మింగినట్టు మింగారు.

''డిక్‌కి జబ్బు ఎక్కువైందండి'' అన్నాడొకడు.

''అలాగా? డిక్! ఏదీ ఇట్రా. నోరు తెరు. నాలిక జాచు. అబ్బ నీ నాలిక చూస్తే ఫ్రెంచివాళ్ళు కూడా హడిలిపోతారు. వణుకుతున్నావేం? చలి వుందా?''

''వద్దురా అంటుంటే బైబిల్ కాగితం చింపాడు. మరి జ్వరంరాక ఏం

చేస్తుంది?'' అని గొణుక్కున్నాడు మోర్గన్.

''బైబిల్ చింపినందుకు కాదు నేస్తం! గాడిదల్లాగా ప్రవర్తించి నందుకు: నమ్మిన వాళ్ళపై కత్తి కట్టినందుకు: ఈ మలేరియా వదలడానికి మీరు ముందు మృత్యువుతో బేరాలాడాలి. సరే డిక్: ఇదిగో ఈ మందు తాగు,'' అని డాక్టరుగారు ఒక్కొక్కరికీ మందులు తీసి ఇచ్చి తాగించారు. వీళ్ళేనా హత్యలు, లూటీలు చేసే సముద్రపు దొంగలు అనిపించింది. డాక్టరుగారి ముందు స్కూలు కుర్రాళ్ళలాగ అయిపోయారు హంతకులు . అంతా అయిపోయిన తర్వాత లివ్‌సేగారు నా వంక చూసి ''సిల్వర్! జిమ్‌ని కాస్త బయటికి పంపించు. అతనితో మాట్లాడాలి, '' అన్నారు నిర్లక్ష్యంగా.

జార్జి ద్వారం వద్ద నుంచుని మందు చేదుగా వుంది కాబోలు ఖాండ్రించి ఉమ్మేతున్నాడు. డాక్టరుగారి మాట వినగానే, ''వీల్లేదు,'' అని అరిచాడు.

''నోర్ముయ్!'' అని గర్జించాడు సిల్వర్. తరవాత డాక్టరుగారితో ''సార్. అలాగేనండి. జిమ్‌ని అవతలకి తీసుకెళ్ళి మాట్లాడండి. మీరు మా మీద చూపించిన దయకి కృతజ్ఞులం. మీరు మంచివారని తెలుసు కాబట్టే మీరు విషమే ఇస్తున్నారో, మందు ఇస్తున్నారో కూడా ఆలోచించకుండా యీ సన్నాసిగాళ్ళంతా తాగారు, హాకిన్స్! నువ్వు ఒట్టేసుకో, డాక్టరుగారితో మాట్లాడి వెనక్కి వస్తానని, పారిపోనని.''

నేను తిరిగి వస్తానని ఒట్టేసుకున్నాను.

''అయితే సార్. మీరు కంచె అవతల నుంచోండి. జిమ్‌ని నేను తీసుకొస్తాను. అతడు కంచె ఇవతల నుంచి మీతో మాట్లాడతాడు. జమీందారుగారికీ, కెప్టెన్ స్మాలెట్ గారికీ మా నమస్కారాలు చెప్పండి.''

డాక్టరుగారు అవతలకు వెళ్ళారు. వెంటనే సిల్వర్ అనుచరులు అతన్ని నిందించ నారంభించారు. జమీందారుగారి పక్షాన చేరాలని చూస్తున్నాడని, తమని మోసగించాలని ఎత్తు వేస్తున్నాడని దూషించారు. సిల్వర్ అరణ్యమంతా మారు మ్రోగేట్టు హుంకరిస్తూ, ''మీరంతా చవటలు, వెధవలు, మూర్ఖులు''

అన్నాడు. అనుచరులంతా భయపడి కిమ్మనకుండా నోరుమూసుకున్నారు. సిల్వర్ విజయగర్వంతో నా భుజంమీద చెయ్యివేసి బయటికి వచ్చాడు.

డాక్టరుగారు మందులపెట్టె పట్టుకుని కంచె అవతల నాకోసం నిరీక్షిస్తున్నారు. ఆయన్ని సమీపించగానే సిల్వర్ మెల్లిగా అన్నాడు:

''డాక్టరుగారూ! జిమ్ హాకిన్స్ చెబుతాడు మీకు నా సంగతి. నా అనుచరులనందరినీ ఎదిరించి అతని ప్రాణాలు ఎలా రక్షించానో చెబుతాడు. మీరు నన్నో కంటితో కనికరించి చూడాలి. నేనేమన్నా అపరాధం చేస్తే క్షమించాలి'' అన్నాడు సిల్వర్.

''ఏం భయపడుతున్నావా కెప్టెన్ సిల్వర్?''

''భయం కాదండి సార్, ఈ పిరికిపందలు నన్నేం చెయ్యలేరు. అది కాదు; నాకు జైళ్ళు, విచారణలు, ఉరికొయ్యలు ఇవన్నీ అంటే అసహ్యమండి. అంచేత నన్ను దయచూడాలని కోరుతున్నాను. సరే, నేను దూరంగా అక్కడ కూర్చుంటానండి. మీరు, జిమ్ మాట్లాడవలసింది మాట్లాడండి'' అంటూ సిల్వర్ మా మాటలు వినబడనంత దూరానికి పోయి ఒక కొయ్య దుంగపై కూర్చుని పైపు కాలుస్తున్నాడు. అప్పుడప్పుడు మాకేసి, ఒక్కోసారి మట్టికోటలో గుసగుస లాడుతున్న తన అనుచరులకేసి దృష్టి సారిస్తున్నాడు.

''జిమ్! చివరి కిదా నువ్వు చేసింది? వచ్చి వచ్చి శత్రువుల చేతిలో చిక్కావా? పైగా కెప్టెన్ స్మాలెట్ గాయం తిని బాధ పడుతుండగా ఇలా పారిపోవడానికి నీకు మనసెలా వొప్పింది?'' అని డాక్టరుగారు ప్రారంభించారు.

నేను ఏడవడం మొదలెట్టాను. ''డాక్టరుగారూ! నేను చేసింది ముమ్మాటికీ తప్పే. క్షమించండి. నన్నెలాగూ వాళ్ళు చంపేస్తారు. ఈ పాటికే చంపేసే వాళ్ళు, సిల్వర్ అడ్డం రాకపోతే. నేను చావుకు భయపడడంలేదు. సముద్రపు దొంగల సంగతి మీకు తెలుసుగా. చేతిలో చిక్కిన ఖైదీని చిత్రహింస పెట్టిగాని చంపరు. అదే నాకూ జరుగుతుందేమోనని భయపడుతున్నాను.''

''జిమ్! అలా ఎన్నటికీ జరగనివ్వను. చెయ్యి ఇటు అందించు, ఒక క్షణంలో

వీళ్ళ కళ్ళలో కారం కొట్టి పారిపోదాం.''

''డాక్టరుగారూ! నేను సిల్వర్‌కి వాగ్దానం చేశానండి.''

''నాకు తెలుసు. కాని నీ ప్రాణం రక్షించుకోడానికి పారిపోవడం కూడా తప్పేనా? ఒకవేళ తప్పు అయితే ఆ పాపం, అవమానం నేను భరిస్తానులే. రా. పారిపోదాం, నిన్నిక్కడ వదిలిపెట్టి పోలేను'' అని డాక్టరు లివ్‌సే నన్ను బలవంతం చేయసాగారు.

''వద్దండి డాక్టరుగారూ! మీమాట కాదంటున్నందుకు క్షమించండి, మీరే అయితే ఇలా వాగ్దాన భంగం చేసి పారిపోయేవారా? మీరే కాదు. జమీందారుగారు, కెప్టెన్ స్మాలెట్ కూడా అలా చేసేవారు కాదు. నేను కూడా అంతే. సిల్వర్ నా వాగ్దానం నమ్మి ఇక్కడ వదిలిపెట్టాడు. ఇప్పుడు నేను నమ్మక ద్రోహం చెయ్యలేను. వాళ్ళు నన్ను అంతగా హింస పెట్టేటట్టయితే హిస్పానియోలా ఎక్కడున్నదో చెబుతానేమో. అంతకంటె మరొక్కమాటకూడా చెప్పను.''

''హిస్పానియోలా ఎక్కడుంది?'' అని డాక్టరుగారు చకితులై అడిగారు.

''ఉత్తర సింధుశాఖలో ఉంది. నేనే దాన్ని దెయ్యాల దీవి దగ్గర రేవునుంచి తప్పించి, కాపలా కళాసీలను చంపి సింధుశాఖలో చేర్చాను, అక్కడది సురక్షితంగా ఉంది'' అంటూ నేను చేసిన సాహస కృత్యాలన్నీ క్లుప్తంగా వర్ణించాను.

''ఇందులో ఏదో విచిత్ర భగవత్సంకల్పం ఉన్నట్టు తోస్తోంది. ప్రయాణం మొదలైన దగ్గర్నుంచి అడుగడుగునా నీ వల్లనే మేము రక్షింపబడుతున్నాము. కుట్రను నువ్వే కనిపెట్టావు, బెన్‌గన్‌ని నువ్వే కనుక్కున్నావు; బెన్‌గన్ గనక నీకు ఆ రోజున కనిపించి ఉండకపోతే మన మిన్ని వేల మైళ్ళు రావడం శుష్క ప్రయాస అయ్యేది. అన్నట్టు సిల్వర్! సిల్వర్!'' అని డాక్టరుగారు సిల్వర్‌ను పిలిచారు.

సిల్వర్ మా దగ్గిరికి వచ్చాడు.

''సిల్వర్! నువ్వు ఆ పటం పుచ్చుకుని వెర్రివాడి లాగ పాతరకోసం

వెదకబోకు. అనవసరంగా కష్టపడతావని చెబుతున్నా'' అన్నారు డాక్టరుగారు.

''కాదండి సార్. పాతరకోసం వెదక్కుండా కూర్చుంటే నాకూ, జిమ్ హాకిన్స్‌కూ కూడా అపాయం. డబ్బుకోసం ప్రయత్నిస్తున్నట్టు కనీసం నటించనైనా నటించాలి.''

''వెదికితే వెదుకుగాని ఆశ్చర్యపడడానికి సిద్ధంగా ఉండు'' అన్నారు డాక్టరుగారు.

''సార్! మీరు చెప్పేది నాకేమీ బోధపడడం లేదండి. మీరు మట్టికోట నెందుకు వదిలిపెట్టారో, పటం ఎందుకిచ్చేశారో, నాకు తెలియదు. మీరేదో రహస్యం దాస్తున్నారు ఏమిటది?''

''ఇంతకంటే ఎక్కువ చెప్పడానికి వీల్లేదు. సిల్వర్! అది నా రహస్యం కాదు. మా అందరిదీని. అందుచేత నీకు తరవాత తరవాతగాని చెప్పడానికి వీల్లేదు: కాని ఒకటి మాత్రం నిశ్చయంగా చెప్పగలను. జిమ్ హాకిన్స్‌ను రక్షించి మా పక్షాన కలిస్తే నీకు ఇంగ్లండులో ఉరిశిక్ష వగైరాలేమీ లేకుండా చేస్తాను.''

సిల్వర్ మొహం చేటంతయింది. ''సార్. మీరు చెప్పింది బావుంది. నాకు నచ్చింది. మీరు చెప్పినట్టు చేస్తాను.''

''అచ్చా! గుడ్‌బై. ఇక పోతాను. జిమ్, జాగ్రత్తగా ఉండు,'' అంటూ డాక్టరుగారు చకచక నడిచి కనుమరుగైపోయారు.

28

డాక్టరుగారు వెళ్ళగానే నేను, సిల్వర్ మట్టికోటలోకి వెళ్ళాము. కళాసీలు వంట పూర్తి చేశారు. మా కోసం ఎదురు చూస్తున్నారు. మేము రాగానే భోజన పదార్థాలన్నీ వడ్డించారు. అందరం కూర్చున్నాం. చిలక సిల్వర్ బుజంమీద కూర్చుంది. సిల్వర్ అందర్నీ ఛలోక్తులాడుతూ నవ్విస్తున్నాడు.

''అరేయ్ అబ్బాయిలూ! లాంగ్ జాన్ సిల్వర్ ఇంకా మీతోనే వున్నాడు గనక మీరు బతికిపోయారు. మనక్కావలసిన దాన్ని సంపాదించాను. ఆ ఓడ మాత్రం వాళ్ళ దగ్గిరే వుంది. ఎక్కడ దాచారో నాకు తెలియదు. పాతర తవ్వి బంగార మంతా సంచుల్లో పోసుకుని సిద్ధమయ్యాక అప్పుడు వెదుకుదాం ఓడ కోసం. ఓడ మన చేతికి వచ్చిందీ అంటే తస్సదియ్య వాళ్ళ పని ఆఖరే.''

నోట్లో మాంసం ముక్కలు కుక్కుకుంటూ సిల్వర్ ఈ రీతిగా అనుచరులను ఉషారు చేస్తున్నాడు. మనుషులను మాటలతో బుట్టలో వేసుకోడం సిల్వర్‌కు ఉగ్గుతో పెట్టిన విద్య అనిపించింది.

''ఇక జిమ్ హాకిన్స్ సంగతి. మనం ద్వీపంలోకి బయలు దేరేటప్పుడు తాడుతో కట్టి మనతో తీసుకుపోదాం, ఈ కుర్రాణ్ణి మన దగ్గిర తాకట్టు పెట్టారు వాళ్ళు. బంగారం, ఓడ–రెండూ సంపాయించాక హాకిన్స్‌ని మీ కప్పగించేస్తాను. అతన్ని మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి.''

ఈ మాటలతో కళాసీలకు సిల్వర్ మీద మరింత నమ్మకం కుదిరింది. సిల్వర్ ఏది చేసినా తమ మంచి కోసమేనన్న భావం కలిగినట్లుంది. నాకు మాత్రం మళ్ళీ భయాలు, సందేహాలు చెలరేగాయి. సిల్వర్ ముఖం చూస్తే, నిజంగా అంటున్నాడో, ఊరికే అంటున్నాడో కనుక్కోవడం కష్టం. ఒకవేళ అతనికి బంగారపు పాతర, ఓడకూడా అనుకున్నట్టే లభ్యమైతే డాక్టరుగారికిచ్చిన వాగ్దానాలన్నీ భంగంచేసి నన్ను ఒక దెబ్బతో హత మారుస్తాడనేది నిస్సందేహం.

అలాగాక అతడు నిజంగానే మా పక్షాన చేరదలుచుకున్నట్టయితే అతని కుతంత్రం మిగతా వారికి తెలియకుండా ఎక్కువ కాలం దాచలేడు. అప్పుడు నేను, సిల్వర్ కలిసి బలాఢ్యులు, సాయుధులు అయిన కళాసీలతో పోరాడాలి. మేమిద్దరం అందరి నెదుర్కొని బతకడం కలలో మాట.

ఇవన్నీ ఇలా వుంచి నా మిత్రుల ప్రవర్తన నాకింకా అయోమయ సమస్యగానే ఉంది. వాళ్ళు మట్టికోట ఎందుకు విడిచిపెట్టినట్టు? కాంచన ద్వీప పటం సిల్వర్ కెందుకు ఇచ్చేసినట్టు? ''ఆశ్చర్య పడడానికి సిద్ధంగా ఉండు'' అని డాక్టరు

గారు సిల్వర్‌తో ఎందుకన్నారు? ఈ ప్రశ్నలతో నా మనస్సు అల్లకల్లోలమై భోజనం సయించనేలేదు.

భోజనాల తరవాత తిరుగుబాటుదార్లంతా గుప్తధనంకోసం బయలు దేలారు. నేను తప్ప మిగతా అందరూ సమృద్ధిగా ఆయుధాలు ధరించారు. సిల్వర్ బుజానికి రెండు తుపాకీలు తగిలించుకున్నాడు. బెల్టుకొక కత్తి తగిలించాడు. జేబుకొక పిస్టల్ చొప్పున దాచుకున్నాడు. ఈ అవతారానికి తోడు కెప్టెన్ ఫ్లింట్‌ను బుజాన ఎక్కించుకున్నాడు. పెంపుడు ఎలుగుబంటిలాగా అతని వెనక నేను నడిచాను.

మిగతా కళాసులు రకరకాల పనిముట్లు ధరించారు. గడ్డపలుగులు, పారలు, గొడ్డళ్ళు, గోనెసంచులు, తినుబండారాల సంచులు మొదలైనవన్నీ చేత పట్టుకున్నారు.

కళాసీలు సరాసరి ద్వీపంలోకి దారితీయలేదు. వారి రెండు పడవలూ రేవులో ఉన్నాయి. వాటిని నా మిత్రులనుంచి కాపాడుకోవలసిన అవసరం ఉన్నది. అందుచేత ముందు రేవుకు దారి తీశారు. పడవలెక్కి బయల్దేరాము. రేవుకు పశ్చిమంగా ఒక చిన్ననది సముద్రంలో పడుతున్నది. ఆ నదీ ముఖ ద్వారం చేరి అక్కడ దిగాము.

తరవాత ఉత్తరంగా కనిపించే చిన్న కొండ కేసి నడవసాగాము. దారిలో కళాసీలు ఒకళ్ళ తరవాత ఒకళ్ళు ద్వీపపటం పుచ్చుకుని పరిశీలించారు. మా ఎదురుగా రెండు మూడు వందల అడుగుల ఎత్తుగల ఒక పీఠభూమి ఉన్నది. దాని ఉత్తరపువేపు వాలు టెలిస్కోపు కొండ దక్షిణపువాలుతో కలుస్తోంది. పీఠభూమిపైన దేవదారు వృక్షాలు మబ్బులను అంటేట్టు ఎత్తుగా, ఒత్తుగా పెరిగి ఉన్నాయి. చెట్ల మధ్య అల్లి బిల్లిగా పెరిగిన అడవి తీగలు మార్గాన్ని దుర్గమం చేస్తున్నాయి.

మేము సరాసరి పీఠభూమి ఎక్కడం ప్రారంభించాము. అడవి తీగలను ఛేదించి మార్గం చేసుకుంటూ ముందుకు పోతున్నాము. ద్వీపంలో ఇప్పటి

వరకూ నేను చూసిన అన్ని ప్రదేశాల్లోకీ ఈ ప్రదేశమే మనోహరంగా వుంది. అడవి పువ్వులు విరియబూసి ఆహ్లాదకరమైన వాసనలు వెదజల్లుతున్నాయి. పొదలు ఒకదానితో ఒకటి పెనవేసుకుని చక్కని పొదరిళ్ళుగా తయారయ్యాయి. ఏమి టేమిటో పక్షులు చెట్లలో కనిపించకుండా దాక్కుని సంగీత ధ్వనులు చేస్తున్నాయి. సూర్యుడు తీక్షణంగా ఉన్నా చెట్ల నీడల్లోంచి నడుస్తుంటే చల్లని సముద్ర వాయువులు వీచి అలసట తీరుస్తున్నాయి.

కళాసీలు ఆత్రం పట్టలేక మాకంటే ముందుకు పరిగెత్తుతూ కేకలు వేస్తూ పోతున్నారు. సిల్వర్, నేను వెనకబడి పోయాము. కుంటి కాలుతో ఎత్తు ఎక్కడం సిల్వర్‌కు ఆయాసంగా ఉంది. చాలా సార్లు నేను చేయూత ఇవ్వకపోతే కాలు జారి కింద పడిపోయేవాడే.

ఈ విధంగా ఒక అరమైలు దూరం పోయాము. పీఠభూమి శిఖరాన్ని ఇంకా సమీపించలేదు. ఇంతలో అందరి కంటే ముందుకు దూకుడుగా పోయిన ఒక కళాసీ, ''అయ్యబాబోయ్, అమ్మ బాబోయ్'' అని కేకలు వేయసాగాడు. వాడికి కొంత దూరంలో వెనకవున్న కళాసీలు ఆ కేకలు విని ఉన్నచోటనే స్తంభించి పోయారు. నేను, సిల్వర్ వాళ్ళని సమీపించాము. సిల్వర్ దారితీశాడు. అతని వెనకాల అడుగుల్లో అడుగులు వేసుకుంటూ మిగతావాళ్ళు అనుసరించారు.

కేకలు వేస్తున్న కళాసీకి ముచ్చెమటలు పోసి ప్రాణం కడబట్టింది. భయంతో ముఖం పాలిపోయింది. తీరాచూస్తే వాడి భయానికి కారణమైన పదార్థం అయిదారు గజాల దూరంలో కనబడింది. ఒక దేవదారు వృక్షం కింద మనిషి అస్థిపంజరం ఒకటి ఉంది. దాని పక్కన శిథిలావస్థలో వున్న చొక్కా, లాగు ఉన్నాయి. అది చూడగానే ఒక్క సారిగా మా అందరి కాళ్ళు చేతులు చల్లబడినై.

అందరిలోకి ధైర్యస్థుడు జార్జి అస్థిపంజరాన్ని సమీపించి, గుడ్డపేలికలను పరీక్షించాడు.

''పాపం ఎవడో కళాసీయే, ఈ గుడ్డలు చూస్తే తెలుస్తోంది.'' అన్నాడు జార్జి.

''కళాసీ కాకపోతే మహారాజా వస్తాడనుకున్నావా ఈ లంకకి? కాదు గాని ఈ అస్థిపంజరాన్ని ఎవరో మనుషులే ఇక్కడ పెట్టినట్టుగా తోస్తోంది. దానంతట అయితే ఇలా ఎప్పటికీ ఉండదు.'' అన్నాడు సిల్వర్.

సిల్వర్ చెప్పింది నిజం కావచ్చుననిపించింది. ఎందుకంటే అస్థిపంజరం ఎక్కడా వంకర లేకుండా సమానంగా వుంది. కాళ్ళు ఒక దిక్కును, చేతులు తల పైకి ఎత్తబడి మరొక దిక్కును సూచిస్తున్నట్టుగా ఉన్నాయి.

''నాకేమని తోస్తోందంటే, ఈ అస్థి పంజరం దిక్కులేవో చూపించడానికి ప్రయత్నిస్తోంది. చేతులువున్న వేపు సూటిగా చూడండి. దెయ్యాల దీవి కనిపిస్తోందా లేదా? మరి ఈ కాళ్ళు ఏం చూపిస్తున్నాయి? బహుశా డబ్బు పాతరవున్న దిక్కును చూపిస్తూ ఉండవచ్చు. తస్సదియ్య. ఇది ఫ్లింట్‌గాడి దెబ్బే. వాడు అఖండుడులే. గుర్తుకోసం ఈ ఎముక లిక్కడ ఉంచి ఉంటాడు. జ్ఞాపక ముంది ఇప్పటికీ. డబ్బు ఇక్కడ పాతిపెట్టడానికి ఆరుగుర్ని వెంట పెట్టుకుని వచ్చాడు. ఆరుగుర్నీ తనే టపటప చంపేశాడు . అందులో ఒకణ్ణి ఇక్కడి కీడ్చుకొచ్చి ఈవిధారిగా పడుకోబెట్టినట్టున్నాడు. కాని- కాని- ఈ పొడుగాటి ఎముకలు, పొడుగాటి కాళ్ళు, చేతులు చూస్తుంటే ఎవడో జ్ఞాపకం వస్తున్నాడు ఆ- ఎలర్ డైస్. టామ్ మోర్గన్! నీకు జ్ఞాపకం ఉన్నాడా ఎలర్ డైస్?'' అని అడిగాడు సిల్వర్.

''జ్ఞాపకం లేకేం? వాడు నాకు డబ్బు బాకీ ఉన్నాడు కూడాను. ఎలర్ డైస్ సంగతేమోకాని ఫింట్ ఇక్కడే దెయ్యమై తిరుగుతూ ఉంటాడని నా భయం'' అన్నాడు మోర్గన్.

''ఫ్లింట్ చచ్చిపోవడం కూడా దారుణంగా చచ్చాడు. ఎప్పుడూ ఒక చేత్తో కత్తి, ఇంకో చేత్తో రమ్‌సీసా పట్టుకుని ''యో-హో-హో- బలె గుమ్మైన రమ్'' అంటూ పాడేవాడు. ఆ పాటవిని చెవులు గింగుర్లెత్తాయనుకో నాకు. అసలప్పటి నుంచీ ఆ పాట వింటే నాకు వళ్ళు జలదరిస్తుంది'' అని జార్జి అన్నాడు.

'' ఏమైనా చచ్చిపోయిన వాడు చచ్చిపోయిన వాళ్ళలోనే లెక్క. మళ్ళీ మన్ని

వేపుకు తింటానికి వస్తాడంటే నేను నమ్మను. అందులో పగటిపూట ఇంత వెల్తురు ఉండగా అసలురాడు. ఇక లేవండి పోదాము'' అని సిల్వర్ ముందుకు దారితీశాడు.

ఈసారి కళాసీలు సిల్వర్‌ను విడిచి దూరం పోలేదు. ఒకప్పుడు తమతో తిరిగిన ఎలర్ డైస్‌కు పట్టిన గతి చూసి వారిగుండెల్లో అర్థంగాని భయం ప్రవేశించింది. గట్టిగా మాట్లాడడానికి, ఊపిరి తీయడానికి కూడా వెరుస్తూ సిల్వర్‌ను అంటిపెట్టుకునే నడవసాగారు.

29

పీఠభూమి శిఖరం చేరగానే మార్గాయాసం తీర్చుకోడానికి అందరం కూర్చున్నాము. శిఖరం మీదనుంచి ద్వీపంలో చాలా దూరం వరకు కనిపిస్తోంది. ఒకపక్కన ఫ్లింట్ ఆగ్రం కనిపిస్తోంది. ప్రకృతి బహు నిశ్శబ్దంగా, నిశ్చలంగా ఉంది. దూరంనుంచి సముద్రతరంగాల ఘోష అస్పష్టంగా వినవస్తోంది. ఈ ఏకాంతం మా మనస్సుల్లోని బరువును ఇంకా వృద్ధి చేసింది.

సిల్వర్ జేబులోంచి దిక్సూచి తీసి పటంలో చెప్పబడిన దిక్కులు నిర్ణయించుకున్నాడు.

''ఇక లేద్దామా? లేక భోజనాలు కానిచ్చి పోదామా?'' అన్నాడు సిల్వర్.

''నాకేమిటో భయంగా వుంది. ఫ్లింట్ తలుచుకున్న కొద్దీ కాళ్ళు గజగజలాడుతున్నాయి'' అన్నాడు మోర్గన్.

'' బతికి వున్నప్పుడే పిశాచంలాగ వుండేవాడు ఫ్లింట్. చచ్చిపోయే రోజుల్లో మొహం నీలంగా మారిపోయింది'' అన్నాడింకొకడు.

'' అవును, నీలంగా వుండేది. రమ్ తెగతాగితే అలాగే అవుతుంది'' అన్నాడు జార్జి

అస్థిపంజరాన్ని చూసిన దగ్గిర్నుంచి కళాసీలు గట్టిగా మాట్లాడ్డానికే జంకుతున్నారు. ఫ్లింట్‌ను గురించి మాట్లాడేటప్పుడు ఫ్లింట్ దెయ్యం వింటుం దేమో నన్నట్టుగా గుసగుసలు గానే మాట్లాడుతున్నారు. అందుచేత నిశ్శబ్దానికేమీ భంగం కలగడం లేదు.

ఇంతలో మా ఎదురుగా కొండ వాలుపై వున్న చెట్ల నడుమనుంచి కీచు గొంతుకతో పాడుతున్న పాట వినిపించింది.

''కిమ్మనకుండా గమ్మున తాగెయ్.
యో-హో-హో-బలె గుమ్మైన రమ్''

ఈ పాట వినగానే కళాసీలకు మూర్ఛ వచ్చినట్టయింది. ఒక్కసారిగా భయంతో బిగుసుకు పోయారు. తర్వాత అదేపనిగా వణికి పోయారు. ఆ పాట ఇంకా వినిపిస్తూనే ఉంది. మంత్రానికి కట్టుబడిన పాముల్లాగా నిశ్చేష్టు లయ్యారు.

పాట ఎంత హఠాత్తుగా ప్రారంభమైందో అంత హఠాత్తుగా ఆగిపోయింది. వెంటనే కళాసీలు సిల్వర్ చుట్టూ ఒకళ్ళ నొకళ్ళు కావిలించుకుని ముడుచుకుని కూర్చున్నారు. మోర్గన్ నేలమీదపడి ము[illegible]కున్నాడు.

''బాబోయ్, బాబోయ్ అది ఫ్లింట్-గొంతుకే'' అని గొణిగాడు.

సిల్వర్ మొదట అదిరిపడినా వెంటనే తేరుకున్నాడు. కళ్ళు చిట్లించి పాట వినవచ్చే దిశగా తేరిపార చూశాడు.

''పిరికి సన్నాసుల్లారా! భయపడతా రేమిట్రా ఊరికేను. దెయ్యమైతే ఏం? మీదపడి మింగుతుందా? అసలు దెయ్యంకాదు, గియ్యంకాదు. ఎవడో మనిషే మన్ని భయపెట్టడానికి...'' అన్నాడు సిల్వర్.

సిల్వర్ మాటలతో కళాసీలకు కాస్త ధైర్యం వచ్చింది. ఒక్కొక్కడే లేచి నుంచుంటున్నాడు. మళ్ళీ హఠాత్తుగా ఆ కీచుగొంతిక వినిపించింది. ఈ సారి పాటకాదు.

''డార్బీ! రమ్ తీసుకురా, డార్బీ! రమ్ తీసుకురా'' అని వినిపించింది. మళ్ళీ

ఆగిపోయింది.

''అదే అది ఫ్లింట్ దెయ్యమే. ఫ్లింట్ చచ్చిపోతూ సరిగ్గా అలాగే అరిచేవాడు. సందేహం లేదు, ఫ్లింట్ మళ్ళీ వచ్చాడు'' అన్నాడు మోర్గన్.

డిక్ తన బైబిల్ తీసి బిగ్గరగా ప్రార్థనలు చదవసాగాడు అందరూ వాడిదగ్గర చేరి ప్రార్థనలో పాల్గొన్నారు. కాని సిల్వర్ మాత్రం లొంగ లేదు. లోపల ఎంత భయపడుతున్నా పైకి మాత్రం ధైర్యం చూపిస్తున్నాడు.

''తమాషాగా ఉందే. ఈ లంకలో ఉన్న వాళ్ళెవరూ డార్బీ పేరు విని వుండరు. మనకి తప్ప డార్బీ పేరు తెలియదు ఏమైనా సరే. అది భూతంగానీ, దెయ్యంగానీ-తస్సదియ్య. నేను డబ్బు మాత్రం విడిచిపెట్ట దలుచుకోలేదు. ఫ్లింట్ బతికి వున్నప్పుడే వాణ్ని నేను లెక్కచెయ్యలేదు. చచ్చిపోయిం తరవాత భయపడతానా? ఇక్కడికి ఫర్లాంగు, రెండు ఫర్లాంగుల దూరంలో ఏడు లక్షల పౌనుల నాణాలుండగా, దెయ్యాలకి జడిసి పారిపోతానా? తస్సదియ్య.''

కాని కళాసీ లెవరూ కదల్లేదు సిల్వర్ దెయ్యాలను అవమానిస్తున్నందుకు ఇంకా భయపడిపోయారు వాళ్ళు.

''సిల్వర్! దెయ్యాలకు కోపం రావచ్చు, అలా మాట్లాడబోకు. వాటితో దెబ్బలాట పెట్టుకోవడం ఎందుకు?'' అన్నాడు జార్జి.

''దెయ్యాలా? ఆ గొంతిక దెయ్యమని అనుకోను. చూశావా ప్రతి ధ్వని కూడా వినిపించింది? దెయ్యాలు ఎండలో నుంచుంటే నీడ పడడం ఎప్పుడన్నా చూశావా? నీడ ఉంటే దెయ్యం కాదన్నమాట. అలాగే దెయ్యాల మాటలకి ప్రతిధ్వని వినిపించదు. కనక అది ఎవరో మనిషే గాని, దెయ్యం కాదు.''

సిల్వర్ వాదన కళాసీలమీద కొంతవరకూ పనిచేసింది. కొద్దిగా ధైర్యం కోలుకున్నారు. జార్జి ఇలాగన్నాడు; ''నువ్వు చెప్పింది నిజమే సిల్వర్, అది ఫ్లింట్ గొంతిక మాదిరిగా వున్నదిగాని పూర్తిగా ఫ్లింట్ అనిపించటం లేదు. ఫ్లింట్ కాదు... అది... ఎక్కడో విన్న గొంతుకే....

''తస్సదియ్య బెన్‌గన్‌రా'' అని అరిచాడు సిల్వర్.

''అవునవును, బెన్‌గన్నే. అనుమానం లేదు'' అని అంతా ఒక్కసారిగా అన్నారు.

డిక్ వీళ్ళలో కొత్తగా చేరినవాడు కనుక బెన్‌గన్ ఎవడో అతనికి తెలియదు; ''బెన్‌గన్ దెయ్యమైతే నేం. ఫ్లింట్ దెయ్యమైతేనేం, మన్ని పీక్కు తింటానికి?'' అన్నాడు డిక్.

మిగతావాళ్ళు డిక్ మాటలు విని హేళనగా నవ్వారు: ''నీకు తెలియదులే డిక్! బెన్‌గన్ బతికివున్నా, చచ్చిపోయినా పసిపిల్లడుకూడా వాడికి భయపడడు. వట్టి అమాయకుడు, చాదస్తుడు.''

కాని డిక్‌కి ఇంకా నమ్మకం కలగలేదు. బైబిల్ గట్టిగా గుండెకి ఆనించుకుని తూలుతూ నడుస్తున్నాడు. ఎండ దెబ్బ, అలసట, భయం, డాక్టర్ లివ్‌సే చెప్పిన మలేరియా రోగం ఇవన్నీ కలిసి అతన్ని మరింత కుంగదీశాయి.

సిల్వర్ తాడు పుచ్చుకుని ముందు నడుస్తున్నాడు మా వెనక కళాసీలు ఇందాకటి ఉత్సాహంతో ఎగురుతూ, దూకుతూ నడుస్తున్నారు. ఇప్పుడు వాలు దిగుతున్నాము . కొంత దూరంలో మూడు పెద్ద దేవదారు వృక్షాలున్నాయి. ఈ మూడూ ఆ చుట్టుపక్కల వృక్షాలకంటే ఎత్తుగా ఉన్నాయి. ఈ మూడు చెట్లలోను ఏది పెద్దదైతే దానికిందనే గుప్తధనం కోసం వెదకాలి. మూడు వృక్షాలను చూడగానే కళాసీల ఆనందం వర్ణించతరంకాదు. సిల్వర్ కూడా చెట్లను సమీపిస్తున్న కొద్దీ తొందరపడుతున్నాడు. ఏడు లక్షల పౌనులధనం అంత సమీపంలో ఉందనేసరికి అతడు డాక్టరుగారికి, నాకు ఇదివరకు చేసిన వాగ్దానాలు, జమీందారుగారి పక్షాన చేరాలనే ఉద్దేశమూ అన్నీ మర్చిపోయాడు. నన్ను శత్రువుగా చూడసాగాడు. నాకేసి విషపు చూపులు చూశాడు.

కళాసీలు సిల్వర్‌ను దాటి ముందుకు పరిగెత్తుకు పోయారు. సిల్వర్ వాళ్ళతో పాటు పరిగెత్తలేక కుంటుతూ గెంతుతూ నడుస్తున్నాడు.

ముందుకు పరిగెత్తుకు పోయిన కళాసీలు ఒక్కొక్క చెట్టు దగ్గిరా పరీక్షించి, ఆఖరి చెట్టు దగ్గిర ఆగారు. ఒక్కసారిగా అంతా వెర్రికేక పెట్టారు.

''ఎవరో తవ్వేశారోయ్!'' సిల్వర్ నిర్ఘాంత పోయాడు. క్షణం సేపు నిలబడి పరిస్థితి అంతా ఆకళించుకున్నాడు. ''డాక్టర్ చెప్పిన మాటల అర్థం ఇదన్న మాట'' అని నాతో మెల్లిగా అన్నాడు. మేము కళాసీలను సమీపించేసరికి కనిపించిన దృశ్యం ఇది: చెట్టుకింద పెద్ద గొయ్యి ఉన్నది. గొయ్యి చాలా కాలం కిందట తవ్వబడినట్టున్నది. ఎందుకంటే గోతిలో కూడా పచ్చిక మొలిచింది. విరిగిన ఒక పారకూడా అక్కడ కనిపించింది. పారమీద ''వాల్రస్'' అనే అక్షరాలు కనిపించాయి. ఇదంతా చూసి కళాసీలకు మొహాన కత్తివాటుకైనా నెత్తురు లేకుండా పోయింది.

ఏడు లక్షల పౌనులూ ఎగిరిపోయాయ్!

30

శూన్యంగా వున్న గొయ్యి చూడగానే కళాసీలందరూ పిడుగుపడినట్టు నిశ్చేష్టులయ్యారు. ఒక్క సిల్వర్ మాత్రమే ఈ పిడుగుపాటు నుంచి వెంటనే తెప్పరిల్లగలిగాడు. తన కర్తవ్యమేమిటో ఒక్కక్షణంలో నిర్ణయించుకున్నాడు.

నన్ను వెనక్కి పిలిచి ''జిమ్! దూరంగా నుంచో. ఇదిగో యీ పిస్టల్ తీసుకో. అవసరం రావచ్చు'' అన్నాడు. అంటూనే కళాసీలకు, గోతికి దూరదూరంగా జరిగాడు అతని చూపుల్లో ఇప్పుడు నాపై ద్వేషం, క్రోధం మచ్చుకైనా లేవు. ప్రపంచంలో నాకంటే అప్తుడు లేడన్నంత ప్రేమగా చూస్తున్నాడు. క్షణక్షణానికి మారిపోయే అతని చిత్త ప్రవృత్తి చూసి నాకు పరమాసహ్యం కలిగింది. ''మళ్ళీ పార్టీని మార్చావన్నమాట'' అన్నాను.

నా మాటకు సిల్వర్ సమాధానమిచ్చే వ్యవధి లేదు. కళాసీలు నిర్ఘాంత స్థితినుంచి తేరుకొని ఒక్కరొక్కరే గోతిలోకి దూకి మట్టి కెలుకుతూ వెతకసాగారు. మోర్గన్‌కి ఒకటే బంగారు నాణెం దొరికింది. ఆ నాణెం ఎత్తి

పట్టుకొని సిల్వర్‌కు చూపిస్తూ బూతులు తిట్టసాగాడు. మోర్గన్ చేతిలోంచి దాన్ని ఒక్కొక్కరే తీసుకొని అతిశ్రద్ధగా పరీక్షించారు. అది రెండు గినీల నాణెం. జార్జి అరిచాడు:

''చూశార్రా. రెండు గినీల నాణెం. దేశం వదిలి ఇన్ని వేల మైళ్ళు ఇన్ని కష్టాలు పడి మనం వచ్చిందెందుకో తెలుసా? ఇదిగో ఈ రెండు గినీల నాణెం కోసం. ఇదే కదూ సిల్వర్! నువ్వు వాగ్దానం చేసిన ఏడు లక్షల పౌనుల బంగారం? అవును నువ్వెప్పుడూ ఏపనీ పాడు చెయ్యలేదు. నువ్వు మహా సమర్థుడివి. నీకు చేతకానిదేమీ లేదు, మేమే చవటలం, దద్దమ్మలం కదూ?''

సిల్వర్ నిశ్చలంగా నవ్వుతూ, ''తవ్వండి, తవ్వండి, ఇంకా గులకరాళ్ళేమన్నా దొరుకుతాయేమో?'' అన్నాడు.

''గులకరాళ్ళా? అరేయ్ చూశార్రా, ఏమంటున్నాడో సిల్వర్? వాడికి మొదటినుంచీ తెలుసు ఈ సంగతి. వాళ్ళతో కలిసి కుట్రచేసి ఇంత కాలమూ మన్ని మోసగించాడు. వాడి మొహం చూడండి. ఎంత కుచ్చితం కనిపిస్తోందో?'' అన్నాడు జార్జి.

''జార్జ్! మళ్ళీ కెప్టెన్ కావాలని చూస్తున్నావా?'' అన్నాడు సిల్వర్. కాని ఈసారి కళాసీలంతా జార్జి పక్షానే వున్నారు. సిల్వర్ మోసంచేశాడని అంతా గ్రహించారు. ఒక్కొక్కరే గొయ్యి బయటికి వచ్చారు. వాళ్ళు మాకు కొన్ని గజాల దూరంలో మాత్రమే వున్నారు. వాళ్ళు మాకేసి, మేము వాళ్ళకేసి కొన్ని క్షణాలసేపు అలాగే చూసుకున్నాము. సిల్వర్ ఊతకర్రనానుకుని నిటారుగా నుంచున్నాడు. అతని గాంభీర్యం చూసి నాకు ఆశ్చర్యం కలిగింది. సందేహం లేదు, సిల్వర్ ధైర్యం నిరుపమానం.

చివరికి జార్జి ఇలాగన్నాడు: ''స్నేహితులారా! సిల్వర్ ఈ నిమిషం నుంచీ మనకు శత్రువు. అరుగో, ఇద్దరు శత్రువులు! అక్కడ ఆ కుర్రాడున్నాడే వాడి నెత్తురు తాగుతాను ఇవ్వాళ-'' అని ఇంకా ఏదో అనబోతున్నాడు. ఇంతలో ఢాం! ఢాం! ఢాం! మూడు తుపాకి గుళ్ళు వరసన వచ్చి కళాసీలకు తగిలాయి.

జార్జి వెనక్కి విరుచుకుని గోతిలో పడ్డాడు. మరొక ఇద్దరు నిలుచున్న చోటనే కుప్పగా కూలిపోయారు.

మిగతా ముగ్గురూ ఒక్క దూకు దూకి పిక్కబలం చూపించారు. గోతిలో పడిన జార్జి ఇంకా లేవబోతున్నాడు. సిల్వర్ పిస్టల్ పేల్చి వాణ్ణి చంపేశాడు.

''జార్జ్! ఇక్కడితో నీ బాధ వదిలిపోయింది నాకు'' అన్నాడు.

ఇంతలో డాక్టరుగారు, అబ్రహాం గ్రే, బెన్ గన్ చెట్ల చాటునుంచి మా దగ్గిరికి వచ్చారు.

''పరిగెత్తండి. ఆ ముగ్గురూ పారిపోయారు. వాళ్ళు పడవలున్న వేపు పోతున్నారు. ఆ పడవలు వాళ్ళకి చిక్కకుండా చూడాలి'' అన్నారు డాక్టరు గారు.

వెంటనే అందరం పరిగెత్తసాగాము. సిల్వర్ కూడా మాతో పాటు పరిగెత్తాడు. తీగెలు, డొంకలు అడ్డం వచ్చినప్పుడు వెనకబడి పోయాడు. పీఠభూమి దిగాము. కొంతదూరంలో కళాసీలు ముగ్గురూ పరిగెత్తుతూ కనిపించారు. వాళ్ళు పడవలున్న దిక్కుకు పరిగెత్తడంలేదు. ఆ భయంలో, కంగారులో వాళ్ళు ఎటు పోతున్నారో కూడా తెలియకుండా పరిగెత్తుతున్నారు. సరే ఇక భయం లేదనుకుని ఆగాము. ఆయాసం తీర్చుకునేందుకు కూర్చున్నాము. కొంతసేపటికి సిల్వర్ కొయ్యకాలు ఈడ్చుకుంటూ వచ్చాడు.

''నమస్కారాలు డాక్టరుగారు! మీరు సరిగ్గా సమయానికి వచ్చి నన్నూ, జిమ్‌నీ రక్షించారు. ఒహో నువ్వా, బెన్‌గన్! కులాసాగా ఉన్నావా?''

''అవును, నేను బెన్‌గన్‌నే. నేనే బెన్‌గన్‌ని. నేనే.'' అన్నాడు మూడేళ్ళపాటు కాంచనద్వీపంలో ఏకాంత జీవితం గడిపిన కళాసీ బెన్‌గన్. ''సిల్వర్! నువ్వు కులాసాగా ఉన్నావా?'' అని కూడా అడిగాడు. బెన్‌గన్ లాంటి అమాయకుడు తప్ప ఇంకెవ్వరూ సిల్వర్‌ని క్షమించలేరు.

తరవాత లేచి అందరం పడవలున్న దిక్కుగా నడిచాము. దోవలో డాక్టరు గారు మా అనుమానాలన్నిటినీ నివృత్తి చేశారు. ఆయన చెప్పిన కథ ఇది:

''లాంగ్ జాన్ సిల్వర్! నువ్వు అతి ఘోర దుర్మార్గుడివి, ద్రోహివి. వట్టి ద్రోహివి కాదు, మహా ద్రోహివి. నిన్ను శిక్షించవద్దని డాక్టర్ లివ్‌సే బతిమాలాడు గనక ఊరుకుంటున్నాను. కాని నీ మూలంగా చనిపోయిన వాళ్ళ ఆత్మలు మాత్రం నిన్ను వదిలి పెట్టవు...'' అని ఆ కోపంలో ఇంక మాట్లాడలేక పోయారాయన.

''మీ దయాఋణం తీర్చుకోలేనండి'' అని సిల్వర్ భక్తితో మళ్ళీ సెల్యూట్ చేశాడు.

అందరం గుహలో ప్రవేశించాము. చాలా విశాలంగా వుంది. గాలి, వెల్తురూ ధారాళంగా వస్తున్నాయి. లోపలనే నీటిబుగ్గ ఒకటి వున్నది. పరిశుభ్ర జలం అందులోనుంచి ఊరి చిన్న కాల్వగా బయటికి పోతున్నది. నేలంతా చక్కటి ఇసుక.

ఒకచోట పెద్ద చలిమంట వేసి ఉన్నది. దాని ముందు కెప్టెన్ స్మాలెట్ పడుకుని ఉన్నాడు. ఇంకొక మూల బంగారు నాణాలు, బంగారు కడ్డీలు రాసులుగా పోసి వున్నాయి. ఏ బంగారం కోసం ఇంత దూరం వచ్చామో, ఏ బంగారం కోసం పదిహేడుగురు మనుషులు ప్రాణాలు కోల్పోయారో, అదే ఇది. ఈ ధనం సేకరించడానికి ఇంకెంత మంది చనిపోయారో, ఎన్ని నెత్తురు టేరులు, ఎన్ని కన్నీటి కాల్వలు ప్రవహించాయో, ఎంత క్రౌర్యం, దౌర్జన్యం జరిగిందో, ఎవరికి తెలుసు? తెలిస్తే సిల్వర్‌కు, మోర్గన్‌కు, బెన్‌గన్‌కు తెలియాలి. వీరిలో ప్రతివాడు ఆ రోజుల్లో కెప్టెన్ ఫ్లింట్ చేసిన దుష్కార్యాల్లో పాల్గొన్నవాడే. చివరికి ఆ ఫ్లింట్ మాత్రం ఏమయ్యాడు? ఒక్క పెన్నీ అనుభవించకుండా అంత ధనమూ పరులకు వదిలేసి దిక్కులేని చావు చావలేదా?

ధనరాసుల ఎదుట నుంచుని చూస్తుంటే ఈ ఆలోచనలన్నీ నన్ను ముసురుకున్నాయి. కెప్టెన్ స్మాలెట్ పిలుపుతో తెప్పరిల్లాను.

''జిమ్! నిన్ను పొగడాలో తిట్టాలో తెలియటంలేదు. నీ మూలాన మాకు

ఎన్ని ఉపకారాలు జరిగాయో చెప్పలేను. నువ్వూ, నేను సముద్ర ప్రయాణాలకి పనికి రామోయ్. ఇక ముందెప్పుడూ నువ్వు నన్ను విడిచి పెట్టకుండా ఏర్పాటు చేస్తాను. అక్కడెవరూ నుంచుంది? సిల్వర్ కాదూ? ఇక్కడికెందుకొచ్చావ్?''

''మళ్ళీ డ్యూటీకి వచ్చానండి'' అన్నాడు సిల్వర్ సెల్యూట్ చేస్తూ.

''ఒహో'' అన్నాడు కెప్టెన్. ఇంకే మనలేదు.

ఆ రాత్రి భోజనాలు బలే సర్దాగా గడిచాయి. కులాసాగా నవ్వుతూ, పేలుతూ తిన్నాము. ఉప్పులో ఊరవేసి బెన్‌గన్ తయారు చేసిన గొర్రె మాంసం మహా రుచిగా వుంది. హిస్పానియోలా లోంచి తెచ్చిన ద్రాక్షసారా తలొక గ్లాసు త్రాగి త్రేన్పడంతో భోజనాలు పూర్తి అయినాయి. సిల్వర్ ఏ కారణం చేతనో వెలుగులోకి రాకుండా నీడలోనే కూర్చున్నాడు. మా ఛలోక్తుల్లో అంత స్వేచ్ఛగా పాల్గొనక పోయినా తిండి మాత్రం తక్కువ తినలేదు.

31

మర్నాటి ఉదయం గుహనుంచి ధనరాసులను హిస్పానియోలా లోనికి చేరవేయడంతో సరిపోయింది. క్రితంరోజు పారిపోయిన ముగ్గురు కళాసీల జాడలేదు గనక మేము వేరేపని పెట్టుకోకుండా ఈ పనిలోనే నిమగ్న మయ్యాము. బెన్‌గన్, గ్రే పడవలో ధనరాసులు తీసుకుపోయి ఓడలోకి చేర్చడం, మిగతావాళ్ళు గుహనుంచి ఒడ్డుకి సంచులు మోసుకుపోవడం. నేను సంచులు మొయ్యలేనందున గుహలో వుండి నాణాలని సంచుల్లోకి ఎత్తడం పనిగా పెట్టుకున్నాను. ముఖ్యంగా బంగారపు కడ్డీలు బాగా బరువుగా ఉన్నాయి. ఒక్కొక్కసారికి రెండుకంటే ఎక్కువ మొయ్యలేకపోయారు. అయినా ఆ మోసేది అచ్చమైన బంగారం కనుక అదొక అదృష్టంగానే భావించారు కాని ఎవరూ విసుక్కోలేదు.

నాణాలు రకరకాలుగా ఉన్నాయి. భూలోకంలో వున్న ప్రతిదేశపు నాణాలు అందులో ఉన్నాయనుకుంటాను. ఇంగ్లీషు, ఫ్రెంచి, స్పానిష్, పోర్చుగీసు, ఇలా ఒక్కొక్క దేశానివే ఎంచుతూ సంచుల్లో నింపాను. గుండ్రనివి, చదరపువి, త్రిభుజాలు, షడ్భుజాలు, అష్టభుజాలు, చిన్నవి, పెద్దవి. నూరేళ్ళ కిందటివి, పదేళ్ళ కిందటివి. అబ్బ, ఎన్నిరకాలో, ఎన్నో చెప్పలేను.

ప్రతిరోజు ఉదయంనుంచి సాయంకాలం వరకూ ఇదే పనిలో నిమగ్న మయ్యేవాళ్ళం. కాని ఎవ్వరికీ విసుగనిపించలేదు.

మూడవరోజు రాత్రిగావును, నేనూ, డాక్టరుగారూ కొండపైన షికారుగా నడుస్తుండగా దూరం నుంచి పాటలు వినవచ్చాయి.

''హు. వాళ్ళే. ఆ పారిపోయిన ముగ్గురూ అక్కడెక్కడో ఉన్నారు'' అన్నారు డాక్టరుగారు.

లాంగ్ జాన్ సిల్వర్ మాతో స్వేచ్ఛగా ఉంటూ, మా పనిలో పాల్గొం టున్నాడు. రోజూ కెప్టెన్ స్మాలెట్టో, జమీందారుగారో అతడిని అవమానిం చేందుకు ఏవో సూటిపోటు మాటలంటున్నా, అతడు దులుపుకుని వూరుకొనే వాడు. ఎవరేమన్నా నోరు మూసుకుని వుండేవాడు. అతన్ని స్వేచ్ఛగా తిరగనిచ్చి నా కుక్క మాదిరిగా చూసేవాళ్ళు. బెన్‌గన్ మాత్రం సిల్వర్ అంటే పైకి కాక పోయినా, లోపలైనా భయపడేవాడు పూర్వపు రోజులు తలుచుకుని. నేను కూడా సిల్వర్ నేమీ అనేవాణ్ణి కాదు. అతడు నా ప్రాణం రక్షించినందుకు కృతజ్ఞతతో నా మనస్సు నిండిపోయి, అతని దుర్గుణాలను ఎంచలేక పోయాను.

పారిపోయిన ముగ్గురు కళాసీలను ఏమి చేయటమా అని ఆలోచించాము. చివరికి వాళ్ళను ద్వీపంలో విడిచి పెట్టటానికే నిశ్చయించాము. ఈ నిర్ణయానికి బెన్‌గన్ ఎంతైనా సంతోషించాడు. అబ్రహాం గ్రే దాన్ని సమర్థించాడు. గుహలో మందుగుండు సామాగ్రి, కొన్ని తుపాకులు, కత్తులు, కొంత గొడ్డుమాంసం, కొన్ని పరికరాలు, బట్టలు ఒక తెరచాప గుడ్డ, ఒక పొడుగాటి తాడు, కొంత పొగాకు, మందులు వాళ్ళకోసం ఉంచాము.

ధనరాసులు ఓడలోకి చేర్చడం పూర్తయింది. కొన్ని రోజులకు సరిపడే గొడ్డుమాంసం, మంచినీళ్ళు కూడా ఓడలోకి చేరవేశాము. ఒక ప్రశాంత ప్రభాతాన లంగరెత్తి, తెరచాప లెత్తి ప్రయాణం సాగించాము. కెప్టెన్ స్మాలెట్ ఆజ్ఞ ప్రకారం మట్టికోటపై అదివరకు ఎగరేసిన బ్రిటిష్ జెండానే ఓడపై ఎగర వేశాము.

హిస్పానియోలా బయల్దేరింది. పారిపోయిన కళాసీలు ఇంతకాలం మా చర్యలన్నిటినీ ఎక్కడో పొంచి చూస్తూనే వున్నారనుకుంటాను. ఎందుకంటే మా ఓడ బయల్దేరే సమయానికి ఎక్కడ నుంచి వచ్చారో ఏమో, సముద్ర తీరానికి వచ్చారు. అక్కడ మోకాళ్ళ మీద పడి చేతులు పైకెత్తి ''మమ్మల్ని కూడా తీసుకుపొండి బాబో, రక్షించండి బాబో!'' అని కేకలు వేయసాగారు. మా హృదయాలు ఒక క్షణంపాటు ద్రవించాయి. వారిని ఆ దుస్థితికి వదిలిపోవటం చాలా బాధాకరంగా తోచింది. కాని ఏంచేస్తాం? వాళ్ళని నమ్మటానికి వీలులేదు. ఓడలో కెక్కించుకుంటే ఇంకోసారి తిరుగుబాటు చెయ్యరని నమ్మకమేముంది? అందుచేత గుండె రాయి చేసుకుని డాక్టరుగారు ఇలా కేకేశారు:

''మిమ్మల్ని తీసుకుపోవటానికి వీల్లేదు. ఒకవేళ తీసుకుపోయినా మిమ్మల్ని కోర్టులో హాజరుపరచటం, ఇన్ని హత్యలు చేసినందుకు మీకు ఉరిశిక్ష పడటం తప్పదు. అందుచేత మీరిక్కడే ఉండండి. అదుగో అక్కడ గుహ కనిపిస్తోందే, అందులో మీకు కావలసిన సామాను, తిండి ఉంచి పోతున్నాం.''

ఈ మాటలు విన్నాక కూడా వాళ్ళు ఇంకా ప్రాధేయపడసాగారు. మాలో ఒక్కొక్కళ్ళనీ పేరు పేరునా పిలిచి బతిమాలారు. కాని మా ఓడ నిర్దయంగా సముద్రంలోకే కదిలిపోసాగింది.

ఇంతలో వాళ్ళలో ఒకడు ముందుకు, అంటే నీటి అంచువరకూ పరుగెత్తుకు వచ్చి తుపాకి ఎత్తి పేల్చాడు. తూటా సిల్వర్ చెవి పక్కగా దూసుకుని తెరచాపలో నుంచి పోయింది. వాళ్ళ ద్రోహబుద్ధిని గూర్చి మేము అనుమాన పడింది నిజమే అయింది. ఆ తరవాత కొంతదూరం వరకూ మేము సరంబీ మీద

హాహాటంగా నుంచోలేదు. మళ్ళీ చూసే సరికి వాళ్ళక్కడ లేరు. ద్వీపంలోకి వెళ్ళిపోయారు. ఇంకా కొంతదూరం పోయేసరికి ద్వీపభూమి, చెట్లు, క్రమంగా టెలిస్కోపు కొండ శిఖరాలు అన్నీ దృక్పథం నుంచి అదృశ్యమైనాయి. అమ్మయ్య అనుకుని నిట్టూర్పు విడిచాను.

ఓడ నడపటానికి సిబ్బంది కొరత మూలంగా ఇబ్బంది ఎక్కువైంది. అందరం రెండు చేతులా పనిచేస్తున్నా కష్టమైంది. కెప్టెన్ స్మాలెట్ ఇంకా పూర్తిగా కోలుకోలేదు. ఆయనకి ఇంకా బాగా బలం పట్టలేదు. పక్క మీద పడుకునే అందరికీ పనులు పురమాయిస్తున్నాడు. నౌకని శ్పానిష్ అమెరికాలో దగ్గరగావున్న ఒకదేశపు రేవు పట్టణంవైపుగా పోనిచ్చాము. ఎందుకంటే, కొత్త కళాసీలను చేర్చుకోకుండా ఇంగ్లండు వరకు ప్రయాణం చేయడం కష్టమని మాకు అనిపించింది. నిజానికి ఎడాపెడా కొడుతున్న సముద్రపు గాలులకు ఓడని తిన్నగా నడపడంతో తీరం చేరుకునేసరికి మేము ఎంతగానో అలిసి పోయాము.

అప్పటికి సూర్యాస్తమయమైంది. మేము లంగరు వేసిన ప్రదేశం చిన్న అఖాతం. ఎంత అందంగా ఉందో చెప్పలేను. లంగరు దింపీ దింపగానే ఒడ్డు నుంచి చిన్న చిన్న పడవలు నడుపుకుంటూ నీగ్రోలు, మెక్సికన్ ఇండియన్లు, సంకర జాతి వాళ్ళు బిలబిలమని చుట్టుముట్టారు: వాళ్ళు పళ్ళు, కూరగాయలు అమ్ముకునే వాళ్ళు. కొందరు డబ్బిస్తే సముద్రంలో డైవింగ్ ప్రదర్శనలు ఇస్తామని ముందుకొచ్చారు, వాళ్ళ ముఖాలు– ముఖ్యంగా నీగ్రోలవి – అమాయకంగా ఉన్నాయి. వాళ్ళ సరదాచూసి ముచ్చట పడ్డాము, ఉష్ణ మండల దేశాలలో పండే పళ్ళు కడుపారా ఆరగించాము. ఒడ్డున పట్టణంలో లైట్లు వరసగా వెలగడం మొదలెట్టాయి. ఈ చక్కని దృశ్యానికి, మేము కాంచన ద్వీపం చీకటిలో నెత్తురు మడుగులలో అనుభవించిన అవస్థలకి ఎక్కడా పోలికేలేదు. డాక్టరుగారూ, జమీందారుగారూ నన్ను వెంట పెట్టుకుని పట్టణంలో సరదాగా తిరిగొద్దామని బయలుదేరారు. అక్కడ ఒక ఇంగ్లీషు యుద్ధనౌక కెప్టెన్‌ను కలుసుకున్నాము.

అతనితో కబుర్లు చెబుతూ అతని నౌకలోకి వెళ్ళాము. కాలం ఎంతసరదాగా, తెలియకుండా గడిచిపోయిందంటే, మేము తిరిగి హిస్పానియోలాలోకి వచ్చే సరికి తెలతెలవారి పోతోంది.

నౌకలో బెన్‌గన్ ఒక్కడే ఉన్నాడు. మమ్మల్ని చూడగానే ఏడుపు లంకించు కున్నాడు. సిల్వర్ ఉడాయించాడని చెప్పాడు. సిల్వర్ అంతకు కొన్ని గంటల ముందే ఒక చిన్న పడవని మాట్లాడుకున్నాడట. వాడు వెళ్ళి పోవడమే మంచి దైందని, వాడు గనక నౌకలో వుంటే అందర్ని సమయం చూసి సఫా చేసేవాడేనని బెన్‌గన్ చెప్పాడు. ఇంతేకాదు, సిల్వర్ వట్టి చేతులతో పారిపోలేదట. మూడు నాలుగు వందల గినీలున్న ఒక సంచీని కాజేసి మరీ పోయాడట.

అంత చవకలో ఒక ప్రమాదకరమైన మనిషిని వదిలించుకున్నందుకు అందరం సంతోషించామనే చెప్పాలి.

ఇక నా కథ ముగింపుకు వచ్చినట్టే. కొంతమంది కొత్త కళాసీలను చేర్చు కున్నాము. ఇంటి ముఖం పట్టాము. మా హిస్పానియోలా నౌక బ్రిస్టల్ నగరం చేరేసరికి బ్లాండ్లీ మహాశయుడు మా గురించి ఆందోళన పడుతూ ఒక నౌక తీసుకొని బయలుదేరుదా మనుకుంటున్నాడు. హిస్పానియోలాలో మొదట బయలు దేరిన వారిలో తిరిగి వచ్చిన వారు ఐదుగురే.

కాంచనద్వీపం నుంచి తెచ్చిన ధనాన్ని అందరం పంచుకున్నాము. ఎవరి స్వభావాన్ని బట్టి వారు జాగ్రత్తగానో, దుబారాగానో వాడుకున్నాము. కెప్టెన్ స్మాలెట్ సముద్రయానాల నుంచి రిటైర్ అయ్యాడు. అబ్రహాం గ్రే తన డబ్బు భద్రంగా దాచుకున్నాడు. అంతేకాదు, నౌకాయాన విద్య నేర్చుకున్నాడు. ఒక మంచి నౌకలో వాటా కొనుక్కున్నాడు. పెళ్ళి చేసుకున్నాడు. ఇప్పుడు అతడు పిల్లల తండ్రి.

ఇక బెన్‌గన్. అతడి వాటా వెయ్యి పౌనులు వచ్చింది. మూడు వారాలు తిరగకుండా – ఖచ్చితంగా చెప్పాలంటే పంథొమ్మిది రోజులలో అంతా క్షవరం చేసుకున్నాడు. ఇరవై ఒకటో రోజుకల్లా అడుక్కోవడం మొదలెట్టాడు. అతడికి

ఒక లాడ్జి వ్యాపారం ఏర్పాటు చేశాము. పాపం అమాయకుడు కదా. అంతా అతడిని వేళాకోళం చేస్తూ ఉంటారుగాని అతడంటే అంతా ఇష్టపడేవారుకూడా. హుషారుగా పాటలు పాడుతూ వినోదం కలిగించేవాడు.

సిల్వర్ గురించి మళ్ళీమాకు కబురు లేదు. ఆ ఒంటికాలు నావికుడు నా జీవితంలోకి మళ్ళీ తొంగి చూడలేదు. పూర్వపు తన నీగ్రో భార్యని కలుసుకుని, ''కెప్టెన్‌ఫ్లింట్'' (చిలక్క)తో హాయిగా కాలక్షేపం చేస్తున్నాడేమోనని అను కుంటూ ఉంటాను.

వెండి కడ్డీలు, ఆయుధాలు ఇప్పటికీ కాంచన ద్వీపంలో ఫ్లింట్ పాతిపెట్టిన చోటనే ఉండి ఉండాలి. నా మటుకు నేను ఛస్తే ఆ ద్వీపానికి మళ్ళీ వెళ్ళడం అంటూ జరగదు. నాకు ఇప్పటికీ కాంచన ద్వీప తీరాన్ని ప్రళయ భయంకరంగా తాకి విరిగే సముద్రపు అలల హోరు కలల్లో ఎప్పుడన్నా వినబడుతూనే ఉంటుంది. లేదా ఒక్కొక్కసారి ''పెసో పెసో పెసో'' అని ఆగకుండా లాంగ్ జాన్ సిల్వర్ చిలక ''కెప్టెన్ ఫ్లింట్'' అరిచే అరుపులు కలల్లోకి వచ్చి నా నిద్రని వెడగొడుతూ వుంటాయి.